గురువారం 8-2-2018

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 18+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 318

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



కాంగ్రెస్ ముక్త్ భారత్

ఇది మోదీ మాట కాదు.. గాంధీ మాటే • ప్రతిపక్షం తీరుపై లోక్‌సభలో ప్రధాని మండిపాటు

స్వాతంత్ర్యం వచ్చాక అప్పటికున్న 15 కాంగ్రెస్ కమిటీల్లో 12 కమిటీలు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధాని చేయాలని ఓటేశాయి. అయినా పటేల్‌ను పక్కనపెట్టి నెహ్రూకు పగ్గాలు కట్టబెట్టిన విషయాన్ని మరవొద్దు. పటేల్ ప్రధాని అయ్యుంటే కశ్మీర్ సమస్యే ఉండేది కాదు.

వాజ్‌పేయి హయాంలో మేం ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలను ఏర్పాటు చేశాం. వివాదాల్లేకుండా విభజించాం. కానీ మీరు.. ఎన్నికల్లో రాజకీయ లాభం లేకుండా ఏ పనీ చేయలేదు. ఏపీ విషయంలో ఎలాంటి చర్చా జరగకుండానే విభజించారు. ఆంధ్ర ప్రజల మనోభావాలను గుర్తించలేదు. మేమూ తెలంగాణను కోరుకున్నాం. కానీ సరైన పద్ధతిలో మీరు విభజన జరపలేదు.

- ప్రధాని నరేంద్ర మోదీ

5లో

అంతరిక్షంలో షికారు

'స్పేస్ ఎక్స్' ప్రయోగం విజయవంతం.. కానీ..

కారు షికారు కెళ్లింది.. ఇక్కడికో అక్కడికో కాదు ఏకంగా అంతరిక్షంలోకి.. ప్రైవేటు అంతరిక్ష సంస్థ 'స్పేస్ ఎక్స్' అత్యంత శక్తివంతమైన ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా టెస్లా రోడ్‌స్టర్ మోడల్ కారును బుధవారం అంతరిక్షంలోకి పంపింది. డ్రైవింగ్ సీట్లో స్పేస్ సూట్ ధరించిన వ్యోమగామి నమూనానూ ఏర్పాటు చేసింది. ఈ కారును అంగారకుడి కక్ష్యలోకి పంపాలనేది సంస్థ ఆలోచన. కానీ ఫాల్కన్ హెవీ రాకెట్ నుంచి కారును అంతరిక్షంలోకి వదిలిన సమయంలో వేగంలో మార్పు కారణంగా గమ్యం మారిపోయింది. అంగారకుడి అవతల ఉన్న ఆస్టరాయిడ్ బెల్ట్ దిశగా గంటకు 39,400 కిలోమీటర్ల వేగంతో దూసుకెళుతోంది.



- పూర్తి వివరాలు 5లో

హోదా కోసం ఎందాకైనా..



నేడు రాష్ట్ర బంద్

వామపక్షాల పిలుపునకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు

సంఘీభావంగా పాదయాత్రకు ప్రతిపక్ష నేత జగన్ విరామం

- స్వచ్ఛందంగా విద్యా, వాణిజ్య సంస్థల మూసివేత
- తెల్లవారుజాము నుంచే బస్టాండ్ల వద్ద ఆందోళన
- కాంగ్రెస్, ప్రజాసంఘాల మద్దతు
- నేడు అన్ని విద్యాసంస్థలకు సెలవు
- పరిస్థితుల్ని బట్టి బస్సుల్ని నడపాలని ఆర్టీసీ నిర్ణయం

టీడీపీలో తలోమాట.. అస్పష్ట వైఖరి

బంద్‌ల ద్వారా పరిష్కారం లభించదని సీఎం వ్యాఖ్యలు

సాక్షి, అమరావతి

కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, రాష్ట్ర రాజధాని నిర్మాణం మొదలు పోలవరం నిర్మాణం, ప్రత్యేక రైల్వేజోన్ వంటి అంశాల ప్రస్తావన ఏదీ లేకపోవడంపై వామపక్షాలు ఇచ్చిన పిలుపుమేరకు గురువారం రాష్ట్ర బంద్ జరగనుంది. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, లోక్‌సత్తాతో పాటు కేంద్ర కార్మిక, ఇతర ప్రజా సంఘాలతో పాటు ప్రత్యేక హోదా సాధన సమితి వంటివి మద్దతు పలికాయి. బంద్‌కు సంఘీభావంగా ప్రతిపక్ష నాయకుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప యాత్రకు విరామం ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల

మిగతా 2వ పేజీలో ▶

ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ

- పార్లమెంటు ఆవరణలో ధర్నా
- వెల్‌లో ప్లకార్డుల ప్రదర్శన
- కేంద్రం వైఖరికి నిరసనగా వాకౌట్
- ఆందోళన పేరుతో మళ్లీ టీడీపీ నాటకం
- ప్రధాని ప్రసంగం సమయంలో సీట్లలో కూర్చున్న టీడీపీ సభ్యులు
- కాంగ్రెస్ నేతలతో వాగ్వాదం

2లో



బుధవారం పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా హసనాపురంలో మైనార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం

ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ హామీ

- దుల్హాన్ పథకం కింద యువతులకు రూ.లక్ష ఇస్తాం
- ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటుతో ఆర్థికంగా తోడుంటాం
- ప్రతిదీ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవడమే చంద్రబాబు నైజం.. నాలుగేళ్లుగా ఆయనది అదే తీరు
- మనందరి ప్రభుత్వం రాగానే నవరత్నాలతో అన్ని వర్గాల వారినీ ఆదుకుంటాం
- 1100 కిలోమీటర్ల మైలు రాయి దాటిన పాదయాత్ర

6లో

స్వగ్రామం చేరిన 'గాలి' భౌతికకాయం

సీఎం చంద్రబాబు, ఇతర నేతల నివాళులు

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సంతాపం

నేటి ఉదయం అంత్యక్రియలు

- వివరాలు 18లో

'బెల్టు' తీయలేదు

రాష్ట్రంలో అనధికారిక మద్యం దుకాణాల హవా

- గల్లీగల్లీలో పుట్టుకొస్తున్న కొత్త షాపులు
- బెల్టు షాపులు రద్దు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన.. రద్దుపై 95 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని వెల్లడి
- బెల్టు దుకాణాలు పెరిగాయని ఎక్సైజ్ కమిషనర్ మెమో
- బట్టబయలైన సీఎం ప్రకటనలోని డొల్లతనం

3లో

ఇటు 'ఏపీ టెట్'.. అటు తెలంగాణ డీఎస్సీ



- దాదాపుగా ఒకే తేదీల్లో పరీక్షలు ప్రారంభం
- ఏదో ఒక దానికి పరిమితం కావాల్సిందే
- రెండిటికీ సిద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆందోళన
- టెట్ షెడ్యూల్ సవరించాలని వినతి

2లో

హోదా పోరుకు అండగా ఉంటాం

- నేడు జగన్ ప్రజా సంకల్పయాత్రకు విరామం
- ప్రత్యేక హోదా సాధన కోసం అందరినీ కూడగట్టి ముందుకు సాగుతాం: ఎమ్మెల్యే కాకాణి



నెల్లూరు (సెంట్రల్): ఏపీకి ప్రత్యేక హోదా సాధన కోసం వామపక్ష పార్టీలు గురువారం నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు వైఎస్సార్ సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు పార్టీ నెల్లూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా [illegible] వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా కోసం పోరాడేందుకు ఎవరు ముందుకు వచ్చినా అండగా నిలిచి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. గురువారం వామపక్షాలు నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు వైఎస్సార్ సీపీ తరఫున మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు అన్ని చోట్లా బంద్‌లో పాల్గొని మద్దతు తెలుపుతాయన్నారు.

లంచాల కోసమే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకారం

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఎంతో కీలకంగా మారిందని కాకాణి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉప రాష్ట్రపతిగా ఉన్న వెంకయ్య నాయుడు కూడా గత ఎన్నికల ముందు హోదా అవసరమని చెప్పారన్నారు. గత ఎన్నికల సమయంలో తిరుపతిలో శ్రీవారి పాదాల చెంత మోదీతో కలిసి నిర్వహించిన సభలో ఏపీకి ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాలని చంద్రబాబు చిలుక పలుకులు పలికారన్నారు. హోదా కావాలని చెప్పిన నోటితోనే చంద్రబాబు ఇప్పుడు అదేమైనా సంజీవనా? అని అంటున్నారని విమర్శించారు. 14వ ఆర్థిక సంఘం ఒప్పుకోలేదని చెబుతూ మోసగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టుపెట్టి, లంచాల కోసం ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకోవడం దుర్మార్గమన్నారు.

ఏపీకి హోదా కోసం ప్రతిపక్ష నేత అలుపులేని పోరాటం

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రజల కోసం నాలుగేళ్లుగా పలు కార్యక్రమాలు చేపట్టారని కాకాణి గుర్తు చేశారు. ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రతి కార్యక్రమానికి అడ్డుపడి అక్రమ కేసులు పెట్టించడం లాంటి నీచమైన స్థితికి దిగజారారని మండిపడ్డారు. హోదా పోరాటాన్ని అణిచివేయాలని చంద్రబాబు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు.

ప్రజాసంకల్ప యాత్రకు నేడు విరామం

రాష్ట్ర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు గురువారం రాష్ట్ర బంద్ సందర్భంగా విరామం ప్రకటించినట్లు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. హోదా సాధన కోసం జరుగుతున్న బంద్‌కు వైఎస్ జగన్ పూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు చెప్పారు.

హాక్-ఐకి స్వదేశీ చోదక వ్యవస్థ



బుధవారం గగనవిహారం చేస్తున్న హాక్-ఐ విమానం

సాక్షి, బెంగళూరు: దేశంలోనే తొలి సారిగా రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో రూపొందిన హాక్-ఐ యుద్ధ శిక్షణ విమానాన్ని హెచ్‌ఏఎల్ తొలిసారిగా పరీక్షించింది. దీనిని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హెచ్‌ఏఎల్ తయారుచేసింది. ఈ విమానాలను యుద్ధ అవసరాలకు, శిక్షణకు ఉపయోగించుకోవచ్చు. బ్రిటన్ మాతృకగా గల ఈ విమానాల్లో భారత్ తన అవసరాలకు తగినట్లుగా ఆర్టీవోఎస్‌ను నిక్షిప్తం చేసింది. ఇది బుధవారం విజయవంతంగా గగనవిహారం చేసింది.

▶ మొదటి పేజీ తరువాయి

పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రజలంతా ఒక్కటిగా నిలబడి బంద్‌ను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ కోరింది. బంద్‌కు అన్ని సన్నాహాలు చేసినట్టు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు బంద్ సందర్భంగా స్వచ్ఛందంగా మూసివేయనున్నట్టు తెలిపాయి. ప్రభుత్వ సంస్థలు యధావిధిగా నడుస్తాయని అధికారవర్గాలు పేర్కొన్నా.. వాటిని అడ్డుకుంటామని బంద్‌కు మద్దతు ఇస్తున్న ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. బంద్‌కు మద్దతు ప్రకటించాలంటూ ముఖ్యమంత్రికి సీపీఐ బుధవారం బహిరంగ లేఖ రాసింది. తమిళనాడు రాష్ట్రంలో ఏ చిన్న సమస్య వచ్చినా అక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఆందోళన చేస్తాయని, అదే స్ఫూర్తిని ఏపీలోనూ ప్రదర్శించాలని విజ్ఞప్తి చేసింది. బంద్ వల్ల ప్రజలు ఇబ్బంది పడతారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడాన్ని ప్రజాసంఘాలు తప్పుబట్టాయి.

ప్రయాణాలు పెట్టుకోవద్దు

బంద్‌కు అన్ని పక్షాలు పూర్తిగా మద్దతు ఇస్తున్నందున ప్రజలు కూడా అనివార్యమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని వామపక్ష పార్టీల నేతలు విజ్ఞప్తి చేశారు. తెల్లవారుజాము నుంచే రాజకీయ పార్టీల కార్యకర్తలు బస్ డిపోల వద్ద ఆందోళన చేస్తారని, బస్సులు బయటకు రాకుండా నిలుపుదల చేస్తారని తెలిపారు. ఎక్కడికక్కడ బంద్‌కు మద్దతుగా ర్యాలీలు నిర్వహించేలా రాజకీయ పార్టీల నేతలు ఏర్పాట్లు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నేడు రాష్ట్ర బంద్



విజయవాడలో, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కర్నూలులో ఉండి బంద్ తీరును పర్యవేక్షిస్తారు. ఆర్టీసీ సహా అన్ని కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొని రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక హోదా సాధనకు మద్దతు పలకాలని కేంద్ర కార్మిక సంఘాల తరఫున ఏఐటీయూసీ నాయకుడు జె.ఓబులేసు, సీఐటీయు నాయకుడు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసించాలని పేర్కొన్నారు. బంద్‌ను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

విద్యాసంస్థలకు సెలవు

విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకపోవడం, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి సరైన నిధులు కేటాయించకపోవడానికి నిరసనగా నేడు బంద్ పిలుపు నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కాలేజీలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్టు ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి బి.ఉదయలక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే గురువారం జరగాల్సిన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌ను ఈనెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు పాఠశాల విద్యాశాఖ కూడా తన పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవును ప్రకటించింది.

పరిస్థితుల్ని బట్టి బస్సుల్ని నడిపేందుకు ఆర్టీసీ నిర్ణయం

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై ప్రతిపక్ష పార్టీలు గురువారం బంద్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పరిస్థితుల్ని బట్టి ఆర్టీసీ బస్సుల్ని నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నామని పోలీసులు ఆర్టీసీకి తెలిపారు. డీజీపీ మాలకొండయ్య ఆర్టీసీ ఎండీ కూడా కావడంతో స్థానిక పరిస్థితుల్ని బట్టి బస్సుల్ని నడపాలని ఆదేశాలు జారీ చేశారు.

బంద్‌పై టీడీపీలో మూడు వైఖరులు

బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీ చేపట్టిన బంద్‌పై అధికార పార్టీ ఒకరోజు మూడు వైఖరులు బయటపెట్టింది. బంద్ వల్ల ఉపయోగం ఉండదని, సమస్యలు పరిష్కారం కావని స్వయంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, అచ్చెన్నాయుడు బంద్‌ను వద్దంటూనే పునరాలోచించాలని సన్నాయి నొక్కులు నొక్కారు. మరోవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళా వెంకట్రావు బంద్‌కు పరోక్షంగా మద్దతిచ్చేలా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రతిపక్షాలు బంద్‌కు పిలుపునివ్వడంతో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలతో బుధవారం సీఎం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రస్తుతం ఏర్పడిన సమస్య రెండు ప్రభుత్వాల మధ్యదని, దీనికి బంద్‌ల ద్వారా పరిష్కారం లభించదని చెప్పారు. గురువారం తాను దుబాయ్ పర్యటనకు వెళ్తున్నానని, బంద్ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూడాలని సూచించారు. పోరాటాన్ని హేతుబద్ధంగా కొనసాగించాలని, సభ నుంచి సస్పెండ్ చేసినా వెనుకంజ వేయవద్దని పార్టీ ఎంపీలకు సూచించారు.

హోదా కోసం ఎందాకైనా..

ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ
- పార్లమెంటు ఆవరణలో ధర్నా
- వెల్‌లో ప్లకార్డుల ప్రదర్శన
- హామీలపై కేంద్రం వైఖరికి నిరసనగా వాకౌట్
- ఆందోళన పేరుతో మళ్లీ టీడీపీ నాటకం



పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు అవినాష్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభలో రెండో రోజూ హోరెత్తించింది. నిరసనలో మరో అడుగు ముందుకేసింది. ఏకంగా రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై ప్రధాన మంత్రి ప్రసంగాన్ని బహిష్కరించింది. సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించింది. బుధవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాద రావు, వైఎస్.అవినాష్‌రెడ్డి, పి.వి.మిథున్‌రెడ్డి తొలుత ఉదయం 9.30కు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి అనంతరం నేరుగా పార్లమెంటు ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. ప్రత్యేక హోదా వచ్చేవరకు తమ పోరాటం కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, దుగరాజపట్నం పోర్టు, పెట్రో కెమికల్ కాంప్లెక్స్, కడప స్టీలు ప్లాంటు, తదితర ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

టీడీపీ ఎంపీలది డ్రామా

మీడియాలో హైలైట్ అయ్యేందుకు టీడీపీ పాకులాడుతోందే తప్ప, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంలో చిత్తశుద్ధి లేదని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. ''ప్రజలు టీడీపీని చిత్తశుద్ధిని శంకిస్తున్నందున ఆర్థిక మంత్రిని బ్రతిమలాడి ఒక ప్రకటన చేయించారు. దానికి సంతృప్తి చెంది ఆందోళన విరమించుకున్నట్టు చెప్పారు. మరి ఈరోజు మళ్లీ ఎందుకు ఆందోళనకు దిగారు? ఇదంతా డ్రామా..'' అని మండిపడ్డారు. ''రాష్ట్ర ప్రభుత్వం అడుగుతున్నట్టుగా నాబార్డు ద్వారా నిధులిచ్చే అంశాన్ని పరిశీలిస్తామని మాత్రమే ఆర్థిక మంత్రి చెప్పారు. అంతేగాని ప్రత్యేక హోదా విషయంలో గానీ, రైల్వేజోన్, దుగరాజపట్నం పోర్టు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ తదితర విషయాలపై కేంద్రం సమాధానం ఇవ్వలేదు. ఆ మాత్రం ప్రకటనకే టీడీపీ వారు సంతృప్తి చెందడాన్ని బట్టి వారి చిత్తశుద్ధి ఏంటన్న విషయం అర్థమవుతుంది..'' అని ఎంపీ విజయసాయిరెడ్డి దుయ్యబట్టారు. ప్రయివేటు రంగంలో ఉన్న పోర్టును కాపాడేందుకు కేంద్రం నిర్మించే దుగరాజపట్నం పోర్టును ఆపాలని చూస్తున్నారని కేంద్రమే స్వయంగా చెప్పిందని ఎంపీ వరప్రసాద రావు తెలిపారు. అరుణ్ జైట్లీ ఇచ్చిన ప్రకటనపాత సీసాలో కొత్త సారా పోసినట్లుందని, పాత హామీలే మళ్లీ ప్రస్తావించారని ఎంపీ అవినాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

వెల్‌లోకి దూసుకెళ్లిన ఎంపీలు

బుధవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే వైఎస్సార్‌సీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినదించారు. మంగళవారం ఆందోళన విరమించిన టీడీపీ ఎంపీలు తిరిగి బుధవారం పార్లమెంటు ఆవరణలో ధర్నా చేసి లోక్‌సభలో వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఆందోళనల మధ్యే స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12 తరువాత ప్రధాని మోదీ సభలోకి వచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి జరిగిన చర్చకు సమాధానం ఇస్తారని, వైఎస్సార్‌సీపీ, టీడీపీ సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ కోరారు. వెంటనే టీడీపీ సభ్యులు ఆందోళన విరమించి తమ స్థానాలకు వెళ్లారు. అయితే వైఎస్సార్‌సీపీ సభ్యులు తమ ఆందోళన కొనసాగిస్తుండగా స్పీకర్ వారించారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘ్వాల్ వచ్చి విజ్ఞప్తి చేసినా వారు కదల్లేదు. ప్రధాని ప్రసంగం నుంచి తమ డిమాండ్లకు పరిష్కారం ఆశిస్తున్నామని, తమ డిమాండ్లను వినిపించేందుకు అవకాశమివ్వాలని కోరగా స్పీకర్ నిరాకరించారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్రధాని ప్రసంగాన్ని బహిష్కరిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు.

కాంగ్రెస్ ఎంపీలు, టీడీపీ సభ్యుల వాగ్వాదం..

ప్రధాన మంత్రి ప్రసంగించే ముందు టీడీపీ ఎంపీలు తమ స్థానాల్లోకి వెళ్లడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఇదంతా ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమమని విమర్శించారు. అందుకే తన ప్రసంగాన్ని అడ్డుకుని, ఇప్పుడు ప్రధాని ప్రసంగం సమయంలో మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో ఉండి ఆందోళన చేయడం డ్రామాగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎంపీలు మాగంటి బాబు, తోట నర్సింహం కాంగ్రెస్ నేతలతో వాగ్వాదానికి దిగారు. దీంతో కాంగ్రెస్ నేతలు వెల్‌లోకి దూసుకొచ్చారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే

రాజకీయ ప్రయోజనాల కోసమే తాము పార్లమెంటులో నిరసన తెలుపుతున్నట్టు టీడీపీ ఎంపీ నిమ్మల కిష్టప్ప వ్యాఖ్యానించారు. బుధవారం లోక్‌సభ జరుగుతున్న సమయంలో టీడీపీ ఎంపీలు కొణకళ్ల నారాయణ, నిమ్మల కిష్టప్ప సభ నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ.. 'రాజకీయ ప్రయోజనాల కోసం మేం నిరసన తెలిపాం' అని వ్యాఖ్యానించి, ఆ వెంటనే తడబాటును గుర్తించి రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరసన తెలుపుతున్నామని చెప్పారు.

బడ్జెట్ సమావేశాల్లోపు హామీలు నిలబెట్టుకోండి

- కేంద్ర హోం మంత్రిని కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు
- హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే అని స్పష్టీకరణ
- టీడీపీ డ్రామాలను ప్రజలు గుర్తించారు: వైవీ సుబ్బారెడ్డి




కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన హామీలను బడ్జెట్ సమావేశాల్లో ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందేలోపు అమలు చేయాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరింది. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత కేంద్రంపై ఉందని, కేంద్ర ప్రభుత్వానికి ఇదే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో ఇచ్చిన హామీలను బడ్జెట్ సమావేశాల్లోపు అమలు చేయాలని పార్టీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, వి. విజయసాయిరెడ్డి, వరప్రసాదరావు, పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. బుధవారం ఉదయం రాజ్‌నాథ్ సింగ్‌ను ఆయన నివాసంలో కలసిన వైఎస్సార్‌సీపీ ఎంపీలు.. విభజన చట్టంలోని ఇచ్చిన హామీలను, అప్పటి ప్రధాని ఇచ్చిన ప్రత్యేక హోదా హామీపై రాష్ట్రపతి ప్రసంగంలో, కేంద్ర బడ్జెట్‌లో పొందుపరచకపోవడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారని వివరించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలతో సమానంగా ఏపీ అభివృద్ధి ప్రత్యేక హోదాతోనే సాధ్యమవుతుందని వివరించారు. రాష్ట్ర ఆర్థికవృద్ధికి, యువత నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, అలాగే చట్టంలో లిఖితపూర్వకంగా ఇచ్చిన విశాఖ రైల్వే జోన్, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, వెనుకబడిన జిల్లాలకు బుందేల్‌ఖండ్-కేబీకే తరహాలో ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ లాంటి హామీలను బడ్జెట్ సమావేశాల్లో ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందేలోపు అమలు చేయాలని కోరుతూ ఐదు పేజీల వినతిపత్రాన్ని ఇచ్చారు.

హోదా సాధించేవరకూ పోరాటం

చట్టంలోని హామీల అమలుపై సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులతో చర్చిస్తున్నామని, హామీల అమలుపై త్వరలోనే ఒక పూర్తి స్పష్టత ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చినట్టు సమావేశం అనంతరం సుబ్బారెడ్డి మీడియాకు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేవరకు తమ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వామపక్షాలు ఇచ్చిన బంద్ పిలుపునకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తుందన్నారు. పార్లమెంటులో రెండు రోజులుగా టీడీపీ చేస్తున్న డ్రామాలను ప్రజలు గుర్తించారని చెప్పారు. సభలో జైట్లీ చేసిన ప్రకటనలో కొత్తదనం ఏమీ లేదని, హామీల అమలుపై స్పష్టతనివ్వకుండా చేసిన ప్రకటనపై టీడీపీ ఎంపీలు శాంతించి నిరసన విరమించడం పక్కా డ్రామాగా అభివర్ణించారు. గతంలో ఎన్నడూ లేనట్టుగా ఏపీలో అవినీతి రాజ్యమేలుతోందన్నారు. కేంద్రం ఇచ్చే నరేగా నిధులను టీడీపీ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, సొంత పథకాలను అమలు చేస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకొచ్చినట్టు ఎంపీ వరప్రసాదరావు తెలిపారు.

ప్రధాని ప్రసంగంపై వైఎస్సార్‌సీపీ నిరసన



సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ఆర్థిక సాయానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బుధవారం రాజ్యసభలో విజయసాయిరెడ్డి ఐదు సవరణలు ప్రతిపాదించారు. ఏపీకి ప్రత్యేక హోదా.. విశాఖలో రైల్వే జోన్, కడపలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు ఏర్పాటు, పోలవరానికి అయ్యే పూర్తి ఖర్చు భరించడం, రాయలసీమ, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ, రాజకీయాల్లో మహిళా రిజర్వేషన్లను విస్మరించడంపై విజయసాయిరెడ్డి సవరణలు ప్రతిపాదించారు. కాగా, కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు రాజ్యసభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఏపీకి న్యాయం చేయాలంటూ వెల్‌లో నిరసన తెలుపుతున్న కేవీపీని సభ నుంచి ఒకరోజు సస్పెండ్ చేస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ప్రకటించారు. ఇదిలాఉండగా, ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే తీవ్రంగా నష్టపోతారని ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి బీజేపీ చీఫ్ అమిత్‌షాను హెచ్చరించారు.

'మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళలపై నేరాల సంఖ్యలో పెరుగుదల వాస్తవమేనని రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ప్రశ్నకు జవాబుగా హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఆహిర్ వెల్లడించారు. పులివెందుల అరటి పండ్ల ఎగుమతి కోసం ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు శాఖ సహాయ మంత్రి సి.ఆర్.చౌదరి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా, దేశీయ సహజ వాయువు విక్రయ ధరల విధానాన్ని సమీక్షించాలంటూ ఓఎన్‌జీసీతోపాటు పలు సంస్థలు విజ్ఞప్తి చేసిన మాట వాస్తవమేనని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. ఫార్మా-డి కోర్సు చేసిన వారిని మెడికల్ ప్రాక్టీషనర్స్‌గా గుర్తించాల్సిన ఆవశ్యకతను జీరో అవర్‌లో విజయసాయిరెడ్డి ప్రస్తావించారు.

మార్చి 5న రైల్వే మంత్రి ఇంటి ముందు ధర్నా

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల స్పష్టీకరణ

అక్కయ్యపాలెం (విశాఖ ఉత్తరం): విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మార్చి 5న ఢిల్లీలో రైల్వే మంత్రి ఇంటి ముందు ధర్నా చేపట్టనున్నట్లు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్ ఇవ్వాలనే డిమాండ్‌తో ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్ శివశంకర్ అధ్యక్షతన శంకరమఠం రోడ్‌లోని ఓ హోటల్‌లో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హాజరైన ప్రతినిధులు మార్చి 5న ఢిల్లీలో రైల్వే మంత్రి ఇంటి ముందు ధర్నా, ఈ నెల 24 నుంచి 3 రోజుల పాటు విశాఖలో జరగనున్న భాగస్వామ్య సదస్సు ఎదుట నిరసనలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు విజయప్రసాద్, సీపీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాంజనేయులు, ఏయూ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ద్రోణం రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇటు 'ఏపీ టెట్'.. అటు తెలంగాణ డీఎస్సీ

దాదాపుగా ఒకే తేదీల్లో పరీక్షలు ప్రారంభం ● టెట్ షెడ్యూల్ సవరించాలని అభ్యర్థుల వినతి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఈనెల 21వ తేదీనుంచి ప్రారంభమై మార్చి 3వ తేదీతో ముగియనున్నాయి. అయితే ఇదే సమయంలో తెలంగాణలో టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహిస్తున్నారు. దీంతో ఇటు ఏపీ టెట్, అటు తెలంగాణలో డీఎస్సీ పరీక్షలు దాదాపు అవే తేదీల్లో జరగనుండడంతో తాము అవకాశాన్ని కోల్పోతామని వేలాది మంది నిరుద్యోగ టీచర్ అభ్యర్థులు వాపోతున్నారు.

20 శాతం స్థానికేతర కోటాలో పోటీ

ఏపీ టెట్ పరీక్ష ఈనెల 21నుంచి మార్చి 3వరకు జరగనుండగా తెలంగాణలో డీఎస్సీ ఫిబ్రవరి 24వ తేదీనుంచి మార్చి 4వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఏపీ టెట్ రాస్తున్న పలువురు అభ్యర్థులు తెలంగాణ డీఎస్సీకి కూడా దరఖాస్తు చేసుకున్నారు. అలాగే తెలంగాణ డీఎస్సీ రాస్తున్న అభ్యర్థులు కూడా ఏపీ టెట్‌కు దరఖాస్తు సమర్పించారు. ఇప్పుడు అవే తేదీల్లో పరీక్షలు ప్రకటించటంతో వీరిలో ఆందోళన నెలకొంది. ఏదో ఒక పరీక్షకే పరిమితం కావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. స్థానికేతరులకు ఓపెన్ కేటగిరీ కింద ఉన్న 20 శాతం కోటా పోస్టులకు వీరు పోటీపడుతున్నారు.

శిక్షణ పొందుతున్న అభ్యర్థుల్లో ఆందోళన

ఏపీ టెట్ మూడు పేపర్లలో జరగనుంది. పేపర్ 1కు 1,71,141మంది, పేపర్ 2కు 2,20,047 మంది, పేపర్ 3కి 50,866 మంది పోటీ పడుతున్నారు. పేపర్ 1, 2లకు కలిపి పరీక్ష రాయడానికి 10,499 మంది దరఖాస్తు చేసుకున్నారు. పేపర్ 1, 3లకు కలిపి 1,620 మంది దరఖాస్తు చేశారు. వీరిలో అత్యధికులు తెలంగాణ డీఎస్సీలో 20 శాతం కోటాలో విజయం సాధించేందుకు దరఖాస్తు చేసుకుని శిక్షణ కూడా తీసుకుంటున్నారు. ఏపీ టెట్‌కూ కోచింగ్ తీసుకుంటున్న వారు కూడా భారీగానే ఉన్నారు. రెండు పరీక్షలు ఒకేసారి నిర్వహిస్తే నష్టపోతామని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాలా రోజుల క్రితమే తెలంగాణ డీఎస్సీ షెడ్యూల్

డీఎస్సీని తెలంగాణ ప్రభుత్వం చాలా రోజుల క్రితమే ప్రకటించిందని, ఆ షెడ్యూల్‌లో మార్పులు చేయలేదని అభ్యర్థులు పేర్కొంటున్నారు. అదే ఏపీ టెట్ పరీక్షల షెడ్యూల్‌లో ఇప్పటికే 3సార్లు మార్పులు చేశారని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ప్రయోజనాల దృష్ట్యా ఏపీ టెట్‌ను వేరే తేదీల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మనకు సంబంధించిన అన్ని విషయాలొస్తున్నాయ్‌సార్ ఆయన నోట.. ఒక్క ప్రత్యేక హోదా మాట తప్ప!!

ఏపీ సీఎం అసమర్థుడు

- లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వరప్రసాదరావు
- టీడీపీ ఎంపీ జయదేవ్ వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం
- ఆ మాటలు రికార్డుల నుంచి తొలగించాలని పట్టు
- తొలగిస్తున్నట్టు ప్రకటించిన ఉపసభాపతి
- చంద్రబాబు అవినీతిని ఎండగట్టిన వరప్రసాదరావు
- హామీలు అమలుచేసేలా ఒక వ్యవస్థ ఉండాలి


ఎంపీ వరప్రసాద్

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ లోక్‌సభలో వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వెంటనే స్పీకర్‌ను కలిసి ఆ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా తమకూ అవకాశం ఇవ్వాలన్నారు. జయదేవ్ వ్యాఖ్యలు, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను లోక్‌సభ సాక్షిగా తూర్పారబట్టారు. మొదట వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్రధాన మంత్రి ప్రసంగాన్ని బహిష్కరించి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి సభ నుంచి బయటకు వెళ్లారు. అనంతరం బడ్జెట్‌పై చర్చలో గల్లా జయదేవ్ వైఎస్సార్ సీపీపై దూషణలతో ప్రసంగం ప్రారంభించారు. దీంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు వరప్రసాదరావు, వైవీ సుబ్బారెడ్డి సభలోకి వచ్చి జయదేవ్ వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. ఆ వెంటనే స్పీకర్‌ను కలిసి ఆ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా తమకూ అవకాశం ఇవ్వాలని కోరారు. దీంతో వరప్రసాదరావుకు అవకాశం కల్పించారు. ఆయన ప్రసంగం ప్రారంభిస్తూనే టీడీపీ తీరుపై మండిపడ్డారు.

ఏపీ సీఎం అసమర్థుడు

''టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ తన ప్రసంగంలో మా పార్టీ అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మా అధ్యక్షుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో కుమ్మక్కయ్యారని వ్యాఖ్యానించారు. ఒకవేళ అలా జరిగి ఉంటే సిల్లీ కారణాలపై 16 నెలలు జైల్లో ఉండేవారు కాదు. ఒక వ్యక్తి ఇక్కడ లేనప్పుడు వారి గురించి ఎలా మాట్లాడుతారు? ఇది పార్లమెంటరీ నిబంధనలకు విరుద్ధం. ఆ వ్యాఖ్యలను స్పీకర్ తొలగించాలి..'' అని వరప్రసాదరావు కోరారు. దీనికి వెంటనే సభాపతి స్థానంలో ఉన్న ఉపసభాపతి స్పందిస్తూ.. అన్‌పార్లమెంటరీ పదాలు ఉంటే వాటిని తొలగిస్తామని ప్రకటన చేశారు. ఆ తర్వాత వరప్రసాదరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ''ఏపీ ముఖ్యమంత్రి పూర్తిగా అసమర్థుడు. నాలుగేళ్లుగా కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉండి రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న ప్రత్యేక హోదాను తీసుకురాలేకపోయారు. కనీసం ప్రత్యేక ప్యాకేజీని కూడా అమలు చేయించుకోలేకపోయారు. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుకోలేకపోయారు. కనీసం రైల్వే జోన్‌ను కూడా తెచ్చుకోలేకపోయారు. ప్రైవేటు పోర్టును కాపాడుకునేందుకు దుగరాజపట్నం పోర్టును రానివ్వడం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన జిల్లా అయినందునే కడపలో స్టీల్ ప్లాంటు రానివ్వడం లేదు. పోలవరం జాప్యానికీ ముఖ్యమంత్రిదే బాధ్యత. రాష్ట్రానికి ఏమీ సాధించలేకపోయిన టీడీపీ మంత్రులు ఎన్డీయే నుంచి ఎప్పుడో రాజీనామా చేసి ఉండాల్సింది. నాలుగేళ్లు అధికారం అనుభవించి ఇప్పుడు తప్పులు వెతికితే ఏం లాభం? ఇది ఎన్నికలు దగ్గరికి వస్తున్నందున చేస్తున్న మ్యాచ్‌ఫిక్సింగ్ కాదా?'' అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీ ప్రజలు ఈ రాజకీయ క్రీడలను అర్థం చేసుకుంటారని చెప్పారు.

సీబీఐతో విచారణ జరిపించాలి

ఈ సందర్భంలో ఉపసభాపతి జోక్యం చేసుకుని రాష్ట్ర బడ్జెట్ గురించి కాదు కేంద్ర బడ్జెట్ గురించి మాట్లాడాలని సూచించారు. ''అసలు మా నేత గురించి వారు ప్రస్తావించి ఉండకపోతే మేం ఈ బడ్జెట్ ప్రసంగంలో ఆ ఊసెత్తేవాళ్లమే కాదు. అందుకే మీ అనుమతితోనే నేను ఈ అంశాలు లేవనెత్తాను. ఇవన్నీ రికార్డుల్లో ఉండాలి. అందుకే మాట్లాడుతున్నా..'' అని వరప్రసాదరావు తెలిపారు. ''నరేగా నిధుల మళ్లింపు కేంద్రానికి తెలుసు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పది పథకాలకు నరేగా నిధులను మళ్లించారు. ఇది నిరుపేద పొట్టకొట్టడమే'' అని ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి కమిటీలను టీడీపీ నేతలతో నింపేశారని విమర్శించారు. ''పట్టిసీమ గురించి దేశానికి తెలియాలి. 80 శాతం కాలువ పనులు వైఎస్సార్ హయాంలో పూర్తయ్యాయి. మిగిలిన 20 శాతం పనులకు రూ. 200 నుంచి రూ. 300 కోట్లు అవసరం. కానీ చంద్రబాబు రూ. 1800 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో రూ. 280 కోట్ల అవినీతి జరిగిందని కాగ్ తప్పు పట్టింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వంపై సీబీఐతో విచారణ జరిపించాలి..'' అని డిమాండ్ చేశారు. ఫిరాయింపుల చట్టం కేవలం కాగితాల్లోనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ''చంద్రబాబు మా పార్టీకి చెందిన 24 మంది ఎమ్మెల్యేను కొనుగోలు చేశారు. అందులో నలుగురిని మంత్రులుగా చేశారు. ఇది అప్రజాస్వామికం కాదా? తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు కుంభకోణానికి పాల్పడ్డారు. పదేళ్లపాటు హైదరాబాద్ రాజధానిగా ఉంటుందని అవకాశం కల్పించినా ఆయన మాత్రం వెంటనే సీబీఐ కేసుకు భయపడిపోయి ఏపీకి వచ్చేశారు'' అని తూర్పారబట్టారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉంటే ఆయన పుష్కరాలపై రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. సీఎం స్నానానికి వెళ్లి 29 మంది చావుకు కారణమయ్యారని, ఇది సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే తాజా కేంద్ర బడ్జెట్లోని లోపాలను వరప్రసాదరావు ఎండగట్టారు.

ఒక్క హామీనీ నెరవేర్చలేదు

చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన 600 హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని వరప్రసాదరావు చెప్పారు. దురదృష్టవశాత్తూ హామీలు అమలు చేయించే వ్యవస్థ, నెరవేర్చనందుకు చర్యలు తీసుకునేందుకు వీలుగా చట్టం లేనందువల్ల చంద్రబాబు ఆటలు సాగుతున్నాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలుచేసేలా ఒక వ్యవస్థ ఉండాలన్నారు. ''అధికారంలోకి వస్తే బేషరతుగా అన్ని పంట రుణాలు మాఫీ చేస్తామన్నారు. వడ్డీతో సహా ఉన్న రైతు రుణాలు రూ. 80 వేల కోట్లు కాగా ఆయన ఇచ్చింది రూ. 8 వేల కోట్లు మాత్రమే. దీంతో 90 శాతం రైతులు అప్పుల ఊబిలో ఉన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వమైనా రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాలి. రూ.30 వేల కోట్ల మేర డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామన్నారు. కానీ రూ. 300 కోట్ల మేర మాఫీ చేశారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ఉద్యోగం కల్పిస్తామన్నారు.. ఇవ్వకపోతే రూ. 2 వేల మేర నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. బీసీ కులాలకు రూ. 10 వేల కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ఏర్పాటు చేస్తామన్నారు. చేనేతల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు స్మార్ట్ ఫోన్లు, ప్రతి పేదవాడికి ఇల్లు, అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, అన్ని గ్రామాలను బీటీ రోడ్లతో అనుసంధానం చేస్తామని చెప్పారు. కానీ ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదు'' అని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. రైతులు, మహిళలతో సహా అన్ని వర్గాలకు అన్యాయం చేశారని దుయ్యబట్టారు.

ఆస్ట్రేలియా వర్సిటీ ప్రొఫెసర్ జగదీష్‌కు నాయుడమ్మ అవార్డు



నెల్లూరు(బృందావనం): నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక నాయుడమ్మ అవార్డును ఈ ఏడాది ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ చెన్నుపాటి జగదీష్‌కు అందచేస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ బుధవారం తెలిపారు. ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీలో చెన్నుపాటి జగదీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఆయన సెమీ కండక్టర్ ఆఫ్టో ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీలో విశేష కృషి చేశారు. అలాగే జగదీష్ వివిధ అంశాలకు సంబంధించి 870కు పైగా పరిశోధనాపత్రాలు ప్రచురితమయ్యాయి. అమెరికాలో 5 పేటెంట్లతో పాటు 11 పుస్తకాలు ప్రచురించారు. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో నెల్లూరులో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో జగదీష్‌కు నాయుడమ్మ అవార్డును అందచేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. కాగా, గతంలో నాయుడమ్మ అవార్డును డాక్టర్ కె.కస్తూరి రంగన్, నందన్ నీలేకని తదితర ప్రముఖులు అందుకున్నారని ఆయన తెలిపారు.

విజయవాడ నుంచి 3 నగరాలకు ఇండిగో సర్వీసులు

సాక్షి, అమరావతి: విజయవాడ నుంచి మూడు నగరాలకు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. మార్చి 2వ తేదీ నుంచి ఈ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సంజయ్ కుమార్ తెలిపారు. విజయవాడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు మూడు సర్వీసులు, బెంగళూరు, చెన్నైలకు ఒక్కో సర్వీసు చొప్పున రోజుకు 5 సర్వీసులను నడపనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు రూ.1,246, చెన్నై రూ.1,179, బెంగళూరుకు రూ. 1,826 నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చే 2,3 నెలల్లో ముంబై, ఢిల్లీలకు నేరుగా సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. ఉడాన్ పథకం కింద తిరుపతి నుంచి కొల్హాపూర్, కేరళలోని కానూర్‌లకు త్వరలో విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

18 కొత్త రైల్వే లైన్ల పనులు జరుగుతున్నాయి

ఎంపీలు మేకపాటి, అవినాశ్ రెడ్డి ప్రశ్నకు రైల్వే మంత్రి సమాధానం




సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో రూ. 20,301 కోట్ల నిధులతో 2,213 కి.మీ మేర 18 కొత్త లైన్లలో రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నట్టు ఎంపీలు మేకపాటి రాజమోహన్ రెడ్డి, అవినాశ్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్ బుధవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అలాగే రూ. 27, 688 కోట్ల నిధులతో 2,803 కి.మీ మేర 14 డబ్లింగ్ లైన్ పనులు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. కాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు పరిధిలోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 114 న్యాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పీపీ చౌదరి సమాధానం ఇచ్చారు. అలాగే దేశవ్యాప్తంగా కింది కోర్టుల్లో 5,925 పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

హామీల అమలుపై టాస్క్‌ఫోర్స్ కోరలేదు..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం చేయలేదని ఎంపీ కేవీపీ రామచంద్రారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం బుధవారం లోక్‌సభలో లిఖితపూర్వకంగా తెలిపారు. చట్టంలోని హామీల అమలులో తలెత్తే వివాదాల పరిష్కారానికి ఒక కమిటీ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

తిరుపతి-కశ్మీర్ హమ్‌సఫర్‌కు హాల్ట్ ఇవ్వండి

కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ఎంపీ మిథున్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతి నుంచి కశ్మీర్ వెళ్లే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ (22705/22706)కు రాజంపేట లేదా కడపలో హాల్ట్ ఇవ్వాలని కేంద్ర రైల్వే మంత్రి పియూష్ గోయల్‌ను ఎంపీ మిథున్ రెడ్డి కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని మిథున్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి–నిజాముద్దీన్ (12707/12708)సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు రాజంపేటలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. రాజంపేట మీదుగా ఢిల్లీకి ఈ ఒక్క రైలు మాత్రమే నడుస్తుందని, అందువల్ల దీనికి రాజంపేటలో హాల్ట్ ఇవ్వాలని కోరారు. అలాగే పుల్లంపేట మండలం అప్పరాజుపేట వద్ద ఎల్ నం.98 వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. రాజంపేట, కోడూరు అండర్ బ్రిడ్జి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. ఇక నండలూరు పాత లోకో షెడ్డును మూసివేయడం వల్ల 250 ఎకరాల్లో స్టాఫ్ క్వార్టర్లు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని అలాగే వదిలేయకుండా వినియోగించేందుకు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను మంజూరు చేయాలని కోరారు.


కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌తో వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి

9న విట్‌లో జాతీయ క్రీడా సాంస్కృతిక ఉత్సవం



సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలోని 'విట్' కేంపస్‌లో ఈ నెల 9న 'విటోపియా –2018' పేరున జాతీయ స్థాయి క్రీడా సాంస్కృతిక ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు విట్–ఏపీ కేంపస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్ తెలిపారు. ఇందులో 300కు పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. విట్–ఏపీ కేంపస్‌లో ఈ ఉత్సవాన్ని తొలిసారి నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు 9న ఉదయం పలు క్రీడా పోటీలు, స్టాండప్ కామెడీ, సింగింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు అదేరోజు బహుమతులు అందజేస్తామన్నారు. విటోపియా–2018లో మంత్రి గంటా శ్రీనివాసరావు, గుంటూరు రూరల్ ఎస్పీ వెంకటప్పలనాయుడు, బాలీవుడ్ గాయకుడు బెన్నీడయాల్ తదితరులు పాల్గొంటారన్నారు.

ఎవరిపై పోరాటం?

- పవన్ చెబుతున్న జేపీసీ విధివిధానాలు తెలుసుకున్నాకే స్పందిస్తా: ఉండవల్లి
- 11న హైదరాబాద్‌లో జనసేన అధ్యక్షుడితో భేటీ కానున్న ఉండవల్లి



సాక్షి, రాజమహేంద్రవరం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఏర్పాటు చేస్తామంటున్న జేపీసీ విధివిధానాలు తెలుసుకున్నాకే తన స్పందన వెల్లడిస్తానని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పారు. పవన్ కల్యాణ్ తనకు ఫోన్ చేసి జేపీసీ విషయం చెప్పారని, ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో సమావేశమవుతున్నామని తెలిపారు. ఉండవల్లి బుధవారం రాత్రి రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. 'పవన్ కల్యాణ్ ఈరోజు నాకు ఫోన్ చేసి దీనిపై సలహా కోరేందుకు వస్తానన్నారు. 10వ తేదీన హైదరాబాద్ వస్తున్నా. 11వ తేదీన కలుద్దామని చెప్పా. ప్రెస్‌మీట్‌లో నాపేరు ఎందుకు చెప్పారో తెలియదు. నాకు రాజకీయంగా యాక్టివ్ అవుదామన్న ఉద్దేశం లేదన్నా. నాకు అన్ని పార్టీలతో మంచి సంబంధాలున్నాయి. జేపీసీపై ఇంకా స్పష్టత లేదు. ఏదైనా సాధించేందుకు అది ఏర్పాటు చేస్తారు. ఇది ఎన్నికల ఏడాది. జేపీసీ ఏర్పాటు చేశాక బీజేపీ వాళ్లు ఎన్నికల్లో మళ్లీ గెలిస్తే ప్రత్యేక హోదా ఇస్తామంటారు. కాంగ్రెస్ వాళ్లు ఇప్పటికే ఇచ్చామంటారు. ఇది చాలా పెద్ద విషయం. ఏ రకమైన పోరాటం, ఎవరితో చేయాలన్నది తెలియాలి. ఏపీ విభజన చట్టం ఇంకా ఆమోదం పొందలేదని చెబుతున్నారు. కోర్టులోనూ కేసు నడుస్తోంది. విభజన చట్టం ఆమోదం కోసమా? లేక చట్టంలోని అంశాలు అమలు కోసం పోరాటమా? అనే పరిస్థితి వచ్చింది. ఆయన ఏ రకమైన పోరాటం చేస్తారన్నది తెలియాలి. పవన్ ఆలోచన తెలుసుకున్న తర్వాత వివరాలు వెల్లడిస్తాం. ఆయన అన్ని పార్టీల వారిని కూడగట్టి వెళ్తామంటున్నారు. ఆ పరిధి ఎంత ఉందో చూద్దాం. హోదా సాధన కోసం గురువారం నిర్వహిస్తున్న బంద్‌కు నేను మద్దతు ఇస్తున్నా' అని ఉండవల్లి పేర్కొన్నారు.

నాకన్నా ఉత్సాహవంతులున్నారు..

జేపీసీకి మీరు అధికార ప్రతినిధిగా ఉండాలని కోరితే అంగీకరిస్తారా? అని విలేకరులు ఉండవల్లిని ప్రశ్నించగా.. 'యుద్ధ వాతావరణంలోకి వెళ్లి దెబ్బలాడే ఉద్దేశం లేదు. అందరినీ కలుపుకొని పోతామంటున్నారు. అయితే నాకన్నా ఉత్సాహం, గొంతు ఉన్న యువకులు చాలామంది ఉన్నారు. వారికి నేను మద్దతు ఇస్తా' అని చెప్పారు. సమావేశంలో అల్లు బాబి, న్యాయవాది దేశాయ్, ఎన్వీ తదితరులు పాల్గొన్నారు.

హోదా సాధనకు జేఏసీ ఏర్పాటు

- అన్ని ప్రజా సంఘాలతో కలసి ఉద్యమిస్తాం: పవన్‌కల్యాణ్
- బీజేపీ హామీలు నెరవేర్చటం లేదు



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం అన్ని ప్రజా సంఘాలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి పోరాటం చేస్తామని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోసం జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమం చేసిన తరహాలోనే ఏపీలో కూడా ప్రత్యేక హోదా జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కూడా కలిసి వస్తే మంచిదన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమార్, జేపీలతోపాటు ఇతర మేధావులను త్వరలో కలుస్తానని చెప్పారు. బీజేపీ మేనిఫెస్టోలో చెప్పిన హామీలు నెరవేర్చలేదన్నారు. కేంద్రం ఎన్ని నిధులు ఇస్తోందో, వాటిని ఏలా ఖర్చు చేస్తోందో రాష్ట ప్రభుత్వం చెప్పలేకపోతోందని పవన్ అన్నారు.

పవన్ పర్యటనను అడ్డుకుంటాం

గిరిజన సంఘాల హెచ్చరిక

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్)/ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఈ నెల 21న తలపెట్టిన శ్రీకాకుళం జిల్లా పర్యటనను అడ్డుకుంటామని ఏపీ గిరిజన సంఘాలు వెల్లడించాయి. మత్స్యకారులు, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఇటీవల పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించాయి. ఈ మేరకు గిరిజన సంఘాల నేతలు బుధవారం వేర్వేరుగా మాట్లాడారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు పాలకీర్తి రవి విలేకరులతో మాటాడుతూ.. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివే పవన్‌కు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించే అర్హత లేదన్నారు. అఖిల భారత గిరిజన సంఘం అధ్యక్షుడు ఒ.రామలింగం మాట్లాడుతూ.. మత్స్యకారులను, బోయలను ఎస్టీల్లో చేర్చేందుకు పవన్ మద్దతు తెలపడం అవగాహనారాహిత్యమన్నారు.

'బెల్టు' తీయలేదు

- రాష్ట్రంలో అనధికారిక మద్యం దుకాణాల హవా
- గల్లీగల్లీలో పుట్టుకొస్తున్న కొత్త షాపులు
- బెల్టు షాపులు రద్దు చేశామని సీఎం చంద్రబాబు ప్రకటన



సాక్షి, అమరావతి: ''రాష్ట్రవ్యాప్తంగా మద్యం బెల్టు దుకాణాలన్నీ రద్దు చేశాం. బెల్టుషాపుల రద్దుపై ప్రజా సంతృప్త సర్వే నిర్వహించాం. 13 లక్షల మంది నుంచి అభిప్రాయ సేకరణ జరిపాం. 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సంతృప్త సర్వేలో ఎక్సైజ్ శాఖ మూడో స్థానంలో ఉంది. బెల్టు షాపులు రద్దు చేశామన్న సంగతిని ప్రజల్లో కింది స్థాయి వరకూ తీసుకెళ్లాలి''

ఈ నెల 5వ తేదీన కలెక్టర్లు, ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

''రాష్ట్రంలో మద్యం బెల్టుషాపులు రద్దు కాలేదు. అన్ని చోట్లా అనధికారిక మద్యం షాపులు పెరిగిపోయాయి. అసాంఘిక శక్తులు బెల్టుషాపులు నిర్వహిస్తున్నాయి. మేము కేసులు నమోదు చేస్తున్నా మళ్లీ పుట్టుకొస్తున్నాయి''

రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహం తాజాగా అన్ని జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లకు పంపిన మెమో సారాంశం


చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన రోజు తొలి ఐదు సంతకాలు చేశారు. మద్యం బెల్టుషాపుల రద్దు కూడా వీటిలో ఒకటి. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టి దాదాపు నాలుగేళ్లవుతోంది. రాష్ట్రంలో బెల్టుషాపుల సంఖ్య ఏమాత్రం తగ్గకపోగా నానాటికీ పెరిగిపోతున్నాయి. పల్లె, పట్నం అనే తేడా లేకుండా గల్లీగల్లీలో కొత్త దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. సాక్షాత్తూ ఎక్సైజ్ కమిషనర్ మెమో ప్రకారం చూసినా రాష్ట్రంలో బెల్టు షాపుల సంఖ్య గతం కంటే పెరిగింది. బెల్టుషాపులు రద్దయ్యాయి, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారంటూ చంద్రబాబు చెప్పిన మాటలు బూటకమేనని తేలిపోయింది. ఆయన అంకెల గారడీతో ప్రజలను మభ్య పెడుతున్నట్లు తేటతెల్లమైంది.

మద్యం అమ్మకాల పెంపు యోచన

రాష్ట్రంలో అధికార పార్టీ నేతల అండతో బెల్టు దుకాణాలను మద్యం సిండికేట్లే నిర్వహిస్తున్నాయి. మద్యం అమ్మకాలు రాష్ట్రవ్యాప్తంగా రోజుకు రూ.70 కోట్ల వరకు జరుగుతున్నాయి. బెల్టు షాపుల ద్వారా ఈ అమ్మకాలను రూ.వంద కోట్లకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. పైకి బెల్టు షాపుల రద్దు అంటూ చెబుతూనే అంతర్గతంగా అనధికారిక అమ్మకాలను ప్రోత్సహిస్తోందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. బెల్టు షాపులపై ఫిర్యాదుల కోసమంటూ ప్రభుత్వం 'ప్రజలే ముందు' కాల్ సెంటర్‌ను ఆర్భాటంగా ప్రారంభించింది. ఇప్పుడు ఈ కాల్‌సెంటర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించడం లేదు. దీంతో ఎక్సైజ్ కమిషనర్‌కు నేరుగా ఫిర్యాదులు అందుతున్నాయి.

జన్మభూమి సభల్లో 1,507 ఫిర్యాదులు

గత నెలలో నిర్వహించిన 'జన్మభూమి–మా ఊరు' సభల్లో సారా తయారీ, బెల్టు షాపులపై 1,507 ఫిర్యాదులు నమోదయ్యాయి. తమ ఇళ్ల మధ్యే బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని మహిళల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. అనధికారిక మద్యం దుకాణాల వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు. చాలాచోట్ల మద్యం దుకాణాల నిర్వాహకులే కల్తీ మద్యం తయారు చేసి బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తున్నట్లు ఇటీవల ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించింది. బెల్టు షాపులపై చర్యలు తీసుకుంటే అధికార పార్టీ నేతలు బెదిరింపులకు దిగుతున్నారని అంతు చూస్తామని హెచ్చరిస్తున్నారని ఎక్సైజ్ అధికారులు వాపోతున్నారు.


OFFICE OF THE COMMISSIONER OF PROHIBITION AND EXCISE
ANDHRA PRADESH, VIJAYAWADA.

Cr.No.1/Shop policy for 2017-19/2017 Dated: 05-02-2018

Sri P.Lakshminarasimham, I.A.S.,
Commissioner of Prohibition & Excise

MEMO

Sub: Prohibition and Excise - Eradicating the menace unauthorized liquor outlets (commonly known as b shops) - Instructions - Issued - Reg.

బెల్టు షాపులు ఇంకా కొనసాగుతున్నాయంటూ ఎక్సైజ్ కమిషనర్ జారీ చేసిన మెమో

ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు: కమిషనర్

రాష్ట్రంలో బెల్టు దుకాణాలను నిర్మూలించాలని తాజాగా ఉన్నత స్థాయి సమీక్షలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ సాంబశివరావు, డీజీపీ మాలకొండయ్య, ఎక్సైజ్ కమిషనర్ లక్ష్మీనరసింహం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు భేటీ అయ్యారు. ఇప్పటికే ఆయా జిల్లాల డిప్యూటీ కమిషనర్ల నుంచి ఎక్సైజ్ సీఐ స్థాయి వరకు మెమోలు జారీ చేశామని లక్ష్మీనరసింహం వివరించారు. బెల్టు షాపులపై నేరుగా తనతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు సమాచారం ఇవ్వొచ్చని సూచించారు. తన (కమిషనర్) ఫోన్ నంబరు 9515124852, డైరెక్టర్ ఫోన్ నెంబరు 9440902660కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు. 0866–2428333, 18004254868 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 8

జనం క్షమించరు

కొత్త సంవత్సరం ప్రారంభమయ్యాక జరిగే పార్లమెంటు తొలి సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీ. అంతకన్నా ముందు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించడం కూడా ఆచారంగా వస్తున్నదే. కేంద్ర కేబినెట్ చర్చించి ఖరారు చేసే ఆ ప్రసంగంలో గడిచిన ఏడాది ప్రభుత్వం సాధించిన విజయాలు, రాగల సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాలు ఉంటాయి. సారాంశంలో అది ప్రభుత్వ విధాన పత్రం. కనుకనే అందులోగానీ, ఆ తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోగానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన హామీల ఊసు లేదేమని ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు నిలదీశారు. అటు ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షంగా ఉంటున్న తెలుగుదేశం సభ్యులు కూడా విపక్ష సభ్యుల్లా హడావుడి చేయడం జాతీయ మీడియాను సైతం విస్మయపరిచింది. ఆ సంగతలా ఉంచి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ జవాబిచ్చిన తీరు, ఆయన ప్రసంగిస్తుండగా లోక్‌సభ నినాదాలతో హోరెత్తడం, వాటిని ఖాతరు చేయకుండా మోదీ గంటన్నరపాటు సుదీర్ఘ ప్రసంగం చేయడం వంటివి అందరిలోనూ ఆసక్తి రేకెత్తించాయి. ప్రసంగం పొడవునా ప్రత్యర్థులపై పిడుగులు కురిపించి వారిని గుక్కతిప్పుకోకుండా చేయడంలో మోదీకెవరూ సాటిరారని తెలిసిందే. ఈసారి ప్రసంగంలో సైతం అలాంటివి దండిగానే ఉన్నాయి. అంతకుమించి అదొక భారీ బహిరంగసభను ద్దేశించి చేసిన ప్రసంగాన్ని తలపించింది. కేవలం ఆయన స్వరం పెంచి మాట్లాడటం వల్ల మాత్రమే కాదు... అందులో స్వాతంత్ర్యోద్యమం నాటినుంచీ ఇంత వరకూ కాంగ్రెస్ వల్ల జరిగిన తప్పుల్ని ఏకరువు పెట్టడం వల్ల కూడా అది బహిరంగ సభ ప్రసంగాన్నే గుర్తుకు తెచ్చింది. గుజరాత్ ఎన్నికలు, రాజస్థాన్ ఉప ఎన్నికలలో వెలువడిన ఫలితాలు, మరికొన్ని నెలల్లో జరగబోయే కర్ణాటక ఎన్నికలు అలాంటి ప్రసంగం చేయడానికి కారణం కావొచ్చు. కానీ ప్రధాని నుంచి దేశ ప్రజలు... మరీ ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో ఆశగా, ఆత్రుతగా ఎదురుచూసింది ఈ మాదిరి ప్రసంగం కోసం కాదు.

ప్రధాని ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన బాగానే వచ్చింది. రాజీవ్‌గాంధీ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు సొంత పార్టీ ముఖ్యమంత్రి అంజయ్యను అవమానించడం, అది తెలుగుదేశం ఆవిర్భావానికి కారణం కావడంతో మొదలుపెట్టి రాష్ట్ర విభజన వరకూ జరిగినవి ఆయన గుర్తు చేశారు. అది ఏక పక్షంగా జరి గిందని, లోక్‌సభ తలుపులు మూసి ఆ తీర్మానం ఆమోదించారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకూ విభజన ఇప్పుడు గతించిన అంశం. ఆ సమయంలో ఏం జరిగిందో, ఎవరి పాత్రేమిటో రాష్ట్ర ప్రజలకు కొత్తగా ఎవరూ చెప్పనవసరం లేదు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఏకం కావడం వల్లే ఆ విభజన సాధ్యమైంది. రాజ్యసభలో విభజన బిల్లు వచ్చినప్పుడు వెంకయ్యనాయుడు, ప్రస్తుత కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విపక్షంలో ఉండి అప్పటి యూపీఏ ప్రభుత్వం నుంచి రాబట్టిన ప్రత్యేక హోదా హామీని ఆంధ్రప్రదేశ్ ప్రజలు మర్చిపోలేదు. వాటినే నెరవేర్చమని ప్రజలు అడుగుతున్నారు. నాలుగేళ్లు కావస్తున్నా వాటి అతీగతీ లేకపోవడాన్ని నిరసిస్తున్నారు. తమకు అధికారం అప్పగిస్తే రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఇస్తామని ఎన్నికల ప్రచార సభలో తిరుపతి వెంకన్న సాక్షిగా బీజేపీ, టీడీపీలు చెప్పిన సంగతిని గుర్తు చేస్తున్నారు. ఆ పార్టీల మేనిఫెస్టోల్లో ప్రత్యేక హోదా అంశం ప్రముఖంగా ఉన్న సంగతిని జ్ఞాపకం తెచ్చు కోమంటున్నారు. కాంగ్రెస్ అన్యాయం చేసిందని నరేంద్రమోదీ చెప్పడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇప్పుడు ఒరిగేదేమీ లేదు. అందుకు బదులు పునర్విభజన చట్టం అమలుకు దాదాపు ఈ నాలుగేళ్ల కాలంలోనూ వచ్చిపడిన అడ్డంకులేమిటో, ఆ విషయంలో ఎందుకు విఫలమయ్యారో మోదీ చెప్పాలి. ప్రత్యేక హోదా సంగ తేమి చేశారో వివరించాలి. దానికి సమానమైన స్థాయిలో 'ప్రత్యేక ప్యాకేజీ' ఇచ్చామని, హోదా గతించిన అంశమని ఇన్నాళ్లుగా బీజేపీ, టీడీపీలు చెబుతున్నాయి. కానీ అది చెల్లదు. ఆ అరకొర 'ప్యాకేజీ' సైతం ఏమీ అమలు కాలేదని కేంద్ర బడ్జెట్ సాక్షిగా ఇప్పుడు రుజువైంది.

విభజన సమయంలో ఆడిన కపటనాటకాలను తెలుగుదేశం ఇప్పుడు కూడా పునరావృతం చేసి జనాగ్రహం నుంచి తప్పించుకుందామని ప్రయత్నిస్తోంది. పాలక ఎన్‌డీఏలో భాగస్వామిగా కొనసాగుతూ అదే ప్రభుత్వంపై ఆందోళన సాగించడం అనైతికమని ఆ పార్టీకి తోచలేదు. దాన్నయినా చిత్తశుద్ధితో చేస్తే వేరే విషయం. బడ్జెట్‌పై తొలుత కేంద్ర కేబినెట్‌లో చర్చ జరుగుతుంది. అక్కడ ఆమోదం పొందాకే దాన్ని పార్లమెంటులో ప్రవేశపెడతారు. గత మూడు బడ్జెట్‌ల మాదిరే ఈసారి కూడా కొత్త బడ్జెట్‌లో రాష్ట్రానికిచ్చింది ఏమీ లేదని కేబినెట్ భేటీ సమయంలోనే టీడీపీకి అర్థమై ఉండాలి. ఆ క్షణంలోనే నిరసన తెలిపి, ప్రభుత్వం నుంచి బయటకు రావాలి. అది చేయలేదు సరిగదా... వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఆందోళనకు పూనుకొనేసరికి ఎక్కడ వెనకబడిపోతామోనన్న ఆత్రుతతో సభలోనూ, సభ వెలుపలా డ్రామాలాడటం ఎవరి కళ్లు కప్పడానికి? పోనీ ఆ ఆందోళన నిజమైందే అనుకుంటే జైట్లీ హామీకి సంతృప్తిపడి దాన్ని కాస్తా విరమించిన వారు 24 గంటలు గడవకుండానే ప్రధాని ప్రసంగం సమయంలో దాన్ని మళ్లీ ప్రారంభించడం, మధ్యలో విరమించడంలోని ఔచిత్యమేమిటి? ఒకపక్క ఢిల్లీలో ఇలా బహు పాత్రాభినయం చేస్తూ, రాష్ట్రంలో గురువారం బంద్ తలపెట్టిన ప్రతిపక్షాలపై ఉక్కుపాదం మోపడం నీతిమాలినతనం కాదా? ఇప్పుడు టీడీపీ, బీజేపీలు రెండూ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంజాయిషీ ఇవ్వాల్సిన స్థితిలో పడ్డాయి. వాటిలో ఒక పార్టీ నిరసన నాటకాన్ని నడిపించి, మరో పార్టీ మౌనం పాటించి తప్పించుకోలేవు. తక్షణం విభజన చట్టంలోని హామీల అమలు ప్రారంభించడం, ప్రత్యేక హోదా ప్రకటించడం మినహా మరేవీ ఆంధ్రప్రదేశ్ ప్రజలను సంతృప్తి పరచలేవు. రెండు పార్టీలూ ఆ సంగతి గుర్తించాలి.



మంచి ఆశయాలు కలిగిన వారు హామీలు ఇస్తారు. మంచి వ్యక్తిత్వం ఉన్నవారు వాటిని నిలబెట్టుకుంటారు.

– లానా టర్నర్
అమెరికా నటి

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.అష్టమి ప.1.20 వరకు, తదుపరి నవమి, నక్షత్రం విశాఖ సా.5.23 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం. రా.9.41 నుంచి 11.23 వరకు దుర్ముహూర్తం ఉ.10.19 నుంచి 11.04 వరకు, తదుపరి ప.2.53 నుంచి 3.37 వరకు, అమృతఘడియలు ఉ.8.05 నుంచి 9.45 వరకు.

సూర్యోదయం	: 6.34	3.00 వరకు
సూర్యాస్తమయం	: 5.53	యమగండం :
రాహుకాలం :		ఉ.6.00 నుంచి
ప 1.30 నుంచి		7.30 వరకు




నమాజ్ వేళలు

ఫజర్	: 5.32	మగ్రీబ్	: 6.15
జొహర్	: 12.30	ఇషా	: 7.29
అసర్	: 4.38		

విశాల ఐక్యత నేటి అవసరం

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

కమ్యూనిస్టు పార్టీల ప్రస్తుత క్షీణ స్థితిని గుర్తుచేసి జాగ్రత్తపడాలని హెచ్చరిస్తే అలాంటి వారిని బీజేపీ అనుకూల మేధావుల సరసన చేర్చి వ్యవహరించే వారిపట్ల కమ్యూనిస్టులు సైతం అప్రమత్తతతో ఉండాలి. కొన్ని పొరపాట్లు జరగకుండా ఉండి ఉంటే కమ్యూనిస్టుల స్థితి మరింత ఆశాజనకంగా ఉండేదన్న సదుద్దేశంతో విమర్శించినంత మాత్రాన వారందరినీ శత్రు శిబిరంలో కలుపడమే కాకుండా 'కమ్యూనిస్టులదే అంతిమ విజయం' అనే భావనను సమర్థించకపోవడమే తీవ్ర తప్పిదం అంటే ఎలా?

ఇటీవల రాజస్థాన్‌లో 2 లోక్‌సభా స్థానాలకు, ఒక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఆ మూడు స్థానాల్లో బీజేపీ పరాజయాన్ని చవిచూసింది. ఇంతకు ముందు ప్రధాని మోదీ స్వరాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో గుజరాత్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చినా ఆ విజయం బీజేపీకి గానీ, మోదీకి గానీ ప్రత్యేకించి పేర్కొనదగినది కాకపోగా, గతంలో కంటే తక్కువగా పోలైన ఓట్ల శాతంతో భారీగా నష్టపోయింది. ఆమేరకు కాంగ్రెస్ పార్టీ లాభపడింది. అదే విధంగా బెంగాల్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో తృణమూల్ ఘన విజయమే సాధించింది. ఉపఎన్నికలను కొట్టి పారేయడం కుదరదు. బహుశా గతంలో రెండు సార్లు.. అధికారంలో ఉన్న పార్టీ ఉపఎన్నికలలో ఇలా ఓడిపోవడం జరగలేదు. అది రాజస్థాన్‌లో బీజేపీ మాత్రమే సాధించిన రికార్డు. అలాగే తమిళనాడులో జరిగిన ఇటీవలి ఉపఎన్నికలలో బీజేపీకి నోటాకు వచ్చిన ఓట్లకంటే కూడా తక్కువ వచ్చి, 1300 ఓట్లతో సరిపెట్టుకోవలసివచ్చింది. ఈ 67 ఏళ్ల రిపబ్లిక్ చరిత్రలో ఒక శాసనసభ ఉప ఎన్నికలో ఇంత తక్కువ ఓట్లు సాధించిన ప్రధాన జాతీయ పార్టీ ఏదీ లేదు.

భారతదేశం వివిధ జాతుల సముదాయం అన్న వాస్తవాన్ని గుర్తించకుండా మొత్తం దేశాన్ని ఏకశిలా సదృశమైన అఖండ హిందూరాజ్యంగా మార్చాలన్న ఆర్‌ఎస్‌ఎస్ మతతత్వ ఎజెండాను శాయశక్తులా అమలు జరిపేందుకు తీవ్రకృషి చేస్తోందని ఈ నాలుగేళ్ల బీజేపీ, మోదీజీల వ్యవహార శైలి వలన తేటతెల్లమవుతున్నది. దేశానికి ఈ పరిస్థితి దాపురించడానికి, బీజేపీ ఇంతటి స్థాయికి ఎదగడానికి, కాంగ్రెస్ పార్టీ అవినీతిమయమైన అధ్వాన పాలన కారణమని ఇతర ప్రతిపక్షాలు సహజంగా కాంగ్రెస్‌ను విమర్శిస్తాయి. ఆ విమర్శ వాస్తవమే. కానీ బీజేపీకి లేని బలాన్ని సంతరింపచేయడంలో మిగిలిన బీజేపీయేతర పార్టీల, వ్యక్తుల పాపం కూడా లేకపోలేదు. ఉదా.కు బిహార్‌లో నితీశ్ కుమార్ నిర్వాకం ఏమిటి? లాలూప్రసాద్ యాదవ్ పార్టీ ఆర్జేడీతో కలిసి బిహార్‌లో గత శాసనసభ ఎన్నికల్లో బీజేపీని మట్టిగరిపించి గద్దెనెక్కిన నితీశ్ కుమార్ ఈ మధ్యనే తనకు ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టిన ఆర్జేడీకి, లాలూకు వెన్నుపోటు పొడిచి పచ్చి అవకాశవాదంతో బీజేపీతో చేతులు కలిపి ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా అందలం మీద కులుకుతున్న విషయం మనకు తెలిసిందే కదా.

అవకాశవాదానికి మారుపేరు బాబు

ఇక మన రాష్ట్రంలో చంద్రబాబు తెలుగుదేశం వ్యవహారం తెలిసిందే కదా. వెన్నుపోటు అనే పేరుతో ఎవరైనా సినిమా తీయదల్చుకుంటే అది చంద్రబాబును ఉద్దేశించేనని ఆంధ్రప్రదేశ్ ప్రజలు అపార్థం చేసుకునే అవకాశమూ ఉంది. మోదీ అధికారంలో ఉండగా గుజరాత్‌లో మతకల్లోలాల సందర్భంగా 3 వేలమంది (అత్యధికంగా ముస్లింలు) మారణ హోమానికి గురైనప్పుడు మోదీ మన రాష్ట్రానికి వస్తే కారాగారంలో వేసి శిక్షిస్తానని చంద్రబాబు ప్రగల్భాలు పలికిన విషయం తెలుగు ప్రజలు మర్చిపోలేదు. 2004 ఎన్నికలనాటికి వాజ్‌పేయితో, బీజేపీతో కలిసి ఎన్నికలలో జతకట్టి ఓటమి పాలైన సందర్భంగా ఇక బీజేపీతో ఎన్నికలపొత్తు పెట్టుకోనని రాజకీయ ప్రతిజ్ఞ చేసిన పెద్ద మనిషి చంద్రబాబు. కానీ 2014 ఎన్నికల్లో ఆ ఒట్టు తీసి గట్టున పెట్టి మోదీతో, బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు.

ఇక వామపక్షాల పాత్ర కూడా బీజేపీ నేడు ఈ స్థాయికి ఎదగడానికి తోడ్పడింది. నిజానికి బీజేపీకి, ఆ పార్టీ సైద్ధాంతిక స్ఫూర్తి ఆర్‌ఎస్‌ఎస్‌కు భావజాలపరంగా మార్క్సిస్టు దృక్పథంతోనే ప్రథమ శత్రుత్వం ఉంటోంది. ఈ నేపథ్యంలో మార్క్సిస్టులు పరస్పరం ఆ ఊరికీవూరు ఎంత దూరమో ఈ ఊరుకు ఆ ఊరూ అంతే దూరం అన్నట్లుగా ఉండటం సరైంది కాదు. ఏ కమ్యూనిస్టు పార్టీలోనూ సభ్యత్వం లేనంత మాత్రాన తమకు తెలిసినంతలో మార్క్సిజం పట్ల నిబద్ధత కలిగి ఉంటున్నవారు–కమ్యూనిస్టు పార్టీల ఆచరణ, వాటి ఎత్తుగడల లోపాలపై విమర్శిస్తూ ఉండవచ్చు. అది మన పిల్లవాడు తప్పు చేస్తుంటే హెచ్చరించడం, సరిదిద్దుకోమని చెప్పడం వంటిది. అలా విమర్శించినంత మాత్రాన ఆ వ్యక్తిని కమ్యూనిస్టు పార్టీకి శత్రువుగా పరిగణించడం సబబు కాదు.



పొత్తు విషయంలోనే విభేదాలు!

ఎవరితో పొత్తు కుదుర్చుకోవాలి, ఎవరిని దూరం పెట్టాలి, విభేదించాలి అనే సూత్రబద్ధతకు సంబంధించి కమ్యూనిస్టు పార్టీల్లోనే అంతర్గతంగా చర్చలు, వాదాలు జరిగి ఓటింగ్ వరకు వెళుతున్న ఘటనలు గతంలోనూ జరిగాయి, ఇప్పుడూ జరుగుతున్నాయి. ఎమర్జెన్సీ అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్ల ఎలాంటి వైఖరి కలిగి ఉండాలనే విషయమై పుచ్చలపల్లి సుందరయ్య సీపీఎంలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో తీవ్ర చర్చ జరిగింది. 42 ఏళ్ల తర్వాత సీపీఎం పార్టీ అఖిల భారత మహాసభ జరగనున్న సందర్భంగా అలాంటి పరిస్థితే మళ్లీ ఏర్పడింది. మోదీ, షాల బీజేపీ పార్టీ మతతత్వ ధోరణులకు వ్యతిరేకంగా రాజ్యాంగ ఔన్నత్యాన్ని నిలబెట్టుకోవాలంటే ఏం చేయాలి అన్న విషయంలో సీపీఎంలో విభేదాలున్నాయనే వార్త వచ్చింది. కాంగ్రెస్ పార్టీతో సహా బీజేపీ వ్యతిరేక, బీజేపీయేతర పార్టీలన్నింటినీ కలుపుకుని కూటమి ద్వారా పోరాడాలనీ, ఆ పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం ప్రతిపాదిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అలాంటి పోరాటంలో పాల్గొనే అర్హత కోల్పోయిందని అలాగే ఇతర పెట్టుబడిదారీ పార్టీలు కూడా కాంగ్రెస్ లాగే ఉదార ఆర్థిక విధానాలనే అనుసరిస్తున్నాయని, కనీస వామపక్షాలతో తప్ప ఇలాంటి వాటితో కలిసి వేదిక పంచుకునే ప్రశ్న రాదని, గతంలో విశాఖపట్నంలో చేసుకున్న తీర్మానానికే కట్టుబడి ఉండాలని, మునుపటి పార్టీ ప్రధాన కార్యదర్శి, నేటి పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ ప్రతిపాదించారని వార్త. ఈ ఇరువురి వాదనల మధ్య ఓటింగులు జరిగి, ఒక దశలో ప్రకాశ్ వాదన నెగ్గిందని, తర్వాత కేంద్రకమిటీలో ఏచూరి వాదన నెగ్గిందని అయితే మహాసభ చివర జరిగిన కేంద్రకమిటీ భేటీలో తిరిగి ప్రకాష్ వాదనే 8 ఓట్ల తేడాతో నెగ్గిందని హిందూ పత్రికలో వార్త చూశాము.

ప్రకాష్ కరత్ వాదన ప్రకారం, కాంగ్రెస్ పార్టీ లౌకిక పార్టీ కాదు. కాంగ్రెస్ కూడా బీజేపీ అంత మొరటు మతతత్వ పార్టీ కాకపోయినా, కొంత సున్నితమైన మతతత్వ పార్టీయే అని కరత్ వాదన. ఇదే సమయంలో విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ కౌన్సిల్‌లో, మోదీ మతతత్వ, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధపడిన పార్టీలన్నింటితోపాటు కాంగ్రెస్‌ను కూడా కలుపుకుని పోరాడాలి అని తీర్మానం చేశారు. దానిపై సీపీఎం నుంచి సానుకూల స్పందన లేదు.

కమ్యూనిస్టు పార్టీల సానుభూతి పరులు, సాధారణ కష్ట జీవులు, వర్ణ (కుల) వ్యవస్థ పద ఘట్టన కింద నలిగిపోతున్నవారు, మతోన్మాదంతో పాటు ఉదారవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా దైనందిన జీవనంలో అష్టకష్టాలు పడుతున్నవారు.. వీరందరూ కూడా రెండు కమ్యూనిస్టు పార్టీల మధ్య కానరాని ఐక్యత విషయంలో నిస్పృహకు గురవుతున్నారు. వామపక్షాల ఐక్యత గురించి సీపీఐ, సీపీఎం తరచుగా ప్రబోధిస్తుంటాయి. కానీ ప్రస్తుత కీలక సమయంలో అయినా ఐక్యతకు భిన్నంగా ఉండే ప్రకటనల పట్ల కాస్త సమతుల్యతతో ఉండటం అవశ్యం.

అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ రెండూ ఆర్థిక విధానాల్లో కోటీశ్వరుల కొమ్ము కాస్తూ, నిరుపేదల పట్ల, దిగువ మధ్య తరగతి పట్ల నిర్లక్ష్యం వహించి సాధారణ ప్రజల జీవితం దుర్భరం చేయడం వాస్తవమే. దానికి తోడు బీజేపీ కరడుగట్టిన మతతత్వంతో హిందూ, హిందూయేతర ప్రజల మధ్య వైరుధ్యాన్ని పెంచి హిందూ మత ఓటు బ్యాంకు కోసం పరమత ద్వేషాన్ని రెచ్చగొడుతూ, ప్రజానీకాన్ని మధ్యయుగాల అంధకారంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ నాలుగేళ్ల పాలనలో అది ఎన్ని దుశ్చర్యలకు పాల్పడిందో తెలిసిందే. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ లౌకికవాద పార్టీ కాదని చెబుతూ దాన్ని బీజేపీతో కలిపి ఒకే గాటన కట్టడం వాస్తవం కాదు. ఆ మాటకొస్తే మైనారిటీల తరపున నిలబడినందువలన హిందూమతానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్న అపప్రథకు సీపీఎం కూడా గురైంది. అంత మాత్రాన అది నిజమేనా?

మతతత్వ పాలనే ప్రథమ శత్రువు

ఏది ఏమైనా మోదీ, షాల అప్రకటిత నియంతృత్వ పాలనను, దాని ఉన్మత్త ఏకశిలా సదృశ జాతీయతను, దాని శ్రామిక వ్యతిరేక సిద్ధాంతాన్ని, ప్రజల జీవనాన్ని అధోగతిలోకి నెడుతున్న మతతత్వ దుర్మార్గాన్ని వ్యతిరేకించడం ప్రస్తుతం అవసరం. నాడు అత్యవసర పరిస్థితిలో సుందరయ్య కూడా కాంగ్రెస్ నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా జనతాపార్టీతో కలిసి వ్యవహరించడం తప్పు అనలేదు. అలా సాగిస్తూనే, ఉమ్మడి ఎన్నికల కార్యక్రమాలు, ఉపన్యాస వేదికలు పనికిరావని ఆయన హెచ్చరించారు. నేటి పరిస్థితిలో అదే వైఖరి సరైనదవుతుంది. వామపక్ష నాయకత్వాన ఇలాంటి ప్రయత్నం సాగాలి.

ఈ సందర్భంలో ఎన్నో రాజకీయ పార్టీలను, ఉద్యమ సంస్థలను, నేతలను కలుపుకురావాలి. అందుకు ఎంతో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుంది. తొలి పార్లమెంటులో నెహ్రూ ప్రధాని కాగా, సుందరయ్య ప్రధాన ప్రతిపక్ష నేత. నేడు పార్లమెంటులో పార్టీ స్థాయి ఎలా ఉంది? నేడు ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐ కానీ, సీపీఎం కానీ ఒక్క స్థానాన్ని అయినా పొందగల స్థితి ఉన్నవా? అని కొందరు కమ్యూనిస్టులకు, సానుకూల తటస్థులైన మేధావులకూ సందేహాలుండే అవకాశం ఉంది. ఇలా పార్టీల క్షీణ స్థితిని గుర్తుచేసి జాగ్రత్తపడాలని హెచ్చరిస్తే అలాంటి వారిని బీజేపీ మేధావుల సరసన చేర్చి వ్యవహరించే వారిపట్ల కమ్యూనిస్టులు సైతం అప్రమత్తతతో ఉండాలి.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వంటి విప్లవాత్మకత కూడా ఈ పార్టీల నుంచి ఆశించే భౌతిక, స్వీయాత్మక స్థితీ నేడు లేదు. కొన్ని పొరపాట్లు జరగకుండా ఉండి ఉంటే కమ్యూనిస్టుల స్థితి మరింత ఆశాజనకంగా ఉండేదన్న సదుద్దేశంతో విమర్శించినంత మాత్రాన వారందరినీ శత్రుశిబిరంలో కలపటం భావ్యం కాదు. పైగా కమ్యూనిస్టులదే అంతిమ విజయం అనే భావనను సమర్థించకపోవడమే అలాంటి మేధావులు, ప్రజాస్వామ్యవాదుల తీవ్ర తప్పిదమన్నట్లుగా హద్దులు దాటిన విమర్శనాస్త్రాలతో వ్యంగ్యంగా అపహాస్యం చేయబూనడం కమ్యూనిస్టు పార్టీల లక్ష్యాలను, వారి ఓర్పు నేర్పులను బూడిదలో పోసిన పన్నీరు చేస్తాయి. కమ్యూనిస్టులు తమను తాము ఒంటరి చేసుకునే అలాంటి తుంటరి పనులకు, రచనలకు, దూరంగా ఉండి ఆ మహత్తర కర్తవ్యంలో వీలైనంత మంది ప్రజానీకాన్ని రాసిరీత్యా, వాసిరీత్యా కూడా తమ మిత్రులుగా నిలబెట్టుకునే కృషి చేయడం చాలా అవసరం!

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

కళల బోధన ఇక మిథ్యేనా!

స్థూలంగా చూస్తే ఆర్ట్, వర్క్ పాఠ్యాంశాలు పార్ట్ టైం పద్ధతిన, లేదా కేవలం రెండున్నర గంటలు బోధించేవి కావు. పూర్తికాలం (ఫుల్ టైం) పద్ధతిలో బోధిస్తేనే మంచి ఫలితాలు అందుతాయి.

ప్రాచీన భారతదేశ చరిత్రను చూస్తే ప్రజలకూ, కళలకూ ఉన్న అవినాభావ సంబంధం అర్థమౌతుంది. గుహలలో బయ టపడిన చిత్రలేఖనాలు, చేతిపని ముట్లు ఇందుకు సాక్ష్యం చెబుతాయి. అటువంటి కళా కౌశలాన్ని, పని సంస్కృతిని భావితరాలకు అందించేందుకు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టారు. పాఠశాలలలో ప్రాథమిక స్థాయి నుంచే కళా విద్యను, పని విద్యను బోధించాలని నిర్ణయించారు. తద్వారా పిల్లల్లో చదువుల ఒత్తిడిని తగ్గించి, అంతర్లీనంగా ఉండే సృజనాత్మక శక్తిని వెలికితీయవచ్చుననే సదాశయంతోనే చిత్రలేఖన (ఆర్ట్ ఎడ్యుకేషన్) విద్యను ప్రవేశపెట్టారు. చేతివృత్తుల పట్ల అవగాహన పెంచి, పనిలో సామర్థ్యం, ప్రతిభ పెంచాలనే లక్ష్యంతో పనివిద్యను (వర్క్ ఎడ్యుకేషన్) బోధనాంశం చేశారు.

ఈ దేశ విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకువచ్చిన ఈశ్వరీబాయి, కొఠారీ కమిషన్లు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. ఆర్ట్, వర్క్ ఎడ్యుకేషన్ విభాగాల ఉపాధ్యాయులను అందించేందుకు ప్రత్యేక పరీక్షల నిర్వహణ, శిక్షణ వంటి విధానాలు ప్రవేశపెట్టి, సమర్థవంతమైన వ్యవస్థలుగానే వీటిని నిర్వహించారు కూడా. కోట్ల మంది విద్యార్థుల మానసిక పరిపక్వత, వికాసమే ప్రధానసూత్రంగా ఈ విభాగాల పాఠ్యప్రణాళికలను కూడా పటిష్టంగా రూపొందించారు. కాలక్రమేణా సిబ్బంది కొరత, ఇతర కారణాల వల్ల ఈ విభాగాలకు చెందిన ఉపాధ్యాయులను ఇతర సేవలకు కేటాయించడం, ఈ అంశాల బోధనకు సరైన సమయాన్ని నిర్దేశించకపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ విభాగాలకు వచ్చిన కొంతమంది ఉపాధ్యాయులు బోధన పట్ల చూపిన నిర్లక్ష్యం కూడా ఈ దుస్థితికి కారణమన్నది ఒక చేదు నిజం. అన్నీ కలిపి ప్రస్తుత ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులకు శాపంగా పరిణమించాయి.

కానీ సీబీఎస్‌సీ విద్యా విధానంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలోనే కాకుండా, ఈ విధానంలో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలో కూడా ఫుల్‌టైం ఆర్ట్, వర్క్ టీచర్లు ఉండాలన్న నిబంధన కారణంగా ఈ ఉపాధ్యాయులు నియామకాల చేపడుతున్నారు. అక్కడ అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు కూడా.

మన రాష్ట్రం విషయానికొస్తే 1989 నుంచి ఈ విభాగాలకు ఉపాధ్యాయుల నియామకమే జరగలేదు. కానీ ప్రతి ఏడాది అర్హతలకు కావల్సిన పరీక్షలు మాత్రం నిర్వహిస్తున్నారు. అయితే అర్హతలు సాధించిన అభ్యర్థులు వేల సంఖ్యలో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. మూడు దశాబ్దాలుగా జరుగుతున్న టీచర్ల నియామక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రాముఖ్యం ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులకు ఇవ్వలేదు. ఈ వ్యవస్థ దాదాపు నశించిపోతున్న తరుణంలో 2009లో కేంద్రప్రభుత్వం రూపొందించిన విద్యాహక్కు చట్టం వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులను పార్ట్ టైం పద్ధతిలో నియమించాలని నిర్దేశించారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఆ అంశాలను బోధించాలని సూచించారు.



ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో సుమారు 6000 మందికి పైగా ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులు అతి తక్కువ వేతనానికి పార్ట్ టైం పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా, 6 నుంచి 8 తరగతుల విద్యార్థుల సంఖ్య వందకంటే తక్కువగా (ఆఖరికి ఒక్కరు తగ్గినా) ఉంటే ఆ పోస్టును రద్దు చేసి ఆ ఉపాధ్యాయులను తొలగిస్తున్నారు. పూర్తికాలం (ఫుల్ టైం) ఉద్యోగాలు లభించక, పార్ట్ టైం వేతనంతో జీవించలేక వీరు అప్పుల పాలైపోతున్నారు.

స్థూలంగా చూస్తే ఆర్ట్, వర్క్ పాఠ్యాంశాలు పార్ట్ టైం పద్ధతిన, లేదా కేవలం రెండున్నర గంటలు బోధించేవి కావు. పూర్తికాలం (ఫుల్ టైం) పద్ధతిలో బోధిస్తేనే మంచి ఫలితాలు అందుతాయి. మరొక అంశం కూడా గమనించాలి. ఈ రెండు అంశాల బోధన కాస్త ఖర్చుతో కూడుకొని ఉన్నది. ఇందులో కూడా పార్ట్‌టైం విధానంలో ఉద్యోగాలను భర్తీ చేశారు గాని, బోధన సామగ్రికి నిధులు కేటాయించలేదు. అయినప్పటికి ఆర్ట్, వర్క్ ఉపాధ్యాయులు వారి అరకొర జీతాలలోనే కొంత సొమ్మును సామగ్రికి వినియోగించి కొంతవరకు మంచి ఫలితాలనే సాధిస్తున్నారు. సర్వ శిక్ష అభియాన్ నిబంధనల ప్రకారం వీరిని 8వ తరగతి వరకే బోధనకు పరిమితి చేయడం వల్ల ఉన్నత విద్య దశలో కీలకమైన 9, 10 తరగతుల విద్యార్థులకు ఆర్ట్, వర్క్ విద్యాబోధన దాదాపు అందని ద్రాక్షే అవుతోంది.

ఉపాధ్యాయ సంఘాలు కూడా వీరిని విస్మరిస్తున్నాయి. ఎన్నికల్లో వీరికి ఓటు హక్కు లేకపోవడమే అందుకు కారణం. ప్రభుత్వానికి వీరి నియామకాల మీద చిత్తశుద్ధి లేదు. దీనితో అటు విద్యార్థుల, ఇటు ఆర్ట్, వర్క్ అంశాలు బోధించే ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం వీరిని ప్రత్యేక డి.ఎస్.సి. ద్వారానో లేక ప్రస్తుతం పనిచేస్తున్న వారిని పూర్తిస్థాయి బోధకులుగా మార్చి క్రమబద్ధీకరించడమో చెయ్యకపోతే ఈ వ్యవస్థ పూర్తిగా అంతమయ్యే ప్రమాదం ఉందని విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే విద్యార్థులు టి.వి., సెల్‌ఫోన్, ట్యాబ్, ఇంటర్‌నెట్ వంటి కృత్రిమ వ్యవస్థలకు అలవాటు పడి ఎన్నో దుష్పరిణామాలకు కారణమవుతున్నారు. ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు ప్రమాదపు అంచున ఉన్న ప్రస్తుత పరిస్థితిలో సాంప్రదాయ కళావిద్య పట్ల ప్రభుత్వం అశ్రద్ధ చూపితే సమాజం నష్టపోతుంది.

శంకర్, పరిశోధకుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం
మొబైల్ : 98490 17667

ఒక అద్భుత చరిత్ర

వయసు మీద పడుతున్న చాంపియన్‌లో 'వాడితనం' మందగించింది. కానీ వేడితనం ఇంకా తిరగబడుతోంది. పోటీల పద్ధతులు మారి, చేతిలో రాకెట్లు మారి, కాలం మారినా మనసులో ఉద్ధతి మారలేదు.



గొల్లపూడి మారుతీరావు

ఉన్నట్టుండి రాత్రి 11 గంటలకి తుళ్లిపడి లేచాడు. ఇక నిద్ర పట్టలేదు. మర్నాడు సాయంకాలం ఫైనల్‌మ్యాచ్. ఇది తన జీవితంలో 30వ పోటీ. ఏం జరుగుతుంది? ఇదీ ఫెదరర్ మనస్సుని ఆవరించుకున్న ఆలోచన. గెలిస్తే చరిత్ర. ఓడిపోతే? అది మరొక రకమైన చరిత్ర. అయినా మనసు ఓటమిని అంగీకరించడం లేదు. ఇప్పటికే పోటీ నుంచి నాదల్, జకోవిచ్, ఆండీ ముర్రే (అందరూ ముప్పయ్యో పడిలోనున్న ఆటగాళ్లు) వైదొలిగారు. ఫెదరర్ వారసుడనిపించదగ్గ అలెగ్జాండర్ జ్వరేవ్ (20 ఏళ్లవాడు) ఓడిపోయినప్పుడు ఫెదరర్ ఓ మాట అన్నాడు. ''ప్రపంచ కప్పు మీదే దృష్టి పెట్టుకోవడం ఆటలో ఏకాగ్రతని బలి తీసుకుంటుంది'' అని. ఇప్పుడు తను అదే చేస్తున్నాడా? ఒకరికి హితవు చెప్పడం సులువు. మర్నాటి సాయంకాలం ఒక జీవితకాలం దూరంగా ఉన్నట్టనిపించింది. ఉదయం అయితే లేచినప్పటినుంచీ ఆటకి సిద్ధమయ్యే వ్యాపకం ఉంటుంది. ఇప్పుడు రోజంతా ఏం చేయాలి? ఎప్పుడో తెల్లవారుఝామున 3 గంటలకి చిన్న కునుకు పట్టింది. ఇలాంటి సందర్భాలు ఫెదరర్ జీవితంలో ఎన్నో ఉన్నాయి. కానీ ఇది మరీ ప్రముఖమైనది. కారణం ఇరవయ్యో చాంపియన్‌షిప్పే ప్రపంచ చరిత్ర.

ఫెదరర్ వయస్సు 36 సంవత్సరాల 173 రోజులు. ఇప్పుడు ఎదురు నిలిచిన ప్రత్యర్థి చిలిచ్ వయస్సు 29. 2003 నుంచి 2008 మధ్య ఫెదరర్ 13 చాంపియన్‌షిప్పులు గెలుచుకున్నాడు. తర్వాతి ఏడేళ్లలో కేవలం నాలుగే, వయసు లుప్తమవుతున్న శక్తిని గుర్తు చేస్తోంది. 2004 నుంచీ తనతో పోటీ చేసినవారు దాదాపు అందరూ రిటైరయిపోయారు. ఇప్పుడు గెలిస్తే ఫెదరర్ ఒక తరానికి మకుటంలేని మహారాజవుతాడు. ఈ విచికిత్సని 16 గంటలు భరించాడు.

ఆ సాయంకాలం టెన్నిస్ కోర్టులో జరిగిన ఆట మహాకావ్యం. గెలవాలన్న ముందుతరంతో ఓటమిని ఎదిరించే పాత తరం పోటీ పడుతోంది. కానీ వయసు శరీరానిది కాదు. ఆ స్థాయిలో ఆలోచనది. నాలుగో సెట్‌లో ఫెదరర్ బ్యాక్ హ్యాండ్ వాలీలు కేవలం చిత్రకారుడి ఆయిల్ పెయింటింగ్‌లు.

గెలిచిన క్షణంలో ప్రతీ చాంపియన్ కన్నీటి పర్యంతం అవుతాడు. కానీ ఫెదరర్ 'ప్రతీ' చాంపియన్ కాడు. ఈ తరంలో 20వ సారి చాంపియన్ షిప్ గెలుచుకున్న ఒకే ఒక పురుష క్రీడాకారుడు. 36 సంవత్సరాల వయసున్న ఆటగాళ్లలో రెండవవాడు. 1972లో ఆస్ట్రేలియా ఓపెన్ గెలుచుకున్న కెన్ రోజ్‌వాల్‌కి 36 సంవత్సరాల 93 రోజులు.

మా అబ్బాయి నన్ను వెక్కిరించాడు. 'ఎందుకీ కాలమ్?' అని. తెలుగుదేశంలో ఎంతమందికి టెన్నిస్ ఆట మీద ఆసక్తి ఉంటుంది? అంటాడు. 2004 నుంచీ– అంటే తన 23వ ఏటినుంచీ ప్రపంచంలో జయించడాన్ని వ్యసనం చేసుకున్న ఆటగాడు ఫెదరర్. అడ్డమయిన కారణాలకీ బస్సులు తగలెట్టి, స్కూళ్లలో టీచర్లనే కాల్చి చంపే కుర్రకారుకి, మొహాలకి ముసుగులు వేసుకుని సైనికులను కాల్చే యువతరం పెచ్చు రేగుతున్న తరానికి ఫెదరర్ ఏ మాత్రమయినా స్ఫూర్తిని ఇవ్వగలిగితే– ఒక వ్యక్తిలో చిత్తశుద్ధి, ఏకాగ్రత, అకుంఠిత దీక్ష ఏ స్థాయిలో మనిషిని నిలపగలవో ఎవరయినా గుర్తించగలిగితే, ఫెదరర్ ఎవరో, అతను ఆడే ఆట గొప్పతనం ఏమిటో తెలియకపోయినా ఫరవాలేదు. గొప్పతనానికి చిరునామా లేదు. తెంపరితనానికి ఉంది. ఆచరణ ఆవగింజ, ఆదర్శం ఆకాశం.

ప్రపంచకప్పు 20వ సారి పట్టుకుని ఆవేశంతో ఏడ్చాడు ఫెదరర్. 'నేనే నమ్మలేకపోతున్నాను. బొత్తిగా ఇది కాశీమజిలీ కథ' అన్నాడు. చూస్తున్న లక్షలాది ప్రజానీకమూ, ఆ మాటకి వస్తే ప్రపంచమంతా అదే అనుకున్నారు. 'ఇది అపూర్వకమైన కాశీమజిలీ కథ'.

జీవన కాలమ్



వయసు మీద పడుతున్న చాంపియన్‌లో 'వాడితనం' మందగించింది. కానీ వేడితనం ఇంకా తిరగబడుతోంది. పోటీల పద్ధతులు మారి, చేతిలో రాకెట్లు మారి, కాలం మారినా మనసులో ఉద్ధతి మారలేదు. గెలవాలన్న 'నిప్పు' రగులుతూనే ఉంది. అంతే. ఆ క్షణంలో కాలం ఘనీభవించింది. తన ఆలోచనల్లోంచి వయసుని అతి క్రూరంగా గెంటేశాడు.

ప్రీతీ రామమూర్తి అనే పాత్రికేయురాలు తన్మయత్వంతో కేవలం కవిత్వాన్ని చెప్పింది. ''ఇవాళ ప్రేక్షకుల ముందు ఫెదరర్ ప్రదర్శన లక్ష సందర్భాలలో ఒకటి కావచ్చు. కానీ It represents a sense of life. ఈ విజయం అతనికి అవసరం లేకపోవచ్చు. కానీ ఇందులో అమలిన తన్మయత్వం ఉంది. తొందరపాటు లేదు. ఓ స్థితప్రజ్ఞుడి విన్యాసం ఉంది. ఫెదరర్ తనని తాను నిలదొక్కుకుని కాలాన్ని మెడబట్టుకుని లొంగదీసుకుని తనతో కూచిపూడి నృత్యం చేయించే విలాసం ఉంది''.

రెండు వాక్యాలయినా ఇంగ్లీషులో చెప్పాలని నా కక్కుర్తి. It is no longer a cliched religious experience... Of late, it appears that Federer has managed to take control, grabbing TIME by its shoulder and making it dance a slow waltz with him.



గాంధీజీ మాటే.. కాంగ్రెస్ ముక్త్ భారత్!

దేశాన్ని ముక్కలు చేశారు ● పటేల్‌ను ప్రధాని కాకుండా అడ్డుకున్నారు.. లేదంటే కశ్మీర్ సమస్య ఉండేది కాదు

● పార్లమెంటులో కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ

కాంగ్రెస్ లక్ష్యంగా ప్రధాని మోదీ బుధవారం పార్లమెంటులో నిప్పులు చెరిగారు. స్వాతంత్ర్యానంతరం నుంచి నేటివరకు విపక్ష కాంగ్రెస్ విధానాలను అంశాలవారీగా ఎండగట్టారు. మోదీ ప్రసంగ తీవ్రతకు కాంగ్రెసే కాకుండా, విపక్ష పార్టీలన్నీ కాసేపటివరకు చేష్టలుడిగాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లో ప్రసంగించారు. లోక్‌సభలో తొలుత ప్రశాంతంగానే ప్రసంగాన్ని ప్రారంభించినా.. కాంగ్రెస్ సహా విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో ఒక్కసారిగా.. తీవ్రత పెంచారు. దేశ విభజన కాంగ్రెస్ పాపమేనన్న ప్రధాని.. ఇటీవలి ఆంధ్రప్రదేశ్ విభజన సైతం రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా జరిపారన్నారు. నాడు వల్లభాయి పటేల్ ప్రధాని అయి ఉంటే.. కశ్మీర్ సమస్యే ఉత్పన్నమయ్యేది కాదని, అసలు, కశ్మీర్లోని కొంత భాగం పాకిస్తాన్ ఆధీనంలోకి వెళ్లేదే కాదని కుండబద్ధలు కొట్టారు. కాంగ్రెస్ వారికి కావలిసింది న్యూ ఇండియా కాదని.. వారికి ఎమర్జెన్సీ, బోఫోర్స్, చాపర్ స్కామ్‌ల భారతే కావాలి అంటూ దుయ్యబట్టారు. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' తమ మాట కాదని, ఆ మాట నాడు గాంధీజీనే అన్నారని వ్యాఖ్యానించారు.

న్యూఢిల్లీ: పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్, యూపీఏ పాలనపై ప్రధాని నరేంద్ర నిప్పులు చెరిగారు. రాజకీయ స్వలాభం కోసమే దేశాన్ని ముక్కలు ముక్కలు చేశారని.. ప్రధాని తీవ్రంగా విమర్శించారు. బ్యాంకులపై ఎన్‌పీఏల రూపంలో కాంగ్రెస్ చేసిన పాపాల ప్రభావాన్ని ఇప్పటికీ దేశం అనుభవిస్తోందన్నారు. తెలంగాణ ఏర్పాటుకు తాము సంపూర్ణ మద్దతు తెలిపామన్నారు. 'కాంగ్రెస్ ముక్త భారత్' పిలుపునిచ్చింది మోదీ కాదని.. మహాత్మా గాంధీయేనన్న విషయాన్ని మోదీ గుర్తుచేశారు.

ఓ కుటుంబ సేవలో..

'భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత.. స్వేచ్ఛావాయువులు పీల్చిన పలు దేశాలు అభివృద్ధిలో మనకన్నా వేగంగా ముందుకెళ్తున్నాయి. మనమింకా వెనుకబడే ఉన్నాం. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి తల్లి భారతిని ముక్కలు ముక్కలు చేశారు. అయినా.. మొదట్నుంచీ దేశం మీ వెంటే ఉంది. 4–5 దశాబ్దాల వరకు నామమాత్రమైన విపక్షం.. మీడియా ప్రభావం లేకపోవటం వంటివి మీకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. ఇంత స్వేచ్ఛ ఉన్న సమయంలోనూ మీరు చేసిందేంటి? దేశ సౌభాగ్యం, అభివృద్ధిని విస్మరించి.. ఒక కుటుంబం సేవలో తరించటంలోనే సమయాన్ని వ్యర్థం చేశారు' అని పేర్కొన్నారు.

మీరా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేది?

ఆగస్టు 15, 1947 తర్వాతే దేశంలో ప్రజాస్వామ్యమనే పదం తెలిసిందని.. అంతకుముందు దేశానికి అస్తిత్వమే లేదని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారని మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ, నెహ్రూలే దేశానికి ప్రజాస్వామ్యం తెచ్చారనటంలో అర్థంలేదన్నారు. 'మన దేశంలో బౌద్ధమతం విరాజిల్లుతున్న సమయంలోనే ప్రజాస్వామ్యం విరాజిల్లింది. కర్ణాటకలో 12వ శతాబ్దంలోనే జగద్గురు బసవేశ్వరుడు ప్రజాస్వామ్యాన్ని అమలుచేశారు' అని తెలిపారు. జహంగీర్ స్థానంలో షాజహాన్.. ఆయన స్థానంలో ఔరంగజేబ్ ఇలా పారంపర్యంగా పగ్గాలందినట్లే.. కాంగ్రెస్ పార్టీకి గాంధీ కుటుంబానికే అధ్యక్ష బాధ్యతలు అందుతాయని.. ఎన్నికలంటూ ఉండవని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలనూ ప్రధాని గుర్తుచేశారు.

పటేల్ ప్రధాని అయ్యుంటే!

స్వాతంత్ర్యం వచ్చాక అప్పటికి దేశవ్యాప్తంగా ఉన్న 15 కాంగ్రెస్ కమిటీల్లో 12 కమిటీలు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రధాని చేయాలని ఓటేశారని మోదీ తెలిపారు. అయినా పటేల్‌ను పక్కనపెట్టి నెహ్రూకు పగ్గాలు కట్టబెట్టిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. ఒకవేళ పటేల్ తొలి ప్రధాని అయ్యుంటే ఇవాళ కశ్మీర్‌సమస్యే ఉండేది కాదని.. భారత్‌లో అంతర్భాగమై ప్రశాంతంగా ఉండేదని మోదీ పేర్కొన్నారు. దేశంలో ఎక్కువ సార్లు ఆర్టికల్ 365ను కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందన్నారు. యూపీఏ హయాంలో కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఆ పార్టీ పదాధికారి ఒకరు (పరోక్షంగా రాహుల్ గాంధీని సంబోధిస్తూ) మీడియా సాక్షిగా చించేయటమే ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.

చెప్పింది చేసి చూపిస్తాం

2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త పనిసంస్కృతిని తీసుకొచ్చిందని ప్రధాని తెలిపారు. 'మాటలు చెప్పటం, ప్రధాన శీర్షికల్లో వార్తలు వేయించుకోవటం మా ఉద్దేశం కాదు. ప్రజలను మభ్యపెట్టకుండా చేతుల్లోకి తీసుకున్న పనిని పూర్తిచేయటమే మా లక్ష్యం. దేశానికి నష్టం చేసే వారెవరైనా.. ఏ పనైనా దార్లోపెట్టి ప్రజాసంక్షేమం కోసం నడిపిస్తాం' అని మోదీ పేర్కొన్నారు. దేశంలో మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేస్తున్న పథకాలు, పనుల అమలుతీరును ఆయన వెల్లడించారు. 'దేశంలో అతిపెద్ద సొరంగం, అతిపెద్ద గ్యాస్‌పైప్‌లైన్. అతిపెద్ద సముద్రపు రైలు, వేగవంతమైన రైలు మేం తీసుకొస్తున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

నాడు అనుమానాలు.. నేడు విమర్శలా?

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఆధార్ వ్యవస్థను రద్దుచేస్తారంటూ కాంగ్రెస్ విషప్రచారం చేసిన విషయాన్ని మోదీ గుర్తుచేశారు. కానీ తమ ప్రభుత్వం ఆధార్ సాంకేతికతను సరిగ్గా వినియోగించుకుంటుండటం వల్ల విపక్షాలు అసహనంతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారి నలుగురు మాజీ సీఎంలు అవినీతి కేసుల్లో జైలుకెళ్లారన్నారు. దేశాన్ని లూటీ చేసిన వారంతా.. దోచుకున్నది తిరిగివ్వాల్సిందేనని ఈ ప్రయత్నంలో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని ప్రధాని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నిరర్థక ఆస్తులపై ఎన్డీయే ప్రభుత్వంపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. అసలు కాంగ్రెస్ హయాంలో చేసిన పాపాల ఫలితాన్నే ఇప్పటికీ దేశం అనుభవిస్తోందన్నారు.

రండి కలసి పనిచేద్దాం: రాజ్యసభలోనూ కాంగ్రెస్ తీరుపై మోదీ నిప్పులు చెరిగారు. ఆత్యయిక పరిస్థితి, బోఫోర్స్, హెలికాప్టర్ కుంభకోణాలు, సిక్కులపై హింస వంటివున్న పాత భారతాన్ని కాంగ్రెస్ కోరుకుంటోందని.. కానీ తమ ప్రభుత్వం 'నవభారత' నిర్మాణానికి కృషిచేస్తోందన్నారు. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' నినాదాన్ని తీసుకొచ్చింది మహాత్మాగాంధీయేనని మోదీ పేర్కొన్నారు. విపక్షాలు ఓబీసీ, ట్రిపుల్ తలాక్ బిల్లులకు మద్దతివ్వాలని ఆయన కోరారు. పార్లమెంటు, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపైనా నిర్మాణాత్మక చర్చలు జరగాలన్నారు.

ఏపీ విభజన తీరుపై ప్రధాని మండిపాటు



సాక్షి, న్యూఢిల్లీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ విభజించిన తీరుపై ప్రధాని మోదీ మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా జరిగిన ప్రసంగంలో కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టారు. ప్రధాని ప్రసంగం ప్రారంభం కాగానే అనూహ్యంగా కాంగ్రెస్ ఎంపీలు వెల్‌లోకి వచ్చి ఏపీకిచ్చిన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదా అమలు చేయాలని, పోలవరం నిర్మించాలని నినదించారు. టీడీపీ, బీజేపీల మ్యాచ్ ఫిక్సింగ్ ఆపాలని నినదించారు. ఈ నిరసనల మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వాజ్‌పేయి హయాంలో మేం ఉత్తరాఖండ్ (యూపీ నుంచి), ఛత్తీస్‌గఢ్ (మధ్యప్రదేశ్), జార్ఖండ్ (బిహార్) అనే మూడు రాష్ట్రాలను వివాదాల్లేకుండా విభజించాం. కానీ మీరు మాత్రం.. ఎన్నికల్లో రాజకీయలాభం లేకుండా ఏ పనీ చేయలేదు. ఏపీ విషయంలో ఎలాంటి చర్చా జరగకుండానే విభజించారు. ఆంధ్ర ప్రజల మనోభావాలను గుర్తించలేదు. ఆరోజు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హడావుడిగా పార్లమెంటు ద్వారాలను మూసేసి నిర్ణయాలు తీసుకున్నారు. మేమూ తెలంగాణకు మద్దతు ఇచ్చాం. తెలంగాణతో ఉన్నాం. ఆ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాం. కానీ మీ ఉద్దేశాల కారణంగా ఈ సమస్య ఇప్పటికీ మండుతూనే ఉంది' అని దుయ్యబట్టారు. 'మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హైదరాబాద్ విమానాశ్రయంలో మీ పార్టీ నుంచి ఎన్నికైన దళిత ముఖ్యమంత్రి టి.అంజయ్యను అవమానించారు. అలాంటిది ప్రజాస్వామ్యంపై మీరు మాట్లాడతారా?. ఇలాంటి అవమానాలను సహించలేకే తెలుగుదేశం పుట్టింది. ఎన్టీయార్ సినిమాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చారు' అని పేర్కొన్నారు. సంజీవరెడ్డిని రాష్ట్రపతి అభ్యర్థిగా నిలిపి రాత్రికి రాత్రే వెన్నుపోటు పొడిచిన విషయాన్నీ ప్రజలు మరిచిపోలేదన్నారు.

'రామాయణం' తర్వాత ఇప్పుడే చూస్తున్నాం!



రాజ్యసభలో బుధవారం ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరిని ఉద్దేశించి ప్రధాని మోదీ అన్న మాటలు సభలో వివాదాస్పదమయ్యాయి. ఆధార్ ఆలోచన 1998 నాటిదనీ, నాటి హోం మంత్రి ఎల్‌కే అద్వాణీ ఈ ప్రతిపాదన తెచ్చారని మోదీ పేర్కొనగా రేణుకా చౌదరి పలుమార్లు గట్టిగా నవ్వారు. దీంతో రాజ్యసభ అధ్యక్షుడు వెంకయ్య నాయుడు 'మీకేమైంది? సభలో అమర్యాదకర ప్రవర్తన, విచక్షణ లేని మాటలను అనుమతించం. మీకేమైనా సమస్య ఉంటే డాక్టర్ దగ్గరకు వెళ్లండి' అంటూ రేణుకా చౌదరిని మందలించారు. వెంటనే మోదీ స్పందిస్తూ 'ఆమె నవ్వును ఆపకండి. రామాయణం టీవీ సీరియల్ తర్వాత మళ్లీ అలాంటి నవ్వును చూసే భాగ్యం ఇప్పుడే కలిగింది' అని వెటకారంగా అన్నారు. దీంతో వెంటనే సభ్యులంతా గట్టిగా నవ్వారు. బీజేపీ ఎంపీలు కొద్దిసేపు బల్లలు చరిచారు. అనంతరం సభ బయట రేణుక మాట్లాడుతూ 'వారి నుంచి ఇంతకంటే ఎక్కువ ఏం ఆశించగలం? బీజేపీ మహిళా వ్యతిరేక పార్టీ అని ఇప్పటికే తెలుసు. ఆ విషయం మరోసారి స్పష్టమైంది. మోదీ నాపై వ్యక్తిగత విమర్శలు చేశారు. నేను ఆ స్థాయికి దిగజారి ఆయన మాటలకు బదులివ్వలేను' అని అన్నారు.

అది ఎన్నికల ప్రసంగం: రాహుల్



న్యూఢిల్లీ: పార్లమెంటులో రాష్ట్రపతి ఉపన్యాసానికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రధాని చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఆయనది ఎన్నికల ప్రసంగమని దుయ్యబట్టారు. రైతు సమస్యలు, ఉద్యోగాల కల్పన, రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అవినీతి వంటి వాటికి ప్రధాని మోదీ సమాధానాలివ్వాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా కేవలం కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకే సమయం మొత్తాన్నీ వృథా చేశారని రాహుల్ ఆక్షేపించారు. మోదీ ప్రధాన మంత్రి అన్న విషయాన్ని మరిచిపోయి ప్రతిపక్ష నేతలా మాట్లాడారని రాహుల్ అన్నారు. 'మోదీ ప్రసంగం సుదీర్ఘం. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకున్నారు. రాఫెల్ ఒప్పందంపై మోదీ తన నిశ్శబ్దాన్ని ఛేదించి ఇంకెప్పుడు మాట్లాడతారు?' అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ మాట్లాడుతూ 'ప్రజలకు ఉద్యోగాలు కావాలి. వారి భవిష్యత్తు గురించి తెలుసుకోవాలని వారు ఆశపడ్డారు. కానీ ఆయన ఉద్యోగ కల్పన, రైతు సమస్యలు తదితర వేటినీ పట్టించుకోలేదు' అని విమర్శించారు.

విపక్షాల వాకౌట్

మరోవైపు రాఫెల్ ఒప్పందం నుంచి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం వరకు తమ ప్రశ్నల్లో ఒక్కదానికి కూడా మోదీ సమాధానం ఇవ్వలేదంటూ విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి. మోదీ ప్రసంగం పూర్తయిన వెంటనే ఆయా పార్టీల సభ్యులంతా బయటకు వెళ్లిపోయారు. అంతకుముందు మోదీ ప్రసంగిస్తున్నంతసేపూ కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు వెల్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే జోన్ కేటాయించాలనీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలనీ, రాఫెల్ ఒప్పందం వివరాలు బయటపెట్టాలంటూ సభ్యులు ఆందోళన చేపట్టారు.





రోడ్డు ప్రమాదంలో జశోదాబెన్‌కు గాయాలు

జైపూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భార్య జశోదా బెన్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. రాజస్థాన్‌లో ఆమె ప్రయాణిస్తున్న కారు ట్రక్కును ఢీకొనటంతో ఒకరు చనిపోగా, పలువురు గాయపడ్డారు. కోటాలో జరిగిన శుభకార్యానికి హాజరైన జశోదా బెన్ బుధవారం మధ్యాహ్నం కారులో బంధువులతో కలిసి చిత్తోర్‌గఢ్‌కు బయలుదేరారు. పర్సోలీ సమీపంలో ముందు వెళ్తున్న ట్రక్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో కారు ట్రక్కును బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న జశోదా బెన్ బంధువు బసంత్ భాయ్ మోదీ(67)తోపాటు అతని భార్య విమలా మోదీ, ఒక పోలీసు కానిస్టేబుల్, చిన్నారి(5) గాయపడ్డారు. జశోదా బెన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బసంత్ భాయ్ మోదీ చనిపోయారనీ, విమలా మోదీ, కానిస్టేబుల్‌ను మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి తరలించారని పోలీసులు తెలిపారు.

కొత్తగా 24 మెడికల్ కాలేజీలు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యారోగ్య రంగంలో మానవవనరుల కొరతను తగ్గించేందుకు వివిధ పథకాలకు రూ.14,930 కోట్లు కేటాయిస్తూ కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు అన్‌రిజర్వ్‌డ్ ప్రాంతాల్లో 24 వైద్య కళాశాలల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 2020–21 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో 18,058 యూజీ, పీజీ సీట్లను పెంచనున్నట్లు కేంద్రం ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది. దాదాపు 248 నర్సింగ్ కళాశాలల్ని కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. త్వరలో ఏర్పాటు చేయనున్న 24 మెడికల్ కాలేజీలను ప్రస్తుతమున్న జిల్లా, రెఫరల్ ఆస్పత్రులకు అనుసంధానిస్తామని పేర్కొంది. 3 నుంచి 5 పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపింది. వీటిని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయమై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకుంటాయంది.

'త్వరలో డ్రైవింగ్ లైసెన్స్-ఆధార్ లింక్'

న్యూఢిల్లీ: డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆధార్‌తో అనుసంధానించేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు సుప్రీం కోర్టుకు బుధవారం ఓ కమిటీ తెలిపింది. రహదారి భద్రతపై గతంలో కోర్టు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ కేఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ తన నివేదికను బుధవారం సుప్రీంకోర్టుకు సమర్పించింది. గత నవంబరు 28న తాము రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శితో సమావేశం నిర్వహించామనీ, నకిలీ లైసెన్స్‌లను ఏరివేసేందుకు ఆధార్ అనుసంధానాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు సదరు అధికారి తమకు చెప్పారని కమిటీ పేర్కొంది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందిస్తోందంది. సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చిన వెంటనే అన్ని రాష్ట్రాల్లోనూ డ్రైవింగ్ లైసెన్స్‌లను ఆధార్‌తో అనుసంధానించే పనిని కేంద్రం మొదలుపెడుతుందని కమిటీ తన నివేదికలో చెప్పింది.

ఆ ఐదు పార్టీల్లో బీఎస్పీ టాప్!

న్యూఢిల్లీ: దేశంలోని ఐదు జాతీయ పార్టీల ఆదాయం(కాంగ్రెస్, బీజేపీ మినహా) కలిపి రూ.299.54 కోట్లు కాగా, బీఎస్పీ రూ.173.58 కోట్లతో సింహభాగంలో ఉంది. రూ.100.25 కోట్లతో సీపీఎం తర్వాతి స్థానంలో ఉందని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం వెల్లడించింది. అయితే, 2016–17 కాలానికి ఆడిట్ నివేదిక సమర్పణ గడువు ముగిసినా కాంగ్రెస్, బీజేపీ ఇంకా ఆదాయ వివరాలను సమర్పించలేదంది.

శాంతిస్థాపకుడు బాహుబలి

- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- ఘనంగా ప్రారంభమైన మహామస్తకాభిషేకం

సాక్షి, బెంగళూరు: శాంతి స్థాపనకు బాహుబలి (గోమతేశ్వరుడు) ఎంతో కృషి చేశారని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. అన్నింటి కంటే శాంతి ముఖ్యమని బోధించే జైనధర్మం ప్రపంచంలోనే ఎంతో విలువైందని కొనియాడారు. కర్ణాటకలో హాసన్ జిల్లా శ్రావణ బెళగొళలో కొలువుతీరిన గోమతేశ్వరుని విగ్రహానికి 88వ మహామస్తకాభిషేక కార్యక్రమాలను కోవింద్ బుధవారం ప్రారంభించారు. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ ఉత్సవాలను చావుండరాయ సభ మంటపంలో జ్యోతిని వెలిగించి నాంది పలికారు. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా 17వ తేదీన మహామస్తకాభిషేకం జరుగనుంది. వేడుకల్లో రాష్ట్రపతి సతీమణి సవితా కోవింద్, గవర్నర్ వజుభాయి వాలా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ తదితరులు పాల్గొన్నారు. 17 మీటర్ల ఎత్తైన బాహుబలి ఏకశిలా విగ్రహానికి జైన అర్చకులు పాలు, నెయ్యి, కుంకుమలతో అభిషేకం చేశారు.





మహామస్తకాభిషేకానికి సిద్ధమైన బాహుబలి విగ్రహం. వేడుకలను ప్రారంభించిన కోవింద్ దంపతులు

తైవాన్‌ను వణికించిన భూకంపం

తైవాన్‌లో భూకంపం ధాటికి ఒకవైపు ఒరిగిన పెద్ద భవనం



ఏడుగురు మృతి, 145 మంది గల్లంతు

హువలీన్: తూర్పు ఆసియా దేశమైన తైవాన్‌ను శక్తిమంతమైన భూకంపం వణికించింది. హువలీన్ కౌంటీకి ఉత్తరాన దక్షిణ చైనా సముద్రంలో మంగళవారం అర్ధరాత్రి 6.4 తీవ్రతతో సంభవించిన ఈ భూకంపంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, దాదాపు 145 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో 31 మంది విదేశీయులు సహా 258 మంది గాయపడ్డారు. భూకంప తీవ్రతకు దేశంలోని తూర్పు ప్రాంతంలో రోడ్లు, నీటి సరఫరా వ్యవస్థ ధ్వంసం కాగా, విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో దాదాపు 35,000 మంది ప్రజలు ఆహారం, నీళ్లు లేకుండా చీకట్లో మగ్గుతున్నారు. భూ ప్రకంపనలకు భారీ భవంతులు సైతం పేక మేడల్లా కూలిపోయాయి. మరికొన్ని నివాస, వాణిజ్య భవన సముదాయాలు కూడా భూమిలోకి కుంగిపోవడంతో అందులో చిక్కుకున్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వీరిని రక్షించడానికి 600 మంది సైనికులతో పాటు 750 మంది అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగినట్లు అత్యవసర సేవల కేంద్రం తెలిపింది.

'కత్తి'లాంటి బర్త్‌డే పార్టీ!

సాక్షి ప్రతినిధి, చెన్నై: చెన్నైకి చెందిన ఓ రౌడీ..బర్త్‌డే వేడుకకు అట్టహాసంగా ఏర్పాట్లు చేసుకున్నాడు. వాసన పసిగట్టిన పోలీసులు ఆఖరి నిమిషంలో ఎంటర్ కావటంతో కథ రివర్సయింది. చెన్నై సూలైమేడుకు చెందిన బిన్నీ (40)కి పెద్ద రౌడీ అనే పేరుంది. మంగళవారం ఇతని పుట్టిన రోజు కావటంతో నగర శివార్లలోని ఓ లారీ షెడ్డులో వేడుకలకు ఏర్పాట్లు చేసుకున్నాడు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాలకు చెందిన 150 మందికి పైగా రౌడీలకు ఆహ్వానాలు పంపాడు. రాత్రికల్లా అందరూ షెడ్డు వద్దకు చేరుకోగా బాణసంచాతో వారికి స్వాగతం పలికారు. ఆనవాయితీ ప్రకారం బిన్నీ పిడికత్తితో కేక్ కూడా కోశాడు. ఈ విషయం పోలీసులకు తెలిసింది. దీంతో అంబత్తూరు డిప్యూటీ కమిషనర్ సర్వేష్‌రాజ్ నేతృత్వంలో 70 మంది పోలీసులు మెరుపుదాడి చేసి 75మంది రౌడీలను అదుపులోకి తీసుకున్నారు. బిన్నీతోపాటు మరో 50 మంది మాత్రం తప్పించుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న మారణాయుధాలతో పాటు 50కి పైగా సెల్‌ఫోన్లు, 50 బైకులు, 8 కార్లను స్వాధీనం చేసుకున్నారు. నేరాల ప్రణాళిక, సమాచారం చేరవేత, అమలు కోసం రౌడీలంతా సెల్‌ఫోన్లలో ఒక ప్రత్యేక వాట్సాప్ గ్రూపును కూడా నడుపుతున్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నామని చెన్నై పోలీస్ కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు.

'స్పేస్ ఎక్స్' ప్రయోగం సక్సెస్.. కానీ!

నిర్ణీత కక్ష్యలో కాకుండా అంగారకుడి అవతల కక్ష్యలోకి ఫాల్కన్ కారు

అత్యంత శక్తిమంతమైన రాకెట్ ప్రయోగం ● అమెరికా ఘనత

కేప్ కనవెరాల్: అంతరిక్ష పరిశోధనా రంగంలో మరో మైలురాయికి అమెరికా సాక్షిగా నిలిచింది. ప్రపంచంలో పేరుగాంచిన అంతరిక్ష పరిశోధనా సంస్థలకు సాధ్యంకాని ప్రయోగాన్ని ప్రైవేట్ సంస్థ 'స్పేస్ ఎక్స్'(స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ టెక్నాలజీస్ కార్పొరేషన్) సుసాధ్యం చేసింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా పరీక్షించింది. నిప్పులు విరజిమ్ముతూ అంతరిక్షంలోకి దూసుకెళ్లిన ఫాల్కన్ హెవీ రాకెట్.. స్పేస్ ఎక్స్ సంస్థ సీఈవో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా రోడ్‌స్టర్ కారును అంగారకుడి దగ్గరి కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఫాల్కన్ హెవీ రాకెట్‌లో అమర్చిన 27 ఇంజిన్లను మండించడం ద్వారా రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. రెండు నిమిషాల తర్వాత రాకెట్‌కు అమర్చిన రెండు బూస్టర్లు విడిపోయి విజయవంతంగా భూమిని చేరుకున్నాయి. సముద్రంలో ల్యాండ్ అవ్వాల్సిన రాకెట్‌లోని మూడో బూస్టర్ కాలిపోయినట్లు ఎలన్ చెప్పారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఫ్లోరిడాలోని కేప్ కనవెరాల్‌లో సంబరాలు మిన్నంటాయి.


కక్ష్య తప్పి.. సౌరవ్యవస్థలో షి'కారు'..

తొలుత ప్రయోగం విజయవంతమైనట్లేనని శాస్త్రవేత్తలు, సంస్థ ప్రతినిధులు భావించారు. అయితే ఫాల్కన్ హెవీ రాకెట్ కారును ప్రవేశపెట్టాల్సిన నిర్ణీత కక్ష్యలో కాకుండా అంగారకుడి అవతల ఆస్టరాయిడ్ ప్రభావిత ప్రాంతంలో విడిచిపెట్టిందని ఎలన్ మస్క్ తెలిపారు. ఒకవేళ కారు సౌరవ్యవస్థ ప్రభావిత ప్రాంతంలోకి ప్రవేశిస్తే సూర్యుడి కాస్మిక్ కిరణాలు తగిలి కారు ముక్కలవుతుంది.



నిప్పులు చిమ్ముకుంటూ దూసుకెళ్తున్న రాకెట్. (ఇన్‌సెట్లో) టెస్లా స్పోర్ట్స్ కారు.

ఫాల్కన్ హెవీ ప్రత్యేకతలు: ఫాల్కన్ హెవీ రాకెట్‌ను మూడు చిన్న ఫాల్కన్ 9 రాకెట్లను కలిపి రూపొందించారు. అంతేకాకుండా పునర్వినియోగించుకోగలగడం దీని ప్రత్యేకత. 230 అడుగుల ఎత్తు ఉండే ఫాల్కన్ హెవీ రాకెట్ సుమారు 64 మెట్రిక్ టన్నుల బరువును కక్ష్యలోకి ప్రవేశపెట్టగల సామర్థ్యముంది. ఇది నిండుగా నింపిన 737 జెట్‌లైనర్ల బరువుతో సమానం. అయితే ఫాల్కన్ హెవీ కంటే శాటర్న్ వీ రాకెట్ అత్యధిక బరువును మోసుకెళ్లగలదు. ప్రసుతానికైతే అంతరిక్ష రంగంలో ఫాల్కన్ హెవీ ప్రయోగం అతిపెద్దది. తొలుత ఫాల్కన్ హెవీని చంద్రుడు, అంగారకుడిపైకి మనుషులను పంపాలన్న ఉద్దేశంతో ప్రారంభించామని, అయితే ప్రస్తుతానికి ఈ ఆలోచనలు విరమించుకున్నామని ఎలన్ మస్క్ చెప్పారు. దీని ద్వారా సుదూర అంతరిక్ష ప్రాంతాలను చేరుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.





హసనాపురంలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్



హసనాపురంలో జగన్ వెంట నడుస్తున్న అశేష జనవాహినిలో ఓ భాగం

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం

ఆత్మీయ సమ్మేళనంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ భరోసా

> 'చంద్రబాబు తన రాజకీయాల కోసం ఏమైనా చేస్తారు. ఎంతటి హామీలైనా ఇస్తారు. ఆ తర్వాత వాటిని మరచిపోతారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ గాలి విపరీతంగా వీస్తోందనుకుంటే మైనార్టీలను పూర్తిగా మరచిపోతారు. మోదీ గాలి తగ్గిందంటే మళ్లీ ఆయనకు మైనార్టీలు గుర్తుకు వస్తారు.' – వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను అన్ని విధాలా ఆదుకునేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుం టుందని ప్రతిపక్ష నేత, ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. దేవుని ఆశీస్సులు, ప్రజల దీవెనలతో రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా 82వ రోజు బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 1100 కిలోమీటర్ల మైలు రాయిని అధిగమించిన ఆయన ఆత్మకూరు శాసనసభ నియోజకవర్గంలోని హసనాపురం వద్ద జరిగిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మైనారిటీలకు చేసిన మోసాలను ఎండగట్టారు. 'ఎన్నికలప్పుడు చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఒక్కో కులానికి ఒక్కో పేజీ కేటాయించి హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఒక్క హామీ కూడా అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసగించారు. అప్పుడు విడుదల చేసిన మేనిఫెస్టో వెబ్‌సైట్‌లో ఉంటే ప్రజలు కొడతారని భయపడి ఇప్పుడు దానిని తొలగించారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనంలో జగన్ ఇంకా ఏం మాట్లాడారంటే..

ఒక్కరికైనా రుణం ఇచ్చారా?

''ముస్లిం నిరుద్యోగ యువకులకు రూ.5 లక్షల రుణ సౌకర్యం కల్పిస్తానని చెప్పిన చంద్రబాబు ఏ ఒక్కరికైనా రుణం ఇచ్చారా? పేద, మధ్య తరగతి ముస్లింలకు రూ. లక్ష మేరకు వడ్డీలేని రుణాలు ఇస్తానన్నారు. అవీ ఇవ్వలేదు. ఇస్లామిక్ బ్యాంకును ఏర్పాటు చేసి రూ.50 వేల వరకూ సబ్సిడీతో రుణాలిస్తానని చెప్పారు. ఇస్లామిక్ బ్యాంకును స్థాపించారా? ఎక్కడైనా ఒక్కరికైనా రుణం ఇచ్చారా? కేజీ నుంచి పీజీ వరకూ ఉచిత విద్య అన్నారు. అమలు జరుగుతోందా? నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో మోసాలు, అబద్ధాలే చోటు చేసుకున్నాయి. రోజుకు రెండు సార్లు మీడియా ముందుకు వచ్చి గంటలు గంటలు మాట్లాడి బోర్ కొట్టించే ముఖ్యమంత్రి.. కేంద్రం బడ్జెట్ పెట్టి ఐదు రోజులైనా మీడియా ముందుకు రాలేదు. కానీ తాను చిటపటలాడుతున్నట్లు తనకు అనుకూలమైన మీడియాలో లీకులు ఇస్తున్నారు. టీడీపీ ఎంపీలు మంత్రులుగా ఉంటున్న కేంద్ర క్యాబినెట్‌లో ఆమోదించిన తర్వాతే బడ్జెట్ పార్లమెంటుకు వస్తుంది. మరి చంద్రబాబుకు తెలియకుండా బడ్జెట్ ప్రవేశ పెట్టారా? ఆయనకు తెలియకుండానే అన్యాయం జరిగిందా? ఇప్పటికి నాలుగు బడ్జెట్‌లు ఇలాగే ప్రవేశ పెట్టారు. అయితే ఒక్క ఏడాదిలో ఎన్నికలు వస్తున్నాయి కనుక నెపాన్ని ఎవరిమీదనో ఒకరి మీద నెట్టాలి కనుక కేంద్రంపై వేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

ప్రతిదీ రాజకీయమే..

చంద్రబాబు చేసే ప్రతి పనిలోనూ విశ్వసనీయత, విలువలు లేని రాజకీయాలే కనిపిస్తాయి. ప్రత్యేక హోదా చాలా అవసరం అని మనకు తెలుసు. అది వస్తేనే మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయనీ తెలుసు. పదేళ్లు కాదు.. పదిహేనేళ్ల హోదా కావాలని ఎన్నికలప్పుడు చెప్పారు. ఎన్నికలయ్యాక ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా? అంటూ మనల్నే అడుగుతారు. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో మీకేమైనా మేలు జరిగిందా? ఆలోచించాలని కోరుతున్నా. రైతులు, మహిళలనే కాకుండా చదువుకునే పిల్లలను కూడా చంద్రబాబు మోసం చేశారు. ఒక రాజకీయ నాయకుడు ఎన్నికలప్పుడు ఫలానా పని చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక చేయకపోతే తన పదవిని వదలి వెళ్లిపోయే పరిస్థితి రావాలి. రాజకీయ నాయకులకు ఒకటి చిత్తశుద్ధి, రెండోది నిజాయితీ, మూడోది విశ్వసనీయత ఉండాలి. చెడిపోయిన ఈ రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత రావాలి. ఇది నా ఒక్కడి వల్లే సాధ్యం కాదు. మీ అందరి మద్దతు కావాలి. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఇప్పటికే నవరత్నాలను ప్రకటించాం. ఆ నవరత్నాల నుంచి ప్రతి పేదవాడికి మేలు జరగాలి. నేను చనిపోయాక ప్రతి ఇంట్లో మా నాన్న ఫొటోతో పాటు నా ఫొటో కూడా ఉండాలనే ఆరాటం, తాపత్రయం నాలో ఉంది. అంతగా పేదలకు మేలు చేయాలన్నది నా లక్ష్యం.



హసనాపురంలో తనను చూసేందుకు వచ్చిన దివ్యాంగుడు వెంకటేశ్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్

దయనీయ స్థితిలో ఆరోగ్యశ్రీ

నాన్నగారి పాలనలో ఎవరికైనా బాగోలేదంటే 108కి ఫోన్ చేస్తే.. 20 నిమిషాల్లో అంబులెన్స్ వచ్చి పేదవాడిని తీసుకువెళ్లి పెద్దాసుపత్రిలో ఉచితంగా వైద్యం చేయించి, చిరునవ్వుతో ఇంటికి పంపేవారు. మరిప్పుడు 108కు ఫోన్ కొడితే అంబులెన్స్ వస్తోందా? డ్రైవర్లకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వటం లేదని, డీజిల్ లేదనే సమాధానం వస్తోంది. ఆరోగ్యం బాగో లేకపోతే మంచి ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవాలంటే హైదరాబాద్ వెళ్లాలి. క్యాన్సర్, గుండెపోటు, న్యూరో సర్జరీ, మెదడు సర్జరీ చేయించుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లక తప్పదు. అయితే హైదరాబాద్‌లో వైద్యం చేయించుకుంటే ఆరోగ్యశ్రీ వర్తించకుండా చేశారు. ఇక్కడేమో మంచి ఆసుపత్రులు లేవు. మంచి ఆసుపత్రులున్న హైదరాబాద్‌కు వెళితే ఉచిత వైద్యం అందకుండా చేశారు. మనందరి ప్రభుత్వం రాగానే ఆరోగ్యశ్రీని మరింత మెరుగ్గా అమలు చేస్తాం. డెంగీ లాంటి జ్వరాలతో పాటు వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్య శ్రీ వర్తింపజేస్తాం. దేశంలో ఎక్కడైనా సరే వైద్యం పొందేలా నిబంధనలను మారుస్తాం. శస్త్ర చికిత్స చేయించుకున్న వారి విశ్రాంతి కాలానికి వైద్యుల సూచన మేరకు డబ్బులు ఇచ్చి ఆదుకుంటాం. దీర్ఘకాలిక రోగాలైన కిడ్నీ, తలసీమియా వ్యాధులతో బాధపడేవారికి రూ.10 వేలు పింఛన్ ఇస్తాం.

దుల్హన్ పథకం కింద రూ.లక్ష

పేద ముస్లిం యువతులకు పెళ్లి చేసేటపుడు దుల్హన్ పథకం కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.50 వేల స్థానంలో మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్ష రూపాయలు ఇస్తాం. (ప్రస్తుతం ఈ పథకం కింద రూ.50 వేలు ఇస్తున్నారని, అది కూడా సక్రమంగా అమలు జరగడం లేదని, కమీషన్లు తీసుకుంటున్నారని ఓ ముస్లిం సోదరుడు జగన్ దృష్టికి తెచ్చినపుడు ఆయన ఇలా స్పందించారు.) ఈ మొత్తాన్ని వధువు తల్లిదండ్రులకు పెళ్లికి ముందే అందేలా ఏర్పాట్లు చేస్తాం'' అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

పేదల చదువుకు ఎన్ని లక్షలు ఖర్చు అయినా భరిస్తాం


పేద వారి పిల్లలు నేడు ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ఉన్నత విద్య చదువుకునే పరిస్థితి లేదు. ఇంజినీరింగ్ చదవడానికి ఏడాదికి ప్రతి పిల్లవానికి రూ. లక్షకు పైగా ఫీజు అవుతుంటే చంద్రబాబు ప్రభుత్వం వారికి ఇస్తున్నది ముష్టి వేసినట్లుగా రూ.30 వేలు. లేదా రూ.35 వేలు మాత్రమే. అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. మిగిలిన రూ.65 వేలు లేదా రూ.70 వేలు ఏటా చెల్లించే పరిస్థితి పేద పిల్లల తల్లిదండ్రులకు లేదు. ఆ ఫీజులు కట్టలేక చాలా మంది మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. నాన్నగారు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పేద పిల్లలు ఉన్నత చదువు చదవాలన్నా, ఎన్ని లక్షలు ఖర్చు అయినా నేనున్నానని ఆయన ముఖ్యమంత్రిగా ఒక భరోసా ఇచ్చారు. ఆయన చనిపోయాక పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. పేదల కోసం నాడు నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే, ఆయన కుమారుడిగా నేను రెండడుగులు వేస్తాను. రేపు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మీ పిల్లలను ఇంజినీరింగ్, డాక్టర్.. ఇతరత్రా ఏ పెద్ద చదువులు చదివించుకుంటారో మీ ఇష్టం. ఎన్ని లక్షలు ఖర్చయినా భరిస్తాం. ఫీజులే కాదు.. ఏటా హాస్టల్, మెస్ చార్జీల కోసం రూ.20 వేలు ఇచ్చి తోడుగా ఉంటాం. ఇంజినీరింగ్, డాక్టర్ చదువులు చదవాలంటే చిట్టి పిల్లల నుంచే ఆ పునాదులు మొదలవుతాయి. అందుకే చిట్టి పిల్లలను స్కూలుకు పంపించే ప్రతి తల్లికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 32 శాతం ఇంకా చదువుకోని వారున్నారు. అందుకే ఇంత గట్టిగా ఈ విషయాన్ని చెబుతున్నాను. అవ్వా, తాతలకు రూ.2 వేలు పింఛన్ ఇస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల్లోని మహిళలకు రూ.2 వేలు పింఛను ఇవ్వడమే కాక, పింఛను పొందే వయసును 45 ఏళ్లకు తగ్గిస్తాం. పింఛన్ పొందేందుకు అర్హత వయసును 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించి పేదలకు తోడుగా ఉంటాం.



కొరిమెర్ల క్రాస్ వద్ద పాదయాత్ర 1100 కిలో మీటర్లు పూర్తి అయిన సందర్భంగా మొక్క నాటి నీళ్లు పోస్తున్న జగన్



సమ్మక్క, సారక్కకు మొక్కు చెల్లించిన బెల్లంను హసనాపురం శివారులో జగన్‌కు అందజేస్తున్న పార్టీ తెలంగాణ నేత కొండా రాఘవరెడ్డి



అక్బర్ ఆలీ: ప్రతి జిల్లాలో మైనారిటీ కళాశాల ఏర్పాటు చేసి ముస్లిం విద్యార్థుల ఉన్నత చదువుకు తోడ్పడాలి. ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేయాలి.

జగన్: పేద విద్యార్థుల చదువు ఆగకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం. ఇస్లామిక్ బ్యాంకు తప్పకుండా ఏర్పాటు చేస్తాం.



ఇమామ్: చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి మాతో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. మసీదుల్లో పని చేస్తున్న మౌజన్‌లకు చందాలేసుకుని జీతాలు ఇచ్చే పరిస్థితి ఉంది.

జగన్: మనందరి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మసీదులతో పాటు దేవాలయాలు, చర్చిలలో పని చేస్తున్న వారికి ప్రతి నెలా వేతనం సక్రమంగా అందేలా చూస్తాం.



రఫీ: చంద్రబాబు మమ్మల్ని మోసం చేశారు. రాజకీయంగా ముస్లింలను ప్రోత్సహించాలి.

జగన్: తప్పకుండా ప్రోత్సహిస్తాం.



రహంతుల్లా: నాయుడుపేట సెంటర్‌లో ముస్లింకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇతరులు వ్యాపారం చేసుకుంటున్నారు. ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

జగన్: తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తాం

మస్తాన్‌బీ: అగ్రిగోల్డ్‌లో నగదు పెట్టి అప్పులపాలయ్యాం. ప్రభుత్వం పట్టించుకోలేదు. మీరే న్యాయం చేయాలి.

జగన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంది. అగ్రిగోల్డ్ ఆస్తులను తక్కువకు దక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ విషయమై అసెంబ్లీలో అనేక పర్యాయాలు చర్చించాం. మనందరి ప్రభుత్వం రాగానే బాధితులందరికీ న్యాయం చేస్తాం.



ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వైఎస్ జగన్, వేదికపై ఎమ్మెల్యే ముస్తఫా, ముస్లిం మైనారిటీ నాయకులు, ఎమ్మెల్యేలు మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్ యాదవ్, కిలివేటి సంజీవయ్య, జెడ్పీ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి తదితరులు



హసనాపురం సమీపంలో జగన్‌కు సమస్యలు వివరిస్తున్న పప్పుశనగ రైతులు



హసనాపురం వద్ద పనులు చేసి చేసి కాయలుకాసిన మహిళా కూలీల చేతులను పరిశీలిస్తున్న జగన్



82వ రోజు

07-02-2018, బుధవారం
దుండిగం క్రాస్,
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆ తల్లులకు న్యాయం చేయాలన్నదే నా ఆశయం

సేద్యం చేసే రైతే కాదు.. స్వేదం చిందించే కూలీ ముఖంలోనూ సంతోషం కనిపించడం లేదు. ఎక్కడికెళ్లినా కష్టాలు, కడగండ్లే. ఇలాంటి రైతులు, కూలీలే.. ఈ రోజు కొరిమెర్లలో నన్ను కలిశారు. ఉన్న ఊళ్లో బతకలేని కొంతమంది రైతులు కొరిమెర్లలో భూమిని కౌలుకు తీసుకుని శనగ పంట వేశారట. మూడేళ్లుగా గిట్టుబాటు ధరలేక.. అప్పులే వెంటాడుతున్నాయన్నారు. తిన్నా, తినకున్నా కౌలు కింద ఎకరాకు ఆరు వేల రూపాయలు కట్టాల్సిందేనట. పెట్టుబడితో కలుపుకొంటే ఎకరాకు రూ.22 వేలు ఖర్చవుతోందట. ఆ ఖర్చుకు, మార్కెట్ ధరకూ ఏమాత్రం పోలికే ఉండటం లేదన్నారు. క్వింటా రూ.9,500 పలికిన శనగ.. ఇప్పుడు రూ.3,500 కూడా పలకడం లేదని చెప్పారు. ధర వచ్చేదాకా దాచుకునే గిడ్డంగులూ లేవన్నారు. నిజమే! వాళ్ల బాధకూ అర్థం ఉంది. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ రైతన్న కంట నీరే. అన్నదాతకు ఇలాంటి పరిస్థితి లేకుండా చేయాలన్న నా తపన మరింత బలపడింది. అందుకే నవరత్నాల్లో రైతన్నకు పెద్దపీట వేశాను.

కొరిమెర్ల వద్ద పాదయాత్ర చేస్తున్నప్పుడు.. పొలాల్లోంచి కొంతమంది మహిళలు పరిగెత్తుకుంటూ నా వైపు రావడం కనిపించింది. వారొచ్చే వరకూ ఆగాను. రొప్పుతూ.. చెమటతో పూర్తిగా తడిచిపోయి ఉన్నారు. ఆనందం పట్టలేక నాతో కరచాలనం చేశారు. ఆ చేతులు బొబ్బలెక్కి ఉన్నాయి. కాయకష్టంతో మృదుత్వాన్ని కోల్పోయాయి. 'ఏంటమ్మా..' అని ప్రశ్నించాను. కష్టాలన్నీ ఒక్కసారిగా చెప్పుకోవడం మొదలెట్టారు. రోజంతా కష్టపడ్డా రూ.150 రావడం లేదన్నా.. అంటూ చెమ్మగిల్లిన కళ్లతో చెప్పారు. కరువు పనులూ లేవని, చేసినా డబ్బులే ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. వాళ్ల ఊళ్లో ఏడెనిమిది నెలలుగా ఉపాధి బకాయి డబ్బులే రావడం లేదట. ఇలాంటి అమ్మలు, అక్కలను కూడా పట్టించుకోకపోతే.. రాష్ట్రంలో పాలన ఉన్నట్లేనా? నిండు మనసుతో, సడలని నమ్మకంతో నా దగ్గరకు వచ్చిన ఆ తల్లులకు న్యాయం చేయాలన్నదే నా ఆశయం.

రెండు రోజులుగా జలుబు వేధిస్తోంది. దుమ్మూధూళి వల్ల దగ్గు బాగా ఎక్కువైంది. గొంతు నొప్పి కూడా మొదలైంది. నిన్నటి నుంచి స్వరంలోనూ కొంత మార్పు కన్పించింది. కాస్త ఇబ్బందిపడుతూనే.. మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడాల్సి వచ్చింది. మధ్యాహ్నం వైద్యులు పరీక్షించి మందులిచ్చారు.

జువ్వలకుంటపల్లిలో చేనేత కుటుంబానికి చెందిన ఓ చెల్లెమ్మ కలిసింది. భర్తతో కలిసి రోజంతా కష్టపడితే రూ.300 వస్తున్నాయని, పోనీ.. ముడి సరుకును తామే తెచ్చుకుని చీర నేద్దామంటే.. గిట్టుబాటు ధర లేదని బాధపడింది. చిన్న వయసులోనే నడుం నొప్పులు, కీళ్ల నొప్పులు వచ్చాయని, చూపు సైతం మందగిస్తోందని వాపోయింది. ఇలాంటి చెల్లెమ్మల కష్టాలు చూసే.. 45 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని సంకల్పించాను. మంచిరోజులు దగ్గర్లోనే ఉన్నాయని ధైర్యం చెబుతూ ముందుకు సాగాను.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మీ నాలుగేళ్ల పాలనలో గిట్టుబాటు ధరలేక రైతన్నలు విలవిల్లాడుతున్నారు. ఏమైంది మీ రూ.5,000 కోట్ల ధరల స్థిరీకరణ నిధి?

వైఎస్. జగన్.

ప్రజాసంకల్ప యాత్ర 82వ రోజు

ఇప్పటి వరకూ నడిచిన దూరం **1,109.9** కిలో మీటర్లు

82వ రోజు నడిచిన దూరం **15.2** కిలో మీటర్లు

ప్రారంభం: ఉ. 8.00 గంటలకు సంగం బైపాస్

ముగింపు: సా. 6.30 గంటలకు కావలి నియోజకవర్గం దుండిగం క్రాస్

ముఖ్యాంశాలు: కలిగిరి క్రాస్, తలుకూరుపాడు క్రాస్, కొరిమెర్ల క్రాస్, ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం, కావలి నియోజకవర్గంలోని దుండిగం క్రాస్‌లో ప్రజలతో మమేకం

- కొరిమెర్ల క్రాస్ వద్ద పార్టీ పతాకావిష్కరణ
- హసనాపురంలో ముస్లింలతో ఆత్మీయ సమ్మేళనం

బంద్‌కు మద్దతుగా నేడు పాదయాత్రకు విరామం



హసనాపురంలో జగన్‌కు చాక్లెట్ తినిపిస్తున్న బాలుడు

బాధ చెప్పుకొంటే చాలు.. బోలెడు ఊరట

ప్రజా సంకల్పయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 82వ రోజు బుధవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో పంట పొలాల మధ్య సాగింది. పొలాల్లో పని చేస్తున్న రైతులు, రైతు కూలీలు జగన్‌ను కలిసేందుకు పెద్ద ఎత్తున వచ్చారు. కొరిమెర్ల దాటిన తర్వాత కొంత మంది మహిళలు పరుగెత్తుకుంటూ రావడం చూసి జగన్ ఆగిపోయారు. దగ్గరకొచ్చిన వాళ్లను ఆప్యాయంగా పలకరించాడు. 'అన్నా...' అంటూ ఒక్కొక్కళ్లు ఒక్కో సమస్య చెప్పారు. 'మీరు వస్తేనే మా బతుకులు మారతాయన్నా' అని నీలమ్మ అనే మహిళ అంది. గిట్టుబాటు ధర లేదంటూ, అప్పుల పాలయ్యామంటూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. జగన్‌ను కలిసిన ప్రతీ వ్యక్తి.. తాను జగన్‌తో ఏం చెప్పింది.. అందుకు బదులుగా జగన్ ఏం మాట్లాడిందీ మరో పది మందికి చెప్పుకోవడం కనిపించింది. బుధవారం సంగం బైపాస్ రోడ్డు నుంచి మొదలైన పాదయాత్ర కలిగిరి క్రాస్, తలుపూరుపాడు క్రాస్ మీదుగా కొరిమెర్ల క్రాస్ రోడ్డు, హసనాపురం, దుండిగామ్ వరకూ కొనసాగింది. కొరిమెర్ల క్రాస్ వద్ద పాదయాత్ర 1100 కిలోమీటర్లు దాటింది. ఈ సందర్భంగా ఆయన అక్కడ మొక్క నాటి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. హసనాపురంకు సమీపంలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

నేనున్నానంటూ ధైర్యం చెప్పిన జననేత: జగన్‌ను కలవాలని, తమ సమస్య చెప్పాలని ప్రజలు ఆరాటపడుతున్నారు. అన్ని ఊర్ల నుంచి సమూహాలుగా తరలివస్తున్నారు. సమస్య ఆయన దృష్టికి తీసుకెళ్లాక బాధ దిగిపోయినంత ప్రశాంతంగా కన్పిస్తున్నారు. ఇక ఆ సమస్యను ఆయనకే వదిలేస్తామంటున్నారు. ఆయనే చూసుకుంటాడని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'ఆయనకు చెబితే చాలు.. గుండెల్లో బాధ తీరుతుంది' అని పెన్షన్ రాని చంచమ్మ అనే గిరిజన మహిళ చెప్పింది. ఇల్లూ వాకిలీ లేదని, ఎట్లా బతకాలో తెలియడం లేదని జగన్ వద్ద బావురుమంది. పెన్షన్ అడిగితే 'నువ్వు టీడీపీకి ఓటెయ్యలేదు' అంటున్నారంది. కొవూరు మండలం మానే గుంటపాడు నుంచి కొంతమంది గిరిజనులు వచ్చారు. కొరిమర్ల క్రాస్ వద్ద వాళ్లు జగన్ కోసం దాదాపు నాలుగు గంటల నుంచి వేచి చూశారు. నాలుగేళ్లుగా వాళ్లు పడుతున్న బాధలు జగన్‌కు ఏకరవు పెట్టారు. 'మీ నాన్నగారి పాలనలో ఎంత సంతోషంగా ఉన్నామయ్యా.. చంద్రబాబు మమ్మల్ని అస్సలు పట్టించుకోవడం లేదు' అని మానేగుంటపాడుకు చెందిన శీనయ్య, పద్మ జననేతకు చెప్పారు. రైతన్నలు, రోగ పీడితులు, అన్నార్తులు, ఆశావాహులు, అక్కా చెల్లెమ్మలు... చెప్పిన సమస్యలన్నీ ఆయన ఓపికగా విన్నారు. పుట్టెడు దుఃఖంతో వచ్చిన వాళ్లందరికీ ధైర్యం చెప్పారు.

ప్రజా సంకల్ప యాత్ర | మరిన్ని చిత్రాలు టాబ్లాయిడ్‌లో

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
గురువారం, 8-2-2018



పేదరాశి వైద్యమ్మ

కూరగాయలు అమ్మి ఆసుపత్రి కట్టించింది!

రాత్రీ పగలూ లేకుండా ఏ సమయంలో ఎవరు అనారోగ్యంతో వచ్చినా వెంటనే వారికి వైద్య సదుపాయం అందించే ఆసుపత్రి అది. మానవత్వానికి ఎప్పుడూ ద్వారాలు తెరిచి వుంచే ఆ వైద్యాలయం పశ్చిమ బెంగాల్‌లోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న హన్స్‌పుకూర్ గ్రామంలో పాతికేళ్ల క్రితం వెదురు గుడిసెలో ప్రారంభమైంది. నాటి నుంచీ పేదలకు ఉచితంగా వైద్యసేవలు, సదుపాయాలు అందిస్తూ ఇప్పుడు ఒకటిన్నర ఎకరం స్థలంలో 45 పడకలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా విస్తరించింది. ఈ ఆసుపత్రిలో పది ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు ఉండగా 17 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. రోజూ 300 మంది ఇక్కడ ఉచితంగా వైద్యం పొందుతున్నారు.

'హ్యూమానిటీ' పేరుతో పేదలకు ఉదారంగా వైద్య సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి నిర్వహణ వెనకాల ఓ వృద్ధురాలైన ఒక స్త్రీమూర్తి ఉన్నారంటే




కూరగాయలు అమ్ముతున్న సుభాషిణి (ఫైల్ ఫొటో)

ఆశ్చర్యం వేస్తుంది. ఒకనాడు కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగించిన ఆ మహిళ.. సుభాషిణీ మిస్త్రీ. ప్రస్తుతం 78 ఏళ్ల వయసున్న సుభాషిణిని పేదలకు అందిస్తున్న సేవలకు గాను భారతప్రభుత్వం ఈ యేడు పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

కళ్ల ముందే భర్త మరణం కొడుకుతో తీరిన రుణం

ఆసుపత్రి దగ్గరలో లేకపోవడం మూలాన సరైన వైద్యం అందక రోగులు దారి మధ్యలోనే ప్రాణాలు విడవడం సుభాషిణి మనసును కలిచివేసేది. అలాగే ఆమె భర్త సాధన్ చంద్ర మిస్త్రీ కూడా ఉదరకోశ సమస్యతో తగిన వైద్యం అందక తన కళ్ల ముందే ప్రాణాలు విడవడం ఆమె గుండెను ఛిద్రం చేసింది. భర్త అలా కన్ను మూస్తున్నప్పుడు నిస్సహాయంగా ఉండిపోయిన సుభాషిణి నాటి పరిస్థితులను తలుచుకుంటూ కంట తడి పెట్టుకున్నారు.

''అప్పుడు నా వయసు 23 ఏళ్లు. నలుగురు చిన్న పిల్లలు. కూరగాయలు అమ్ముకుంటూ నా పిల్లలను పోషించుకున్నా. నా భర్తలా ఎవరూ వైద్యం అందక చనిపోకూడదని నిర్ణయించుకున్నాను. మా జీవనానికి పోను కొద్ది కొద్దిగా పొదుపు చేసేదాన్ని. ఆ డబ్బుతో నా పెద్ద కొడుకును డాక్టర్ని చదివించాను. నా కొడుకు డాక్టర్ అజయ్ మిస్త్రీ నా మాటపై ఉన్న ఊరిలోనే వైద్యం ప్రారంభించాడు.

కూరగాయలు అమ్మే ఆ వెదురు గుడిసెలోనే రోగులను పరీక్షించేవాడు. ఆసుపత్రి అంటే సకల సదుపాయాలు ఉండాలి. అందుకు చాలా డబ్బు కావాలి. రేయింబవళ్లు ఒకటే ధ్యాస.. మంచి ఆసుపత్రి కట్టాలి. డబ్బులు కావాలి ఎలా అని. తెలిసిన డాక్టర్లతో మాట్లాడాను. అంతా లెక్క వేస్తే పేదలకు ఉచితంగా వైద్యం అందించాలంటే నెలకు కనీసం 16 లక్షల రూపాయలు కావాలని స్పష్టమైంది. నిధుల కోసం ఊరూ వాడా, పల్లె పట్నం అని తేడా లేకుండా అందరినీ కలుస్తూనే ఉన్నాను. ఇందుకు నా పిల్లల సాయం తీసుకున్నాను. ప్రకటనలు ఇచ్చాను. దక్షిణ భారతం నుంచి ఎక్కువ మంది దాతలు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఏడాది ప్రయత్నం తర్వాత ప్రభుత్వం నుంచి సాయం అందడానికి అంగీకారం లభించింది. చెప్పలేనంత ఆనందం.

ఆ క్షణం నుంచి దాతల నుంచి డబ్బు తీసుకోవడం ఆపేశాను. ఆసుపత్రి ప్రారంభమైంది. రోగుల ప్రాణాలు నిలబడ్డాయి'' అని ఆసుపత్రి ఆవిర్భావ పరిస్థితులను, తను ఎదుర్కొన్న ఒత్తిడులను వివరించారు సుభాషిణీ మిస్త్రీ.

ఆసుపత్రి పక్కనే ఓ కాలేజీ ద్వీపంలోనూ ఒక ఆసుపత్రి

ఆ తర్వాత ''ఈ ఆసుపత్రికి దగ్గర్లోనే నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది'' అని స్థానిక డాక్టర్లు సుభాషిణికి చెప్పారు. ఆమె అలాగే ఏర్పాటు చేసింది. ఓసారి.. సుందర్ బన్స్‌లోని సజ్జలీయా ద్వీపంలో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే పడవ మీద రెండు గంటలు పడుతుందని, రోగులు నానా ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోందని సుభాషిణి దృష్టికి వచ్చింది. అక్కడా ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి ఆమె నడక సాగించారు. 25 మంచాల ఆసుపత్రిని ఆ ఊళ్లో ఏర్పాటు చేశారు. ఇక్కడితో ఆమె ప్రయాణం ఆగిపోలేదు. ఝుర్గామ్ జిల్లాలోని మానికపరాలో హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

''సుభాషిణీ మిస్త్రీ వారంలో ఒక్కో రోజు ఒక్కో ఆసుపత్రిలో రోగులకు సరైన సేవలు అందుతున్నాయా లేదా అని పర్యవేక్షిస్తుంటారు. అలాంటి మనిషి చాలా అరుదు'' అని ఆమె గురించి తెలిసిన డాక్టర్ ఎ.పాల్ అంటారు.

ఆసుపత్రుల నిర్వహణకే కాదు అనాథ పిల్లలకు చక్కని భవిష్యత్తును ఇవ్వడానికి ఆశ్రమాల ఏర్పాటుకు ఈ వయసులోనూ ఆమె అడుగులు పరుగులు తీస్తూనే ఉన్నాయి.

– ఎస్.ఆర్

నూరేళ్లు



వారసత్వంగా ఆస్తి పొందడానికి లేదు.
(1922లో 'లా ఆఫ్ ప్రాపర్టీ' వచ్చాక ఆ పరిస్థితి మారింది).

అకౌంటెంట్ అవడానికి, మేజిస్ట్రేట్ అవడానికి లేదు.
(1919 నాటి సెక్స్ డిస్‌క్వాలిఫికేషన్ (రిమూవల్) యాక్ట్ వచ్చాక ఆ పరిస్థితి మారింది).

బ్యాంకు అకౌంట్ తెరవడానికి లేదు. బ్యాంకు రుణం పొందడానికి లేదు.
(1975లో ఆ పరిస్థితి మారింది).

1918 - 2018 వందేళ్ల క్రితం ఆడవాళ్లు


మహిళలకు ఓటు హక్కు వచ్చి నూరేళ్లు అయిన సందర్భంగా బ్రిటన్ పార్లమెంటులో మహిళా ఎంపీల గ్రూప్ ఫొటో

పబ్బుల్లో సొంతంగా డబ్బు ఖర్చు చేయడానికి లేదు.
(1982లో ఆ పరిస్థితి మారింది).

సమాన వేతన హక్కు లేదు.
(1970 నాటి సమాన వేతన చట్టంతో ఆ పరిస్థితి మారింది).

చట్టం దృష్టిలో ఒక 'వ్యక్తి' కాదు!
(1929లో ఆ పరిస్థితి మారింది).

'హౌస్ ఆఫ్ లార్డ్స్'లో కనిపించడానికి లేదు.
(1958 లో 'లైఫ్ పీరేజస్ యాక్ట్'తో ఆ పరిస్థితి మారింది.)

లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పని చేయడానికి లేదు.
(1973లో ఆ పరిస్థితి మారింది).

క్రూరుడైన భర్తకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లేందుకు లేదు.
(1976 డొమెస్టిక్ వయలెన్స్ అండ్ మ్యాట్రిమోనియల్ ప్రొసీడింగ్స్ యాక్ట్‌తో ఆ పరిస్థితి మారింది).

అవివాహిత అయితే గనుక గర్భనిరోధక మాత్రలు కొనడానికి లేదు.
(1967లో నేషనల్ హెల్త్ సర్వీస్ ఫ్యామిలీ ప్లానింగ్ యాక్టుతో ఆ పరిస్థితి మారింది.

చట్టపరంగా గానీ, వైద్యపరంగా గానీ సురక్షితమైన అబార్షన్ చేయించుకోడానికి లేదు.
(1967 అబార్షన్ యాక్ట్ తో ఆ పరిస్థితి మారింది).

భర్త రేప్ చేస్తున్నాడని ఫిర్యాదు చేయడానికి లేదు.
(1991లో ఆ పరిస్థితి మారింది).

ప్రశంస


● దీపికా పదుకోన్

పద్మావతికి పట్టు చీర

ధైర్యంగా నిలబడినవాళ్లకే ఏదైనా దక్కుతుంది! 'పద్మావత్' లీడింగ్ లేడీ దీపికా పదుకోన్‌కు ఆ సినిమాలో నటించినందుకు.. ఇంకా బెదిరింపులు వస్తూనే ఉన్నాయి. నిందారోపణలూ కురుస్తూనే ఉన్నాయి. వాటన్నిటినీ తట్టుకుని చిరునవ్వుతో నిలబడ్డారు దీపిక. 'బయటికి వస్తే నీ ముక్కు కోసి, కాళ్లు విరగ్గొడతాం' అని కర్ణిసేన బెదిరిస్తే.. 'కావాలంటే కాళ్లు విరగ్గొట్టండి కానీ, నా ముక్కును మాత్రం ఏం చేయకండి' అని దీపికా సెటైర్ వేశారు. 'పద్మావత్' చూసి వచ్చి, 'స్త్రీ అంటే అవయవమేనా, శీలాన్ని కాపాడుకోడానికి మంటల్లోకి దూకేయడం ఏంటి?' అని స్వరా భాస్కర్ అనే బాలీవుడ్ నటి భన్సాలీని తిట్టిపోస్తే.. అందుక్కూడా దీపికే ధైర్యంగా సమాధానం ఇచ్చారు. 'సినిమా ఆరంభంలో డిస్‌క్లెయిమర్‌ను వేస్తున్నప్పుడు స్వరా.. పాప్‌కార్న్ కొనుక్కోడానికి వెళ్లినట్టున్నారు' అని మరో సెటైర్ వేశారు. ఇవన్నీ అలా ఉంచండి. సినిమాలో దీపిక పెర్ఫార్మెన్స్ చూసిన వాళ్లు థియేటర్ నుంచి బయటికి రాగానే, నేరుగా దీపిక ఇంటికి గిఫ్టుతో వెళుతున్నారు! లేటెస్టుగా అమితాబ్ ఈ అమ్మాయికి పూలగుత్తి పంపించి, 'వెల్‌డన్ రా' అని కాంప్లిమెంట్స్ ఇచ్చారు. ఇంకా లేటెస్టుగా రేఖ.. దీపికకు ఒక పార్శిల్ పంపారు. ఖరీదైన పట్టుచీర అది! వెంటనే దాన్ని ఫొటో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి, 'గెస్ హూ?' అని అభిమానులకు పజిల్ పెట్టారు దీపిక. 'బాజీరావ్ మస్తానీ' చిత్రాన్ని చూసి వచ్చాక కూడా రేఖ ఇలాగే దీపికకు పట్టుచీర పెట్టారు. దీపికలో ఎక్కడో తనని చూసుకుంటున్నట్లున్నారు అలనాటి అందాల నటి రేఖ.


దీపికకు రేఖ బహూకరించిన పట్టుచీర గిఫ్ట్ ప్యాకెట్

ఆఫీస్

అవునట!

వాలెంటైన్స్ డే దగ్గరికి వస్తోంది. అన్ని చోట్లా రొమాన్స్ విరబోసే కాలం ఇది. అయితే ఈ ఏడాది 'ఆఫీస్ రొమాన్స్' బాగా తగ్గిపోయిందని రిలేషన్‌షిప్ ఎక్స్‌పర్ట్‌లు దిగ్భ్రాంతికి లోనవుతున్నారు! అంత దిగ్భ్రాంతి అవసరం లేదు కానీ, 'యంగ్ వాయిసెస్' పత్రిక మేనేజింగ్ ఎడిటర్ లిజ్ వోల్ఫ్ ఆ ఎక్స్‌పర్ట్‌ల చేత చిన్న సర్వే చేయిస్తే.. ఈ విషయం బయటపడింది! 'మీ టూ' ఎఫెక్ట్‌తో యు.ఎస్.లోని చాలా ఆఫీస్‌లలో మగాళ్లు తమ ఫిమేల్ కొలీగ్స్‌తో అంటీముట్టనట్లు ఉంటున్నారట. దాంతో పలకరింపులు తగ్గి, కనికరం కూడా లేకుండా బిహేవ్ చేస్తున్నారట. కనికరం ఏంటి? పనిఒత్తిడితో ఆడవాళ్లు అవస్థలు పడుతుంటే, మగవాళ్లు ఆ ఒత్తిడిని కొంత షేర్ చేసుకోవడం ఏ ఆఫీస్‌లోనైనా సహజమే. ఇప్పుడు అదీ లేకుండా పోయిందట. హాయ్‌లు చెప్పుకోవడం, బాయ్‌లు చెప్పుకోవడం వరకే ఆడామగ రిలేషన్స్ పరిమితం అయిపోయి, కలిసి బ్రేక్ తీసుకోడానికి కూడా మగవాళ్లు సంశయిస్తున్నారని ఎక్స్‌పర్ట్‌లు 'యంగ్ వాయిసెస్' ఎడిటర్‌కి నివేదిక ఇచ్చారు. ఎంతోకాలంగా పరిచయం ఉన్న కొలీగ్‌తో కూడా జోక్‌లు వేయడానికి, హ్యాండ్ షేక్ ఇవ్వడానికి, వ్యక్తిగతమైన విషయాలు మాట్లాడ్డానికి పురుష ఉద్యోగులు సంశయించడంతో.. ఆఫీస్‌లలో ఒకలాటి 'జెండర్ వార్' పరిస్థితులు ఏర్పడ్డాయని కొంతకాలంగా అమెరికన్ మీడియా కూడా అంటోంది. దీన్ని బట్టి ఏం అర్థమౌతోంది? హెరాస్‌మెంట్ కొత్త పుంతలు తొక్కిందని!



చెట్టు నీడ

నీలోకి నీవు తొంగి చూసుకో!

పూర్వం మహాభారత యుద్ధ సందర్భంలో అర్జునుడు యుద్ధం పాపానికీ, దుఃఖానికీ కారణమైనని భావించి, ఆయుధాలను పక్కన పడవేసి, నిర్వేదంలో కూరుకుపోయి ఉన్నప్పుడ శ్రీ కృష్ణ పరమాత్మ ధర్మయుద్ధం క్షత్రియులకు పూర్వపుణ్యం వల్లనే దొరుకుతుందని, అది రాబోయే మహాపుణ్యానికి సాధనా మార్గమని, అదే మహాసుఖానికీ, ఆనందానికీ కారణమని తెలిపాడు. ఇక్కడ కృష్ణపరమాత్మ అర్జునుడిని యుద్ధంచేయమని బలవంతం చేయలేదు, కేవలం యుద్ధం ఎందుకు చేయాలో చెప్పాడంతే! దాంతో అర్జునుడికి దుఃఖనివృత్తి జరిగి, యుద్ధం వైపు మనసు మళ్లింది. అంటే దుఃఖాన్ని తొలగించుకోవడం వల్ల ఆనందం కలుగుతుందన్నమాట.

లోకంలో ప్రజలు కోరే ధనం, ధాన్యం, ఇల్లు–వాకిలి, విద్య, అధికారం, కీర్తి, మర్యాద, పుణ్యం, బంధువర్గం మొదలైనవన్నీ తమ తమ సుఖానికి లేదా ఆనందాన్ని పొందడం కోసమేనని భావిస్తారు. ఎందుకంటే, ఆనందాన్ని కలిగించేది సుఖం మాత్రమే, సుఖాన్ని చేకూర్చేది ఆనందం మాత్రమే. వేదాలు, ఉపనిషత్తులూ ఏమి చెబుతాయంటే, అవివేకులైన వారు మాత్రమే తాత్కాలిక ఆనందాన్ని, సుఖాన్ని కోరుకుంటారు. వివేకజ్ఞానం కలిగిన వారెప్పుడూ దీర్ఘకాలిక సుఖానికై ప్రయత్నిస్తారు. భగవంతుడిని నమ్మేవారు వారు ఎప్పుడూ కూడా దీర్ఘకాలిక సుఖాన్ని లెక్కించక స్వర్గలోకం పొందబోయే సుఖం కోసమే ప్రయత్నిస్తారు. గట్టిగా ఆలోచించి చూస్తే, సుఖం లేదా ఆనందం అన్నది శరీరంలోనిదే కానీ శరీరానికి అవతల ఉన్నది కాదు.

> **వివేకజ్ఞానం కలిగిన వారెప్పుడూ దీర్ఘకాలిక సుఖానికై ప్రయత్నిస్తారు. భగవంతుడిని నమ్మేవారు వారు ఎప్పుడూ కూడా దీర్ఘకాలిక సుఖాన్ని లెక్కించక స్వర్గలోకం పొందబోయే సుఖం కోసమే ప్రయత్నిస్తారు.**

సుఖం మాత్రమే తమకు అనుకూలమైనదని భావించినప్పుడు, దానికి ప్రతికూలమైనవన్నీ దుఃఖాలే అవుతాయి. కాబట్టి దుఃఖ పరిహారాన్నీ, ఈ లోకపు అల్పసుఖాన్నీ, శాశ్వత మోక్షసుఖాన్నీ కోరేవారు, దైవానుగ్రహం కోసం కృషి చేయాలనీ, తద్వారానే జీవుల దుఃఖ నివృత్తి అవుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. మరి భగవంతుణ్ణి నమ్మని వాళ్ల సంగతేమిటనే ప్రశ్న తలెత్తవచ్చు. దానికి యోగశాస్త్ర పితామహుడు పతంజలి ముని ఏమి చెబుతాడంటే... ప్రతిరోజూ రాత్రి పడుకునేముందు ఆ రోజు చేసిన పనులన్నింటినీ నెమరు వేసుకో. ఆ తర్వాత నీలోకి నీవు తొంగి చూసుకో. నువ్వు ఆలోచించిన కొద్దీ నీ ఆలోచనా పరిధి పెరుగుతుంది. దుఃఖ నివృత్తి జరుగుతుంది. ఆనందం కలుగుతుంది. అలా తనలోకి తాను తరచి చూసుకోవడమే ధ్యానం.

బ్యూటిప్

- పాలమీగడలో చిటికెడు పసుపు కలిపి ముఖానికి ప్యాక్ వేసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకుంటే పొడిచర్మానికి చక్కని నిగారింపు వస్తుంది. చర్మం మరింత కాంతిమంతంగా కనిపించాలంటే ఈ ప్యాక్‌లో నాలుగు చుక్కల తేనె కలపాలి.
- టొమాటో జ్యూస్, నిమ్మరసం సమపాళ్లలో తీసుకోవాలి. ఇందులో కొద్దిగా గ్లిజరిన్ కలిపి చేతులకు రాసుకుని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. దీనివల్ల మురికి త్వరగా పోవడంతోపాటు చర్మం తేమగా కనిపిస్తుంది.

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా..! ఇది సెకండ్ టైమ్ నేను మీతో మాట్లాడ్డం. ఫస్ట్ టైమ్ మీకు నా ప్రాబ్లమ్ చెప్పినప్పుడు ''వాణ్ని వది లెయ్.. బయటకి ఊసెయ్'' అన్నారు. అలానే చేశా అన్నయ్యా. వాడినైతే మరి చిపోయా కానీ, వాడి జ్ఞాపకాలను మరి చిపోలేకపోతున్నా. ఫ్రెండ్స్ అనే ప్రపం చంలో పడ్డాను. బట్ ఏదో బాధ నన్ను వెంటాడుతోంది. మనసుని ఎంత డైవర్ట్ చేసుకున్నా.. మళ్లీ ఆ బాధ దగ్గరకే వస్తున్నా. నా పేరెంట్స్ నన్ను సంతోషంగా ఉంచాలని చాలా కష్టప డుతున్నారు. నా కళ్లల్లో నీళ్లు చూస్తే వాళ్లు ఏమైపోతారోనని ఏడవడం కూడా మానేశా. కానీ గుండె బరువుగా ఉందన్నయ్యా. అన్నీ షేర్ చేసుకునే ఫ్రెండ్స్ దగ్గర కూడా ఏడుపు రావడంలేదు. వాళ్ల ముందు కూడా నటిస్తున్నా. నేను నాలాగా ఎవరి దగ్గరా ఉండలేకపోతున్నా. అసలు ఈ బాధకు కారణం ఏమిటో నాకే అర్థం కానప్పుడు, ఏమని చెప్పి ఏడ్వాలి? కానీ నా అనే వాళ్లని పట్టుకుని బాధపోయేదాకా ఏడ్వాలనుంది. నా పేరు హస్మ అన్నయ్యా. గుర్తున్నానా? మీ లక్షల మంది చెల్లెళ్లలో నేనూ ఒకదాన్ని. నా లైఫ్‌కి ఏదైనా సలహా ఇవ్వండి ప్లీజ్.

- హస్మ

హస్మ బంగారం...
ఒక్క క్షణం కూడా బాధను ఆపకు...
మనస్ఫూర్తిగా ఏడ్చేసెయ్...
వాడ్ని ఊసేసావు.. వాడి ఊసులను కన్నీళ్లతో కడిగేసెయ్...
చెప్పడం చాలా ఈజీ.. చెయ్యడం చాలా కష్టమని నాకు తెలుసు.
అలా అని లైఫ్‌ని ఒక దుర్మార్గుడి కోసం...
మనమే పాడు చేసుకోవడం వల్ల...
వాడి పన్నాగం పండినట్టే...!
పెద్ద హీరో అనుకుంటున్నాడు గాడిద.
వాడు నిన్ను మోసం చెయ్యడం దుర్మార్గమైతే...
ఇవాళ నిన్ను నువ్వు మోసం చేసుకోవడం సిల్లీ..!
ప్రేమలో పడ్డావు, మోసపోయావు. రెండూ సహజంగా జరిగాయి.
అక్కడితో ఆపు. లేకపోతే పిరికిదానిలా జీవిస్తావు.
ఏడ్చెయ్..! బాధను కడిగెయ్..!! ముందుకు అడుగెయ్..!!

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

8	2			3			4	
3			4			9		8
	4	7	8	1			2	
	5					8		4
	9	4				2	1	
7		8					6	
	7			6	3	1	8	
5		9			1			7
	8			7			9	2

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	5	7	9	3	1	8	4	2
2	9	3	6	4	8	7	5	1
4	8	1	7	2	5	6	9	3
9	4	5	2	6	7	3	1	8
1	7	2	4	8	3	5	6	9
8	3	6	5	1	9	2	7	4
5	1	4	3	7	2	9	8	6
3	6	9	8	5	4	1	2	7
7	2	8	1	9	6	4	3	5

టీచర్ : ఏరా రామూ.. కళ్లు మూసుకుని పరీక్ష రాస్తున్నావేంటి?
రాము : ఏం లేదు టీచర్. పరీక్షలో చూసి రాయకూడదని మా అమ్మ చెప్పింది. అందుకే కళ్లు మూసుకుని రాస్తున్నాను.

* * *

తండ్రి : నీకు ఉద్యోగం వచ్చేవరకు నా గుమ్మం తొక్కావంటే నా మీద ఒట్టే.
కొడుకు : ఉద్యోగం వచ్చాక నేను మీ గుమ్మం తొక్కితే ఒట్టు!



● శర్వానంద్

నో వార్.. ఓన్లీ లవ్

... అంటున్నారు హీరో శర్వానంద్. హను రాఘవపూడి దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శర్వానంద్ సైనికుడి పాత్రలో నటించనున్నారన్న వార్తలు వచ్చాయి. కానీ అందులో నిజం లేదట. బోర్డర్‌లో యుద్ధం చేసే సైనికుడి పాత్రలో కాదు.. ప్రేమ కోసం పోరాడే కుర్రాడి క్యారెక్టర్‌లో శర్వానంద్ నటిస్తున్నారు. శర్వా లుక్‌ను కొత్తగా డిజైన్ చేశారట హను రాఘవపూడి. ఈ లుక్ కోసం బరువులో డిఫరెన్స్ చూపించేందు శర్వా కసరత్తులు చేశారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ కోల్‌కతాలో స్టార్టైంది. శర్వానంద్, సాయి పల్లవిలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రానికి 'పడి పడి లేచే మనసు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలని చిత్ర బృందం ఆలోచిస్తున్నారట. ఈ సినిమాకు సంగీతం: విశాల్ శేఖర్, కెమెరా: జయకృష్ణ.

అల్లుడు ఆన్ లొకేషన్



● కల్యాణ్ దేవ్

మెగా అల్లుడు ఇన్ యాక్షన్. యస్... హీరోగా బుధవారం చిరంజీవి అల్లుడు కల్యాణ్ దేవ్ యాక్షన్ మొదలు పెట్టారు. రాకేశ్ శశి దర్శకత్వంలో సాయి కొర్రపాటి, రజనీ కొర్రపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో మాళవికా నాయర్ హీరోయిన్. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ – ''చిరంజీవిగారి అల్లుడు కల్యాణ్ దేవ్ పరిచయం అవుతున్న ఈ సినిమాను నిర్మిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. రాకేశ్ శశి ప్రిపేర్ చేసిన బ్యూటిఫుల్ స్క్రిప్ట్‌ను ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కిస్తాం. 'బాహుబలి' కెమెరామేన్ సెంథిల్ ఈ సినిమాకు పని చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇంకా ఈ సినిమాలో బోలెడన్ని విశేషాలు ఉన్నాయి. ఈ షెడ్యూల్‌లో కల్యాణ్‌తో పాటు కీలక నటీనటుల పాల్గొంటారు'' అని అన్నారు. ఈ సినిమాకు సమర్పణ సాయి శివాని, సంగీతం: యోగేష్, సాహిత్యం: రెహమాన్.



● వీవీ వినాయక్

అందరికంటే సినిమానే గొప్ప

"నిన్నే ఫైనల్ కాపీ చూశాం. సినిమా చాలా బాగా వచ్చింది. తేజు, లావణ్య బాగా చేశారు. నేను అందర్నీ బాగా చూసుకుంటాను. కల్యాణ్ గారు నన్నో గాజు బొమ్మలా చూసుకున్నారు. ఖచ్చితంగా 'ఇంటిలిజెంట్' సూపర్ హిట్ అవుతుంది" అన్నారు వీవీవినాయక్. సాయిధరమ్ తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా వీవీ వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన 'ఇంటిలిజెంట్' రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా వినాయక్ పలు విశేషాలు పంచుకున్నారు.

■ ఈ సినిమాలో ఒక సోషల్ ఇష్యూను టచ్ చేశాం. మైండ్ గేమ్స్ మీద సినిమా ఉంటుంది. అందుకే 'ఇంటిలిజెంట్' అని పెట్టాం. నా స్టైల్‌లోనే ఫుల్ కమర్షియల్ మీటర్‌లో ఉంటుంది. సాయిధరమ్, నేను, కల్యాణ్... మా ముగ్గురిలో ఎవరు ఇంటిలిజెంట్ అంటే సి.కల్యాణ్ గారే (నవ్వుతూ).

■ ఆకుల శివ మంచి కథ అందించారు. తమన్ సూపర్ మ్యూజిక్ అందించాడు. జానీ, శేఖర్ మాస్టర్‌లు డ్యాన్స్‌లు బాగా కంపోజ్ చేశారు. కాంబినేషన్ ఫ్రెష్‌గా ఉంటుందని తేజ్‌కు జోడీగా లావణ్య త్రిపాఠిను తీసుకున్నాం. తను కుడా చాలా బాగా చేసింది. సినిమా టెంపోకు అడ్డు రాకూడదని కేవలం నాలుగు పాటలే పెట్టాము. నా మునుపటి సినిమా ఖైదీ నెం.150లో కూడా నాలుగు పాటలే ఉన్నాయి.

■ ఈ సినిమాతో ఎంత పెద్ద కమర్షియల్ కథనైనా మోయగలడు అనే నమ్మకం తీసుకొచ్చాడు తేజ్. తనని హీరోగా ఫిక్స్ చేశాక 'చమక్ చమక్' సాంగ్‌ను రీమిక్స్ చేయాలనుకున్నాను. చిరంజీవిగారి పాటల్లో అది నా ఫేవరేట్ సాంగ్. అడిగిన వెంటనే ఇళయరాజాగారు పాటను మాకు ఇచ్చారు.

■ మెగా ఫ్యామిలిలో నాలుగో హీరోతో చేశాను. చిరంజీవిగారితో సినిమా అంటే సెట్‌లో అందరం చాలా టెన్షన్‌గా ఉంటాం. చరణ్, బన్నీ విషయానికి వస్తే వాళ్లను ఠాగూర్' సినిమా అప్పుడు నుంచి చూస్తున్నాను. చరణ్ చాలా సౌమ్యుడు. బన్నీ చాలా హార్డ్ వర్కింగ్. తేజ్, వరుణ్‌తేజ్ ఒకేసారి వస్తున్నారు. ఇది అనుకోకుండా జరిగింది. బాగుంటే రెండు సినిమాలు ఆడతాయి. సినిమాకు హీరో, దర్శకుడు, నిర్మాత.. ఎవరు గొప్ప అంటే నా దృష్టిలో అందరికంటే సినిమానే గొప్ప.

■ బయట కథలతో సినిమా ఎందుకు తీస్తున్నానంటే, ఒక్కో కథకు చాలా టైమ్ పడుతుంది. రాఘవేంద్ర రావుగారు ఓసారి అన్నారు. ఎప్పుడూ మన కథలే కాదు బయట కథలు కూడా చేయాలి. లేకపోతే మన ఐడియాలే రిపీట్ అవుతాయని. బయట కథలు చేస్తే కొత్త యాంగిల్ ఓపెన్ అవుతుంది.

■ మా కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది కాబట్టి నేను రాజకీయాల్లోకి వస్తానని అనుకుంటున్నారు. ప్రస్తుతానికి నాకా ఆలోచన లేదు. దర్శకుడిని కావాలనుకోలేదు.. అయ్యాను. సో... డెస్టినీకు వేరే ప్లాన్స్ ఏం ఉన్నాయో నాకు తెలీదు.

■ రెండేళ్ల తర్వాత కొత్తవాళ్లతో సినిమా తీస్తాను. అప్పుడే ప్రొడక్షన్ హౌస్ ప్లానింగ్స్ కూడా చెబుతా. స్టార్స్‌తో అయినా కాబోయే స్టార్స్‌తో సినిమా అయినా నాకు టెన్షనే. బేసిక్‌గా సినిమా అంటేనే టెన్షన్. ఈ మధ్యన ఎవరో ఎయిర్‌పోర్ట్‌లో ఒ వ్యక్తి 'సుమోలు గాల్లో లేస్తేనే మీ సినిమాలా ఉంటుంది సార్' అన్నారు. ప్రతి సినిమాలోనూ సుమోలు గాల్లో ఎలా లేపుతాం (నవ్వుతూ). సినిమా సినిమాకు గ్యాప్ కావాలని తీసుకోం. రైటర్స్ కొరత కూడా అనను. టాలెంట్ ఉన్నవాళ్లకు అవకాశాలు రావట్లేదు. అవకాశం ఉన్నవాళ్లకు మంచి కథలు సెట్ కావట్లేదు.

■ నా తర్వాత సినిమా ఏంటో నాక్కూడా తెలియదు. 'అదుర్స్ 2' వర్క్‌వుట్ చేద్దామనుకున్నాం. బట్ సెట్ అవ్వలేదు. కానీ తప్పకుండా ఉంటుంది. మహేశ్‌తో సినిమా చేద్దామనుకున్నాను కానీ మంచి కథ చెప్పలేకపోయా.



● శ్రీదేవి

శ్రీదేవి సినిమాలు తిందాం రండి!

శ్రీదేవి ఫ్యాన్స్‌కు ఓ తాజా ఖబర్. ఇప్పటి వరకూ ఆమె సినిమాలను చూసి ఆనందించిన అభిమానులు ఇప్పుడామె సినిమాలను తినబోతున్నారు. సినిమాలను తినడమా అనుకుంటున్నారా? మీరు చదివినది నిజమే. శ్రీదేవి వీరాభిమాని ఒకరు ఆమె పేరు మీద రెస్టారెంట్ ఓపెన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. నిర్మాణం పూర్తయింది. రెస్టారెంట్‌కి శ్రీదేవి పేరు మాత్రమే కాదు.. ఇప్పటివరకూ ఈ అతిలోక సుందరి నటించిన సినిమాల్లో ఓ వంద వంటకాలకు ఆ సినిమా పేర్లను పెట్టాడు. మొన్నా మధ్య రిలీజైన 'మామ్'తో కలిపి శ్రీదేవి 300 సినిమాలు చేశారు. అంటే... వాటిలో వంద సినిమా పేర్లతో వంటకాలను వడ్డిస్తారన్న మాట. మామూలుగా ఇడ్లీ తింటారా? ఉప్మా తింటారా? అని అడుగుతాం కదా. అలా క్షణ క్షణం తింటారా? మిస్టర్ ఇండియాని ఆరగిస్తారా? చాందినీని టేస్ట్ చేస్తారా? ఇలా అడుగుతున్నారన్న మాట. ఇవన్నీ శ్రీదేవి యాక్ట్ చేసిన ఫేమస్ సినిమాల లిస్ట్‌లో ఉంటాయి. కాబట్టి కచ్చితంగా ఏదైనా వంటకాలకు ఈ పేరు పెట్టే ఉంటారు. శ్రీదేవి పేరుతో రెస్టారెంట్ అంటేనే బోలెడంత క్రేజ్ ఉంటుంది. ఇక ఆమె సినిమా పేర్లతో వంటకాలంటే కచ్చితంగా రెస్టారెంట్‌ను విజిట్ చేస్తారు. పైగా రెస్టారెంట్ ముందు శ్రీదేవిది భారీ కటౌట్ కూడా పెట్టించాడు. ఆ సంగతలా ఉంచితే. 'మీ చేతుల మీదగా రెస్టారెంట్ ఓపెన్ అయితే నాకు రొంబ (చాలా) సంతోషం మేడమ్' అని ఆ అభిమాని శ్రీదేవికి ఇన్విటేషన్ పంపాడు. మరి.. అభిమాని విన్నపాన్ని అంగీకరిస్తారా? త్వరలోనే తెలిసిపోతుంది.



● రాశీఖన్నా

నా ఫస్ట్ లవ్ అదే

'తొలిప్రేమ'... జీవితంలో ఫస్ట్ లవ్ లేనివాళ్లు ఉండరు. అది ఫెయిలైనా జీవితాంతం గుర్తుంటుంది. ఫస్ట్ లవ్ ఇంపాక్ట్ అలాంటిది. ఈ నెల 10న వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా నటించిన 'తొలిప్రేమ' రిలీజవుతుంది. ఈ చిత్రం అందరి మనసులపై మంచి ప్రభావం చూపిస్తుందంటున్నారు రాశీఖన్నా. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీయస్‌యన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రిలీజ్ సందర్భంగా రాశీఖన్నా పలు విశేషాలు పంచుకున్నారు.

■ ఈ సినిమా ఒప్పుకున్నాక నేను పవన్ కల్యాణ్ గారి తొలిప్రేమ (1998) సినిమాను కావాలనే చూశాను. అందులో హీరోయిన్ కీర్తిరెడ్డి ఇంట్రడక్షన్ హైలైట్‌గా ఉంటుంది. నా ఇంట్రడక్షన్‌కి దానికి సంబంధం లేదు. నా సినిమాల్లో నా బెస్ట్ ఇంట్రడక్షన్ అంటే 'జిల్'లో బావుంటుంది.

■ నా తొలి ప్రేమ విషయానికొస్తే నా కాలేజీలో సీనియర్‌తో 17 ఏళ్ల వయస్సులోనే ఫస్ట్ క్రష్ జరిగింది. అతనే ప్రపోజ్ చేశాడు (నవ్వుతూ).

■ ఈ సినిమాలో నా పేరు వర్ష. మూడు డిఫరెంట్ క్యారెక్టర్స్‌లో కనిపిస్తా. ఒకటి 19 ఏళ్ల కాలేజీ యువతిలా. మరోటి లండన్ గర్ల్. ఇంకో పాత్ర నా ఏజ్‌కి తగ్గట్టుగా ఉంటుంది. మూడు పాత్రలను చాలా ఎంజాయ్ చేశాను.

■ కాలేజి గర్ల్ పాత్ర కోసం రెండు నెలలు వర్కవుట్ చేసి ఐదు కిలోలు తగ్గాను. తగ్గటం కోసం తిండి మానేయలేదు. ఫుల్‌గా తిని, జిమ్‌లో వర్కవుట్ చేశాను. రోజూ కనీసం రెండు గంటలైనా జిమ్‌లో గడిపాను. ఇప్పుడు అందరూ తగ్గావంటే చాలా ఆనందంగా ఉంది.

■ వరుణ్ తేజ్ మంచి కోస్టార్. ఈ సినిమాలోని పాత్ర కోసం చాలా ఎక్సర్‌సైజ్ చేశాడు. జనరల్‌గా రోజుకి ఒక్కసారి జిమ్‌కి వెళ్లడం చాలా కష్టం. అటువంటిది రోజు మూడు సార్లు జిమ్ చేసేవాడు. ఈ సినిమాలో కారులో రొమాన్స్ జరిగే సీన్ బెస్ట్ సీన్.

■ వెంకీకి ఈ కథ తయారుచేసుకోవటానికి రెండున్నరేళ్లు పట్టింది. కథను ఎంత బాగా రాశాడో అంతకంటే బాగా తీశాడు.

■ ఈ ఏడాది తమిళంలో నావి మూడు సినిమాలు రిలీజవుతాయి. ఒకటి అథర్వ, ఇంకోటి 'జయం' రవి, మరోటి సిద్ధార్థ్ పక్కన చేస్తున్న సినిమాలు. వీటిలో ఓ సినిమాలో బాలీవుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్ కీ రోల్ చేస్తున్నారు. ఆయ వెరీ డౌన్ టు ఎర్త్. ప్రస్తుతం సౌత్‌లో హ్యాపీగా ఉన్నాను. హిందీకి వెళ్లే ఐడియా లేదు. ఒకవేళ మంచి చాన్స్ వస్తే.. అప్పుడు ఆలోచిస్తా.

బహిష్టు సంబంధిత పరిశుభ్రత మీద ఇవాళ దేశమంతా మాట్లాడుతోంది. మెన్స్ట్రువల్ హైజీన్‌కు సంబంధించి కలిగించాల్సిన అవగాహన పట్ల అందరూ ఆసక్తి చూపిస్తున్నారు. స్కూలు స్థాయి నుంచి ఆడపిల్లలకు ఈ చైతన్యం అవసరం. 'ప్యాడ్‌మేన్' వంటి సినిమాలు, సెలబ్రిటీల 'ప్యాడ్ ఛాలెంజ్' వంటివి ఈ ప్రచారానికి తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్యాడ్' వాడకంపై విస్తృత కథనం...



ప్యాడ్ వాడకంపై ప్రచారం: ట్వింకిల్‌ఖన్నా, దీపికా పదుకోన్, కత్రినాకైఫ్

ప్యాడ్ ఛాలెంజ్

మహిళలకు అనివార్యమైన ఆ మూడు నుంచి ఐదురోజుల ఇబ్బందికరమైన సమయంలో అనుసరించాల్సిన పద్ధతులు, ఉపకరించే సాధనాలను వారు తమకు తామే రూపొందించుకున్నారు. సామాజికంగా వారికి ఎదురయ్యే అనేక సాంస్కృతిక అంశాలు, మూఢనమ్మకాల వంటి సవాళ్లు చుట్టుముట్టిన నేపథ్యంలో వాటికి అనుగుణంగా ఎలాగోలా తమ తమ ఆర్థిక, విద్యాపరమైన స్థోమతను బట్టి తమ తమ సొంత మార్గాలు అనుసరించారు. చాలా సందర్భాల్లో వారు అనుసరించిన మార్గాలు అంత సులువైనవీ, సౌకర్యవంతమైనవి కావు. మరీ ముఖ్యంగా పేద వర్గాల్లో అవి చాలా ఇబ్బందికరమైనవి. అయినా తమ ఇబ్బందికరమైన ఆ రోజులను ఎలాగోలా నెట్టుకొచ్చారు. వారి ఇబ్బందులు గమనించిన తమిళనాడులోని అరుణాచలం మురుగనంతం లాంటి వాళ్లు దానికి గురించి మాట్లాడటానికి ప్రయత్నించినా సమాజం వారిని ప్రోత్సహించలేదు.





ఆమీర్‌ఖాన్ సోనమ్ కపూర్

భారత్‌లో ఇదీ పరిస్థితి...

మన భారతీయ సమాజంలో అత్యధికులు పేద వర్గాలే. మార్కెట్లో దొరికే ఖరీదైన ప్యాడ్స్‌ను కొనుగోలు చేయగలిగే ఆర్థిక స్తోమత ఉన్నవారు చాలా తక్కువ. 2016లోని ఒక అధ్యయన వివరాల ప్రకారం... దేశంలో 84% కౌమార బాలికలు, 92.2% తల్లులు ఇప్పటికీ నెలసరి సమయంలో గుడ్డను వాడుతున్నారు. ప్రభుత్వమే నిర్వహించిన ఒక సర్వే వివరాల ప్రకారం మన దేశంలో కేవలం 12% మంది మాత్రమే ప్యాడ్స్ వాడగలిగే స్థితిలో ఉన్నారు. దాంతో 37.8% మంది పెళ్లికాని యువతులు యోని దగ్గర దురద, దుర్వాసన వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

ఇవీ ప్రభుత్వ మార్గదర్శకాలు

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ వారు రుతుస్రావ సమయంలోని పరిశుభ్రత విషయంలో 2015లో కొన్ని మార్గదర్శకాలు రూపొందించారు. అలాగే స్వచ్ఛభారత్ కార్యక్రమంలోనూ కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. వాటిలోని ముఖ్యాంశాలు ఇవి.

1. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లకు రుతుస్రావ సమయంలో పాటించాల్సిన పరిశుభ్రత విషయమై శిక్షణ ఇచ్చి, అది మహిళలందరికీ చేరేలా చూడాలి.
2. స్వయంసేవాసంఘాల (సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల) ద్వారా శానిటరీ నాప్కిన్స్ గ్రామీణ ప్రాంతాలకూ చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
3. కౌమారవయసులోని బాలికల సాధికారత కోసం ఉద్దేశించిన ఎస్ఏబీఎల్ఏ కార్యక్రమం, సమీకృత బాలల అభివృద్ధి (ఇంటిగ్రేటెడ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్) కార్యక్రమాలు, మహిళా ఆర్థిక్ వికాస్ మహామండల్ కింద పనిచేసే స్వయం సేవా సంఘాల ద్వారా రుతుస్రావ పరిశుభ్రత అవసరాలను మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్ పిల్లల వరకూ చేర్చాలి.
4. కొత్తగా యుక్తవయసుకు వచ్చిన బాలికల కోసం 'అడాలసెంట్ రీసోర్స్ సెంటర్స్' ద్వారా కౌన్సెలింగ్ కార్యకలాపాలను నిర్వహింపజేయాలి.
5. కొత్తగా యుక్తవయసుకు వచ్చిన బాలలకు ఏర్పడే అవసరాల గురించి, ఆ బాలలు అనుసరించాల్సిన పద్ధతులు, సంబంధిత అంశాల గురించి అన్ని స్కూళ్లలోనూ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలోనూ నోడల్ టీచర్లు విపులంగా వివరించాలి.
6. స్కూలుకు వెళ్లే వయసున్న బాలబాలికలకు తగిన అవగాహన కల్పించేలా 'రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమ్' కోసం ఉద్దేశించిన కార్యకర్తలు కృషిచేయాలి.
7. యుక్తవయసుకు వచ్చిన బాలికలకు రుతుసమయంలో పాటించాల్సిన పరిశుభ్రత పద్ధతుల (మెన్‌స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్–ఎమ్‌హెచ్‌ఎమ్)తో పాటు ఆ వయసులో కిశోర బాలబాలికలకు ఏర్పడే సందేహాల నివృత్తి కోసం 'రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమ్' కింద సేవాకార్యకర్తలు పాటుపడాలి.
8. రుతుసమయంలో పాటించాల్సిన పరిశుభ్రత పద్ధతుల (మెన్‌స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్–ఎమ్‌హెచ్‌ఎమ్) గురించి నేషనల్ రూరల్ లైవ్‌లీహుడ్ మిషన్ కింద పనిచేసే స్వచ్ఛంద సేవా సంస్థలు యువతుల్లో, మహిళల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి.

మురగనాథమ్ చేసిన కృషి



మురగనాథమ్

తమిళనాడుకు చెందిన అరుణాచలం మురుగనాథమ్ అనే వ్యక్తి తన అసాధారణ కృషితో మూడున్నర కోట్ల శానిటరీ న్యాప్‌కిన్ మెషిన్‌ను కేవలం రూ. 65 వేలకే తయారు చేశాడు. దాని సహాయంతో స్వయం సేవా సంఘాల ద్వారా 29 రాష్ట్రాలు ఉన్న మన దేశంలోని 23 రాష్ట్రాలలో ప్యాడ్స్‌ను చాలా చవకగా అమ్ముతున్నాడు. ఆయన సేవలకుగాను 2016లో ఆయనను కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. ఆయన భూమికను ప్రముఖ బాలివుడ్ నటుడు అక్షయ్‌కుమార్ పోషించగా 'ప్యాడ్‌మ్యాన్' అనే చిత్రం దేశవ్యాప్తంగా ఈనెల 9 విడుదల కానుంది. సినిమా వంటి మాస్‌మీడియా ద్వారా ఈ సినిమా రుతుస్రావ పరిశుభ్రత, ప్యాడ్ అవసరాల గురించి అవగాహన కల్పించనుంది.

సాధారణ గుడ్డను ఉపయోగించడంలో ఎదురయ్యే ఇబ్బందులు

- మళ్లీ ఉపయోగించే గుడ్డను వాడినప్పుడు, అది కాస్తంత అపరిశుభ్రంగా ఉన్నా మహిళలకు రీప్రోడక్టివ్ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు (యోని సంబంధిత ఇన్ఫెక్షన్లు – ఆర్టీఐ) రావచ్చు.
- సాధారణంగా యోనిలో దాని రక్షణకు అవసరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను స్రవించే లాక్టోబాసిల్లై అనే మంచి బ్యాక్టీరియాతో పాటు కొద్ది మోతాదులో వేరే బ్యాక్టీరియా కూడా జీవిస్తూ ఉంటుంది. గుడ్డ వంటి అపరిశుభ్రమైన పద్ధతుల వల్ల యోని సంబంధిత ఇన్ఫెక్షన్ల ముప్పు ఏర్పడి తర్వాతి కాలంలో సంతానలేమి, సెక్స్ వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ వ్యాధులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.
- మహిళల్లో మూత్రవిసర్జనకు ఉండే రంధ్రం నిడివి చాలా తక్కువగా ఉంటుంది. దాంతో హానికరమైన బ్యాక్టీరియా అక్కడ విస్తరిస్తే అది యూరినరీ ఇన్ఫెక్షన్స్‌కు దారి తీయడంతో పాటు బ్లాడర్ (మూత్రం నిల్వ ఉండే తిత్తి) వరకు పాకే ముప్పు ఉంటుంది. పురుషులతో పోలిస్తే మహిళల్లో యూరినరీ ఇన్ఫెక్షన్లు పదే పదే తిరగబెడుతుండటానికి కారణం కూడా రుతుస్రావం సమయాల్లో పాటించే అపరిశుభ్రమైన పద్ధతులే.

వాడి పారేయగల ప్యాడ్స్ గురించి...


- మిగతా వాటితో పోలిస్తే వాడి పారేసేందుకు అనువైన ప్యాడ్స్ స్త్రీల పరిశుభ్రతకు అనువైనవి. వాటిని ఉపయోగించాల్సిన తీరుతెన్నులు బాలికలకూ, యువతులకూ మహిళా టీచర్లు విపులంగా వివరించాలి.
- ఉపయోగించిన ప్యాడ్స్‌ను తేలిగ్గా పారేసేలా కొంత మరుగుగా ఉన్న ప్రాంతాల్లో 'డిస్పోజబుల్–బిన్స్' ఏర్పాటు చేయాలి. అంటే స్కూళ్లలో, ఆఫీసుల్లో ఉండే టాయిలెట్స్‌లో, మహిళలు వేచి ఉండే ప్రాంతాలు, విశ్రాంతి స్థలాల్లోని మరుగు ప్రదేశాల్లో వాటిని ఉంచాలి. ఆ బిన్స్‌ను తరచూ శుభ్రపరుస్తూ ఉండాలి.
- వాడేసిన ప్యాడ్స్‌ను 'సేఫ్‌గా డిస్పోజ్' చేయాలి. అంటే లోతు గుంతలో వేసి కాల్చేయడం (పిట్ బర్నింగ్), బయటకు ఏమాత్రం పొగరానివ్వని విధంగా భస్మం చేయడం (ఇన్‌సినరేషన్) వంటి పద్ధతులు అవలంబించడం మేలు. ప్యాడ్ తయారైన మెటీరియల్ ఆధారంగా ఏది ఆరోగ్యకరమైన పద్ధతో ఆ పద్ధతిని ఎంచుకోవడం మేలు.
- అంతే తప్ప వాటిని ఒకచోట కుప్పగా వేసి, బహిరంగంగా తగలబెట్ట రాదు.

ప్యాడ్స్‌లో సాధారణ రకాలు

1. పీల్చుకునే సాధనంగా ఉపయోగించే గుడ్డ : పాత చీరలూ, తువాళ్లు, పాత బెడ్‌షీట్లు వంటి వాటిని తమకు అనువైన రీతిలో కత్తిరించుకొని చాలా మంది వాడుతుంటారు. ఇవి దొరకడం చాలా తేలిక. దాంతో వీటిని తరచూ శుభ్రపరచుకొని ఉపయోగిస్తుంటారు. లభ్యత తేలికే అయిన శుభ్రపరచుకునేందుకు వారు కోరుకునే చాటు/మరుగు మన సమాజంలో అంత తేలిగ్గా దొరకదు. ఉతికేందుకు చోటూ, తగినంత నీరూ, సబ్బు, ఎండ తగిలేలా ఆరేసుకునేందుకు అనువైన ప్రదేశం దొరకడం చాలా కష్టం. పైగా ఇన్ని సౌకర్యాలు లేకపోతే వాటిని మళ్లీ ఉపయోగించడం వల్ల దురద, దుర్వాసన వంటి మరికొన్ని ఆరోగ్య సమస్యలు వస్తాయి. చెమ్మ ఉంటే ఇన్ఫెక్షన్లకూ దారితీస్తుంది. అలాంటి అనారోగ్యకరమైన, అపరిశుభ్రమైన పరిస్థితులు మన దేశపు పల్లెప్రాంతాల్లోని పేదవర్గాల్లో చాలా ఎక్కువ.

2. స్థానికంగా తయరయ్యే మళ్లీ ఉపయోగించేందుకు వీలున్న న్యాప్కిన్లు : దాదాపు 6–12 సార్లు ఉపయోగించేందుకు వీలైన స్థానిక ప్యాడ్స్ కొన్ని చోట్ల లభ్యమవుతున్నాయి. ఇవి మాటిమాటికీ ఉపయోగపడేవి కావడంతో దాదాపు శిథిలమయ్యేవరకు ఉపయోగించే వీలుండటం వల్ల పర్యావరణానికీ హాని చేయవు. అయితే పైన పేర్కొన్నట్లే శుభ్రపరచడానికి (లాండ్రీయింగ్)కు వీటికి చోటు కావాలి.

3. ఉపయోగం తర్వాత పారేసేందుకు అనువైన వాణిజ్య ఉత్పాదనలు : ఇప్పుడివి మరీ మారుమూల ప్రాంతాలు మినహాయించి, ఒక మోస్తరు పెద్ద పల్లెల వరకూ విస్తారంగా లభిస్తున్నాయి. తగినంత పరిశోధన తర్వాత ఆరోగ్యకరమైన రీతిలో రూపుదిద్దుకున్న న్యాప్కిన్లు ఇవి. అయితే అందరూ కొనలేని కారణంగా, ఆర్థికంగా అందరికీ అందుబాటులో లేకపోవడం, ఒక్క ఉపయోగం తర్వాత వ్యర్థాలుగా మారడంతో శిథిలం కావడానికి కాస్తంత ఎక్కువ సమయం తీసుకోవడంతో ఇవి పర్యావరణానికి అంత అనువుగా లేవు. అందుకే వాడాక కొంత జాగ్రత్తగా వీటిని పారేయాల్సి ఉంటుంది.



అక్షయ్‌కుమార్

ఆరోగ్య సమస్యల ముప్పు తగ్గించడానికి పాటించాల్సిన పరిశుభ్రత సూచనలు

రుతుస్రావం సమయంలో పరిశుభ్రత (మెన్‌స్ట్రువల్ హైజీన్) పాటించకపోతే చాలా ఆరోగ్య సమస్యలొస్తాయి. అవి రాకుండా ఉండాలంటే పాటించాల్సిన సూచనలివే...

01. తిరిగి ఉపయోగించగలిగేవైనా లేదా వాడాక పడేసేవైనా సురక్షితమైన రీతిలో ఉపయోగించాలి. ఈ ప్రయోజనం కోసం గుడ్డ కంటే ప్యాడ్ మేలు.


02. ప్యాడ్ తరచూ మార్చుకోవాలి : మన రక్తం దేహాన్ని వదలగానే మన శరీరంలో ఉండే కొన్ని క్రిములతో కలిసి కలుషితం అవుతుంది. అంటే పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులను కలిగించేలా మారుతుంది. ప్యాడ్ రక్తంతో తడిసినప్పుడు యోనిలో ఉండే బ్యాక్టీరియా క్రిములు, యోని పరిసరాల్లో స్రవించిన చెమటలోని క్రిములతో నిండిపోతుంది. అదే చెమ్మ అలాగే ఎక్కువసేపు కొనసాగింతే ఆ క్రిములు మరింతగా వృద్ధి చెందేందుకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది. దాంతో ఆ క్రిములు అపరిమితంగా పెరిగి మూత్రసంబంధమైన, యోని సంబంధిత ఇన్ఫెక్షన్లు, చర్మం ఎర్రబారడం, దురద వంటి సమస్యలు రావడానికి దారి తీయవచ్చు. అందుకే వీలైనంత త్వరత్వరగా ప్యాడ్స్ మార్చేయాలి. ఎంత వ్యవధిలో వాటిని మార్చాలన్నది వారి వారి సౌకర్యాన్ని బట్టి ఉంటుంది. సగటున ప్రతి ఆరుగంటలకు ఒకసారి మార్చడం మంచిది.

03. రుతు సమయంలో స్రవించే రక్తం యోని ముఖద్వారం, దాని చుట్టూ ఆవరించే ఉండే లేబియా చర్మంలో కొన్ని చుక్కలు ఉండవచ్చు. దాని వల్ల దుర్వాసన వచ్చేందుకు అవకాశం ఉంటుంది. కనుక తరచూ యోని ప్రాంతాన్ని కడుక్కుంటూ ఉండాలి.

04. యోని కడిగేందుకు సబ్బు లేదా ఇతర ఉత్పాదనలు వాడకండి. సబ్బు లేదా ఇతర ఉత్పాదనలు వాడినప్పుడు చెడు బ్యాక్టీరియాతో పాటు యోనికి మేలు చేసేందుకు ఉద్దేశించిన మంచి బ్యాక్టీరియా కూడా ప్రక్షాళన ప్రక్రియలో నశించిపోతాయి. అందుకే కాస్తంత గోరువెచ్చని నీటితోనే శుభ్రం చేసుకోవడం మేలు.

05. యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకునే సమయంలో ఎప్పుడూ మీ చేతిని కింది నుంచి పై వైపునకు కదిలిస్తూ శుభ్రం చేసుకోండి. దీనికి వ్యతిరేక దిశలో వద్దు. మీ ప్రైవేటు పార్ట్స్‌ను పై నుంచి కిందివైపునకు శుభ్రం చేసుకుంటే యోని దగ్గర ఉండే క్రిములు కింద మలవిసర్జన ద్వారం నుంచి లోపలికి ప్రవేశించి, అక్కడికి ఇన్ఫెక్షన్స్‌ను వ్యాపి చేసే అవకాశం ఉంటుంది.

06. ఉపయగించి తీసేశాక ఆ ప్యాడ్‌ను జాగ్రత్తగా వదిలించుకోవాలి (డిస్కార్డ్ ప్రాపర్లీ): ఉపయోగించిన న్యాప్కిన్ లేదా టాంపూన్ వల్ల దుర్వాసన లేదా ఇన్ఫెక్షన్ వ్యాపించడానికి అవకాశం ఉంటుంది. అందుకే దాన్ని వాడాక పారేసేముందర ఏదైనా శుభ్రమైన పేపర్‌లో చుట్టి (ర్యాప్ చేసి) దూరంగా పొడిప్రాంతాల్లో పడేయాలి. టాయిలెట్ రంధ్రంలో వేసి ఫ్లష్ చేయడం సరైన పద్ధతి కాదు. అది మీ టాయిలెట్‌లో అడ్డంకిగా మారి మరో సమస్యను సృష్టించవచ్చు. న్యాప్కిన్‌ను పారేశాక మీ చేతులు శుభ్రంగా కడుక్కోవడం మరచిపోకండి.



07. ప్యాడ్‌తో వచ్చే ర్యాష్‌తో జాగ్రత్త : ఒక్కోసారి రక్తస్రావం ఎక్కువగా ఉన్నవారిలో ప్యాడ్ చాలాసేపు తడిగా ఉండి తొడలు, తొడలోపలి భాగాల్లో దురద రావడం, ఎర్రగా మారడం, ర్యాష్ రావడం జరగవచ్చు. అందుకే ప్యాడ్స్‌ను తరచూ మార్చడం ఎంత ముఖ్యమో, ఆ ప్రాంతాన్ని ఎప్పుడూ పొడిగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యం. ఒకవేళ అప్పటికే మీకు అక్కడ ర్యాష్ ఉంటే ప్యాడ్ వాడే సమయంలోనే మరింత జాగ్రత్తతో ఉండటం చాలా అవసరం. అలాగే డాక్టర్ సలహా మేరకు యాంటీసెప్టిక్ ఆయింట్‌మెంట్‌ను స్నానం తర్వాత, పడుకునే ముందర రాసుకోవాలి. ఇలాంటి సమస్య ఉంటే బిడియపడకుండా తప్పక డాక్టర్‌ను సంప్రదించండి. మీకు సహాయం చేయడం కోసమే డాక్టర్లు ఉంటారు. అంతేగానీ 'ఇదేమిటీ' అంటూ వారేమీ చెడుగా అనుకోరు. అన్యథా భావించరు. మీ సమస్య గురించి వేరే ఎక్కడా చర్చించరు. వారు అక్కడికక్కడే ఆ విషయాన్ని మరచిపోతారు.

08. ఒకసారికి ఒక్క ప్యాడ్ మాత్రమే: ఒకసారి ఒక్కటే ప్యాడ్‌ను వాడండి. అంతేగానీ హెవీ బ్లీడింగ్ అవుతోంది కదా అని రెండు ప్యాడ్స్ వాడకండి. రెండు వాడటం వల్ల కింది ప్యాడ్ రక్తాన్ని పూర్తిగా పీల్చుకునే అవకాశం ఉండదు. పై ప్యాడ్ రక్తంతో తడిసి, చెమ్మగా చాలాసేపు ఉండిపోతుంది. కిందిది పొడిగానే ఉంది కదా అని మీరు మార్చడానికి చాలాసేపు ఉంచుతారు. దాంతో పైనున్న తడిప్యాడ్‌లో ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియా వృద్ధి చెంది మీకు ఇన్ఫెక్షన్స్ కలిగిస్తాయి. ర్యాష్ కూడా రావచ్చు. ఇక కొన్ని సందర్భాల్లో రెండు ప్యాడ్స్ ఉండటం అంత సౌకర్యం కాకపోవచ్చు కూడా.

09. రుతు సమయంలో క్రమం తప్పకుండా స్నానం చేయండి : రుతుసమయాల్లో మహిళలు స్నానం చేయకూడదంటూ కొన్ని సంస్కృతుల్లో మహిళలకు ఆంక్షలు ఉంటాయి. కానీ రుతుసమయంలో మహిళలు తప్పనిసరిగా రోజూ స్నానం చేయాలి. స్నానం వల్ల వారి ప్రైవేట్ పార్ట్స్ పూర్తిగా శుభ్రం కావడమే కాదు వారిలో మెన్‌స్ట్రువల్ క్రాంప్స్ రాకుండా ఆ శుభ్రత దోహదపడుతుంది. అంతేకాదు ఎక్కడా ఏ అడ్డులేకుండా స్రావాలు ఫ్రీగా ప్రవహించేందుకూ స్నానం ఉపయోగపడుతుంది. స్నానం తర్వాత ఉండే ఆహ్లాద భావనతో మహిళలు చాలా హాయిగా ఫీలవుతారు.

10. మీ ప్యాడ్స్‌ను రెడీగా ఉంచుకోండి: రుతుస్రావం మొదలయ్యాక ప్యాడ్‌ను వెతుక్కోవడమో, ప్యాడ్ పారేయాల్సిన సమయంలో అవి లేవని గుర్తించి, షాప్‌కు వెళ్లడమో కాకుండా మొదట్నుంచే ప్యాడ్స్‌ను రెడీగా పెట్టుకోండి. మీరు స్కూల్‌కు లేదా కాలేజీకి వెళ్లే యువతి అయినా, లేదా బయటకు వెళ్లి పనిచేసే వర్కింగ్ ఉమన్ అయినా శానటరీ న్యాప్కిన్స్ లేదా ప్యాడ్స్‌ను ఎప్పుడూ నిల్వ ఉంచుకోండి. పరిశుభ్రమైన మీ బ్యాగ్‌లో ఒక పేపర్‌లో చుట్టి ప్యాడ్‌నూ, మృదువైన ఒక తువ్వాలను, లేదా కొన్ని పేపర్ న్యాప్కిన్స్‌నూ, చేతులు శుభ్రపరచుకునే హ్యాండ్ వాష్ (హ్యాండ్ శానిటైజర్)నూ, కాస్తంత పెద్దమొత్తంలోనే తినుబండారాలనూ (హెవీ శ్నాక్), ఒక వాటర్‌బాటిల్‌నూ, ఒక యాంటీసెప్టిక్ ట్యూబ్‌నూ దగ్గరుంచుకోండి. •



డాక్టర్ శ్రుతిరెడ్డి, సీనియర్ గైనకాలజిస్ట్,
బర్త్‌రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్
రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్

ఫ్యామిలీ డాక్టర్

అజీర్ణం... కడుపు ఉబ్బరం ఎందుకిలా?

నా వయసు 43 ఏళ్లు. కడుపులో విపరీతమైన మంటతోనూ, నొప్పి, అజీర్ణం, కడుపు ఉబ్బరం. డాక్టర్ గ్యాస్ట్రైటిస్ అన్నారు. హోమియోలో చికిత్స ఉందా?

– ఎమ్. రామసుబ్బారెడ్డి, కర్నూలు

జీర్ణకోశం లోపల ఉండే మ్యూకస్ పొర ఇన్‌ఫ్లమేషన్ లేదా వాపునకు గురికావడాన్ని గ్యాస్ట్రైటిస్ అంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు మన మెదడు లాగే జీర్ణ వ్యవస్థ మీద కూడా ప్రభావం పడుతుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు ఆకస్మికంగా మొదలై కొన్ని రోజుల వరకు ఉండి తగ్గిపోతే అక్యూట్ గ్యాస్ట్రైటిస్ అంటారు. దీర్ఘకాలికంగా ఉంటే దాన్ని క్రానిక్ గ్యాస్ట్రైటిస్ అంటారు. గ్యాస్ట్రిక్ ముదిరితే అవి కడుపులో అల్సర్స్ (పుండ్లు)గా ఏర్పడతాయి.

కారణాలు : 20 నుంచి 50 శాతం అక్యూట్ గ్యాస్ట్రైటిస్‌లకు వైరస్, బ్యాక్టీరియా (హెలికోబ్యాక్టర్ పైలోరీ అనే బ్యాక్టీరియా) కారణమవుతుంది • తీవ్రమైన మానసిక ఒత్తిడి, మద్యం ఎక్కువగా తీసుకోవడం, సమయానికి ఆహారం తీసుకోకపోవడం • కొన్ని రకాల మందులు... ముఖ్యంగా పెయిన్ కిల్లర్స్ వాడటం • పైత్య రసం వెనక్కి ప్రవహించడం • క్రాన్స్ డిసీజ్, కొన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధులు • శస్త్రచికిత్స లేదా వంశపారంపర్య చరిత్ర ఉన్నవారిలో • వేపుళ్లు, మసాలాలు, కారం, పులుపు ఎక్కువగా తీసుకునే వారిలో గ్యాస్ట్రైటిస్ సమస్య కనిపిస్తుంది.

లక్షణాలు : కడుపు నొప్పి, మంట, ఉబ్బరం, కొంచెం తిన్నా కడుపు నిండుగా అనిపించడం • అజీర్ణం, వికారం, రక్తంతో కూడిన వాంతులు • ఆకలి తగ్గిపోవడం • మలం రంగు మారడం వంటివి.

జాగ్రత్తలు : సమయానికి ఆహారం • కొద్ది మోతాదుల్లో ఎక్కువ సార్లు తినాలి • పొగ, మద్యపానం మానేయాలి • మసాలాలు, కారం, వేపుళ్లు తగ్గించాలి. భోజనానికి నిద్రకు మధ్య రెండు గంటల విరామం ఉండాలి.

చికిత్స : ఈ సమస్యలకు మూలకారణమైన ఆమ్లాలు, తీవ్ర రసాయనాల సమతౌల్యత చక్కదిద్దడం వల్ల గ్యాస్ట్రిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ మోర్లావర్
సీఎండీ, హోమియోకేర్
ఇంటర్నేషనల్, హైదరాబాద్

పేనుకొరుకుడుకు చికిత్స ఉందా?

మా అమ్మాయికి 25 ఏళ్లు. ఈ మధ్య ఒకే దగ్గర వెంట్రుకలు రాలిపోతున్నాయి. పేనుకొరుకుడు అంటున్నారు. హోమియోలో దీనికి పరిష్కారం ఉందా?

– సురభి, ఖమ్మం

పేనుకొరుకుడు సమస్యను వైద్యపరిభాషలో అలొపేషియా అంటారు. ఈ కండిషన్‌లో ఒక నిర్ణీత స్థలంలో వెంట్రుకలు పూర్తిగా రాలిపోయి, నున్నగా మారుతుంది. శరీరం తనను తాను రక్షించుకోగలిగే శక్తిని కోల్పోయినప్పుడు జుట్టు రాలిపోయి తలపై అక్కడక్కడ ప్యాచ్‌లలాగా ఏర్పడతాయి. ఇది ఒక ఆటో ఇమ్యూన్ డిజార్డర్. అంటే తన సొంత వ్యాధి నిరోధక శక్తి తన వెంట్రుకలపైనే ప్రతికూలంగా పనిచేయడం వల్ల వచ్చే సమస్య అన్నమాట. ఇది తలలోగానీ, గడ్డంలోగానీ, మీసాలలోగాని రావచ్చు. ఇది అంటువ్యాధి కాదు.

కారణాలు : • మానసిక ఆందోళన • థైరాయిడ్ సమస్య • డయాబెటిస్, బీపీ వంటి సమస్య ఉన్నవాళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంటుంది • వంశపారంపర్యంగా • కవలల్లో ఒకరికి ఉంటే మరొకరికి వచ్చే అవకాశం ఉంటుంది.

లక్షణాలు : • తలపై మొత్తం జుట్టు ఊడిపోయి, బట్టతల లక్షణాలు కనిపిస్తాయి. • తలపై అక్కడక్కడ గుండ్రంగా ప్యాచ్‌లలా జుట్టు ఊడిపోతుంది • సాధారణంగా గుండ్రగా లేదా అండాకృతితో ఈ ప్యాచ్‌లు ఉంటాయి.

నిర్ధారణ : ఈ సమస్య నిర్దుష్టంగా ఏ కారణం వల్ల వచ్చిందో తెలుసుకోవాలి. ట్రైకోస్కోపీ, బయాప్సీ, హిస్టలాజిక్ పరీక్షలు, పిగ్మెంట్ ఇన్‌కాంటినెన్స్ వంటివే మరికొన్ని పరీక్షలు.

చికిత్స : పేనుకొరుకుడు సమస్యకు హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వైద్యులు వ్యాధి కారణాలు, లక్షణాలను పరిగణనలోకి తీసుకొని మందులను సూచిస్తారు. దీనికి హోమియోలో యాసిడ్ ఫ్లోర్, సల్ఫర్, ఫాస్ఫరస్, గ్రాఫైటిస్, సెలీనియమ్, సొరినమ్, తుజా వంటి మందులను డాక్టర్ల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది.



డాక్టర్ మురళి కె. అంకిరెడ్డి,
ఎండీ (హోమియో) స్టార్
హోమియోపతి, హైదరాబాద్

సాక్షి ఫ్యామిలీ
సినిమా
విజయవాడ
గురువారం
8-2-2018

జీరో ప్రమోషన్స్




● షారుక్ ఖాన్

...అని చదవగానే షారుక్ ఖాన్ 'జీరో' సినిమాకు అసలు ప్రమోషన్స్ లేవా? అని డిసైడ్ అయిపోకండి. ప్రమోషన్స్ విషయంలో షారుక్‌కు చాలా ప్లాన్స్ ఉన్నాయట. ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో షారుక్, అనుష్కా శర్మ, కత్రినా కైఫ్ నటిస్తున్న చిత్రం 'జీరో'. ఈ సినిమా డిసెంబర్ చివరి వారంలో రిలీజ్ కానుంది. జనరల్‌గా విడుదలకు పది పదిహేను రోజుల ముందు ప్రమోషన్స్ మొదలుపెడతారు. కానీ షారుక్ మాత్రం ముందే మొదలుపెట్టబోతున్నారు. ఇప్పటినుంచి డిసెంబర్ వరకూ వచ్చే ప్రతి పండగకు 'జీరో' సినిమాకు సంబంధించిన ఏదో ఒక విశేషాన్ని మనం చూడొచ్చట. ఈ చిత్రంలో అనుష్కా శర్మ కథానాయిక. ఇది కాకుండా ఆమె కథానాయికగా నటించిన 'పరీ' హోలీకు విడుదల కానుంది. సో అప్పటికి ఆమె లుక్ రివీల్ చేయడంతో 'జీరో' ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నారట. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ 'రేస్ 3' ఈ రంజాన్‌కు రానుంది. ఎలాగూ సల్మాన్ ఖాన్ 'జీరో'లో ఓ పాటలో తళుక్కున మెరిశారు కాబట్టి, రంజాన్‌కు ఈ సినిమాకు సంబంధించిన తొలి టీజర్‌ను 'రేస్ 3'తో పాటుగా రిలీజ్ చేస్తారట. ఫైనల్‌గా 3 నిమిషాల నిడివి గల అఫీషియల్ ట్రైలర్‌ను దీపావళికి రాబోతున్న ఆమిర్ ఖాన్ 'థగ్స్ ఆఫ్ హిందోస్తాన్'తో జతపరచాలని భావిస్తున్నారట 'జీరో' బృందం. 'జీరో' ఒక సెలబ్రేషన్‌లా ఉండాలని భావించారట షారుక్. అందుకని ఇలా ప్రతి పండగకు సినిమాకు సంబంధించిన ఏదో ఒక స్పెషల్‌ను రివీల్ చేయలనుకుంటున్నారని చిత్రబృందం అంటోంది. ఇంతకీ ఈ 'జీరో' షారుక్‌కి ఎందుకంత స్పెషల్ అంటే.. ఇందులో ఆయన చేస్తున్న క్యారెక్టర్ కూడా స్పెషలే. మరుగుజ్జు పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా పూర్తయ్యేవరకూ షారుక్ వేరే సినిమా చేయకూడదని ఫిక్స్ అయ్యారట.

డెవిల్ ఈజ్ బ్యాక్



● సల్మాన్‌ఖాన్

యస్.. డెవిల్ ఈజ్ బ్యాక్. మరోసారి డెవిల్‌గా వచ్చే ఏడాది క్రిస్మస్‌కు థియేటర్స్‌లో డబుల్ కిక్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు సల్మాన్ ఖాన్. ఆల్మోస్ట్ నాలుగేళ్ల క్రితం సాజిద్ నాడియాడ్‌వాలా తొలిసారి దర్శకత్వం వహించిన చిత్రం 'కిక్'. తెలుగులో రవితేజ హీరోగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో వచ్చిన 'కిక్' చిత్రానికి రీమేక్ ఇది. హిందీ చిత్రంలో సల్మాన్ ఖాన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, రణ్‌దీప్ హుడా, నవాజుద్దీన్ సిద్ధిఖీ నటించారు. దేవీలాల్ సింగ్ (డెవిల్) పాత్రలో సల్మాన్ నటించి, బాక్సాఫీసును కొల్లగొట్టారు. అంతేకాదు దర్శకత్వం వహించిన తొలి సినిమానే 200 కోట్ల క్లబ్‌లో చేర్చిన ఘనత సాజిద్‌కు దక్కింది. బుధవారం 'కిక్'కి సీక్వెల్‌గా 'కిక్ 2' చిత్రాన్ని ఎనౌన్స్ చేశారాయన. ''వెయిట్ ఈజ్ ఓవర్.. డెవిల్ ఈజ్ బ్యాక్. 'కిక్ 2' సినిమాను వచ్చే ఏడాది క్రిస్మస్‌కు రిలీజ్ చేయనున్నాం'' అని పేర్కొన్నారు సాజిద్. ఇందులో సల్మాన్ డ్యూయెల్ రోల్ చేయనున్నారన్న వార్తలు బీటౌన్‌లో జోరందుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది తన ఫేవరెట్ ఫెస్టివల్ రంజాన్‌కు అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'భరత్' మూవీకి రెడీ అవుతున్నారు సల్మాన్. ఈ ఏడాది రంజాన్‌కు సల్మాన్ 'రేస్ 3' విడుదల కానున్న సంగతి తెలిసిందే. గతేడాది క్రిస్మస్‌కు సల్మాన్ 'టైగర్ జిందాహై' చిత్రం రిలీజై మంచి వసూళ్లను రాబట్టింది. సో.. ఈ సెంటిమెంట్‌ను కొనసాగించడానికే సల్మాన్ వచ్చే ఏడాది క్రిస్మస్‌కు 'కిక్ 2' ప్లాన్ చేశారని బాలీవుడ్ టాక్.

ఇరగదీసింది!

అవును..డ్యాన్స్‌ను ఇరగదీసింది శ్రీదేవి తనయ జాన్వీ. మరాఠీ సూపర్ హిట్ 'సైరట్' చిత్రం హిందీలో 'థడక్' అనే టైటిల్‌తో రూపొందుతున్న సంగతి తెలిసిందే. శశాంక్ కేతన్ దర్శకత్వంలో ఇషాన్ కట్టర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం రీసెంట్‌గా ఓ సోలో సాంగ్‌ను ముంబైలో జాన్వీ కపూర్‌పై చిత్రీకరించారు. కొరియోగ్రాఫర్ తుషార్ కలియా డిజైన్ చేసిన ఈ రేసీ సాంగ్‌లో డ్యాన్స్ కుమ్మేసిందట జాన్వీ. ఈ సాంగ్ షూట్‌కు రెండు రోజుల ముందు నుంచే ఫుల్‌గా ప్రాక్టీస్ చేసి లొకేషన్‌లోకి వచ్చిందట జాన్వీ. ''చాలా కాన్ఫిడెంట్‌గా



● తుషార్ కలియా

డ్యాన్స్ చేసింది జాన్వీ. ఏ డ్యాన్స్ మూమెంట్‌లో చేంజ్ అడగలేదు. సాంగ్ బ్రేక్ టైమ్‌లోనూ నెక్ట్స్ స్టెప్ కోసం ప్రాక్టీస్ చేస్తూనే ఉంది'' అని జాన్వీని పొగిడేశారు తుషార్. ఈ సినిమాను జూలై 20న రిలీజ్ చేయాలనుకుంటున్నారు. హీరోయిన్‌గా నటిస్తున్న తొలి సినిమాలోనే కొరియోగ్రాఫర్‌ను మెప్పించే రేంజ్‌లో జాన్వీ డ్యాన్స్ చేయడం విశేషమే.



● జాన్వీ కపూర్



● అమితాబ్ బచ్చన్, అయాన్ ముఖర్జీ, రణ్‌బీర్ కపూర్

మెన్ ఇన్ డిస్కషన్

బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఏదో చెబుతుంటే హీరో రణ్‌బీర్ కపూర్, దర్శకుడు అయాన్ ముఖర్జీ ఎలా ఆలకిస్తున్నారో చూశారుగా! ఇంతకీ అమితాబ్ ఏం చెబుతున్నారు? ఈ ముగ్గురూ ఎక్కడ కలిశారు? దేని గురించి డిస్కస్ చేస్తున్నారు అంటే... 'బ్రహ్మాస్త్ర' కోసం. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ధర్మా ప్రొడక్షన్స్ పతాకంపై అమితాబ్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ నటిస్తున్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. ''బ్రహ్మాస్త్ర. ఎగ్జైటింగ్ జర్నీ స్టార్టైంది'' అని ధర్మా ప్రొడక్షన్స్ సంస్థ పేర్కొంది. ఈ సినిమాలో ఓ కీలకమైన పాత్ర కోసం సౌరవ్ గుర్జార్‌ను తీసుకున్నారని బాలీవుడ్ సమాచారం. హిందీ బుల్లితెరపై రావణ, భీమ క్యారెక్టర్స్‌లో నటించారు సౌరవ్. 'బ్రహ్మాస్త్ర' సినిమాను మూడు పార్ట్స్‌గా తీయాలనుకుంటున్నారు. 150 కోట్లతో రూపొందించనున్న తొలి పార్ట్‌ను వచ్చే ఏడాది ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ఎనౌన్స్ చేసింది.



● కత్రినాకైఫ్



● ఇర్ఫాన్ ఖాన్

బడికి వేళాయెరా

మళ్లీ స్కూల్‌కి వెళ్లేందుకు రెడీ అవుతున్నారు ఇర్ఫాన్ ఖాన్. ఆ వయసు దాటిపోయింది కదా అనుకుంటున్నారా? ఇది రీల్ స్కూల్. గతేడాది 'హిందీ మీడియమ్' సినిమా కోసం స్కూల్‌కి వెళ్లారు ఇర్ఫాన్. ఆ సినిమాలో ఆయన టీచర్ కాదు. బిజినెస్‌మేన్. కూతురిని ఇంగ్లిష్ మీడియమ్ స్కూల్‌లో చేర్పించడానికి నానా పాట్లు పడతారు. సాకేత్ చౌదరి దర్శకత్వంలో ఇర్ఫాన్ ఖాన్, సబా కమర్, దీపక్ దోబ్రియాల్ ముఖ్య తారలుగా రూపొందిన ఈ సినిమాకు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌ను ప్లాన్ చేశారు. అంటే.. ఇర్ఫాన్ ఖాన్‌కు స్కూల్‌కు వెళ్లేందుకు టైమ్ అయ్యిందన్న మాట. ఈ సినిమాలోనూ తండ్రి రాజ్ బాత్రా పాత్రలోనే ఇర్ఫాన్ కనిపించనున్నారని బాలీవుడ్ సమాచారం. ఆగస్టులో సెట్స్ పైకి వెళుతుందట. ఇక హీరోయిన్‌గా సబా కమర్‌నే తీసుకోవాలని ఆలోచిస్తున్నారట. అంతేకాదు ఈసారి కొంచెం డోస్ పెంచి ఇండియన్ ఎడ్యుకేషన్ సిస్టమ్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా తీసేందుకు స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారట చిత్రబృందం.

జల్దీ జారుకోవాలె!

ఇక్కడ ఉన్న ఫోటో చూశారుగా! హీరో అర్జున్ కపూర్, హీరోయిన్ పరిణీతి చోప్రా ట్రైన్‌లో ఉన్నారని అర్థం అయ్యే ఉంటుంది. ట్రైన్ పేరు చెప్పడం కష్టం కానీ... ఎక్కడో చెప్పగలం. ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ఉన్నారు. అక్కడ ఏం చేస్తున్నారు? అంటే.. పారిపోతున్నారట. అర్జున్ కపూర్, పరిణీతి చోప్రా జంటగా దిబాకర్ బెనర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సందీప్ ఔర్ పింకీ ఫరార్'. ఈ సినిమా షూటింగ్‌ను ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిపారు. విలన్స్ నుంచి అర్జున్, పరిణీతి చోప్రా పారిపోయే సీన్స్‌ను తెరకెక్కించారు చిత్రబృందం. జారుకో.. జారుకో.. జల్దీ జారుకోవాలె అని అక్కడి నుంచి ఉడాయించింది ఈ జంట. అది సరే కానీ విలన్స్‌ను రఫ్ఫాడించకుండా హీరో పారిపోవడం ఏంటీ? అంటే.. ఉంది బాస్.. దానికి రీజన్ ఉంది. ఆ రీజన్ ఏంటో స్క్రీన్‌పై చూడండి అంటున్నారు చిత్రబృందం. ఈ సినిమాను ఆగస్టులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.




● పరిణీతి చోప్రా, అర్జున్ కపూర్

బాలీవుడ్ స్పైస్

ఏడేళ్లు.. 49 ట్రాన్స్‌ఫర్లు!

రైడ్‌కు వెళ్లారు హీరో అజయ్ దేవగన్. నెచ్చలితో సరదాగా సాగే రైడ్ కాదిది. పోనీ సోలోగా ఎంజాయ్ చేయడానికి చేసే రైడ్ కాదు. ఈ ప్రయాణానికి ఓ పర్పస్ ఉంది. నీతి, న్యాయం, ధర్మం లేకుండా దొడ్డిదారిన మూడు బ్రీఫ్‌కేస్‌లు, ఆరు స్కామ్‌లు చేసి డబ్బు దాచుకున్న వారిని రొడ్డున పడేసే రైడ్ ఇది. కాంప్రమైజ్ అవ్వడానికి, కామ్‌గా వెళ్లడానికి రైడ్ చేసేవాడు మాములోడు కాదు. ఏడేళ్లలో 49 సార్లు బదిలీ అయిన సిన్సియర్ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్. పేరు అమీ పట్నాయక్. 'రైడ్'లో అజయ్ దేవగన్ చేస్తున్న పాత్ర పేరిది. అజయ్ దేవగన్, ఇలియానా, సౌరభ్ శుక్లా ముఖ్య తారలుగా రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌తోపాటుగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. 'హీరోలు ఎప్పుడూ యూనిఫార్మ్స్‌లో రారు' అనే ట్యాగ్ ఇచ్చి, ట్రైలర్‌ను షేర్ చేశారు అజయ్. ఈ సినిమాను మార్చి 16న విడుదల చేయాలనుకుంటున్నారు. 1980 బ్యాక్‌డ్రాప్‌లో లక్నోలో జరిగిన ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా సినిమాను రూపొందించారని బాలీవుడ్ టాక్. ''అజయ్ దేవగన్ వర్క్ పట్ల చాలా డేడికేషన్‌గా ఉంటాడు. అంత ఈజీగా ఇంప్రెస్ అవ్వడు. స్ట్రాంగ్ స్క్రిప్ట్‌ను అజయ్‌కు వినిపించాను. అప్పుడు ఒప్పుకున్నాడు. అజయ్‌తో వర్క్ చేయాలంటే ఎక్స్‌ట్రా ఎఫర్ట్స్ పెట్టాల్సిందే'' అన్నారు రాజ్‌కుమార్ గుప్తా.



● అజయ్ దేవగన్



● ఇలియానా

గాల్లో తేలినట్టుందే

...అని అంటున్నారు లేడీ టైగర్ కత్రినా కైఫ్. ఇప్పుడెందుకు ఆమె గాల్లో తేలిపోతున్నారు అంటే.. 'థగ్స్ ఆఫ్ హిందోస్తాన్' కోసం అట. ఈ సినిమాలో వచ్చే ఓ స్పెషల్ సాంగ్ కోసం కత్రినా కైఫ్ గాల్లో ఎగిరే స్టెప్స్‌ను ప్రాక్టీస్ చేస్తున్నారట. అందుకని 'గాల్లో తేలిపోతున్నాను' అని పేర్కొన్నారు కత్రినా. అలాగే తనకు తోడుగా ఆమిర్ ఖాన్, ఫాతిమా సనా షేక్‌ను కుడా జాయిన్ చేసుకున్నారు కైఫ్. కత్రినాతో పాటు ఆమిర్, ఫాతిమా కూడా ఈ పాటకు కాలు కదపబోతున్నారట. స్టెప్స్ అంత ఈజీ కాదు. అందుకే ఆమిర్, కత్రినా, ఫాతిమా చాలా రోజులగా ప్రాక్టీస్ చేస్తున్నారట. ఈ సాంగ్‌ను త్వరలో షూట్ చేస్తారని సమాచారం. ఇదివరకు కత్రినా చేసిన 'చిక్నీ చమేలీ, కమిలీ కమిలీ' సాంగ్ రేంజ్‌లోనే ఈ సాంగ్ కూడా ఉంటుందని 'థగ్స్..' చిత్రబృందం పేర్కొంటున్నారు.'కన్ఫెషన్స్ ఆఫ్ ఏ థగ్' నవల ఆధారంగా విజయ్ కృష్ణ ఆచార్య దర్శకత్వంలో వైఆర్ఎఫ్ సంస్థ నిర్మిస్తున్న ఈ యాక్షన్ అడ్వెంచర్‌లో ఆమిర్ ఖాన్, అమితాబ్ బచ్చన్ తొలిసారి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. కత్రినా కైఫ్, 'దంగల్' భామ ఫాతిమా సన షేక్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీపావళి సందర్భంగా ఈ సినిమా నవంబర్ 7న విడుదల కానుంది.

కొరియాలో ఏపీ ప్రత్యేక ప్రతినిధులు నియామకం

సాక్షి, అమరావతి: దక్షిణ కొరియాకు చెందిన కియో మోటార్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అధ్యక్షుడు హన్ ఊ పార్క్‌ను కొరియాలోని సియోల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధిగా ప్రభుత్వం నియమించింది. అలాగే కొరియాలో భారత గౌరవ కౌన్సిల్ జనరల్ జియాంగ్ డియోమిన్‌ను బూషన్‌లో ఏపీ ప్రత్యేక ప్రతినిధిగా నియమించింది. ఏపీ టూరిజం అభివృద్ధికి, సాంస్కృతిక, ఆర్థిక రంగాల ప్రగతికి కొరియా నుంచి ఏపీకి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు వీరిద్దరూ కృషి చేస్తారని సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొరియాలో వారిద్దరూ చేసే పర్యటనలు, ఇతర ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

రూ.15 వేల బాకీ తీర్చాలని బెదిరింపులు

ఎంపీ రాయపాటి మాజీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం


విజయరాజ్‌ను అత్యవసర విభాగం నుంచి వార్డుకు తరలిస్తున్న దృశ్యం

గుంటూరు ఈస్ట్: తెలుగుదేశం పార్టీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, ఆయన కుమారుడు రంగారావు వద్ద మూడు నెలల క్రితం వరకు పనిచేసిన డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. రాయపాటి రంగారావుకు తాను రూ.15 వేలు బాకీ ఉన్నందున ఆయన సిబ్బంది డబ్బుల కోసం తరచూ బెదిరిస్తుండడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బాధితుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నల్లచెరువుకి చెందిన పుట్ల విజయరాజు రెండేళ్లపాటు రాయపాటి సాంబశివరావు, రంగారావు వద్ద కారు డ్రైవర్‌గా పనిచేశాడు. మూడు నెలల క్రితం వ్యక్తిగత కారణాల వల్ల మానేశాడు. డ్రైవర్‌గా పనిచేసేటప్పుడు పిల్లలకు చికిత్స చేయించేందుకు రాయపాటి రంగారావు వద్ద రూ.15 వేలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. దీంతో కొన్ని రోజులుగా రంగారావు, ఆయన సిబ్బంది ఫణి, డ్రైవర్ వెంకటేష్ తరచూ విజయరాజుకు ఫోన్ చేసి బాకీ తీర్చాలని బెదిరిస్తున్నారు. మనస్తాపానికి గురైన విజయరాజు బుధవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు అతడిని జీజీహెచ్‌కు తరలించారు.

లక్ష దరఖాస్తులకు కోత

- కొత్త తెల్ల కార్డులు రానట్టే
- ఐదో విడత జన్మభూమిలో అందిన దరఖాస్తులు 1.55 లక్షలు
- పలు వడపోతలతో మూడో వంతుకు కుదించిన సర్కారు
- కుటుంబ సభ్యులు పేర్లు చేర్చేందుకూ తంటాలే



సాక్షి, అమరావతి

తెల్ల రేషన్‌కార్డు కావాలంటే పేదలు ఇక తెల్లముఖం వేయాల్సిందే. లక్షల సంఖ్యలో దరఖాస్తులు అందితే పలు వడపోతల పేరుతో ప్రభుత్వం వీటిని మూడో వంతుకు కుదించింది. ఇటీవల ఐదో విడత జన్మభూమిలో 1.55 లక్షల మంది తెల్ల రేషన్ కార్డుల కోసం అర్జీలు ఇవ్వగా 74,311 దరఖాస్తులు అర్హులైనవిగా తేల్చారు. అయితే చివరకు 53,703 దరఖాస్తులను అత్యంత అర్హులైన వారివిగా గుర్తించి వారికి మాత్రమే కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆరోగ్యశ్రీతో సహా ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం అందాలన్నా తెల్లరేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీంతో తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి అయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు నిర్వహించిన పలు జన్మభూమి కార్యక్రమాల్లో దాదాపు 15 లక్షల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఆధార్ పేరుతో 8 లక్షల కార్డులకు ఎగనామం

టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోలేదనే కారణంతో దాదాపు 8 లక్షల కార్డులను రద్దు చేసింది. ప్రజా సాధికార సర్వే (పల్స్)లో కుటుంబ వివరాలను నమోదు చేయించుకోని 4.11 లక్షల కుటుంబాలకు రేషన్‌ను నిలిపివేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.42 కోట్ల తెల్లరేషన్ కార్డులు ఉన్నాయి. అర్హత నిబంధనల పేరుతో కనీసం 40 శాతం వరకు కార్డుల్లో కోత విధించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

కొత్త వారి పేర్లు చేర్చేందుకు నిరాకరణ

ఇప్పటికే జారీ చేసిన కార్డుల్లో కొత్తగా కుటుంబ సభ్యుల వివరాలు చేర్చేందుకు అందిన లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తగా సభ్యుల పేర్లను చేర్చాలని మీ సేవా కేంద్రాలకు 23.23 లక్షల దరఖాస్తులు అందగా ఎలాంటి కారణాలు చూపకుండానే 3.58 లక్షల దరఖాస్తులను తిరస్కరించారు. దీంతో పేదలకు బియ్యం అందటం లేదు.

5వ విడత జన్మభూమిలో తెల్ల రేషన్‌కార్డుల కోసం అందిన దరఖాస్తులు

జిల్లా	దరఖాస్తులు	అర్హులు	అత్యంత అర్హులు	తిరస్కరించినవి
గుంటూరు	27198	12294	9985	4,919
కృష్ణా	22063	11154	7408	3,501
తూర్పు గోదావరి	14866	7047	5779	2,040
చిత్తూరు	13872	6841	4698	2,333
కర్నూలు	13000	6280	3869	2,851
విశాఖపట్నం	12923	6506	4130	2,287
వైఎస్సార్	10570	5114	3602	1,854
ప్రకాశం	10523	4618	3777	2,128
విజయనగరం	8205	3527	2906	1,772
పశ్చిమ గోదావరి	7483	3779	2552	1,152
అనంతపురం	6760	3351	2267	1,142
నెల్లూరు	4446	1914	1701	831
శ్రీకాకుళం	3547	1886	1029	632
మొత్తం	1,55,456	74,311	53,703	27,442

తెల్ల రేషన్ కార్డులకు ఇదీ లెక్క

- గ్రామీణ ప్రాంతాల్లో రూ.60 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.75 వేలకు మించి వార్షిక ఆదాయం ఉంటే తెల్ల రేషన్ కార్డు పొందేందుకు అనర్హులు.
- 4 చక్రాల వాహనం ఉండకూడదు. ■ ఇతర రేషన్‌కార్డుల్లో సభ్యులుగా ఉండకూడదు.
- దరఖాస్తుదారుడి పేరుతో 740 అడుగుల ఇల్లు రిజిస్ట్రేషన్ అయి ఉండకూడదు.
- పల్స్ సర్వేలో కుటుంబ వివరాలు తప్పకుండా నమోదు అయి ఉండాలి.
- కొత్తగా తెల్ల రేషన్ కార్డు పొందాలంటే రాయలసీమ జిల్లాలో 10 ఎకరాలు, మిగిలిన జిల్లాలో 5 ఎకరాల్లోపు పొలం మాత్రమే పొలం ఉండాలి.
- విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటకూడదు.

అమృత వర్సిటీకి శంకుస్థాపన

- విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరం: సీఎం చంద్రబాబు
- చీరలు ఇస్తామని సభకు తరలించి మోసగించారని మహిళల ఆందోళన
- డ్వాక్రా యానిమేటర్లు ఫోన్లు చేసినా స్పందించని టీడీపీ నేతలు

మంగళగిరి టౌన్: విలువలతో కూడిన సమాజం నిర్మాణం కోసం అమృత విశ్వవిద్యాలయం రాజధాని అమరావతి ప్రాంతంలో ఏర్పాటు కానుడటం అభినందనీయమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కురగల్లు, యర్రబాలెం గ్రామాల మధ్య నిర్మించనున్న అమృత విశ్వవిద్యాలయానికి సీఎం బుధవారం శంకుస్థాపన చేశారు. అమృతానందమయి ట్రస్ట్ పలు దేశాల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలకు అండగా ఉందని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా విశ్వవిద్యాలయ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రవేశాలు ప్రారంభించాలని కోరారు. రాజధాని ప్రాంతవాసుల మౌలిక సదుపాయాల కోసం రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు సీఎం చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు కామినేని, గంటా, పి.నారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్, కలెక్టర్ కోన శశిధర్, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, కొచ్చి అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ప్రేమ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మహిళలు


చీరలు ఇస్తామంటే వచ్చాం..

సీఎం పాల్గొంటున్న అమృత విశ్వవిద్యాలయ శంకుస్థాపన కార్యక్రమానికి వస్తే చీరలు ఇస్తామని చెప్పి తరువాత ఇవ్వకుండా మోసగించారంటూ పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. మహిళలు భారీగా రావాలని, చీరలు ఇస్తామని రాజధాని ప్రాంతంలో దండోరా కూడా వేయటం గమనార్హం. దీంతో పలువురు



గ్రామాల్లో ఇచ్చిన టోకెన్లు

మహిళలు తెల్లవారుజామునే దూర ప్రాంతాలనుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలి వచ్చారు. వారికి కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదు. సీఎం సభ ముగిసిన వెంటనే భోజనాలు ఏర్పాటు చేసి చీరలిస్తామంటూ ఒకటికి నాలుగుసార్లు మైకులో ప్రకటించారు. అయితే సీఎం వెళ్లిపోయిన వెంటనే చీరలిస్తామన్న నాయకులు పత్తా లేకుండా పోయారు. మహిళలు నిలదీయటంతో డ్వాక్రా యానిమేటర్లు ఫోన్లు చేసినా టీడీపీ నేతలు స్పందించలేదు. మొక్కుబడిగా తెచ్చిన కొద్ది చీరలను తొక్కిసలాట జరుగుతుందనే ఆందోళనతో పోలీసులు వేరే చోటకు తరలించారు. ఆందోళనకు దిగిన మహిళలను గెంటేశారు. చివరకు కొద్ది చీరలను మాత్రం పార్టీ కార్యకర్తలకు అందచేశారు.

విజయవాడలో అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ!

మంత్రివర్గ ఉపసంఘానికి అధ్యయన బాధ్యతలు

సాక్షి, అమరావతి: విజయవాడ నగరంలోని అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా దీనిపై అధ్యయనం చేసి సిఫార్సు చేసే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, మంత్రులు యనమల, అచ్చెన్నాయుడుతో కూడిన మంత్రి వర్గ ఉపసంఘానికి అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల్లో కట్టడాల క్రమబద్ధీకరణ జీవో అమలులో ఉంది. ఇది విజయవాడ వాసులకు కూడా వర్తిస్తుంది. అయితే విజయవాడలో ప్రభుత్వ, అసైన్డ్ భూములు, కొండలు, నీటిపారుదల శాఖకు చెందిన స్థలాలను కూడా ఆక్రమించుకుని కొందరు భవనాలు నిర్మించుకున్నారు. బినామీ పేర్లతో కొందరు రాజకీయ నాయకులు కూడా ఈ స్థలాలను ఆక్రమించుకుని భవనాలు నిర్మించారు. వీటిని కూడా క్రమబద్ధీకరించేలా విజయవాడకు ఉత్తర్వులు జారీ చేయాలని అధికార పక్ష నాయకులు ఒత్తిడి తేవడంతో.. ప్రభుత్వం దీనిపై అధ్యయనం చేయాలని ఉపసంఘాన్ని ఆదేశించింది.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు టిక్కెట్లలో 50% రాయితీ

సాక్షి, అమరావతి: ఏపీఎస్ ఆర్టీసీలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులతోపాటు వారి భార్యలకు, సర్వీసులో ఉండి చనిపోయిన ఉద్యోగుల భార్య, భర్తలకు సూపర్ లగ్జరీ బస్సులు, ప్రొడక్టు బస్సు టిక్కెట్లలో 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ప్రయాణానికి ముందుగా ఆర్టీసీ, ప్రైవేటు రిజర్వేషన్ కౌంటర్లలో టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకోవచ్చని చీఫ్ పర్సనల్ మేనేజర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మద్దతులో కనీస ధర్మం పాటించండి

కేంద్ర ప్రభుత్వానికి నిపుణుల సూచన
- సాగు వ్యయానికీ, కనీస మద్దతు ధరకు పొంతనే లేదు
- స్వామినాథన్ సిఫార్సులను పట్టించుకోని ప్రభుత్వాలు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు

సాక్షి, అమరావతి



వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్న నేపథ్యంలో పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)పై మరోసారి దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. మద్దతు ధర నిర్ణయంలో ఏపీ లాంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వ్యవసాయరంగ నిపుణులు పేర్కొంటున్నారు. రైతులు తీవ్ర ఆందోళన, ఆవేదనలతో అతలాకుతలం అవుతున్న దశలో కేంద్ర ప్రభుత్వం 2004 నవంబర్ 18న డాక్టర్ స్వామినాథన్ నాయకత్వంలో ఏర్పాటు చేసిన కమిషన్ 2006లో తన నివేదికను సమర్పించింది. అందులో పంటలకు కనీస మద్దతు ధర విషయాన్ని ప్రస్తావిస్తూ.. సొంత పెట్టుబడి, దానిపై వడ్డీ, కౌలు, కుటుంబ శ్రమను కూడా పరిగణలోకి తీసుకుని, దానికి 50 శాతం అదనంగా కలిపి ఎంఎస్‌పీని నిర్ణయించాలని సిఫార్సు చేశారు. 2014 ఎన్నికలకు ముందు దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికలో ఈ అంశాన్ని ప్రముఖంగా పేర్కొనడమే కాకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పినా ఇంతవరకు ఎవ్వరూ అమలు చేయలేదు. ఈనెల 1న ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఈ అంశాన్ని ప్రముఖంగా పేర్కొన్నారు. వాస్తవ వ్యయానికి 50 శాతం కలిపి ఇస్తామని కేంద్రం ప్రకటించింది. అయితే ప్రస్తుతం నిర్ణయిస్తున్నట్టే ఎంఎస్‌పీని నిర్ణయిస్తే రైతులకు పెద్దగా మేలు జరగదని నిపుణులు వివరిస్తున్నారు. మద్దతు ధర నిర్ణయంలో కనీస ధర్మాన్ని పాటించాలని కోరుతున్నారు.

సిఫార్సు చేసిందెంత? ఇచ్చిందెంత?

సాగు వ్యయానికీ కనీస మద్దతు ధరకు అసలు పొంతన ఉండడం లేదు. ఖరీఫ్‌లో వరికి హెక్టార్‌కు సాగు వ్యయం రూ. 68 నుంచి 70 వేల రూపాయల మధ్య వ్యయం అవుతుందన్నది అధికారిక అంచనా. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో వరికి (సాధారణ రకం) క్వింటాల్‌కు 2016–17లో రూ. 2,672, 2017–18లో రూ. 2,799 మద్దతు ధర ఉండాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫార్సు చేసింది. అదే గ్రేడ్– ఏ రకానికైతే 2016–17కి రూ. 3,392, 2017–18కి రూ. 3,437 ఉండాలని కేంద్రానికి సూచించింది. అయితే కేంద్రం 2016–17లో సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ. 1,470, గ్రేడ్–ఏ రకానికి రూ. 1,510 నిర్ణయించింది. అదే 2017–18 సంవత్సరానికి పాత ధరకు రూ. 80 కలిపి నిర్ణయించింది. అంటే వాస్తవ సాగు వ్యయంలో సగం కూడా రైతుకు దక్కడం లేదు. ప్రస్తుతం అమలు చేస్తున్న తీరునే ప్రభుత్వం ప్రాతిపదికగా తీసుకుంటే బడ్జెట్‌లో ప్రకటించిన 50 శాతం కలిపినా రైతుకు పెద్దగా ఒరిగేది ఏమీ ఉండదు. మహా అయితే క్వింటాల్‌కు పెంపు రూ. 150కి లోపే ఉంటుంది.

రాష్ట్రాలకే స్వేచ్ఛ ఇవ్వాలి..

కనీస మద్దతు ధర నిర్ణయించుకునే అధికారం రాష్ట్రాలకే ఉండాలని చాలా కాలంగా రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా సగటు తీస్తే ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతోందని, ఈశాన్య రాష్ట్రాలలో అయ్యే ఖర్చుకు ఏపీలో అయ్యేదానికి అసలు పొంతన ఉండదని వాదిస్తున్నాయి. పెట్టుబడి, వాస్తవ వ్యయం, వడ్డీ, శ్రమ, కౌలును పరిగణలోకి తీసుకుని ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి వేర్వేరుగా కనీస మద్దతు ధరలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. ఉత్పత్తి వ్యయానికి ప్రస్తుతం ఇస్తున్న నిర్వచనం ప్రకారం ఏది ధర తక్కువగా ఉంటే దాన్నే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దానికి 50 శాతం కలపడం వల్ల ఏమాత్రం ఉపయోగం ఉండదన్నది నిపుణుల వాదన.

కౌలు రైతుల మద్దతు ఏదీ?

వాస్తవ సాగుదార్లుగా ఉన్న కౌలు రైతులకు ఈ విధానంతో ఎటువంటి ప్రయోజన ఉండదు. కౌలును పరిగణలోకి తీసుకుని ధరలను నిర్ణయించినప్పుడే వారికి మేలు జరుగుతుంది. కౌలు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు –మోడల్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ –2016ను తీసుకువస్తున్నట్టు నీతి ఆయోగ్ ప్రకటించినా అది ఏమాత్రం లబ్ధి చేకూర్చదని కౌలు రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. కౌలు రైతులకు పంట రుణాలు రావడం లేదని, అందువల్ల వారి పరిరక్షణకు ప్రభుత్వం ముందుకు రావాల్సి ఉందంటున్నారు.

పక్కాగా గనుల సర్వే

- డీజీపీఎస్ ద్వారా సర్వే చేయాలని గనుల శాఖ నిర్ణయం
- సర్వే ఖర్చు లీజుదారులదే

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాలో ఓ వ్యక్తి 650 ఎకరాల ముడి ఇనుప గనులను లీజుకు తీసుకున్నాడు. చాలాకాలం తవ్వకాలు జరిపాడు. ఇటీవల సర్వే చేయగా ఆయన తవ్వకాలు జరిపిన ప్రాంతం రిజర్వు ఫారెస్టు అని తేలింది. ప్రకాశం జిల్లాలో ఒక వ్యక్తి గ్రానైట్ నిక్షేపాల కోసం లీజుకు తీసుకొని కొంతకాలం తవ్వకాలు సాగించాడు. తర్వాత సర్వే జరిపించగా పక్క లీజుదారుడికి చెందిన ప్రాంతంలో ఈయన తవ్వకాలు జరిపినట్లు తేలింది. ఇలాంటి సంఘటనలు ఇటీవల ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం అన్ని ఖనిజ లీజు ప్రాంతాలను సర్వే చేసి, పక్కాగా సరిహద్దులను ఖరారు చేయాలని గనుల శాఖ నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేయడంతో డైమెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్) ద్వారా సర్వే చేపట్టేందుకు గనుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. గొలుసులతో కొలిపించి హద్దులు ఖరారు చేస్తే నంబరు రాళ్లు లేకపోవడం, సాంకేతిక కారణాల వల్ల తప్పులు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. అందువల్ల డీజీపీఎస్ ద్వారా సర్వే చేయించేందుకు భూగర్భ గనుల శాఖ కసరత్తు ఆరంభించింది.

రిజిస్టర్ చేసుకున్న సంస్థలకే అవకాశం

గనుల సరిహద్దుల నిర్ధారణ సర్వేకు రిజిస్టర్డ్ సంస్థలనే అనుమతిస్తారు. ఆసక్తి ఉన్న సంస్థలు తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని భూగర్భ గనులశాఖ సూచించింది. ఐదు సర్వే సంస్థలు గనుల శాఖలో ఎన్‌ప్యానల్‌మెంట్ చేయించుకున్నాయి. రాష్ట్రంలో దాదాపు 7,400 గనుల లీజులు ఉన్నాయి. అన్ని గనుల లీజుల సరిహద్దులను నిర్ధారించాల్సి ఉన్నందున ఎన్‌ప్యానల్‌మెంట్ సంస్థలతో చర్చించి సహాయ సంచాలకుల కార్యాలయాల పరిధిలోని వాటి వివరాలు ఇస్తారు. వీటి ప్రాతిపదికనే డీజీపీఎస్ సర్వేకి సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులను ఆహ్వానిస్తారు. లీజుల వారీగా సర్వేకు అయ్యే వ్యయాన్ని ఆయా లీజుదారులే చెల్లించాల్సి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

కొత్తనాటకానికి తెరతీసిన సీఎం చంద్రబాబు

నాన్ పొలిటికల్ జేఏసీ సదస్సులో సీపీఎం కార్యదర్శి పి మధు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): విభజన హామీల సాధనలో ఘోరంగా విఫలమైన సీఎం చంద్రబాబు బడ్జెట్ సందర్భంగా కొత్త నాటకానికి తెరతీశారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రానికి బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై బుధవారం సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తన ఎంపీల ద్వారా ప్రధానిని నిలదీయలేని చంద్రబాబు బడ్జెట్ సందర్భంగా కొత్త నాటకానికి తెరతీశారన్నారు. వామపక్షాలు తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను అరెస్టులతో ఆపలేరన్నారు. విభజన హామీలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పోరాటం చేయిస్తామన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లాది విష్ణు మాట్లాడుతూ


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లాది విష్ణు

చంద్రబాబు పార్లమెంట్ సాక్షిగా కొత్తడ్రామాకు తెరతీశారన్నారు. అధికారం కోసం చంద్రబాబు ఏ గడ్డితినడానికైనా సిద్ధపడతారని దుయ్యబట్టారు. నాలుగేళ్లుగా విభజన హామీలపై కేంద్రాన్ని ప్రశ్నించని బాబు ఇప్పుడు తన ఎంపీలచేత పార్లమెంట్‌లో ఆందోళన చేయిస్తున్నారన్నారు. చంద్రబాబు డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ చంద్రబాబు అసమర్థత వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. గురువారం జరిగే బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెంటనే విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- అడ్డగోలు కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలి
- ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణలో వైఎస్సార్‌సీపీ డిమాండ్
- పొలాల్లో టవర్లు నిర్మిస్తే నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల ధర్నా


ఏపీఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, రైతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అడ్డగోలు విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేసి, కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అన్నిచోట్లా విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గినా మన రాష్ట్రంలో మాత్రం ప్రైవేట్ సంస్థల నుంచి అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తూ, చార్జీలను తగ్గించకపోవడాన్ని తప్పు పట్టింది. యూనిట్ విద్యుత్ రూ.1.50కే దొరుకుతున్నా ప్రైవేట్ కంపెనీల నుంచి ప్రభుత్వం రూ.5 నుంచి రూ.6కు కొనుగోలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ నేత మల్లాది విష్ణు విమర్శించారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికి ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) ప్రతిపాదించిన వార్షిక ఆదాయ, అవసరాలు, రిటైల్ సరఫరా ధరలపై బుధవారం విజయవాడలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తరుపున మల్లాది విష్ణు పాల్గొన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ జి.భవానీప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏపీఈఆర్‌సీ స్వతంత్రంగా వ్యవహరించి కరెంటు చార్జీలను తగ్గించాలని విష్ణు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు భారంగా మారాయని పారిశ్రామిక, ప్రజాసంఘాలు ఏపీఆర్‌ఈసీ దృష్టికి తీసుకొచ్చాయి. కరెంటు చార్జీలు మిగిలిన రాష్ట్రాల కంటే మన దగ్గరే ఎక్కువగా ఉన్నాయంటూ గణాంకాలతో సహా 'ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' నివేదిక సమర్పించింది.

ఎన్నికల తర్వాత పెంపు?

వచ్చే ఏడాది ఎన్నికలుండటంతో ప్రభుత్వం ఈ ఏడాది విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూ ప్రజలను మోసం చేస్తోందని, ఎన్నికల తర్వాత భారీగా పెంచే అవకాశం ఉందని రైతు, ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. రాష్ట్రంలో విద్యుత్ రంగం అవినీతిలో కూరుకుపోయిందని, డబ్బులు ఇవ్వనిదే ఏ పనీ జరగడం లేదని భారతీయ కిసాన్ సంఘ్ ఆరోపించింది. తమ పొలాల్లో అనుమతి లేకుండా విద్యుత్ టవర్లు నిర్మించడమే కాకుండా నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ రైతులు ధర్నా చేశారు. ఈ విషయాన్ని పరిశీలిస్తానని భవానీప్రసాద్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ చార్జీలు పెంచకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. సమావేశంలో ఏపీఈఆర్‌సీ సభ్యులు పి.రఘు, పి.రామ్మోహన్, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ఎంఎం నాయక్ పాల్గొన్నారు.

అవార్డు కోసం రంగుల మాయ

- అడ్డదారులు తొక్కుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల అధికారులు
- పాత ఆసుపత్రుల భవనాలకు రంగులతో ముస్తాబు
- లోపల చూస్తే పొట్ట విప్పిన మేడిపండే

సాక్షి, అమరావతి

పురస్కారాలు రావాలంటే మన ప్రతిభను, పనితీరును నలుగురు మెచ్చుకోవాలి. కానీ, అదేమీ లేకుండానే అవార్డులు అందుకోవాలన్న యావతో కొందరు అడ్డదారులు తొక్కుతుండడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే'కాయకల్ప అవార్డు' కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని అధికారులు, సిబ్బంది వెగటు పుట్టించే చర్యలకు పాల్పడుతున్నారు. పైన పటారం లోన లొటారం అన్నట్లుగా శిథిలావస్థకు చేరిన ఆసుపత్రుల భవనాలకు ముందు వైపు రంగులేసి అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తులు పంపిస్తున్నారు. అధికారుల నిర్వాకం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముఖద్వారం వైపు భారీగా రంగులేశారు. మెరిసిపోయేలా చేశారు. కానీ, లోపలికి వెళ్లి చూస్తే పొట్ట విప్పిన మేడిపండు కనిపిస్తోంది. గోడలన్నీ ఎక్కడికక్కడ బూజుపట్టి, పెచ్చులూడి, మురికి కంపు కొడుతున్నాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరిధిలోని పెంటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సైతం ఇలాగే రంగులేసి మాయ చేశారు. మొన్నటి వరకూ ఆయా ఆసుపత్రులు మట్టికొట్టుకుపోయి ఉండేవి. కానీ, అవార్డులకు దరఖాస్తు తేదీ దగ్గరకొచ్చేసరికి ఆదరాబాదరా రంగులేశారు. ఆ ఫొటోలను కేంద్రానికి పంపించారు.



అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రంగులు వేసి ముస్తాబు


అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పెచ్చులూడుతున్న దృశ్యం

కాయకల్ప అవార్డులంటే?

కేంద్ర ప్రభుత్వం 2015లో కాయకల్ప అవార్డులను ప్రవేశపెట్టింది. దీని ప్రధాన ఉద్దేశం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతను ప్రోత్సహించడం. రోగులకు ఆధునిక వసతులు, సౌకర్యాలు కల్పించిన ఆసుపత్రులకు కాయకల్ప అవార్డులు అందజేస్తారు. ప్రతి రాష్ట్రంలో ఒక ఉత్తమ జిల్లా ఆసుపత్రి, రెండు ఉత్తమ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రతి జిల్లాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేస్తారు. ఇందులో ఉత్తమ జిల్లా ఆసుపత్రికి రూ.50 లక్షలు, రెండో స్థానం పొందిన ఆసుపత్రికి రూ.20 లక్షలు ఇస్తారు. మొదటి స్థానంలో నిలిచిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.15 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన కేంద్రానికి రూ.10 లక్షలు అందజేస్తారు. ఉత్తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2 లక్షలు ఇస్తారు. ఈ సొమ్ములో కొంతభాగం సిబ్బందికి, మరికొంత ఆసుపత్రి అభివృద్ధికి కేటాయిస్తారు.

ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: చాలా రోజుల తరువాత నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. దీని ఫలితంగా తమిళనాడు, పాండిచేరిలతో పాటు రాయలసీమలోనూ కొన్నిచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. చిత్తూరు జిల్లాపై ద్రోణి ప్రభావంతో వానలు పడుతున్నాయి. అల్పపీడన ద్రోణి కొనసాగడం, పడమర నుంచి తూర్పు దిశగా (కర్నాటక నుంచి బీహార్ వరకు) పశ్చిమ ఆటంకాలు పయనించడం అకాల వర్షాలకు కారణమని వాతావరణశాఖ రిటైర్డ్ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ చెప్పారు. ఈ వానలను వింటర్ రెయిన్స్‌గా వ్యవహరిస్తారన్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అప్పుడప్పుడు ఇలాంటి వాతావరణం ఏర్పడి తేలికపాటి వర్షాలకు ఆస్కారమేర్పడుతుందని ఆయన వివరించారు. వీటి ప్రభావం ఒకటి రెండు రోజులపాటే ఉంటుందన్నారు.

సీమకు తేలికపాటి వర్ష సూచన

రానున్న 24 గంటల్లో రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు, దక్షిణ కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు కురవవచ్చని తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆకాశంలో మేఘాలేర్పడడంతో రాయలసీమలో రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. సాధారణం కంటే 2–3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. మరోవైపు కొద్దిరోజులుగా అసాధారణంగా (4–8 డిగ్రీలు తక్కువగా) నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పుడిప్పుడే స్వల్పంగా పెరుగుతున్నాయి.

బాలుడిని ఢీకొట్టిన ఎమ్మెల్యే ఆమంచి వాహనం

చల్లారెడ్డిపాలెం(వేటపాలెం): రోడ్డు దాటుతున్న బాలుడిని వేగంగా వస్తున్న చీరాల ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వాహనం ఢీకొన్న ఘటన బుధవారం రాత్రి ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీలోని జబ్బార్‌కాలనీలో జరిగింది. పొట్టిసుబ్బయ్యపాలేనికి చెందిన 13 సంవత్సరాల బాలుడు బుధవారం రాత్రి జబ్బార్‌కాలనీలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఆమంచి కృష్ణమోహన్ తన క్రిస్టల్ సీ ఫుడ్స్ కంపెనీ నుంచి వాహనంలో వస్తున్నారు. అయితే రోడ్డు దాటుతున్న బాలుడిని ఎమ్మెల్యే వాహనం డ్రైవర్ గమనించకుండా వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కారు దిగిన ఎమ్మెల్యే బాలుడిని చికిత్సకోసం తన వాహనంలోనే చీరాలకు తీసుకెళ్లారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జే.వి.ఆర్కే రాజశేఖర్ బుధవారం తెలిపారు. రైలు నెంబరు (07007) సికింద్రాబాద్–దర్భంగా ప్రత్యేకరైలు ఏప్రిల్ 3,7,10,14,17,21,24,28, మే 1,5,8,12, 15,19,22,26,29, జూన్ 2,5,9,12,16,19,23,26,30 తేదీలలో రాత్రి 10 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి రెండో రోజు మధ్యాహ్నం 1.45కు దర్భంగా చేరుతుంది. రైలు నెంబరు (07008) దర్భంగా–సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 6,10,13,17,20,24,27, మే 1,4,8,11,15,18,22,25,29, జూన్ 1,5,8,12,15,19,22,26,29 జూలై 3వ తేదీల్లో ఉదయం 5 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. రైలునెంబరు (07005) హైదరాబాద్ – రక్జుల్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 5,12,19,26, మే 3,10,17,24,31, జూన్ 7,14,21,28 తేదీల్లో రాత్రి 9.30కి హైదరాబాద్‌లో బయల్దేరి రెండోరోజు సాయంత్రం 5.30కి రక్జుల్ చేరుతుంది. రైలునెంబరు (07006) రక్జుల్–హైదరాబాద్ ప్రత్యేకరైలు ఏప్రిల్ 8,15,22,29, మే 6,13,20,27, జూన్ 3,10,17,24 , జూలై 1వ తేదీలలో రాత్రి 1.30కి రక్జుల్‌లో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.15కి హైదరాబాద్ చేరుతుంది. అలాగే, రైలు నెంబరు (07117) హైదరాబాద్–ఎర్నాకుళం ప్రత్యేకరైలు ఏప్రిల్ 4,11,18,25, మే 2,9,16,23,30, జూన్ 6,13,20,27 తేదీలలో మధ్యాహ్నం 12.50కి హైదరాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 5.30కి ఎర్నాకుళం చేరుతుంది. నెంబరు (07118) ఎర్నాకుళం–హైదరాబాద్ ప్రత్యేకరైలు ఏప్రిల్ 5, 12,19,26, మే 3,10,17,24,31, జూన్ 7,14,21,28వ తేదీల్లో రాత్రి 9.45కి ఎర్నాకుళంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.55కి హైదరాబాద్ చేరుతుంది.

మంగంపేట బెరైటీస్‌పై కమిటీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా మంగంపేట బెరైటీస్ గనుల్లో వ్యర్థాల డంపింగ్‌కు సంబంధించి ఏర్పడిన స్థల సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ కమిటీని ఏర్పాటు చేసింది. బెరైటీస్ గనుల దక్షిణ ప్రాంతంలో నాణ్యమైన బెరైటీస్ ఖనిజం లేదని జియాలజికల్ సర్వే తేల్చిందని ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ ప్రభుత్వానికి తెలిపారు. అందువల్ల ఇక్కడ పరిశీలించి ఖనిజం లేదని తేలితే డంప్‌నకు వినియోగించుకునేందుకు వీలుగా సైంటిఫిక్ కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించాలని ఎండీ కోరారు. ఈ నేపథ్యంలో దీనిపై పరిశీలించి సిఫార్సు చేయడం కోసం జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, భూగర్భ గనుల శాఖ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ప్రతినిధులతో సైంటిఫిక్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

హెచ్‌టీ పత్తి విత్తనాల కంపెనీలకు తాఖీదులు

కావేరీ, నూజివీడు సీడ్స్‌కు షోకాజ్ నోటీసులు

సాక్షి, అమరావతి: అనుమతి లేని హెచ్‌టీ(కలుపు నివారించే– హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలను చట్టవిరుద్ధంగా విక్రయించిన రెండు ప్రముఖ విత్తన సంస్థలు కావేరీ సీడ్స్, నూజివీడు సీడ్స్‌లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ తాఖీదులు ఇచ్చింది. ఈ పని చేసినందుకు ఆయా సంస్థల లైసెన్సులు ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలని పేర్కొంది. కలుపు మొక్కలను నివారించే విత్తనాలుగా పరిగణించే హెచ్‌టీ కాటన్ హైబ్రీడ్ విత్తనాలను పెద్దఎత్తున విక్రయించినట్టు దక్షిణాసియా బయోటెక్నాలజీ సెంటర్ (ఎస్ఏబీసీ) కేంద్ర పర్యావరణ, అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదిక ఆధారంగా విచారణ జరిపిన రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆ రెండు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో జన్యుమార్పిడి పత్తి విత్తనాలను మాత్రమే విక్రయించాల్సి ఉండగా ఈ సంస్థలు నిబంధనలను ఉల్లంఘించి 4 లక్షల ప్యాకెట్లను విక్రయించాయి. బీటీ కాటన్ విత్తనాలను ఒక్కో ప్యాకెట్ రూ.800కు రైతులకు అమ్మాల్సి ఉండగా, ఈ సంస్థలు హెచ్‌టీ కాటన్ విత్తనాలు ఒక్కో ప్యాకెట్‌ను రూ.1350కు విక్రయించాయి. మూడేళ్లుగా రాష్ట్రంలో ఈ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం జెనిటిక్ ఇంజినీరింగ్ అప్రూవల్ కమిటీ (జీఇఏసీ) అనుమతించిన తర్వాతే జన్యుమార్పిడి (జీఎం) విత్తనాలను దేశంలో విక్రయించాలి. జీఇఏసీ అనుమతికి ముందు రెండు దశల్లో బయో సంరక్షణ పరిశోధనలు జరగాలి. ఈ విత్తనాల వల్ల పర్యావరణానికి ఎటువంటి ముప్పు లేదని ఈ ప్రయోగాల్లో తేలిన తర్వాత జీఎం విత్తనాలను మార్కెట్‌లోకి విడుదల చేయాలి. అందుకు విరుద్ధంగా– కలుపు మొక్కల్ని నివారించే (హెర్బిసైడ్ టాలరెంట్) హెచ్‌టీ విత్తనాలను రాష్ట్రంతో సహా దేశంలోని వివిధ ప్రాంతాలలో 35 లక్షల ప్యాకెట్లను విక్రయించారు. సుమారు రూ.472 కోట్ల వ్యాపారం జరిగింది. బిగ్‌బాల్, వీడ్‌గార్డ్, వీడ్స్‌గార్డ్స్, బాల్‌గార్డ్, ఆర్‌కాట్, క్రైసిల్ తదితర పేర్లతో వీటిని అమ్మి విత్తన కంపెనీలు సొమ్ము చేసుకున్నాయి.

మా సమస్యలు పరిష్కరించండి

సర్కారుకు ఫార్మా డి అభ్యర్థుల వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వేల మంది ఫార్మా డి కోర్సులు పూర్తి చేసి తీవ్ర నిరాశా, నిస్పృహల్లో ఉన్నారని, తమను తక్షణమే ఆదుకోవాలని ఫార్మా డి అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మా డి అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యవిద్యా సంచాలకులకు వారు బుధవారం వినతిపత్రం సమర్పించారు. స్వయానా రాష్ట్రప్రభుత్వమే ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మా కళాశాలలకు అనుమతిచ్చిందని, దీంతో అభ్యర్థులు లక్షలు వెచ్చించి చదివితే ఇప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో ఏ ఉద్యోగం చేయాలో వివరం లేకపోతే తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావట్లేదని వాపోయారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి తమ సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించడం హర్షదాయకమన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్ల డిమాండ్లపై కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విద్యాసంస్థలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్ల డిమాండ్ల పరిశీలనకు ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సీబీఎస్ వెంకటరమణ, మాజీ వీసీలు ప్రొఫెసర్ అల్లం అప్పారావు, ప్రొఫెసర్ ఎన్.ప్రభాకర్‌రావు సభ్యులుగా, ఉన్నత విద్యామండలి కార్యదర్శి వరదరాజన్ కన్వీనర్‌గా ఈ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ నెలరోజుల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.

వేగం తగ్గిన విమానయానం

- 9 నెలల్లో 5 శాతమే పెరిగిన ప్రయాణికుల సంఖ్య
- జాతీయ సగటుతో పోలిస్తే వెనుకంజలో రాష్ట్రం
- రాజమండ్రిలో తగ్గిన ప్రయాణికుల సంఖ్య
- విజయవాడ నుంచి ప్రారంభం కాని అంతర్జాతీయ సర్వీసులు
- ఎయిర్‌కోస్టా మూతపడటం కూడా కారణమంటున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత వేగంగా దూసుకుపోయిన రాష్ట్ర విమానయాన రంగం గతేడాది నుంచి నెమ్మదిస్తూ వస్తోంది. అంతకుముందు రెండేళ్లల్లో మాత్రం జాతీయ సగటు కంటే భారీ వృద్ధిరేటు నమోదు చేసింది. ఈ ఏడాది జాతీయ సగటు కంటే వెనుకబడిపోయింది. ఈ ఆర్థిక ఏడాది (2017–18) డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రాష్ట్ర విమాన ప్రయాణికుల సంఖ్యలో కేవలం 5.08 శాతం వృద్ధి మాత్రమే నమోదైంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా ప్రయాణికుల సంఖ్యలో వృద్ధి 15.2%గా ఉంది. 2016–17లో జాతీయ ప్రయాణికుల సంఖ్యలో 19.2 శాతం వృద్ధిరేటు ఉంటే మన రాష్ట్రంలో 39.62 శాతం వృద్ధి చోటు చేసుకుంది. కానీ ఈ ఏడాది రాష్ట్రంలో చాలా విమానాశ్రయాల వృద్ధిరేటు ఏక సంఖ్యకు పరిమితం కావడమే కాకుండా రాజమండ్రి వంటి చోట్ల ప్రయాణికుల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రం నుంచి 29,34,306 మంది విమాన ప్రయాణం చేసినట్లు పౌరవిమానయాన మంత్రిత్వశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతకుముందు రెండేళ్లల్లో ప్రయాణికుల సంఖ్య 2016–17లో 27,92,360, 2015–16లో 19,99,868గా ఉంది.

కడప అప్.. రాజమండ్రి డౌన్


కడప విమానాశ్రయాన్ని ఉడాన్ పథకంలోకి చేర్చడంతో ప్రయాణికుల సంఖ్యలో భారీ వృద్ధి నమోదవుతోంది. 2016–17లో తొమ్మిది నెలల కాలానికి కడప నుంచి కేవలం 3,167 మంది ప్రయాణిస్తే ఈ ఏడాది 662 శాతం పెరిగి 24,142 మందికి చేరింది. కానీ ఇదే సమయంలో రాజమండ్రి నుంచి ప్రయాణించే వారి సంఖ్య 9.6 శాతం తగ్గింది. రాష్ట్రంలో అత్యధికంగా ప్రయాణించే విశాఖ విమానాశ్రయంలో కూడా వృద్ధిరేటు 2.9 శాతానికి మాత్రమే పరిమితమైంది. విజయవాడ, తిరుపతిల్లో వృద్ధిరేటు 9 శాతమే నమోదైంది. ఎయిర్‌కోస్టా విమానయాన సంస్థ మూతపడటం వృద్ధిరేటు నెమ్మదించడానికి కారణమని అధికారులు చెబుతున్నారు.

విమానాల సంఖ్యదీ అదే దారి

ఈ ఏడాది కొత్త విమాన సర్వీసులను ఆకర్షించడంలో రాష్ట్రం విఫలమైందని గణాంకాలు చెబుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కేవలం 744 సర్వీసులు (2.21%) మాత్రమే పెరిగాయి. 2016–17 ఆర్థిక ఏడాది తొమ్మిది నెలల కాలానికి రాష్ట్రం నుంచి మొత్తం 33,559 విమానాలు ఎగిరి దిగగా ఈ ఏడాది 34,303 విమానాలు ఎగిరి దిగాయి. ఈ కాలంలో విశాఖ, తిరుపతి నుంచి విమాన సర్వీసులు తగ్గడం గమనార్హం. విశాఖ నుంచి అత్యధికంగా 14,156 విమానాలు ఎగిరి దిగితే, 8,693తో విజయవాడ రెండో స్థానంలో ఉంది. ఈ తొమ్మిది నెలల కాలంలో కడపకు 561 విమానాలు వచ్చి వెళ్లాయి.

ప్రయాణికుల సంఖ్య. ఆర్థిక ఏడాది డిసెంబర్ నాటికి

విమానాశ్రయం	2017-18	2016-17	2015-16
విశాఖపట్నం	18,09,203	17,57,520	12,84,819
విజయవాడ	5,23,404	4,69,892	2,80,648
తిరుపతి	4,02,556	3,68,221	2,68,989
రాజమండ్రి	1,75,001	1,93,560	1,63,675
కడప	24,142	3,167	1,737
మొత్తం	29,34,306	27,92,360	19,99,868



భారీగా పెరిగిన విదేశీ ప్రయాణికులు

రాష్ట్రానికి వచ్చే విదేశీ ప్రయాణీకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం విదేశాలకు ఒక్క విశాఖపట్నం నుంచే విమానాలు నడుస్తున్నాయి. ఈ ఆర్థిక ఏడాది తొమ్మిది నెలల కాలానికి విశాఖ నుంచి ప్రయాణించిన విదేశీ ప్రయాణికుల సంఖ్యలో 35 శాతం పెరుగుదల నమోదైంది. ఈ ఏడాది ఇప్పటివరకు 96,544 మంది ప్రయాణించగా గతేడాది ఇదే కాలానికి ఈ సంఖ్య 71,429 మాత్రమే. విజయవాడ, తిరుపతిలకు అంతర్జాతీయ విమానాశ్రయ హోదా ప్రకటించినా ఇంకా విదేశాలకు సర్వీసులు ప్రారంభం కాలేదు. విజయవాడ నుంచి మరో రెండు, మూడు నెలల్లో అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభించడానికి పనులు వేగంగా నడుస్తున్నాయి.

ఏపీకి మరో మొండిచెయ్యి



- మెడికల్ పీజీ వైద్య సీట్ల పెంపులో అన్యాయం
- ప్రభుత్వ కళాశాలల్లో ఒక్క సీటూ రాలేదు
- సర్కారు నిర్లక్ష్యం, మౌలిక వసతుల్లో లోపమే కారణం
- నారాయణ, జీఎస్ఎల్, కిమ్స్‌లకు దక్కిన సీట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలకూ కేంద్రం ఒక్కటంటే ఒక్క పీజీ వైద్య సీటు కూడా అదనంగా ఇవ్వలేదు. తాజాగా భారత వైద్య మండలి(ఎంసీఐ) దేశవ్యాప్తంగా 63 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ) సీట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో మన రాష్ట్రానికి మొండిచెయ్యే మిగిలింది. ఏపీలో మొత్తం 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉండగా ఒక్క కళాశాలకు కూడా పీజీ సీట్లు అదనంగా పెంచలేదు. ఏ విభాగంలోనూ సీట్లు రాలేదు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో గాంధీ వైద్య కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలకు సీట్లు కేటాయించారు. కర్ణాటక, తమిళనాడుల్లోనూ ప్రభుత్వ వైద్య కళాశాలలకు సీట్లు దక్కాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీజీ సీట్ల పెంపుపై దృష్టి సారించకపోవడం, సర్కారు కాలేజీల్లో మౌలిక వసతులు లేకపోవడం వల్లే ఈ అన్యాయం జరిగిందని నిపుణులు చెబుతున్నారు.

ప్రైవేటు కళాశాలలకు సీట్లు

ఏపీలో ప్రభుత్వ వైద్య కళాశాలలకు మెడికల్ పీజీ సీట్లు రాకపోగా ప్రైవేట్ కాలేజీలు మాత్రం సీట్లు దక్కించుకున్నాయి. గుంటూరులోని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు ఎండీ జనరల్ మెడిసిన్ విభాగంలో 10 నుంచి 14 సీట్లు రానున్నాయి. నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలకు రెస్పిరేటరీ మెడిసిన్ విభాగంలో 3 నుంచి 5, ఎంఎస్ గైనకాలజీలో 7 నుంచి 13, ఎండీ అనస్థీషియాలజీలో 8 నుంచి 12 సీట్లు కేటాయిస్తున్నట్లు ఎంసీఐ వెల్లడించింది. అలాగే అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు గైనకాలజీలో 3 నుంచి 5, అనస్థీషియాలజీలో 6 నుంచి 11, సైకియాట్రీలో 2 సీట్లు, రాజమండ్రిలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు ఎంఎస్ జనరల్ సర్జరీ విభాగంలో 7 నుంచి 14 సీట్లు ఇవ్వనున్నట్లు పేర్కొంది.

ధ్రువపత్రాలు సమర్పించండి

తాజాగా పీజీ వైద్య సీట్లు పొందిన కళాశాలలు సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని ఎంసీఐ కోరింది. పెరిగిన సీట్లు ఈ ఏడాది నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది. ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన సీట్లలో 50 శాతం సీట్లను నేషనల్ పూల్‌కు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. సీట్లు వచ్చిన ప్రైవేట్ కాలేజీలు నిర్దేశిత గడువులోగా బ్యాంకు గ్యారంటీలు చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటికే పీజీ వైద్యసీట్ల ఫలితాలు వెల్లడయ్యాయి. మరో వారంలో రాష్ట్ర ర్యాంకులు ప్రకటించనున్నారు. ఈ పరిస్థితుల్లో మన రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు పెరగకపోవడం దారుణమని వైద్య విద్యార్థులు వాపోతున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు, పక్కన వైఎస్సార్‌సీపీ నేతలు

సొంత లాభం కోసమే చంద్రబాబు తపన

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబటి రాంబాబు మండిపాటు
- సీఎం వైఖరి వల్లే రాష్ట్రానికి కేంద్రం అన్యాయం
- పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీల నాటకాలు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత లాభం కోసం రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. ఆయన బుధవారం గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే కేంద్రానికి లెక్కలేకుండా పోయిందని ధ్వజమెత్తారు. దీనికి కారణం సీఎం చంద్రబాబేనని ఆరోపించారు. విభజన చట్టంలోని హామీలను సాధించాలన్న చిత్తశుద్ధి, పట్టుదల చంద్రబాబులో లేవన్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీని దెబ్బ తీసేందుకు, స్వప్రయోజనాల కోసమే ఆయన తన శక్తియుక్తులను వినియోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో సరికొత్త డ్రామాకు టీడీపీ తెరలేపిందని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ రాజ్యసభ, లోక్‌సభలో టీడీపీ ఎంపీలు ఆందోళన చేయడం అంతా నాటకమన్నారు. ఏ బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగలేదని అంబటి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంపై చంద్రబాబు ఒత్తిడి తీసుకురాకుండా కాలయాపన చేశారని దుయ్యబట్టారు.

కోడెల కుట్రతోనే 9,632 ఓట్ల తొలగింపు

సత్తెనపల్లి పట్టణంలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు, ఆయన తనయుడు కోడెల శివరాం, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు కలిసి కుట్ర చేసి 9,632 ఓట్లను తొలగించారని అంబటి రాంబాబు ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో పట్టణంలో టీడీపీకి మెజార్టీ రాదనే అభిప్రాయంతోనే ఓట్లు తొలగించారనే సమాచారం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌ను కలిసి ఈ విషయం వివరించామని తెలిపారు. ఓటు తొలగించాలంటే నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారన్నారు. ఒక్కరికి కూడా నోటీసు ఇవ్వకుండా 9,632 ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. విచక్షణారహితంగా ఓట్లు తొలగించిన కమిషనర్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని ఏపీ సీఈవో సిసోడియాను ఈ నెల 9న కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. శ్రీనివాసరావుపై చర్యలు తీసుకునేవరకూ పోరాడతామన్నారు.

ప్రాక్టికల్స్‌లోనూ కాపీ!

- ఎగ్జామినర్ల తీరుపై మెరిట్ విద్యార్థుల ఆవేదన
- చిట్టీలు ఇచ్చి రాసుకోమంటున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా విద్యార్థులు, ఎగ్జామినర్లకు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ కాపీలకు తెరపడటం లేదు. కొన్ని కేంద్రాల్లో కాపీల తతంగం యథేచ్ఛగా సాగుతోంది. పరీక్ష సిబ్బంది, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల కుమ్మక్కుతో వ్యవహారం సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

చిట్టీలు ఇచ్చి రాసుకోమన్న సిబ్బంది

బుధవారం విశాఖ జిల్లా యలమంచిలి సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలు మూడున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని విద్యార్థులు 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షలు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభించారన్నారు. గంటన్నరలో మొక్కుబడిగా నిర్వహించి విద్యార్థులకు చిట్టీలు ఇచ్చి రాసుకోవాలని కొందరు సిబ్బంది ప్రోత్సహించినట్లు తెలిపారు. అన్ని ప్రయోగాలు కష్టపడి నేర్చుకొని పరీక్షలకు హాజరయ్యామని, అందరి కంటే ముందు ఉండాల్సిన తమకు దీనివల్ల నష్టం జరుగుతోందని మెరిట్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరీక్ష ఆలస్యంగా నిర్వహించడంతో ఆకలితో అలమటించామని తెలిపారు. నక్కపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో కూడా 9 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్షను రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభించినట్లు తెలిసింది.

బాబు వైఫల్యంతోనే: రఘువీరా

సాక్షి, అమరావతి: బడ్జెట్‌లో జరిగిన అన్యాయానికి సీఎం చంద్రబాబు వైఫల్యమే కారణమని పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి మండిపడ్డారు. ప్రజా పోరాటాల ద్వారానే రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉందని బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదాతోపాటు విభజన చట్టంలోని అంశాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలను ప్రధాని మోదీ, బాబు నమ్మించి మోసం చేశారన్నారు. విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం చేపడుతున్న బంద్‌కు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దివంగత నాయకులు పీవీ నరసింహారావు, సంజీవరెడ్డి తదితరులపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర సమస్యలను పక్కదోవ పట్టించేందుకేనని ప్రజలు గ్రహించాలన్నారు.


పథకం ప్రకారమే మత్స్యకారులపై దాడి

- అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే దాడి: మోపిదేవి
- ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి
- ఎస్టీల జాబితాలో చేరుస్తామని చంద్రబాబే హామీ ఇచ్చారు
- ఆ విషయం గుర్తు చేస్తే తాట తీస్తానని సీఎం అనటం ఏమిటి?

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తమను ఎస్టీల జాబితాలో చేర్చాలని శ్రీకాకుళం జిల్లాలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మత్స్యకారులపై పథకం ప్రకారమే దాడి జరిగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివాసీలకు ఆర్థిక వనరులు సమకూర్చి దాడికి పురిగొల్పారని ఆరోపించారు. ఎస్టీల్లో చేర్చాలన్న మత్స్యకారుల డిమాండ్‌ను పక్కదారి పట్టించేందుకే శిబిరంపై దాడి చేశారన్నారు. దీనిపై తక్షణమే జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ముఖ్యమంత్రే 'తాట తీస్తా' అనటం ఏమిటి?

అధికారంలోకి రాగానే మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని గత ఎన్నికల్లో సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని మోపిదేవి గుర్తు చేశారు. సీఎం హామీని నెరవేర్చాలని మత్స్యకారులు శాంతియుత పద్ధతిలో ఆందోళన చేస్తున్నారని చెప్పారు. హామీని అమలు చేయాలని కోరితే సాక్షాత్తూ ముఖ్యమంత్రే 'తాట తీస్తా' అంటూ బెదిరించటం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర కులాలకు చెందిన నాయకులను చంద్రబాబు ఇలా బెదిరించగలరా? అని ప్రశ్నించారు. కాపులను బీసీల్లో, బోయలను ఎస్టీల్లో జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు మత్స్యకారుల విషయంలో వివక్ష చూపటం సరికాదన్నారు. మత్స్యకారులను ఎస్టీల జాబితాలో చేర్చాలన్న డిమాండ్ గ్రామస్థాయికి చేరుకుందని, దీన్ని అమలు చేయకపోతే బాబుకు వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపిదేవి వెంకటరమణ

కొండకోనల్లో ఉండే వారికి వాహనాలు ఎక్కడివి?

మత్స్యకారులపై అధికార పార్టీకి చెందిన నాయకులే ఆదివాసీలతో దాడి చేయించారని మోపిదేవి పేర్కొన్నారు. కొండ కోనల్లో ఉండే వారికి 150 వాహనాలు సమకూర్చారని, దాడిలో ఐదు వేల మందిపైగా పాల్గొన్నారన్నారు. ఇంత పెద్దసంఖ్యలో ఆదివాసీలు దాడికి దిగటం వెనుక కచ్చితంగా కుట్ర దాగుందని చెప్పారు. మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేయడం, రోడ్లెక్కకుండా చేసేందుకే దాడి చేయించారన్నారు. మత్స్యకారులపై దాడి ఘటనపై విచారణ జరిపించాలని సమాఖ్య అధ్యక్షుడు నడికుదిటి నరసింహారావు డిమాండ్ చేశారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌పై

డైరెక్టర్ల తిరుగుబాటు

- ఆనంద సూర్య ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు
- సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు



టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన డైరెక్టర్లు, జిల్లా సమన్వయకర్తలు

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు): రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనందసూర్యపై కార్పొరేషన్ డైరెక్టర్లు తిరుగుబాటు చేశారు. ఆయనవన్నీ ఏకపక్ష నిర్ణయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. బుధవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో కార్పొరేషన్ డైరెక్టర్లు, పలువురు నేతలు సమావేశమయ్యారు. ఆనంద్‌సూర్య పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పార్టీ అధిష్టానం పేరుతో ఇష్టానుసారంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎవరికీ తెలియకుండా గతంలో 13 జిల్లాల కో–ఆర్డినేటర్లు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ల వ్యవస్థను రద్దు చేశారని ఆగ్రహం వ్యక్త చేశారు. డైరెక్టర్లతో సంబంధం లేకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంతోపాటు బోర్డు మీటింగ్‌లు జరపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్‌లో ప్రభుత్వానికి సంబంధించిన నామినేటెడ్ పదవులను తనకు కావాల్సిన వారికి ఇస్తున్నారని, పార్టీతో సంబంధం ఉన్న వారికి ఇవ్వడం లేదని విమర్శించారు. ఆనంద్‌సూర్య చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఏడు నెలల నుంచి లబ్ధిదారులకు అందాల్సిన రుణాలు అందడం లేదని, ఇలాగే వ్యవహరిస్తే బ్రాహ్మణుల ఓట్లు పార్టీకి దూరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలను అడ్డుకుని కార్పొరేషన్‌ను కాపాడాలని కోరుతూ ఒక తీర్మానం చేసి, ముఖ్యమంత్రికి పంపారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద సూర్యను వెంటనే పదవి నుంచి తొలగించాలని కార్పొరేషన్‌లో నలుగురు డైరెక్టర్లు డిమాండ్ చేశారు.

డీఆర్‌డీఈలో 7 జేఆర్‌ఎఫ్ ఖాళీలు

గ్వాలియర్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్(డీఆర్‌డీఈ).. 7 జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ/ఫార్మకాలజీ/జువాలజీ(ఎంటమాలజీ)/ కెమిస్ట్రీ(ఆర్గానిక్/ఇనార్గానిక్/అనలిటికల్/ఫిజికల్) లో ఎంఎస్సీ ప్రథమశ్రేణి ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో నెట్ క్వాలిఫై అయి ఉండాలి. దరఖాస్తు గడువు ముగిసే నాటికి వయసు 28 ఏళ్లు మించకూడదు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన ముప్పై రోజుల్లోపు దరఖాస్తు చేరాలి. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.drdo.gov.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com


సివిల్స్ 2018

నోటిఫికేషన్ విడుదల



'సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2018'కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ అత్యున్నత అఖిల భారత సర్వీసుల్లో చేరాలనుకునే వారికి ఇదొక చక్కటి అవకాశం. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెన్ సర్వీస్) వంటి 24 ప్రతిష్టాత్మక పౌర సేవ ఉద్యోగాల్లో చేరాలనుకునే అభ్యర్థులు రాయాల్సిన పరీక్ష. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) నోటిఫికేషన్‌తో పాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) పరీక్షకూ యూపీఎస్సీ ప్రకటన వెలువరించింది.

- **ఖాళీల సంఖ్య:** సివిల్ సర్వీసెస్ పరీక్ష ద్వారా సుమారు 782 ఖాళీలు;
- ఐఎఫ్ఎస్ ద్వారా 110 ఖాళీలు భర్తీ చేస్తారు.
- **అర్హత:** సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఐఎఫ్ఎస్‌కు యానిమల్ హస్బెండరీ, వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో ఏదైనా ఒక సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ లేదా అగ్రికల్చర్, ఫారెస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా ఇంజనీరింగ్ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2018 ఆగస్టు 1 నాటికి అభ్యర్థి వయసు 21 – 32 సంవత్సరాల మధ్య ఉండాలి. (1986 ఆగస్టు 2 – 1997 ఆగస్టు 1 మధ్య జన్మించి ఉండాలి). ఓబీసీలకు మరో మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. ఇతర రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులకు సడలింపు వర్తిస్తుంది. అలాగే..జనరల్ కేటగిరీ అభ్యర్థులు నిర్దిష్ట వయోపరిమితి వ్యవధిలో ఆరుసార్లు మాత్రమే పరీక్ష రాసేందుకు వీలుంది. ఓబీసీ కేటగిరీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు పరీక్షకు హాజరు కావచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు గరిష్ట వయోపరిమితికి లోబడి ఎన్నిసార్లైనా పరీక్ష రాసుకోవచ్చు.
- **ఎంపిక:** ఎంపికలో భాగంగా ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ప్రతిదశలోనూ వడపోత ఉంటుంది.
- **ప్రిలిమినరీ పరీక్ష:** సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమ్స్. ఇది ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లతో 400 మార్కులకు ఉంటుంది. ప్రతి పేపర్‌కు 200 మార్కులు. నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.33 మార్కులకోత ఉంటుంది. ప్రిలిమ్స్‌లో నిర్దేశించిన కనీస అర్హత మార్కులు పొందిన అభ్యర్థులను, మొత్తం ఉన్న ఖాళీల సంఖ్యకు 1:12 లేదా 1:13 (అంటే ఒక్కో పోస్ట్‌కు 12 లేదా 13) నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ కేవలం అర్హత పరీక్ష మాత్రమే. పేపర్ -2 (ఆప్టిట్యూడ్ టెస్ట్)లో 33 శాతం మార్కులు పొంది, పేపర్ -1 (జనరల్ స్టడీస్)లో సాధించిన మార్కుల ఆధారంగా మెయిన్‌కు అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.
- ఇక మెయిన్ పరీక్షలో మొత్తం తొమ్మిది పేపర్లు ఉంటాయి. వీటిల్లో పేపర్–ఎ (రాజ్యాంగంలో ఎనిమిదో షెడ్యూల్ ఉన్న భాషల్లో నుంచి ఏదేని ఒక లాంగ్వేజ్ టెస్ట్), పేపర్–బి (ఇంగ్లిష్)లు భాష పరీక్షలు. ఇవి అర్హత పరీక్షలు మాత్రమే. వీటితోపాటు మెయిన్‌లో ఏడు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు చొప్పున మొత్తం 1750 మార్కులకు మెయిన్ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే ఖాళీల సంఖ్యకు 1:2 నిష్పత్తిలో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్‌కు ఆహ్వానిస్తారు. ఇది 275 మార్కులు ఉంటుంది. మొత్తంగా 2025 మార్కులకు పొందే మార్కుల ద్వారా తుది ఎంపిక జరుగుతంది.
- **ఫీజు:** రూ. 100 (మహిళా అభ్యర్థులు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు ఫీజు లేదు).
- **ఆన్‌లైన్ దరఖాస్తులు:** మార్చి 6, 2018 సాయంత్రం ఆరు గంటల వరకు https://upsconline.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 'ఫస్ట్ అప్లై – ఫస్ట్ అలాట్' ప్రాతిపదికన పరీక్ష కేంద్రాలు కేటాయిస్తారు.
- **తెలంగాణ, ఏపీల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, వరంగల్.
- **మెయిన్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ.
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2018 జూన్ 3
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in



సివిల్స్ స్కోర్‌తో.. ఇతర ఉద్యోగాల్లో ప్రాధాన్యత!

యూపీఎస్సీ తాజాగా ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్–2018 నోటిఫికేషన్‌లో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశం.. ఈ పరీక్షలో చివరి దశ (ఇంటర్వ్యూ)కు చేరి విజయం పొందని అభ్యర్థుల మార్కులను.. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని సంస్థలు తమ ఖాళీల భర్తీలో పరిగణనలోకి తీసుకునే దిశగా వీలు కల్పించే ఏర్పాటు చేయడం. దీని ప్రకారం.. సివిల్ సర్వీసెస్ పరీక్ష ఎంపిక ప్రక్రియలో తుది దశ ఇంటర్వ్యూ వరకు చేరుకుని.. తుది ఫలితాల్లో విజయం సాధించని అభ్యర్థుల మార్కులను యూపీఎస్సీ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. తద్వారా ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలోని సంస్థలు ఈ మార్కులను తమ నియామకాల్లో పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు తమ ఖాళీల భర్తీ చేపట్టే దిశగా మెరుగైన మానవ వనరులు గుర్తించడంలో వ్యయ ప్రయాసలకు గురవుతుండటం, మరోవైపు ఇంటర్వ్యూ వరకు చేరుకుని విజయం సాధించలేని అభ్యర్థుల నైపుణ్యాలను దృష్టిలో పెట్టుకుని.. వారికి ప్రత్యామ్నాయ అవకాశాలను కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే.. ఇలా సివిల్స్ ఎంపిక ప్రక్రియలో తుది విజయం సాధించని అభ్యర్థులు.. తమ స్కోర్లను ఇతర సంస్థలు పరిగణనలోకి తీసుకోవాలంటే.. అందుకు సంబంధించి తమకు ఆసక్తి ఉందని.. కమిషన్ నిర్దేశించిన దశలో (ఇంటర్వ్యూ లేదా ఈ–సమన్ లెటర్) సమ్మతి తెలపాల్సి ఉంటుంది.



పరిశోధనలకు ప్రోత్సాహం

కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కొత్తగా పలు రీసెర్చ్ స్కాలర్‌షిప్/ఫెలోషిప్ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఔత్సాహికులు, యువ శాస్త్రవేత్తలు మొదలు ఇప్పటికే పరిశోధనలు కొనసాగిస్తున్న సీనియర్ శాస్త్రవేత్తల వరకూ.. ప్రతిఒక్కరూ మరింత ఉత్సాహంగా పరిశోధనలు కొనసాగించేలా ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కొత్త రీసెర్చ్ స్కీమ్స్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. ఆయా స్కాలర్‌షిప్/ఫెలోషిప్ పథకాల గురించి తెలుసుకుందాం...

టీచర్ అసోసియేట్‌షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్(టీఏఆర్ఈ)

టీఏఆర్ఈ.. రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలు, కళాశాలలు, ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో విధులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ సభ్యులకు ప్రభుత్వ సంస్థల్లో పరిశోధనలు చేసే అవకాశం కల్పించే పథకం ఇది. దీని ప్రకారం.. సదరు ఔత్సాహిక ఫ్యాకల్టీ సభ్యులు ఐఐటీలు, ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర ప్రముఖ రీసెర్చ్ కేంద్రాల్లో పరిశోధనలు చేసేందుకు అవకాశం లభిస్తుంది. ప్రధానంగా లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్, భౌగోళిక–వాతావరణ శాస్త్రం, మ్యాథమెటికల్ సైన్సెస్‌లో పరిశోధనలు చేయాలనుకున్న ఫ్యాకల్టీ సభ్యులకు ఇది ఎంతో ఉపయుక్తం. దాదాపు 500 మంది ఫ్యాకల్టీకి దీని వల్ల ప్రయోజనం చేకూర్చనున్నారు. టీఏఆర్ఈ కింద ఎంపికైన వారికి ప్రతి ఏటా అయిదు లక్షల రీసెర్చ్ గ్రాంట్ లభిస్తుంది. దీంతోపాటు ప్రతి నెల పాకెట్ ఎక్స్‌పెన్సెస్ పేరుతో రూ.5వేల నగదు అందిస్తారు. రెగ్యులర్ వేతనంలోనూ ఎలాంటి కోత ఉండదు. అంటే.. ఈ స్కీమ్‌కు ఎంపికైన ఫ్యాకల్టీకి ప్రతినెల జీతంతోపాటు పైన పేర్కొన్న ప్రోత్సాహకాలు లభిస్తాయి. పీహెచ్‌డీ లేదా మెడిసిన్‌లో ఎంఎస్/ఎండీ; ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులు అర్హులు. ఎంపిక ప్రక్రియ, దరఖాస్తులు తదితర పూర్తి వివరాలు సెర్బ్(సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్)లో ప్రకటిస్తారు. **వివరాలకు వెబ్‌సైట్: http://serb.gov.in/tare.php**

డిస్టింగ్విష్డ్ ఇన్వెస్టిగేటర్ అవార్డ్



సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్(సెర్బ్) నిధులతో నడుస్తున్న ప్రాజెక్ట్‌లలో ప్రధాన పరిశోధకులుగా పనిచేస్తూ...అసాధారణ ప్రతిభ చూపిన వారికి ఫెలోషిప్ అందించే ప్రత్యేక స్కీమ్ ఇది. ప్రతిఏటా వంద మందికి ఈ ఫెలోషిప్ లభిస్తుంది. మూడేళ్లపాటు నెలకు రూ.15వేల ఫెలోషిప్ అందుతుంది. దీంతోపాటు సదరు పరిశోధకులు అందించిన ప్రాజెక్ట్ ప్రతిపాదనల ఆధారంగా అదనపు రీసెర్చ్ గ్రాంట్ ఇస్తారు. గుర్తింపు పొందిన లేబొరేటరీ, ఇన్‌స్టిట్యూట్, యూనివర్సిటీలలో గత పదేళ్ల కాలంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగాల్లో అద్భుత ప్రతిభ చూపిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. సదరు ఇన్వెస్టిగేటర్ జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థల్లో సభ్యత్వం కలిగుండాలి. ఔత్సాహికులను.. జాతీయ సైన్స్ అకాడమీల ప్రస్తుత లేదా మాజీ అధ్యక్షులు, నేషనల్ లేబొరేటరీస్ డైరెక్టర్లు, యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్లు లేదా సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ బోర్డ్ సభ్యులు నామినేట్ చేయాల్సి ఉంటుంది. అలాంటి దరఖాస్తులనే సెర్బ్ పరిగణనలోకి తీసుకుంటుంది. **వివరాలకు వెబ్‌సైట్: www.serb.gov.in**

మరో కొత్త పథకం... పీఎం రీసెర్చ్ ఫెలో ప్రోగ్రామ్

ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో...కొత్తగా ప్రధాన మంత్రి రీసెర్చ్ ఫెలో ప్రోగ్రామ్(పీఎంఆర్ఎఫ్)ను ప్రారంభించనున్నట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రముఖ విద్యా సంస్థల నుంచి ఏటా 1000 మంది ప్రతిభావంతులైన బీటెక్ విద్యార్థులను గుర్తించి ఐఐటీలు, ఐఐఎస్సీలో పీహెచ్‌డీ చేసేలా సౌకర్యాలు కల్పించడంతోపాటు భారీగా స్కాలర్‌షిప్‌ను కూడా అందించనున్నట్లు తెలిపారు. ఈ పీఎంఆర్ఎఫ్‌కు ఎంపికైన 1000 మంది అభ్యర్థులు తమ పరిశోధనలతోపాటు ప్రతి వారం నిర్దేశిత గంటలు ఉన్నత విద్యా సంస్థల్లో బోధిస్తారు. ఈ పథకం ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు విధానంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఓవర్సీస్ విజిటింగ్ డాక్టోరల్ ఫెలోషిప్

భారతీయ పరిశోధక విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి శిక్షణ పొంది.. ప్రపంచ స్థాయి ప్రమాణాలు సొంతం చేసుకునే ఉద్దేశంతో రూపొందించినదే.. ఓవర్సీస్ విజిటింగ్ డాక్టోరల్ ఫెలోషిప్. జాతీయ స్థాయిలో యూనివర్సిటీలు,రీసెర్చ్ లేబొరేటరీస్‌లో ఇప్పటికే పీహెచ్‌డీ చేస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రూపొందించిన స్కీమ్ ఇది. ఈ స్కీమ్ ప్రకారం– ప్రతి ఏటా వంద మంది పీహెచ్‌డీ స్కాలర్స్ విదేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలు, లేబొరేటరీల్లో శిక్షణ పొందేందుకు అవసరమైన ఆర్థిక సదుపాయం లభిస్తుంది. ఏడాదిపాటు ప్రతి నెల రెండు వేల అమెరికన్ డాలర్లకు సమానమైన మొత్తాన్ని ఫెలోషిప్‌గా అందిస్తారు. దీనికి అదనంగా కాంటింజెన్సీ అలవెన్స్, ప్రయాణ ఖర్చులు, వీసా ఫీజు కోసం రూ.60వేలు లభిస్తుంది. ఈ స్కీమ్‌కు సంబంధించిన అర్హతలు, ఇతర విధి విధానాలపై త్వరలోనే నిర్ణయం వెలువడనుంది. భారతీయ యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన 100 మందికి ఈ ఫెలోషిప్ లభిస్తుంది. ఎంపిక ప్రక్రియ, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలు వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
http://www.serb.gov.in/odf.php

ఆగ్మెంటింగ్ రైటింగ్ స్కిల్స్ ఫర్ ఆర్టిక్యులేటింగ్ రీసెర్చ్ (ఏడబ్ల్యుఎస్ఏఆర్)

సెర్బ్, నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్‌లు సంయుక్తంగా అమలు చేయనున్న పథకం. యువ పీహెచ్‌డీ స్కాలర్స్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోస్ వార్తా పత్రికలు, మ్యాగజీన్‌లు, బ్లాగ్‌లు, సోషల్ మీడియా ద్వారా తమ పరిశోధనలను ప్రచురించేలా ఔత్సాహికులను ప్రోత్సహించే ఉద్దేశంతో నెలకొల్పిన కొత్త స్కాలర్‌షిప్ స్కీమ్ ఇది. ఏటా వంద బెస్ట్ ఎంట్రీస్(పరిశోధన పత్రాలు)కు రూ.పదివేల ఇన్సెంటివ్ లభిస్తుంది. టాప్–3 జాబితాలో నిలిచిన ప్రచురణలకు వరుసగా రూ.లక్ష, రూ.యాభై వేలు, రూ.25వేలు అందుతాయి. వీటికి అదనంగా మరో 20 మంది పోస్ట్ డాక్టోరల్ అభ్యర్థులకు రూ.పది వేలు చొప్పున, మొత్తం ప్రచురణల్లో అద్భుతమైన ప్రచురణకు రూ.లక్ష నగదు బహుమతి లభిస్తుంది. ఉత్తమ ప్రచురణను గుర్తించే క్రమంలో వార్తాపత్రికలు, మ్యాగజీన్స్, సోషల్ మీడియా, బ్లాగ్స్, ఇతర మాధ్యమాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేస్తారు.
వివరాలకు వెబ్‌సైట్: www.dst.gov.in

ప్రజాస్వామ్య సూచీలో భారత్‌కు 42వ స్థానం

కాంపిటీటివ్ గైడెన్స్ — కరెంట్ అఫైర్స్

జాతీయం

ప్రజాస్వామ్య సూచీలో భారత్‌కు 42వ స్థానం

ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్(ఈఐఈ) 165 దేశాలతో రూపొందించిన ప్రజాస్వామ్య సూచీ–2017లో భారత్‌కు 42వ స్థానం దక్కింది. పెచ్చుమీరుతున్న హిందూ అతివాదం, మైనారిటీలపై దాడుల కారణంగా తాజా సూచీలో భారత్ పది స్థానాలు దిగజారింది. మొత్తం పది పాయింట్లకు గానూ భారత్‌కు 7.23 పాయింట్లు లభించాయి. జాబితాలో నార్వే 9.87 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, తర్వాతి పది స్థానాల్లో ఐస్‌లాండ్, స్వీడన్, న్యూజిలాండ్, డెన్మార్క్, ఐర్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా, ఫిన్‌లాండ్, స్విట్జర్లాండ్ ఉన్నాయి. అమెరికాకు 21వ స్థానం, రష్యాకు 135వ స్థానం, చైనాకు 139వ స్థానం దక్కాయి.

జలాంతర్గామి కరంజ్ జలప్రవేశం



స్కార్పీన్ శ్రేణికి చెందిన మూడో అత్యాధునిక జలాంతర్గామి ఐఎన్ఎస్ కరంజ్ జలప్రవేశం చేసింది. దీన్ని జనవరి 31న ముంబాయిలో ప్రారంభించారు. ఫ్రెంచ్ నౌకా తయారీ సంస్థ డీసీఎన్ఎస్ భాగస్వామ్యంతో ముంబైలోని మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ ఈ జలాంతర్గామిని నిర్మించింది.

ముంబైకి ఒకే రోజు 980 విమానాలు

ముంబైలోని ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయం అరుదైన ఘనత సాధించింది. 24 గంటల్లో 980 విమానాల రాకపోకలతో ప్రపంచంలోనే అత్యంత రద్దీ గల సింగిల్ రన్‌వే విమానాశ్రయంగా వరుసగా రెండో ఏడాది గుర్తింపు పొందింది. ఈ ఘనత జనవరి 20న సాధించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికార ప్రతినిధి ఫిబ్రవరి 4న ప్రకటించారు.

తేజస్‌లో యూఎస్ వైమానికదళాధిపతి



యూఎస్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ జనరల్ డేవిడ్ ఎల్ గోల్డ్‌ఫీన్ మూడు రోజుల భారత పర్యటన ఫిబ్రవరి 3న ముగిసింది. పర్యటనలో భాగంగా ఆయన జోధ్‌పూర్ వైమానిక స్థావరం నుంచి భారత స్వదేశీ తయారీ యుద్ధవిమానం తేజస్‌లో విహరించారు.

అమల్లోకి జడ్జీల పెరిగిన వేతనాలు

సుప్రీంకోర్టు, హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల వేతనాల పెంపు అమల్లోకి వచ్చింది. రాష్ట్రపతి జనవరి 30న సంబంధిత బిల్లుకు ఆమోదముద్ర వేశారు. దీంతో సుప్రీంకోర్టు సీజేఐ వేతనం నెలకు రూ.లక్ష నుంచి రూ.2.80 లక్షలకు; సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వేతనాలు రూ.90,000 నుంచి రూ.2.50 లక్షలకు; హైకోర్టు న్యాయమూర్తుల వేతనాలు రూ.80,000 నుంచి రూ.2.25 లక్షలకు పెరిగాయని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

సుష్మా స్వరాజ్ నేపాల్ పర్యటన

ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నేపాల్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు. ఆమె ఫిబ్రవరి 2 నుంచి రెండు రోజులపాటు నేపాల్‌లో పర్యటించారు. పర్యటనలో భాగంగా నేపాల్ అధ్యక్షురాలు బిద్యాదేవీ భండారీ, ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవ్‌బా, సీపీఎన్ మావోయిస్టు సెంటర్ చైర్మన్ ప్రచండతో సమావేశమయ్యారు.

అంతర్జాతీయం

శరణార్థులపై నిషేధం ఎత్తేసిన యూఎస్



11 దేశాల శరణార్థులపై విధించిన నిషేధాన్ని ఎత్తేస్తున్నట్లు అమెరికా జనవరి 30న ప్రకటించింది. అయితే ఆయా దేశాల నుంచి వచ్చే శరణార్థులు కఠిన తనిఖీలు ఎదుర్కోవలసి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ జాబితాలో ఇరాన్, లిబియా, ఈజిప్ట్, మాలి, సోమాలియా, దక్షిణ సూడాన్, సూడాన్, సిరియా, యెమెన్, ఉత్తర కొరియా ఉన్నాయి.

మాల్దీవుల్లో అత్యవసర స్థితి

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీంతో ఆ దేశ అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ ఫిబ్రవరి 5న అత్యవసర పరిస్థితి విధించారు. అత్యవసర స్థితి 15 రోజుల పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది.

వార్తల్లో వ్యక్తులు

అనిల్ చౌహాన్: భారత సైన్యం నూతన డీజీఎం(డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్)గా లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ జనవరి 30న బాధ్యతలు స్వీకరించారు. చౌహాన్‌కు జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని చొరబాటు వ్యతిరేక ఆపరేషన్లలో అపార అనుభవం ఉంది.

ఎస్‌కే జోషి: తెలంగాణ రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా శైలేంద్ర కుమార్ జోషి జనవరి 31న బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బరేలీకి చెందిన జోషి 1984 బ్యాచ్ ఐఏఎస్ అధికారి.

డియాజ్ బలర్ట్: క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రో పెద్ద కుమారుడు డియాజ్ బలర్ట్(68) ఫిబ్రవరి 2న హవానాలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన గత కొన్ని నెలలుగా తీవ్ర డిప్రెషన్‌తో బాధపడుతున్నారు. డియాజ్ రాజకీయాల్లో లేనప్పటికీ అచ్చు తండ్రి పోలికలతో ఉండటంతో అక్కడి వారు ఆయన్ను ఫిడెల్ జూనియర్‌గా పిలుస్తుంటారు. ఫిజిక్స్ శాస్త్రవేత్తయిన డియాజ్.. క్యూబా అణుశక్తి కార్యక్రమంలో కీలకపాత్ర పోషించారు.

అమితాబ్ కాంత్: నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితాబ్ కాంత్ పదవీకాలాన్ని 2019 జూన్ 30 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్రం ఫిబ్రవరి 5న ప్రకటించింది. కేబినెట్ నియామకాల కమిటీ సిఫారసు మేరకు ఈ నిర్ణయం తీసుకుంది.

సైన్స్ అండ్ టెక్నాలజీ

అతి చిన్న రాకెట్ ప్రయోగం విజయవంతం



జపాన్ అంతరిక్ష సంస్థ..జక్సా ఫిబ్రవరి 4న ప్రపంచంలోనే అతి చిన్న రాకెట్(ఎస్ఎస్–520)ను విజయవంతంగా ప్రయోగించింది. దీని ద్వారా ట్రైకామ్–1 ఆర్(సూక్ష్మ ఉపగ్రహం)ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఎస్ఎస్–520 పొడవు 10 మీటర్లు కాగా, వ్యాసం 53 సెంటీమీటర్లు. ఈ ప్రయోగం కగోషిమా ప్రిఫెక్చర్‌లోని ఉచినోరా అంతరిక్ష కేంద్రం నుంచి జరిగింది.

సూపర్ బ్లూ బ్లడ్ మూన్

ప్రపంచంలోని చాలా ప్రాంతాల్లో జనవరి 31న సూపర్ బ్లూ బ్లడ్ మూన్ కనిపించింది. ఇది సాధారణ రోజుల్లో కనిపించే చంద్రుడితో పోల్చితే 30 శాతం పెద్దగా, 14 శాతం ప్రకాశవంతంగా ఉందని సైంటిస్టులు వెల్లడించారు. దీంతో అమెరికా, ఆస్ట్రేలియా సహా పలు ఆసియా దేశాలు, రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో కోట్లాది మంది ఈ ఖగోళ వింత(చంద్ర గ్రహణం)ను పెద్ద సంఖ్యలో వీక్షించారు. అయితే దక్షిణ అమెరికా ఖండం, పశ్చిమ యూరోప్, ఆఫ్రికాలోని చాలా దేశాల్లో సూపర్ బ్లూ బ్లడ్ మూన్ కనిపించలేదు.

విహరించిన తేలికపాటి హెలికాప్టర్

భారత తేలికపాటి పోరాట హెలికాప్టర్(ఎల్‌సీహెచ్–టీడీ2) జనవరి 31న బెంగళూరులో 20 నిమిషాలపాటు విహరించింది. దీనికి తొలిసారిగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) రూపొందించిన ఆటోమేటిక్ ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్)ను అమర్చి ప్రయోగించారు.

ఆర్థికం

కేంద్ర బడ్జెట్ 2018-19



ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018–19 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆయన ఏప్రిల్ 1 నుంచి ప్రారంభంకానున్న ఆర్థిక సంవత్సరానికి రూ.24,42,213 కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. బడ్జెట్ ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ రంగ పటిష్టత, పేదల ఆరోగ్య భద్రత, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై దృష్టిసారించింది. జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది ఐదోసారి.

ముఖ్యాంశాలు
- **బడ్జెట్ మొత్తం:** రూ.24,42,213 కోట్లు
- **రెవెన్యూ వసూళ్లు:** రూ.17,25,738 కోట్లు
- **మూలధన వసూళ్లు:** రూ.7,16,475 కోట్లు
- 2018–19లో వృద్ధిరేటు 7.4 శాతంగా అంచనా, 2017–18లో ఎగుమతుల్లో 15 శాతం వృద్ధి, 2018–19లో జీడీపీలో విత్తలోటు 3.3 శాతంగా లక్ష్యం, 2017–18లో విత్తలోటు రూ.5,94,8469(3.5 శాతం)గా సవరణ.
- 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడానికి, గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి, మౌలిక సదుపాలయాల కల్పనకు రూ.14.34 లక్షల కోట్లు.
- ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రతలకు రూ.1.38 లక్షల కోట్లు. పది కోట్ల కుటుంబాలకు లబ్ధిచేకూరేలా జాతీయ ఆరోగ్య బీమా పథకం. దీని కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు వైద్య బీమా సదుపాయం.
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణం, పెట్టుబడి, వడ్డీ సబ్సిడీల కోసం రూ.3,790 కోట్లు.
- 2018–19లో 7 లక్షలకుపైగా ఉద్యోగాల సృష్టి. ప్రతి జిల్లాలో మోడల్ నైపుణ్య కేంద్రం ఏర్పాటు.
- రైల్వేలకు మూలధన వ్యయం కింద రూ. 1,48,528 కోట్లు. 6,000 మేజర్ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ.
- వ్యక్తిగత ఆదాయపన్ను పరిమితిలో ఎటాంటి మార్పులేదు, పన్ను శ్లాబులు యథాతథం.
- పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.80,000 కోట్లు సమీకరణ.

ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు

రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫిబ్రవరి 3న అసోంలోని గువహటిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే, పలువురు కేంద్రమంత్రులు, అసోం సీఎం సర్బానంద సోనోవాల్, 16 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలు

అండర్-19 ప్రపంచకప్ నెగ్గిన భారత్




భారత్ అండర్–19 ప్రపంచకప్ కైవసం చేసుకుంది. న్యూజిలాండ్‌లో ఫిబ్రవరి 3న జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాపై భారత్ 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో నాలుగుసార్లు ఈ కప్ గెలుచుకున్న జట్టుగా రికార్డు సృష్టించింది.

ఇండియన్ ఓపెన్ బాక్సింగ్ టోర్నీ

న్యూఢిల్లీలో ఫిబ్రవరి 1న ముగిసిన ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్లు మొత్తం 18 కేటగిరీల్లో కలిపి 7 స్వర్ణాలు, 10 రజతాలు; 23 కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

ఇండియన్ బ్యాడ్మింటన్ ఓపెన్

ఇండియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను బీవెన్ జాంగ్(అమెరికా) గెలుచుకుంది. న్యూఢిల్లీలో ఫిబ్రవరి 4న జరిగిన ఫైనల్లో పీవీ సింధుపై బీవెన్ గెలుపొందింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను షి యుకి(చైనా) గెలుచుకున్నాడు.


ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్, హైదరాబాద్

సాక్షి బిజినెస్

గురువారం 8-2-2018

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్	113 ▼	34,083
నిఫ్టీ	22 ▼	10,477

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,137	▲ 20
డోజోన్స్	25,184	▲ 271
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,279	▲ 138
డాక్స్	12,590	▲ 198
షాంఘై	3,310	▽ 61
నికాయ్	21,645	▲ 35

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.85	64.98
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	90.95	91.13
€	యూరో	ఎస్‌బీఐ	80.58	80.74
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.58	59.70
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.39	51.50
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	49.41	49.51
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.49	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.25	11.76

వావ్.. షో!


రెనో ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కారు జోయి


మహీంద్రా రేసింగ్ కారుతో మోడల్

కార్ల పండుగ మొదలైంది. 14వ ఆటోఎక్స్‌పో గురువారం మధ్యాహ్నం గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో అధికారికంగా ప్రారంభమౌతుంది. అయితే మీడియా, కార్పొరేట్ ప్రతినిధులకు బుధవారం నుంచి అనుమతించారు. ప్రజలకు 9–14 వరకు అందుబాటులో ఉంటుంది.వాహన విడిభాగాల తయారీ కంపెనీల సంఘం(ఏసీఎంఏ), భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), వాహన తయారీ కంపెనీల సంఘం (సియామ్) సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈసారి షోలో కంపెనీలు ఎలక్ట్రిక్, హైబ్రిడ్, పర్యావరణ అనుకూల టెకాల్నజీలకు అధిక ప్రాధాన్యతనిచ్చాయి. దేశీ, విదేశీ కంపెనీలు వాటి ప్రాడక్టులను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించాయి.


టాటా ఇన్‌ట్రా వాహనంపై అక్షయ్ కుమార్


బీఎండబ్ల్యూ '6 సిరీస్ గ్రాండ్ టురిస్మో'తో సచిన్


హోండా కాన్సెప్ట్ కారు


ఎలైట్ ఐ20తో హ్యుందాయ్ ఎండీ, సీఈవో వై.కె.కో, కంపెనీ ప్రతినిధులు


రెనో ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ కారు ట్రెజోర్


టాటా ఎలక్ట్రిక్ బస్సు


హోండా కొత్త బైక్ బ్లేడ్‌ను ఆవిష్కరిస్తున్న కంపెనీ ప్రతినిధులు


రాయల్ లుక్‌తో టాటా హెచ్5ఎక్స్


ఎలక్ట్రిక్ వెహికల్స్‌తో ఆనంద్ మహీంద్రా, పవన్ గోయెంకా


టయోటా యారిస్ కాన్సెప్ట్ కారు


టయోటా ఎఫ్‌సీవీ ప్లస్ కాన్సెప్ట్ కారు


మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటో.. 'ట్రియో'

• **మారుతీ సుజుకీ:** దేశీ దిగ్గజ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ ఇండియా కాన్సెప్ట్ కాంపాక్ట్ కారు ఆవిష్కరించింది. దీని పేరు కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్. ఇందులో ఎస్‌యూవీ ప్రత్యేకతలు ఉండటం విశేషం. కంపెనీ అలాగే ఈవీ కాన్సెప్ట్ 'సర్వైవర్' కారును కూడా ప్రదర్శించింది. '2020 నాటికి బీఎస్–6 ప్రమాణాలకు అనువైన ప్రాడక్టులను తయారుచేస్తాం. 2020లోనే ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకువస్తాం. వీటిని దేశీయంగానే రూపొందిస్తాం' అని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో కెనిచి అయుకవ తెలిపారు.

• **హోండా:** జపాన్‌కు చెందిన హోండా కంపెనీ మూడు కొత్త ప్రాడక్టులను ఆవిష్కరించింది. ఆల్ న్యూ అమేజ్, సీఆర్–వీ, సివిక్ సెడాన్ అనేవి ఇందులో ఉన్నాయి. వచ్చే మూడేళ్లలో ఆరు మోడళ్లను భారత్ మార్కెట్‌లోకి తెస్తామని కంపెనీ ప్రెసిడెంట్ టకహిరో హచిగో తెలిపారు. కంపెనీ అలాగే పలు ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వాహనాలను ప్రదర్శనకు ఉంచింది.

• **రెనో:** ఫ్రాన్స్ కంపెనీ రెనో.. రెండు ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వెహికల్స్‌ను ఆవిష్కరించింది. ట్రెజోర్, జోయి ఇ–స్పోర్ట్ అనేవి వీటి పేర్లు. 'ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి స్పష్టమైన పాలసీ కోసం ఎదురుచూస్తున్నాం. దీని ఆధారంగా భవిష్యత్ వ్యూహాలు ఉంటాయి' అని రెనో ఇండియా పేర్కొంది. కంపెనీ అలాగే ఫార్ములా వన్ కారు 'ఆర్.ఎస్.17', క్విడ్ సూపర్ హీరో ఎడిషన్‌ను ప్రదర్శనకు ఉంచింది.

• **హ్యుందాయ్:** దక్షిణ కొరియాకు వాహన కంపెనీ తన ప్రీమియం కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ 'ఎలైట్ ఐ20'లో కొత్త వెర్షన్‌ను తీసుకువచ్చింది. దీని ధర శ్రేణి రూ.5.34–రూ.9.15 లక్షలు. మూడేళ్లలో భారత్‌లో రూ.6,300 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. వచ్చే ఏడాది ఎలక్ట్రిక్ వెహికల్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇక తన పాపులర్ మోడల్ శాంట్రోను ఈ ఏడాది దీపావళికి మార్కెట్‌లోకి తీసుకువచ్చే అవకాశముంది.


మారుతీ సుజుకీ కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కారు 'సర్వైవర్'

• **సుజుకీ మోటార్‌సైకిల్:** సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తాజాగా 125 సీసీ స్కూటర్ బర్గ్‌మాన్ స్ట్రీట్‌ను మార్కెట్‌లోకి ఆవిష్కరించింది. అలాగే సబ్–1,000 సీసీ విభాగంలో జీఎస్ఎక్స్–ఎస్750 బైక్‌ను ప్రదర్శించింది. క్రూయిజర్ బైక్ ఇన్‌ట్రూడర్‌లో కొత్త వేరియంట్‌ను ఆవిష్కరించింది. కంపెనీ దాదాపు స్కూటర్, మోటార్‌సైకిల్, బిగ్ బైక్ సెగ్మెంట్‌లలో మొత్తంగా 17 మోడళ్లను ప్రదర్శనకు ఉంచింది.

• **హీరో మోటోకార్ప్:** 200 సీసీ అడ్వెంచర్ మోటార్‌సైకిల్ 'ఎక్స్‌పల్స్'ను, రెండు కొత్త 125 సీసీ స్కూటర్లను ఆవిష్కరించింది.


మహీంద్రా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ.. 'ఈ-కేయూవీ 100

• **పియా జియో:** ఇటలీకి చెందిన పియాజియో 125 సీసీ బైక్ 'అప్రిలియా ఎస్ఆర్'ను ఆవిష్కరించింది. దీని ధర రూ.65,310 (ఎక్స్‌షోరూమ్ పుణే). కంపెనీ అలాగే వెస్పా స్కూటర్లను, ఇ–స్కూటర్ ఎలెట్రికాను ప్రదర్శనకు ఉంచింది.

• **హోండా మోటార్‌సైకిల్:** హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తాజాగా 160 సీసీ బైక్ ఎక్స్–బ్లేడ్‌ను ఆవిష్కరించింది. అలాగే దాదాపు 10 మోడళ్లను ప్రదర్శనకు ఉంచింది.

• **టీవీఎస్ మోటార్:** టీవీఎస్ మోటార్ తాజాగా ఎలక్ట్రిక్ స్కూటర్ కాన్సెప్ట్ 'క్రియాన్', 220 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ బైక్ 'జెప్పెలిన్'ను ఆవిష్కరించింది. అలాగే అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్ఐ బైక్‌ను ప్రదర్శనకు ఉంచింది.


టీవీఎస్ ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ స్కూటర్ 'క్రియాన్'


మారుతీ సుజుకీ కాన్సెప్ట్ కారు 'ఫ్యూచర్-ఎస్'

• **యమహా:** యమహా ఇండియా స్పోర్ట్స్ బైక్ వైజెడ్ఎఫ్–ఆర్15లో కొత్త వెర్షన్‌ను ఆవిష్కరించింది. ధర రూ.1.25 లక్షలు .

• **టాటా మోటార్స్:** టాటా మోటార్స్ కంపెనీ లగ్జరీ ఎస్‌యూవీ, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ విభాగాల్లో వరుసగా హెచ్5ఎక్స్, 45ఎక్స్ అనే రెండు కాన్సెప్ట్ వెహికల్స్‌ను ఆవిష్కరించింది. వీటితోపాటు ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శనకు ఉంచింది.

• **కవాసకి:** కవాసకి ఇండియా రెండు కొత్త బైక్స్ నింజా హెచ్2 ఎస్ఎక్స్ స్టాండర్డ్, నింజా హెచ్2 ఎస్ఎక్స్ ఎస్ఈ స్పెషల్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ప్రారంభ ధర రూ.21.8 లక్షలు.

• **ఎస్ఎంఎల్ ఇసుజు:** ఎస్ఎంఎల్ ఇసుజు తాజాగా కార్గో విభాగంలో మూడు మోడళ్లను ప్రదర్శనకు ఉంచింది. సామ్రాట్ జీఎస్ హెచ్‌డీ 19, సర్తాజ్ జీఎస్ సీఎన్‌జీ, సామ్రాట్ జీఎస్ ట్రిప్పర్ అనేవి వీటి పేర్లు.

• **మెర్సిడెస్ బెంజ్!:** జర్మనీకి చెందిన మెర్సిడెస్ బెంజ్ తాజాగా మేబ్యాక్ ఎస్650ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.2.73 కోట్లు. అలాగే కంపెనీ ఎలక్ట్రిక్ వెహికల్ కాన్సెప్ట్ ఈక్యూతోపాటు దాదాపు 13 ప్రాడక్టులను ప్రదర్శనకు ఉంచింది.

• **అశోక్ లేలాండ్:** తొలి ఎలక్ట్రిక్ బస్సు సర్క్యూట్–ఎస్‌ను ఆవిష్కరించింది. వచ్చే 3–6 నెలల్లో అందుబాటులోకి రావొచ్చు.

• **టయోటా:** టయోటా కిర్లోస్కర్ మోటార్ 'యారిస్' సెడాన్ కారును ఆవిష్కరించింది. ఎఫ్‌సీవీ ప్లస్ కాన్సెప్ట్‌ను ప్రదర్శించింది.

• **జేబీఎం:** ఈ కంపెనీ ఎలక్ట్రిక్ బస్సు సరీస్ 'ఎకో లైఫ్'ను ఆవిష్కరించింది. వీటి ధర రూ.2–3 కోట్ల మధ్యలో ఉండొచ్చు.

• **మహీంద్రా:** మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ ఆరు కొత్త ఎలక్ట్రిక్ కాన్సెప్ట్ వాహనాలను ఆవిష్కరించింది.

• **కియా మోటార్స్:** దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ ఎస్‌పీ కాన్సెప్ట్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్లాంటులో తయారు చేయనుంది. భారత్‌లో కంపెనీ తొలి వాహనం ఇదే.

• **బీఎండబ్ల్యూ:** హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఐ8 రోడ్‌స్టర్, ఎలక్ట్రిక్ వెహికల్ ఐ3ఎస్‌లను ప్రదర్శనకు ఉంచింది.

ఉత్తరప్రదేశ్‌లో మేఘా భారీ ప్రాజెక్టు పూర్తి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ సంస్థ మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉత్తర ప్రదేశ్‌లో ఓ భారీ పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. దేశంలో తొలిసారిగా అత్యాధునిక గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్ టెక్నాలజీని దీనికోసం వాడారు. 13,220 మెగా వోల్ట్ ఆంపియర్ విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం దీని సొంతం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల విద్యుత్ సరఫరా సామర్థ్యానికి ఇది సమానమని కంపెనీ ఈ సందర్భంగా తెలియజేసింది. దేశంలో ప్రైవేటు రంగంలో ఈ స్థాయిలో నిర్మించిన తొలి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. బిల్డ్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన చేపట్టిన ఈ కాంట్రాక్టు విలువ రూ.4,150 కోట్లు. ఈ ప్రాజెక్టును వెస్టర్న్ ఉత్తర ప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ (డబ్ల్యూయూపీపీటీసీ) నుంచి మేఘా ఇంజనీరింగ్ దక్కించుకుని 2011లో నిర్మాణాన్ని ప్రారంభించింది. 35 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతను మేఘా చేపడుతుంది. దీనిద్వారా పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లోని ఏడు జిల్లాలకు విద్యుత్ సరఫరా చేస్తారు. ప్రాజెక్టు నిర్మాణంలో 200 మంది సాంకేతిక నిపుణులు, 2,000లకు పైగా కార్మికులు పాలు పంచుకున్నట్లు కంపెనీ తెలియజేసింది.



బాబోయ్... ధరలు!!

ఆర్‌బీఐ కీలక పాలసీ రేట్లు యథాతథం...

- రెపో రేటు 6 శాతం, రివర్స్ రెపో రేటు 5.75 శాతం
- ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు పెరుగుదలపై ఆందోళన



ముంబై: అందరి అంచనాలకు అనుగుణంగానే కీలక రేట్ల విషయంలో యథాతథ స్థితిని కొనసాగిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకుంది. రెపో రేటు (బ్యాంకులకు స్వల్ప కాలం కోసం ఇచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే రేటు)ను 6 శాతంగా, రివర్స్ రెపో రేటు(బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే రుణాలపై చెల్లించే రేటు)ను 5.75 శాతంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ప్రభుత్వ అధిక వ్యయాలతో ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు పెరిగిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ''ద్రవ్యోల్బణం పెరుగుదలపై ఎన్నో అనిశ్చిత పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రాష్ట్రాల్లో ఏడో వేతన కమిషన్ సిఫారసుల అమలు, అధిక చమురు ధరలు, కస్టమ్స్ డ్యూటీల పెంపు వల్ల ద్రవ్యలోటు 2017–18లో 3.5 శాతానికి చేరొచ్చు. 2018–19 ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటు లక్ష్యం ఎక్కువే ఉండొచ్చు. కేంద్ర బడ్జెట్లో పేర్కొన్నట్టు ద్రవ్యలోటు కట్టుతప్పితే ద్రవ్యోల్బణంపై ప్రభావం పడుతుంది. సూక్ష్మ ఆర్థిక రంగంపై విస్తృత స్థాయిలో ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా రుణ సమీకరణ వ్యయాలు పెరిగిపోవడం ఈ పాటికే మొదలైంది. ఇది ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీస్తుంది'' అని ఆరుగురు సభ్యులతో కూడిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ తన అభిప్రాయాలను వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో అధిక వ్యయాల కోసం రుణాల సమీకరణ, మెగా హెల్త్‌కేర్ ప్లాన్‌ను దృష్టిలో ఉంచుకుని 2018–19 బడ్జెట్లో ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాన్ని పెంచిన నేపథ్యంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలున్నాయని సందేహం వ్యక్తం చేసింది. ''వాటి ప్రభావం ఎంతో కొంత ఉంటుంది. ఎంత ఖర్చు చేయనున్నారన్న దానిపై తగినంత సమాచారం ప్రస్తుతానికైతే లేదు. ఈ విషయంలో మరింత సమాచారం కోసం వేచి చూస్తున్నాం''అని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. కాగా, ఆర్‌బీఐ రేట్ల విషయంలో యథాతథ స్థితినే కొనసాగిస్తుందని, ద్రవ్యోల్బణం విషయంలో కఠిన వ్యాఖ్యలు చేయవచ్చని విశ్లేషకులు ముందుగానే అంచనా వేశారు.

ద్రవ్యోల్బణానికి రెక్కలు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి–డిసెంబర్)లో ద్రవ్యోల్బణం 5.1% స్థాయిలో ఉంటుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2018–19) తొలి 6 నెలల్లో ఇది 5.1–5.6%కి పెరుగుతుందని, ఆ తదుపరి ఆరు నెలల కాలంలో 4.5–4.6%కి దిగొస్తుందని అంచనా వేసింది. పెరుగుతున్న చమురు ధరలు, పలు రాష్ట్రాల్లో హెచ్ఆర్ఏ పెంపు అమలు ద్రవ్యోల్బణాన్ని పెంచే సవాళ్లుగా పేర్కొంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం పెరుగుదలలో హెచ్ఆర్ఏ పెంపు ప్రభావమే 0.35 శాతంగా ఉంటుందని ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు.

> **ఇప్పటికింతే...**
>
> అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ స్థితిలో మరింత డేటా రావాల్సి ఉన్న దృష్ట్యా రెపో రేటును లేదా పరపతి విధానాన్ని మార్చాల్సిన అవసరం లేదని భావిస్తున్నాం.
>
> – ఉర్జిత్ పటేల్, ఆర్‌బీఐ గవర్నర్

ఆర్థిక వృద్ధి..: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.7%గా ఉంటుందన్న గత అంచనాలను 6.6%కి సవరించింది. ''2018–19లో 7.2%కి పెరుగుతుందని అంచనా. స్థూల అదనపు విలువ (జీవీఏ) 2017–18 సంవత్సరంలో 6.6% ఉండొచ్చు. గతంలో ఈ అంచనా 6.7%. 2018–19లో 7.2% ఉంటుంది. ఆర్థిక రంగం మెరుగుపడే క్రమంలో ఉంది. పెట్టుబడులు పుంజుకుంటున్నట్టు కనిపిస్తున్న ప్రాథమిక సంకేతాలకు అదనంగా అంతర్జాతీయ డిమాండ్ పెరుగుతుండటం దేశీయంగా పెట్టుబడులను బలోపేతం చేస్తుంది''అని ఆర్‌బీఐ పేర్కొంది.

ద్రవ్యలోటు...: ''ద్రవ్య స్థిరీకరణ ప్రణాళికను ఆలస్యం చేయడం మరిన్ని సవాళ్లకు దారితీస్తుంది. ప్రభుత్వం ద్రవ్యలోటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.2%గా అనుకుంటే అదిప్పుడు 3.5%కి పెరిగిపోయింది. వచ్చే ఏడాదికి ద్రవ్యలోటు గతంలో పేర్కొన్న 3 శాతానికి బదులు 3.2 శాతానికి సవరించడం, మధ్యకాలిక స్థిరీకరణ లక్ష్యాన్ని వాయిదా వేయడం చూస్తుంటే 3 శాతం ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించడం ఇక 2020–21లోనే సాధ్యం. అంటే షెడ్యూల్ కంటే మూడేళ్ల ఆలస్యంగా'' అని ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు.

జీడీపీలో పెట్టుబడుల నిష్పత్తి

జీడీపీలో పెట్టుబడుల నిష్పత్తి తగ్గిపోవడంపై అడిగిన ప్రశ్నకు... ఇది పెరిగేందుకు ఎన్నో అవకాశాలున్నాయని ఉర్జిత్ పటేల్ చెప్పారు. సామర్థ్య వినియోగాన్ని పెంచడం, రుణాల డిమాండ్‌ను రెండంకెల స్థాయికి తీసుకెళ్లడం వంటి చర్యలను పేర్కొన్నారు.

"కానీ రేట్లను తగ్గించాల్సింది

దేశీ కార్పొరేట్ రంగం అభిప్రాయం



ఆర్‌బీఐ నిర్ణయం కార్పొరేట్ రంగానికి ఉపశమనమే. ద్రవ్యోల్బణం 5 శాతాన్ని దాటుతుందని, చమురు ధరలపై సెంట్రల్ బ్యాంకు వ్యక్తం చేసిన ఆందోళనలు పూర్తి వాస్తవం. దీనికితోడు ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధరలను గణనీయంగా పెంచడం కూడా రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

– సందీప్ జజోదియా, అసోచామ్ ప్రెసిడెంట్



ఆర్‌బీఐ గత ఆర్థిక సంవత్సరంలో ఒకే ఒక్కసారి 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. 2017–18లో ద్రవ్యోల్బణం గత ఆరు సంవత్సరాల్లోనే సగటున తక్కువగా ఉన్నట్టు ఆర్థిక సర్వే సైతం పేర్కొంది. నిస్సందేహంగా రేట్లను తగ్గించే అవకాశాన్ని జార విడిచారు. రేట్లు తగ్గిస్తే ప్రైవేటు పెట్టుబడులకు ఎంతో ఊతమిచ్చేది.

– రషేష్ షా, ఫిక్కి ప్రెసిడెంట్"

రుణ గ్రహీతలకు శుభవార్త

బేస్ రేటును ఎంసీఎల్ఆర్‌తో వచ్చే ఏప్రిల్ 1 నుంచి అనుసంధానించనున్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది. బేస్ రేటు విధానంలో పరిమితుల దృష్ట్యా ఆర్‌బీఐ ఎంసీఎల్ఆర్ విధానాన్ని 2016 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఎంసీఎల్ఆర్ విధానం ప్రవేశపెట్టడంతో అప్పటికే బేస్ రేటు విధానంలో జారీ అయిన రుణాలను ఎంసీఎల్ఆర్‌కు బదలాయింపు జరుగుతుందని ఆశించినట్టు ఆర్‌బీఐ పేర్కొంది.

ఎంఎస్ఎంఈ రంగానికి ఊరట

డీమోనిటైజేషన్, జీఎస్‌టీతో చతికిలబడిన సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి (ఎంఎస్ఎంఈ) సంస్థలకు ఆర్‌బీఐ కొంత ఊరట కల్పించే ప్రయత్నం చేసింది. బ్యాంకులకు తమ బకాయిలను తీర్చేందుకు అదనంగా మరో 6 నెలలు (180 రోజులు) గడువు ఇవ్వనున్నట్టు తెలిపింది. జీఎస్‌టీ ఇక్కట్లను పరిగణనలోకి తీసుకున్న ఆర్‌బీఐ జీఎస్‌టీ కింద నమోదైన సంస్థలకు రుణాల తిరిగి చెల్లింపుల్లో (రూ.25 కోట్ల వరకు) వెసులుబాటు కల్పించింది.

ఊహించిందే: బ్యాంకర్లు

ఆర్‌బీఐ నిర్ణయం తమ అంచనాలకు అనుగుణంగానే ఉందని బ్యాంకర్లు పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో అర్థ భాగంలో తగ్గుముఖం పడితే బాండ్లపై సానుకూల ప్రభావం ఉంటుందని అభిప్రాయపడింది.



ఆర్‌బీఐ యథాతథ స్థితి ఊహించిందే. ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయికి వస్తుందన్న అంచనాలు బాండ్ల మార్కెట్‌కు సానుకూలం.

– రజనీష్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్



పెట్టుబడులు, ఎగుమతుల్లో వృద్ధి, భారీ రుణ గ్రహీతలకు అసెట్ రిజల్యూషన్, రుణాల వృద్ధి తదితర అంశాలు వృద్ధికి దోహదపడతాయని సెంట్రల్ బ్యాంకు పేర్కొనడం స్వాగతించదగినది.

– చందాకొచర్, ఐసీఐసీఐ బ్యాంకు సీఈవో

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

వస్తువు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,500 (కనిష్టం), రూ.4,900 (గరిష్టం)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.7,000 (కనిష్టం), రూ.9,700 (గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	--, --
ఉల్లి (కర్నూలు)	--, --
చక్కెర (చెన్నై)	రూ.3,500
బియ్యం (కరీంనగర్)	3,800 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,200
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	--

లాభాల్లోంచి... నష్టాల్లోకి..!

వరుసగా ఏడవ రోజూ నష్టాలు

- మధ్యాహ్నం లాభాల స్వీకరణ
- 113 పాయింట్లు పతనమై 34,083కు సెన్సెక్స్
- 22 పాయింట్లు నష్టపోయి 10,477కు నిఫ్టీ

స్టాక్ మార్కెట్ నష్టాలు వరుసగా ఏడో రోజూ కొనసాగాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభ, నష్టాల మధ్య కదలాడిన స్టాక్ సూచీలు చివరకు నష్టాలతో ముగిశాయి. అంచనాలకు అనుగుణంగానే ఆర్‌బీఐ కీలక రేట్లలో యథాతథస్థితిని కొనసాగించినప్పటికీ, వృద్ధి అంచనాలను తగ్గించడం ప్రతికూల ప్రభావం చూపించింది. అయితే కొన్ని వడ్డీరేట్ల ప్రభావిత రియల్టీ, వాహన షేర్లు లాభపడటంతో నష్టాలు తగ్గాయి. ఆర్‌బీఐ పాలసీ తర్వాత బ్యాంక్ షేర్లు క్షీణించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 113 పాయింట్లు నష్టపోయి 34,083 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 22 పాయింట్ల నష్టంతో 10,477 పాయింట్ల వద్ద ముగిశాయి. మొత్తం మీద గత ఏడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2,200 పాయింట్లు నష్టపోయింది.

658 పాయింట్ల రేంజ్‌లో కదిలిన సెన్సెక్స్

గత రెండు రోజుల్లో అల్లకల్లోలం సృష్టించిన అమెరికా స్టాక్ మార్కెట్ బుధవారం శాంతించడంతో అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు ఊపిరి పీల్చుకున్నాయి. ఈ సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో మన స్టాక్ సూచీలు లాభాల్లో ఆరంభమయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 470 పాయింట్ల వరకూ పెరగ్గా, నిఫ్టీ 10,600 పాయింట్ల పైకి ఎగబాకింది. ఈ స్థాయి లాభాల కారణంగా ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో ఆ తర్వాత స్టాక్ సూచీలు నష్టాల్లోకి జారిపోయాయి. సెన్సెక్స్ ఒక దశలో 188 పాయింట్లు నష్టపోయింది. మొత్తం మీద 658 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇంట్రాడేలో నిఫ్టీ కూడా ఒక దశలో 116 పాయింట్లు లాభపడి, మరో దశలో 52 పాయింట్లు నష్టపోయింది.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	4,396
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	33,746
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	7,26,958
ఎఫ్ఐఐ	-1,022
డీఐఐ	461

ద్రవ్య పాలసీలో భాగంగా ఆర్‌బీఐ కీలక రేట్లలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయని నేపథ్యంలో వడ్డీరేట్ల ప్రభావిత బ్యాంక్, వాహన, రియల్టీ షేర్లు మిశ్రమంగా ముగిశాయి.

గెయిల్‌పై ఐఓసీ, బీపీసీఎల్ ఆసక్తి



న్యూఢిల్లీ: ఐఓసీ, బీపీసీఎల్ కంపెనీలు గెయిల్ ఇండియాను కొనుగోలు చేయటానికి ఆసక్తిగా ఉన్నాయని చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలియజేశారు. 'ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017-18 బడ్జెట్‌లో విలీనాలు, కొనుగోళ్లు, ఏకీకరణ వంటి మార్గాల్లో సమగ్రమైన చమురు సంస్థల ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలను ఆవిష్కరించారు. విలీనంతరం ఏర్పడే సంస్థలకు అధిక రిస్కును భరించే సామర్థ్యం వస్తుంది. భారీ పెట్టుబడి నిర్ణయాలు తీసుకోగలవు. విదేశీ, దేశీ ప్రైవేట్ రంగ కంపెనీలతో సమానమైన పనితీరును సాధించగలవు' అని ప్రధాన్ బుధవారం రాజ్యసభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

యాంబీ వ్యాలీపై మహీంద్రా, పిరమల్ దృష్టి

న్యూఢిల్లీ: పుణేలోని సహారాకు చెందిన యాంబీ వ్యాలీ కొనుగోలుకు రెండు దేశీయ కంపెనీలు– మహీంద్రా లైఫ్ స్పేస్ డెవలపర్స్, పిరమల్ గ్రూపు ఆసక్తి చూపిస్తున్నాయి. బాంబే హైకోర్టు అధికారిక లిక్విడేటర్ అత్యున్నత న్యాయస్థానానికి ఈ విషయాన్ని తెలిపారు. అయితే ప్రస్తుతానికి ఆయా అంశాలు పరిశీలన దశలోనే ఉన్నాయన్నారు. ఆస్తుల అమ్మకానికి తగిన అనుమతులు మంజూరు చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని లిక్విడేటర్ కోరారు. దీనిని సుప్రీం ఆమోదించింది. బిడ్డర్లు ముందుకు రాకపోవడంతో, గడచిన అక్టోబర్, జనవరిల్లో ప్రారంభించిన వేలం ప్రక్రియ విఫలమైన సంగతి తెలిసిందే. మదుపరులకు రెండు సహారా గ్రూప్ కంపెనీలు దాదాపు రూ.25,000 కోట్ల పునఃచెల్లింపుల కేసులో యాంబీ వ్యాలీ వేలానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

బోర్డ్ మీటింగ్స్

భెల్, సెయిల్, ఏసీసీ, ఆంధ్రాబ్యాంక్, సీఈఎస్‌సీ, భారత్ ఫోర్జ్, ధనలక్ష్మీ బ్యాంక్, ఫ్యూచర్ కన్స్యూమర్, గ్లెన్‌మార్క్ ఫార్మా, టాటా కమ్యూనికేషన్స్, రిలయన్స్ క్యాపిటల్, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, క్యాడిలా హెల్త్‌కేర్, జైప్రకాశ్ పవర్ వెంచర్స్, మణప్పురమ్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, పేజ్ ఇండస్ట్రీస్, టొరంట్ ఫార్మా, ట్రెంట్, టీవీ టుడే, ఏబీబీ లిమిటెడ్, బజాజ్ ఎలక్ట్రికల్స్, బామర్ లారీ

12వ క్వార్టర్లోనూ స్పైస్‌జెట్‌కు లాభాలు



ముంబై: చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో 32 శాతం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.181 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ3లో రూ.240 కోట్లకు పెరిగినట్లు కంపెనీ తెలియజేసింది. తమ కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక క్వార్టర్లీ లాభమని స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ చెప్పారు. ముడి చమురు ధరలు 17 శాతం ఎగిసినా, ఇతర వ్యయాలు 3 శాతం పెరిగినా, ప్రయాణికుల ఆదాయం అధికంగా ఉండటంతో ఈ స్థాయిలో నికర లాభం సాధించామని చెప్పారు. వరుసగా 12వ క్వార్టర్‌లోనూ లాభాల్లో ఉన్నామంటూ... గత క్యూ3లో రూ1,642 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం ఈ క్యూ3లో రూ.2,082 కోట్లకు పెరిగిందని తెలియజేశారు.

ఐషర్ మోటార్స్ లాభం రూ. 520 కోట్లు

న్యూఢిల్లీ: రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఇతర వాణిజ్య వాహనాలు తయారు చేసే ఐషర్ మోటార్స్ కంపెనీ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.520 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత క్యూ3లో సాధించిన నికర లాభం రూ.418 కోట్లతో పోలిస్తే 24 శాతం వృద్ధి సాధించామని ఐషర్ మోటార్స్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.2,071 కోట్ల నుంచి రూ.2,269 కోట్లకు పెరిగిందని కంపెనీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ లాల్ పేర్కొన్నారు. నిర్వహణ లాభం 23 శాతం వృద్ధితో రూ.707 కోట్లకు పెరిగిందని, మార్జిన్ 31.2 శాతంగా నమోదైందని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ అమ్మకాలు 19 శాతం వృద్ధితో 2,06,000కు పెరిగాయని గత క్యూ3లో 27 శాతంగా ఉన్న ఈ బైక్‌ల మార్కెట్ వాటా ఈ క్యూ3లో 31 శాతానికి పెరిగిందని తెలిపారు. ఎగుమతులు 68 శాతం వృద్ధి చెందాయని వివరించారు. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్‌ఈ ఇంట్రాడేలో ఈ షేర్ 3 శాతం వరకూ ఎగసి, చివరకు 1 శాతం లాభంతో రూ.27,911 వద్ద ముగిసింది.

మహీంద్రా 'ట్రాక్టర్ బాజీ' ప్రారంభం

దేశంలో తొలిసారిగా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు



ఎక్స్ఛేంజ్ ట్రాక్టర్ బజార్‌ను ప్రారంభిస్తున్న ఎంఅండ్ఎం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్రతో సాహా

పాలమూరు: మహీంద్రా గ్రూపు సెకండ్ హ్యాండ్ ట్రాక్టర్ల విక్రయంలోకి అధికారికంగా ప్రవేశించింది. దేశంలోనే తొలిసారిగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 'ట్రాక్టర్ బాజీ' పేరిట బుధవారం ఈ కేంద్రాన్ని ఎం అండ్ ఎం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుబ్రతో సాహా, జోనల్–1 హెడ్ విజయ్‌శర్మ, తెలంగాణ రీజినల్ మేనేజర్ మహావీర్ మాథూర్ ఆరంభించారు. పాత ట్రాక్టర్లకు మరమ్మత్తు చేసి టీఆర్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసి కొత్త ఆర్‌సీ ఇవ్వడంతో పాటు లబ్ధిదారుడికి ఏడాది వారంటీ ఇవ్వడం ఈ 'ట్రాక్టర్ బాజీ' ప్రత్యేకత. షోరూమ్‌ను ప్రారంభించిన అనంతరం సుబ్రతో సాహా, స్థానిక జయరామ ఆటోమొబైల్స్ ఎండీ బెక్కరి రాంరెడ్డి విలేకరులతో మాట్లాడారు. బయటి మార్కెట్ కంటే ఈ ఎక్స్ఛేంజ్ బజార్‌లో తక్కువ ధరలు ఉంటాయని, పాత ట్రాక్టర్‌ను పూర్తిగా 81 రకాల మరమ్మతులు చేసి కొత్త ట్రాక్టర్‌గా మార్చు చేసి విక్రయిస్తామని చెప్పారు. ''ట్రాక్టర్ బాజీ వెబ్‌సైట్ ద్వారా కూడా కొనుగోలు చేయొచ్చు. పాత ట్రాక్టర్ ఇచ్చి కొత్త ట్రాక్టర్ కొనే అవకాశంతో పాటు కేవలం ట్రాక్టర్‌ను విక్రయించటం కూడా చేయొచ్చు'' అని తెలియజేశారు.

అరబిందో లాభం రూ.595 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ కంపెనీ అరబిందో ఫార్మా డిసెంబరు త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో స్వల్ప వృద్ధి నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నికరలాభం 2.8 శాతం పెరిగి రూ.595 కోట్లకు చేరింది. టర్నోవర్ 11 శాతం పెరిగి రూ.4,336 కోట్లకు ఎగసింది. 2017–18 ఏప్రిల్–డిసెంబర్ కాలంలో రూ.12,450 కోట్ల టర్నోవరుపై సంస్థ రూ.1,894 కోట్ల నికరలాభం నమోదు చేసింది. ఫార్ములేషన్ అమ్మకాల్లో యూఎస్ 9.4 శాతం, యూరప్ 37 శాతం వృద్ధిని కనబరిచాయి. కీలక మార్కెట్లు చక్కని పనితీరు కొనసాగిస్తున్నాయని అరబిందో ఫార్మా ఎండీ ఎన్.గోవిందరాజన్ ఈ సందర్భంగా చెప్పారు. 2017–18 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.1 రెండవ మధ్యంతర డివిడెండు చెల్లించాలని బోర్డు నిర్ణయించింది.

మూడింతలైన గాయత్రి లాభం

డిసెంబర్ క్వార్టరు స్టాండలోన్ ఫలితాల్లో గాయత్రి ప్రాజెక్ట్స్ నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే మూడు రెట్లకు పైగా పెరిగి రూ.46.5 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.521 కోట్ల నుంచి రూ.908 కోట్లకు ఎగసింది. 2017–18 ఏప్రిల్–డిసెంబర్ కాలంలో రూ.1,992 కోట్ల టర్నోవరుపై రూ.115 కోట్ల నికరలాభం నమోదైంది.

స్వల్పంగా తగ్గిన హెచ్‌బీఎల్ లాభం..

డిసెంబరు త్రైమాసికం స్టాండలోన్ ఫలితాల్లో హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ నికరలాభం క్రితంతో పోలిస్తే రూ.9.6 కోట్ల నుంచి రూ.8.8 కోట్లకు వచ్చి చేరింది. టర్నోవరు రూ.385 కోట్ల నుంచి రూ.417 కోట్లకు ఎగసింది.

కావేరీ లాభం రూ.6.9 కోట్లు..

గడచిన త్రైమాసికంలో కావేరీ సీడ్ కంపెనీ నికరలాభం అంతక్రితం ఏడాదితో పోలిస్తే రూ.5.2 కోట్ల నుంచి రూ.6.9 కోట్లకు చేరింది. టర్నోవరు రూ.78 కోట్ల నుంచి రూ.72 కోట్లకు వచ్చి చేరింది.

ఓల్టాస్ లాభం రూ.100 కోట్లు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన ఓల్టాస్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్లో రూ.100 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో సాధించిన నికర లాభం రూ.82 కోట్లతో పోలిస్తే నికర లాభం ఈ క్యూ3లో 23 శాతం వృద్ధి చెందిందని ఓల్టాస్ తెలిపింది. ఆదాయం రూ.1,200 కోట్ల నుంచి రూ.1,375 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం 43 శాతం వృద్ధితో రూ.119 కోట్లకు, ఇబిటా మార్జిన్ 1.5 శాతం వృద్ధితో 8.6 శాతానికి పెరిగాయి. ఆర్థిక ఫలితాలు బాగుండటంతో స్టాక్ మార్కెట్ నష్టపోయినా, బీఎస్‌ఈలో ఓల్టాస్ షేర్ 2.4 శాతం లాభపడి రూ.600 వద్ద ముగిసింది.

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లాభం రెట్టింపు

న్యూఢిల్లీ: రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో వంద శాతం వృద్ధి చెందింది. గత క్యూ3లో రూ.23 కోట్లుగా ఉన్న కంపెనీ నికర లాభం ఈ క్యూ3లో రూ.46 కోట్లకు పెరిగిందని రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ తెలిపింది. ఆదాయం అధికంగా రావడంతో నికర లాభం ఈ స్థాయిలో పెరిగినట్లు కంపెనీ ఈడీ, సీఈఓ రవీంద్ర సుధాల్కర్ చెప్పారు. మొత్తం ఆదాయం రూ.270 కోట్ల నుంచి 56 శాతం వృద్ధితో రూ.421 కోట్లకు చేరుకుంది. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో బీఎస్‌ఈలో కంపెనీ షేర్ 1 శాతం లాభంతో రూ.69 వద్ద ముగిసింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	30,385	▼	265
బంగారం (99.5, 10గ్రా)	30,235	▼	265
వెండి (కిలో)	38,435	▼	340
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	--		
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	220
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	30,330	▼	240
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	220
వెండి (కిలో)	41,500	▼	300
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	30,850	▼	150
బంగారం (22 క్యారెట్లు)	28,610	▼	240
వెండి (కిలో)	39,700	▼	400
విశాఖపట్నం			
బంగారం(24 క్యారెట్లు)	31,040	▼	410
బంగారం (22 క్యారెట్లు)	28,870	▼	380
వెండి (కిలో)	40,900		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	31,500	▲	150
బంగారం (22 క్యారెట్లు)	28,800		0
వెండి(కిలో)	39,200	▼	500
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	31,240	▼	240
బంగారం (22 క్యారెట్లు)	28,890	▼	220
వెండి (కిలో)	39,500	▼	300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.00కు	మంగళవారం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	61.83	$63.39
బ్రెంట్	65.57	$66.86

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్/100కు రూ.లలో) 08-2-2018

విశాఖ	340–00
చిత్తూరు	373–00
వరంగల్	347–00
ముంబై	390–00
చెన్నై	380–00
విజయవాడ	335–00
గోదావరి	335–00
నమక్కల్	365–00
07-2-2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	345–00
రిటైల్ (ఒక గుడ్డు)	4.05
బెంగళూరు	365–00
ఢిల్లీ	365–00
కోల్‌కతా	373–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PO	407	404.8
AMBUJA C	248.3	255.3
ASIAN PA	1121.1	1110.25
AXIS BAN	559.35	563.7
BAJAJ AU	3135.55	3135.1
BAJAJ FI	1641.65	1662.15

A B C D

3M INDIA	18468.85	18462
5PAISA C	283.3	273.35
63 MOONS	94.85	90.35
8K MILES	726.2	615.2
AARTI DR	608	594
AARTI IN	1125.65	1100.25
AARVI EN	88.2	92.8
ABAN OFF	188.25	180.3
ABBOTT I	5355.15	5250.75
BASF IND	2003.25	1971.6
BATA IND	697.05	681.75
BAYER CR	3993.8	4105.65
BEARDSEL	58.95	55.7
BEML LIM	1212.9	1203.6
BERGER P	247.35	241.5
BETA DRU	155	148.35
BF INVES	285.25	272.55
BF UTILI	428.95	418.9
BGR ENER	120.75	117.35
BHAGERIA	307.2	294.45
BHANSALI	167.55	159.6
DEWAN HO	500.2	505.55
DFM FOOD	1603.05	1587.25
DHAMPUR	192.2	188.5
DHANUKA	669.6	655.7
DHUNSERI	136.9	130.4
DHUNSERI	421.65	383.1
DHUNSERI	422.5	403.85
DIC INDI	527.2	530.35
DILIP BU	861.25	814.7
DISH TV	75	73.8
DISHMAN	346.85	346.35
DIXON TE	3852.25	3622.15

E F G H

GRINDWEL	501.5	500.3
GRP LIMI	1398.8	1384.55
GRUH FIN	514	518.45
GTPL HAT	155.15	150.25
GUFIC BI	118.15	110.1
GUJ IND	115.9	114.25
GUJ NAR	439.65	417.15
GUJ STAT	125.55	120.1
GUJ. APO	215.4	201.3
GUJARAT	141.4	134.1
GUJARAT	140.95	138.4
GUJARAT	202.75	193.05

I J K L

JAGRAN P	162.5	163.7
JAI CORP	153.2	151.2
JAIN DVR	69.95	69.15
JAIN IRR	111.85	113.65
JALAN TR	56.65	56.5
JAMNA AU	78.7	80.25
JASH ENG	176	169.3
JAY BHAR	484.9	476.2
JAYANT A	353.35	331.9
JAYSHREE	102.4	97.55
JBF INDU	171.05	167.45
JBM AUTO	460.7	408.95

M N O P

MAHINDRA	213.1	205.5
MAHINDRA	301.15	298.05
MAHINDRA	463.05	466.1
MAHINDRA	469.65	466.15
MAITHAN	849.35	862.3
MAJESCO	503.45	511.6
MAN INDU	121.4	117.95
MAN INFR	58.7	57.3
MANAKSIA	64.25	63
MANAPPUR	104.3	102.55
MANG.CHE	62.3	60.7
MANGALAM	164.8	155.3
PENNAR I	59.45	55.75
PERSISTE	758.85	784.6
PETRON E	128.7	120.45
PFIZER L	2272.85	2181.9
PG ELECT	321.6	294.8
PHILIPS	999	951.45
PI INDUS	823.8	820.65
PIONEER	183.65	177.1
PLASTIBL	203.7	193.9
PNB HOUS	1237.7	1280.55
PNC INFR	166.7	161.45
PODDAR H	1120.05	1143.85

R S T U

SETCO AU	62.1	57.85
SHAKTI P	561.75	539.4
SHALBY L	235.35	233.2
SHALIM P	173.3	171.85
SHANKARA	1710.7	1640.7
SHANTHI	143.2	134.4
SHARDA C	391.65	400.95
SHARDA M	2276	2233.7
SHEELA F	1615.4	1598.75
SHEMAROO	512.45	518.55
SHILPA M	511.1	518.75
SHIPPING	74.2	70.85
THE HI-T	449.45	450.45
THE INDI	131.85	135.5
THE INDI	152.8	150.7
THE MAND	144.3	139.3
THE NEW	674.8	672.1
THE PHOE	615.65	600.25
THE RAMC	730.45	732.85
THE RUBY	335.1	334
THE STAT	151.1	144.55
THE TINP	228.4	222.55
THEMIS M	575.6	556.2
THERMAX	1175.9	1152.8

V W X Z

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

బీఎస్‌ఈ ఎస్ఎంఈ, ఎమర్జ్

వైద్యవిధాన పరిషత్ ఉద్యోగులకే హెల్త్‌కార్డుల్లేవు

ట్రెజరీ ద్వారా వేతనం అందుకోకపోవడమే కారణం

సాక్షి, అమరావతి: వేరే శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెల్త్‌కార్డులు లేవంటే ఏమో అనుకోవచ్చు.. కానీ వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్న జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న ఐదు వేల మంది ఉద్యోగులకు ఇప్పటికీ హెల్త్‌కార్డులు మంజూరు చేయలేదు. వీరిలో వైద్యులు, ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్‌టెక్నీషియన్లు తదితర ఉద్యోగులున్నారు. ట్రెజరీ ద్వారా వేతనాలు తీసుకోవడం లేదన్న ఒకే ఒక్క కారణంతో వీరికి హెల్త్ కార్డులు ఇవ్వడం లేదు. వీరితో పాటు ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న వారికీ కార్డులు ఇవ్వలేదు. దీనిపై ఇప్పటికే వందల సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చామని, కమిటీల మీద కమిటీలంటూ కాలయాపన చేస్తున్నారని వైద్యవిధాన పరిషత్ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకే ఆరోగ్య కార్డులు లేకపోతే మిగతావారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమవద్దకు హెల్త్‌కార్డు తీసుకొచ్చి వైద్యం చేయించుకుంటూంటే తమకు మాత్రం ఆ భాగ్యం దక్కడం లేదని ఏపీ వైద్యవిధానపరిషత్ ఉద్యోగులు వాపోతున్నారు.

పునరావాస కాలనీల్లో చావు డప్పు

విలవిల్లాడుతున్న వంశధార నిర్వాసితులు

- సొంత గ్రామాల నుంచి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలింపు
- గుడారాల్లోనే నివాసం.. తీవ్రమైన చలి, అనారోగ్యం
- 40 రోజుల్లో 12 మంది మృతి
- అవి ప్రభుత్వ హత్యలేనంటున్న నిర్వాసితులు

కొత్తూరు

శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు కోసం విలువైన తమ భూములు, ఇళ్లను వదులుకొని పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న నిర్వాసితుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కాలనీల్లో చావుడప్పు మోగుతోంది. అరకొర సౌకర్యాలు, తీవ్రమైన చలి, అనారోగ్యం బారిన పడి నిర్వాసితులు మృత్యు ఒడికి చేరుతున్నారు. 40 రోజుల్లో ఏకంగా 12 మంది మరణించడం గమనార్హం. ఇవన్నీ ప్రభుత్వం చేసిన హత్యలేనని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తూరు మండలం మహసింగి గూడ పునరావాస కాలనీలో నిర్వాసితుల గుడారాలు

భూములు కోల్పోయి మనోవేదన

వంశధార ప్రాజెక్టు పరిధిలోని 19 గ్రామాల్లో ఉంటున్న 7 వేల కుటుంబాలను డిసెంబర్, జనవరిలో అధికారులు ఖాళీ చేయించారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి మండలాల్లో 19 గ్రామాలకు చెందిన నిర్వాసితుల కోసం మోట్టూరు, గూనభద్ర, మహసింగిగూడ, శ్యామలాపురం, గాజుల కొల్లివలస, జన్నధాపురం, మల్లికార్జుననగరం తదితర ప్రాంతాల్లో పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. అక్కడ పక్కా ఇళ్లను నిర్మించకపోవడంతో నిర్వాసితులు గుడారాలు వేసుకొని జీవిస్తున్నారు. గత 40 రోజుల నుంచి గుడారాల్లోనే బతుకు వెళ్లదీస్తున్నారు. వృద్ధులు చలికి తట్టుకోలేక, అనారోగ్యానికి గురై కన్నుమూస్తుండగా, మరికొందరు భూములు, ఇళ్లు కోల్పోయి మనోవేదనతో ప్రాణాలు వదులుతున్నారు.


మూడు నెలల గడువు ఇచ్చి ఉంటే..

కొత్తూరు మండలంలోని మహసింగిగూడ వద్ద పాడలి, చిన్నసంకిలి, గదవపేట నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీలో వృద్ధులు అక్కెన దాలయ్య (65), అక్కెన లచ్చయ్య (75) చలికి తట్టుకోలేక చనిపోయారు. పునరావాస కాలనీకి చేరిన 15 రోజుల్లోనే వీరిద్దరూ మృత్యువాత పడ్డారు. అలాగే మెట్టూరు బిట్–3 పునరావాస కాలనీలో అడివరపు కృష్ణయ్య, పోర్న అచ్చెమ్మ, చవిడాన నడిపమ్మ, గులివిందల పారమ్మ, చింతాడ గవిరేష్, పి.జోగినాయుడు, పొడ్డిన భాస్కరరావు, కుండింగి జగన్నాయకులు, సురవరపు నారాయణమ్మ అనే నిర్వాసితులు ఇటీవల మృతిచెందారు. ఎల్.ఎన్.పేట మండలం థులగాం కాలనీలో జి.తవిటమ్మలతోపాటు పలువురు మరణించారు. సొంత గ్రామాల నుంచి బలవంతంగా ఖాళీ చేయించకుండా మరో మూడు నెలలు సమయం ఇచ్చిఉంటే ఈ మరణాలు సంభవించేవి కావని నిర్వాసితులు చెబుతున్నారు. గడువు ఇచ్చి ఉంటే పునరావాస కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుని, చలి బారినుంచి తప్పించుకునేవాళ్లమని అంటున్నారు.



కొత్తూరు మండంలోని మహసింగి గూడ వద్ద పునరావాస కాలనీ

ఇల్లు, పొలం పోవడంతో..



''అధికారులు ఉన్నట్టుండి పునరావాస కాలనీల్లోకి మమ్మల్ని నెట్టేశారు. కాలనీలో గుడారాలు వేసుకొని కాలం గడుపుతున్నాం. చలికి తట్టులేకపోవడంతో పాటు ఇల్లు, పొలం కోల్పోవడంతో నా భర్త లచ్చయ్య మానసికంగా ఆవేదనకు గురై మృతి చెందాడు''

– నివిర్తి పారమ్మ, నిర్వాసితురాలు

భర్తను కోల్పోయాను



''వంశధార ప్రాజెక్టు కోసం పదేళ్ల క్రితం మాకున్న 4 ఎకరాలు పొలాన్ని ప్రభుత్వం తీసుకుంది. అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇటీవల మా సొంతూరు పాడలి నుంచి అధికారులు దౌర్జన్యంగా పంపించారు. దీంతో నా భర్త దాలెయ్య మనస్తాపంతో మంచం పట్టాడు. పునరావాస కాలనీలో గుడారాలు వేసుకొని ఉంటున్నాం. చలికి తట్టుకోలేక నా భర్త చనిపోయాడు''

– అక్కెన చిన్నమ్మి, నిర్వాసితురాలు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ పి.అశోక్ బాబు అన్నారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు కోరుతూ 10న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎస్ కేంద్ర, రాష్ట్రాలు ఎవరి పరిధిలో ఉన్నప్పటికీ ఉద్యోగుల భవిష్యత్ దృష్ట్యా పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. 25న జేఏసీ భేటీలో ఉద్యోగుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ మాట్లాడుతూ 2004 నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ చేసిన, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం లేకపోవడంతో వీధిన పడ్డారన్నారు. సీపీఎస్ విధానంతో 1.86 లక్షల మంది ఉద్యోగుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందన్నారు. జేఏసీ నేతలు బండి శ్రీనివాసరావు, ఎస్.చంద్రశేఖరరెడ్డి, కుళ్లాయప్ప, ఏవీ నరసింహారావు, భాస్కరరావు, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుదివరకు వైఎస్ జగన్‌తోనే కలిసి నడుస్తాం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, ముస్తఫా



కోన రఘుపతి



మహ్మద్ ముస్తఫా

బాపట్ల/పట్నం బజారు (గుంటూరు): తుదివరకు తాము వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగు జాడల్లోనే నడుస్తామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, షేక్ మహ్మద్ ముస్తఫా బుధవారం స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నట్టు మీడియాలో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభానికి ఆహ్వానం ఉన్న నేపథ్యంలో అక్కడకు వెళ్లిన సందర్భంగా ఉపరాష్ట్రపతిని, సీఎంను కలిశానే తప్ప, పార్టీ మారే ఉద్దేశం ఏమాత్రం లేదని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా అన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిందే వైఎస్ జగన్ అని, ఆయన్ను వీడి వెళ్లనని తేల్చి చెప్పారు. నెల్లూరు జిల్లాలో జగన్ ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో తాను పాల్గొంటే మరోవైపు ఇటువంటి వార్తలు రాయడం సరికాదన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే ఊపిరిగా తాను బతుకుతున్నానని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి స్పష్టం చేశారు. బాపట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడేదిలేదన్నారు. టిక్కెట్‌రాదని గానీ, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేమనే అధైర్యం గానీ తనకు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బాపట్లలో వైఎస్సార్‌సీపీ గెలుపొందుతుందని చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వైఎస్సార్ జిల్లా కామసముద్రంలో ఘటన

లింగాల: అప్పులబాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వైఎస్సార్ జిల్లా లింగాల మండలం కామసముద్రంలో బుధవారం చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోతిరెడ్డి రామాంజులరెడ్డి(48)కి మూడు ఎకరాల పొలం ఉంది. రెండు బోరుబావులు తవ్వించి రెండు ఎకరాల్లో చీనీతోట వేశాడు. అయితే దిగుబడి అంతంతమాత్రం కావడంతో ఫలితంలేకుండా పోతోంది. దీనికి తోడు ఇంటి నిర్మాణం ప్రారంభించిన రామాంజులరెడ్డికి ప్రభుత్వం పక్కాగృహం మంజూరు చేయకపోవడంతో భారం మరింత పెరిగింది. వ్యవసాయ బోర్లు తవ్వకానికి, పిల్లల చదువు, కుమార్తె పెళ్లి కోసం సుమారు రూ.29 లక్షలు అప్పు చేశాడు. బలపనూరు స్టేట్ బ్యాంక్‌లో ఆతని పేరిట రూ.లక్ష, భార్య శకుంతల పేరుతో మరో లక్ష రూపాయలు రుణం తీసుకున్నారు. హెచ్‌డీఎఫ్‌సీలో రూ.5లక్షలు, ప్రైవేట్ అప్పులు రూ.20 లక్షలు ఉన్నాయి. 2014లో రూ.1.5 లక్షలు రుణమాఫీ అయ్యింది కానీ.. విడత వారీగా వస్తుండటంతో బ్యాంక్ వడ్డీలకు కూడా సరిపోవడంలేదు. అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో ఇటీవల రెండు ఎకరాల పొలాన్ని గ్రామంలోని ఓ రైతుకు ఆయకం రిజిష్టర్ చేయించి రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు.

దీంతో అప్పులిచ్చిన వారు బాకీలు తీర్చాలని ఒత్తిడిచేయడంతో చేసేదిలేక బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగాడని బంధువులు తెలిపారు. కుటుంబసభ్యులు గమనించి పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్స కోసం కడప తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. రామాంజులరెడ్డికి భార్య శకుంతల, ఒక కూతురు, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్య చేసుకున్న రైతు రామాంజులరెడ్డి

అదనపు కట్నం కోసం భార్యను చంపిన భర్త

బెల్లంకొండ (పెదకూరపాడు): వరకట్నం కోసం నిత్యం వేధిస్తూ కట్టుకున్న భర్తే భార్యను గొంతు నులిమి చంపివేశాడు. గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పిడుగురాళ్ల రూరల్ సీఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాజుపాలెంకు చెందిన వల్లాల అనూష (19)కు రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఏడుకొండలుతో వివాహమైంది. వీరికి ఏడు నెలల పాప ఉంది. అనూష తల్లిదండ్రులు బొల్లాపల్లి మండలంలో నివాసం ఉంటున్నారు. పాప పుట్టినప్పటి నుంచి అనూషను అదనపు కట్నం కోసం నిత్యం భర్త వేధింపులకు గురిచేస్తూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బాలింత అయిన అనూషను గట్టిగా వీపుపై గుద్ది కింద పడవేసి, తాడుతో గొంతుకు వేసి నులిమి చంపాడు.



మృతురాలు అనూష

'పెంపుడు కుక్కలపై పరిశోధనలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి'

గన్నవరం: పెంపుడు కుక్కల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణ, నివారణపై అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన అవసరముందని ఆరోగ్య సంరక్షణ నిపుణుల సంస్థ భారతదేశ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ పీకే ఉప్పల్ అన్నారు. ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టులో శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల పశు వైద్య చికిత్స విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరగనున్న 'పెంపుడు కుక్కల ఆరోగ్యం– వ్యాధి నిర్ధారణ– నివారణ'పై అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు దేశ, విదేశాలకు చెందిన 300 మంది పశువైద్య శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెంపుడు కుక్కల పెంపకంలో వాటి ఆరోగ్యం, పోషణ, జన్యుపరమైన అంశాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని తెలిపారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య వర్సిటీ వీసీ వై. హరిబాబు మాట్లాడుతూ.. కుక్కలకు వచ్చే వ్యాధులను ముందుగానే నిర్ధారించి నివారణ చర్యలు తీసుకోవడంపై తమ వర్సిటీ పరిశోధనలను కొనసాగిస్తుందని చెప్పారు. తిరుపతిని దేశంలోనే రేబిస్ వ్యాధిరహిత నగరంగా తీర్చిదిద్దటమే ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వైకుంఠరావు రచించిన పెంపుడు కుక్కల గుండె సంబంధిత వ్యాధుల పరిరక్షణపై పుస్తకాన్ని అవిష్కరించారు. కార్యక్రమంలో పశ్చిమబంగా పశువైద్య వర్సిటీ పూర్ణేందు బిశ్వాస్, రాజస్థాన్ పశువైద్య వర్సిటీ మాజీ వీసీ ఏకే గెహ్లట్, వెటర్నరీ ఫ్యాకల్టీ డీన్ చంద్రశేఖర్‌రావు, ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉప్పల్, అతిథులు

మోదీ.. గాడ్సే వారసుడు: రామకృష్ణ

కల్లూరు (రూరల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతిపిత గాంధీజీకి కాదు.. ఆయన్ను చంపిన గాడ్సేకి వారసుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. బుధవారం కర్నూలులోని దేవి ఫంక్షన్ హాలులో సీపీఐ 22వ జిల్లా మహాసభలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ మోదీ పెద్ద డ్రామా అర్టిస్ట్ అని, కార్పొరేట్ వర్గాలకే కొమ్ముకాస్తున్నారన్నారు. సంఘ్ పరివార్ గూండాలు దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని, 30 మందిని చంపేశారని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ విషయంలో మోదీనే కాదు.. వాళ్ల అబ్బను కూడా ప్రశ్నిస్తామన్నారు. ఎంపీలు చేతగాని దద్దమ్మలు కావడం వల్లే రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం మూడేళ్లలోనే రూ.1.30 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సంతలో పశువులను కొన్నట్లు ఎమ్మెల్యేలను డబ్బులిచ్చి కొనుగోలు చేశారని, నీతిమాలిన రాజకీయాలు, మోదీ పాలనకు వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయంపై నేడు బంద్‌ను రాష్ట్రమంతా దద్దరిల్లేలా చేపడతామన్నారు. బంద్‌కు వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ మద్దతు ప్రకటించాయన్నారు. ఏప్రిల్ 7 నుంచి 9 వరకు కడపలో సీపీఐ 26వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

బ్రెయిన్‌డెడ్ అయిన పుల్లారెడ్డి అవయవ దానం



పుల్లారెడ్డి (ఫైల్)

గురజాలరూరల్: గుంటూరు జిల్లా గురజాల మండలంలోని జంగమహేశ్వరపురంలో ఆదివారం రాత్రి ప్రత్యర్థుల దాడిలో తలకు తీవ్ర గాయమై బ్రెయిన్‌డెడ్ అయిన యేసిరెడ్డి పుల్లారెడ్డి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. బుధవారం తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి అతని అవయవాలను పలు ఆస్పత్రులకు తరలించారు. మణిపాల్ ఆస్పత్రికి ఒక కిడ్నీ, మరో కిడ్నీని విజయవాడ ఆయుష్ ఆసుపత్రికి, నేత్రాలను గుంటూరు వాసన్ ఐ కేర్‌కు తరలించారు. అనంతరం పుల్లారెడ్డి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఆధార్ సేవలు

సాక్షి, అమరావతి: పోస్టల్ శాఖలో ఆధార్ సేవలు ఇకపై అందుబాటులోకి రానున్నాయి. ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేయడానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలోని 585 పోస్టల్ కార్యాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మార్చిలోపు 24 పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నం, చిత్తూరు నగరాల్లో పోస్ట్ పేమెంట్స్ బ్యాంకులను ప్రారంభించారు. ఖాతాదారుల ఇంటికి బ్యాంకు సేవలు అందుబాటులోకి వస్తాయి. పోస్ట్‌మన్, ఆ శాఖకు చెందిన గ్రామీణ డాక్ సేవక్‌లు ఖాతాదారుల ఇంటి వద్దకు వెళ్లి బ్యాంకింగ్ సేవలు అందచేస్తారు. పెన్షన్, బీమా, ఇతర చెల్లింపులను ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకు రానున్నారు. అదే విధంగా 80 పోస్టల్ ఏటీఎంలు ఏర్పాటు చేయనున్నారు.

10 నుంచి ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు సెలవులు

విజయవాడ (హెల్త్ యూనివర్సిటీ): ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఈనెల 10 నుంచి 13 వరకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ యలమంచిలి రాజారావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే మార్చి 10న (రెండో శనివారం) కౌన్సిల్ కార్యాలయం పనిచేస్తుందని తెలిపారు.

మీ అసమర్థతతోనే అన్యాయం

- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నేత కన్నబాబు విమర్శలు
- అపర చాణక్యత అంటే రాష్ట్రాన్ని నట్టేట ముంచడమేనా?



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అసమర్థత వల్లే కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కురసాల కన్నబాబు విమర్శించారు. విభజన అనంతరం నష్టాలకు ముఖ్యమంత్రే కారకుడని ధ్వజమెత్తారు. కేంద్రంలో భాగస్వామిగా కొనసాగుతూ ఏపీకి రావాల్సిన ప్రయోజనాలను సాధించటంలో విఫలమయ్యారని మండిపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆస్తుల విభజనలోనూ నష్టపోయాం

పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌లో ఉండే అవకాశం ఉన్నా తట్టాబుట్టా సర్దుకుని అమరావతికి రావడం వెనకున్న మతలబు ఏమిటో చంద్రబాబు చెప్పాలని కన్నబాబు నిలదీశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో విఫలమై ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించి చివరకు అది కూడా తేలేక చతికిలబడిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. అపర చాణక్యత అంటే రాష్ట్రాన్ని నట్టేట ముంచడమా? అని నిలదీశారు. రాష్ట్రం నష్టపోవడానికి చంద్రబాబే కారణమన్నారు. ఆస్తుల విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి సహా టీడీపీ నేతలు ఎవరూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదన్నారు.

ఏపీకి జరుగుతున్న అన్యాయంపై ఎందుకీ మౌనం?

జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని కమీషన్ల కక్కుర్తితో కేంద్రం నుంచి చంద్రబాబు లాక్కోవడం నిజం కాదా? అని కన్నబాబు ప్రశ్నించారు. నీటి కేటాయింపుల్లో అన్యాయం జరిగితే తెలంగాణ సర్కారును చంద్రబాబు కనీసం ప్రశ్నించలేకపోయారని విమర్శించారు. ప్రధాని లోక్‌సభలో మాట్లాడుతుండగా టీడీపీ ఎంపీలు నోరెత్తలేదన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాల్లో అవకవతవకలు జరిగితేనే ధర్నా చేస్తానన్న చంద్రబాబు ఇవాళ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఎందుకున్నారో చెప్పాలన్నారు. కేంద్రంలో మంత్రి పదవులు అనుభవిస్తూ మొసలి కన్నీరు కార్చుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా కోసం వామపక్షాలు తలపెట్టిన గురువారం నాటి బంద్‌కు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు.

భారత జట్టు మళ్లీ అదరగొట్టింది... మూడో టెస్టు నుంచి మొదలైన జోరు ఇప్పుడు మూడో వన్డే వరకు సాగింది... మరో ఏకపక్ష పోరులో సఫారీలను చిత్తు చేసిన టీమిండియా సిరీస్‌లో మన ఆధిక్యాన్ని మరింత బలంగా ప్రదర్శించింది. ముందుగా కోహ్లి వీరశతకం, ధావన్ దూకుడుతో చెలరేగిన భారత్... ఆ తర్వాత మళ్లీ తన స్పిన్ ఉచ్చులో దక్షిణాఫ్రికాను పడేసింది. ఇక తర్వాతి అంకం తొలిసారి సిరీస్ గెలుచుకొని సగర్వంగా నిలబడటమే.

ముచ్చటేసేలా...



4 వన్డేల్లో 400 మందిని అవుట్ చేయడంలో భాగమైన నాలుగో వికెట్ కీపర్ ధోని. సంగక్కర (482), గిల్‌క్రిస్ట్ (472), బౌచర్ (424) ముందున్నారు.

8 వన్డేల్లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్న ఎనిమిదో భారత బ్యాట్స్‌మన్‌గా కోహ్లి నిలిచాడు. ధోని (216) తొలి స్థానంలో ఉన్నాడు.

1 టెస్టుల్లో (14), వన్డేల్లో (12) అత్యధిక సెంచరీలు కొట్టిన భారత కెప్టెన్‌గా కోహ్లి రికార్డు.

1 ఒకే వన్డేలో భారత్ తరపున ఇద్దరు స్పిన్నర్లు నాలుగు వికెట్ల చొప్పున తీయడం ఇదే ప్రథమం.

మూడో వన్డేలోనూ భారత్ ఘన విజయం • 124 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు

కోహ్లి అజేయ శతకం • చెరో 4 వికెట్లు తీసిన కుల్దీప్, చహల్ • శనివారం నాలుగో వన్డే



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా గడ్డపై గత నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లలో కూడా ఓటమి పాలైన భారత్ ఇప్పుడు ఆ గండాన్ని మాత్రం దిగ్విజయంగా దాటేసింది. హ్యాట్రిక్ విజయంతో ఇక వన్డే సిరీస్ కోల్పోయే అవకాశం లేని స్థితిలో నిలిచింది. బుధవారం ఇక్కడ జరిగిన మూడో వన్డేలో భారత్ 124 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (159 బంతుల్లో 160 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకంతో చెలరేగగా... శిఖర్ ధావన్ (63 బంతుల్లో 76; 12 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం దక్షిణాఫ్రికా కుల్దీప్ (4/23), చహల్ (4/46) మాయాజాలానికి 40 ఓవర్లలో 179 పరుగులకే ఆలౌటైంది. జేపీ డుమిని (67 బంతుల్లో 51; 4 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. తాజా ఫలితంతో ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ 3–0తో పటిష్ట స్థితిలో నిలిచింది. నాలుగో వన్డే శనివారం జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

భారీ భాగస్వామ్యం...

దక్షిణాఫ్రికా గడ్డపై రోహిత్ శర్మ వైఫల్యం ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. రబడ వేసిన తొలి ఓవర్లోనే రోహిత్ (0) కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో సున్నా వద్దే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత కోహ్లి సున్నా పరుగుల వద్ద ఉన్నప్పుడు అంపైర్ ఎల్బీగా ప్రకటించినా... రివ్యూలో బంతి బ్యాట్‌ను తాకిందని తేలడంతో అతను బతికిపోయాడు. ఆ తర్వాత ధావన్, కోహ్లి ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. బలహీనంగా కనిపించిన సఫారీ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు దూసుకుపోయారు. ఎక్కడా తడబాటు లేకుండా వీరిద్దరు స్వేచ్ఛగా ఒకరితో మరొకరు పోటీ పడి పరుగులు సాధించారు. ముఖ్యంగా తొలి వన్డే ఆడుతున్న ఇన్‌గిడి 4 ఓవర్ల మొదటి స్పెల్‌లో భారత్ 6 ఫోర్లతో 29 పరుగులు రాబట్టింది. పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 10 ఫోర్లతో 50 పరుగులు చేసింది. ఈ జోరులో ధావన్ 42 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం 100 పరుగులు దాటిన తర్వాత 64 బంతుల్లో కోహ్లి కూడా హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అయితే డుమిని బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి ధావన్ వెనుదిరగడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. అనవసరపు షాట్‌కు ప్రయత్నించి రహానే (11) అవుట్ కాగా, పాండ్యా (14) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో దక్షిణాఫ్రికా కొంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేసింది. ఫలితంగా పరుగుల వేగం మందగించింది. ధోని (22 బంతుల్లో 10) పూర్తిగా నిరాశ పర్చగా... జాదవ్ (1) తనకు లభించిన అవకాశాన్ని వృథా చేసుకున్నాడు. అయితే భువనేశ్వర్ (16 నాటౌట్) అండగా నిలవడంతో కోహ్లి మళ్లీ జట్టు ఇన్నింగ్స్‌ను సరైన దారిలో పెట్టాడు. కోహ్లి, భువీ ఏడో వికెట్‌కు అభేద్యంగా 67 పరుగులు జోడించడం విశేషం. చివరి ఐదు ఓవర్లలో 47 పరుగులు రాబట్టిన భారత్ 300 పరుగుల స్కోరును దాటింది.

డుమిని మినహా...

పేసర్ బుమ్రా తాను వేసిన తొలి బంతికే ఆమ్లా (1)ను అవుట్ చేసి దక్షిణాఫ్రికాను దెబ్బ తీశాడు. ఈ దశలో కెప్టెన్ మార్క్‌రమ్ (42 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్), డుమిని కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. అయితే కుల్దీప్ తొలి ఓవర్లో ముందుకు వచ్చి ఆడటానికి ప్రయత్నించిన మార్క్‌రమ్‌ను ధోని స్టంపౌట్ చేయడంతో ఈ భాగస్వామ్యానికి తెర పడింది. ఆ తర్వాత చక్కటి బంతితో క్లాసెన్ (6)ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్న చహల్, తన తర్వాతి ఓవర్లో డుమినిని కూడా పెవిలియన్ పంపించాడు. ఆ తర్వాత మిల్లర్ (25) పోరాడే ప్రయత్నం చేసినా అది సరిపోలేదు. వరుస ఓవర్లలో మోరిస్ (14), జోండో (17) అవుట్ కాగా... ఫెలుక్‌వాయో (3)ను కుల్దీప్ దెబ్బ తీయడంతో దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు కోల్పోయింది.



ధావన్

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) రబడ 0; ధావన్ (సి) మార్క్‌రమ్ (బి) డుమిని 76; కోహ్లి (నాటౌట్) 160; రహానే (సి) ఫెలుక్‌వాయో (బి) డుమిని 11; పాండ్యా (సి) క్లాసెన్ (బి) మోరిస్ 14; ధోని (సి) ఇన్‌గిడి (బి) తాహిర్ 10; జాదవ్ (సి) క్లాసెన్ (బి) ఫెలుక్‌వాయో 1; భువనేశ్వర్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 303.**

వికెట్ల పతనం: 1–0; 2–140; 3–160; 4–188; 5–228; 6–236. **బౌలింగ్:** రబడ 10–1–54–1; ఇన్‌గిడి 6–0–47–0; మోరిస్ 9–0–45–1; ఫెలుక్‌వాయో 6–0–42–1; తాహిర్ 9–0–52–1; డుమిని 10–0–60–2.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఆమ్లా (ఎల్బీ) (బి) బుమ్రా 1; మార్క్‌రమ్ (స్టంప్డ్) ధోని (బి) కుల్దీప్ 32; డుమిని (ఎల్బీ) (బి) చహల్ 51; క్లాసెన్ (ఎల్బీ) (బి) చహల్ 6; మిల్లర్ (సి) ధోని (బి) బుమ్రా 25; జోండో (సి) (సబ్) పాండే (బి) చహల్ 17; మోరిస్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 14; ఫెలుక్‌వాయో (సి) కోహ్లి (బి) కుల్దీప్ 3; రబడ (నాటౌట్) 12; తాహిర్ (సి) కోహ్లి (బి) చహల్ 8; ఇన్‌గిడి (ఎల్బీ) (బి) కుల్దీప్ 6; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (40 ఓవర్లలో ఆలౌట్) 179.**

వికెట్ల పతనం: 1–1; 2–79; 3–88; 4–95; 5–129; 6–150; 7–150; 8–158; 9–167; 10–179. **బౌలింగ్:** భువనేశ్వర్ 7–0–41–0; బుమ్రా 7–0–32–2; పాండ్యా 8–0–35–0; చహల్ 9–0–46–4; కుల్దీప్ 9–1–23–4.

2200 గజాల పరుగు!

కొత్తగా వర్ణించేందుకు విశేషణాలు కరువైపోతున్నాయి... గొప్పతనం గురించి మళ్లీ మళ్లీ చెప్పడానికి అంకెలు కూడా చిన్నబోతున్నాయి... దిగ్గజాలతో పోలికను కూడా దాటిపోయి చాలా కాలమైంది... అయినా ఆ పరుగుల దాహం, సెంచరీలపై వ్యామోహం మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. కాస్త బయటకు వెళ్లి టీ తాగి వస్తానని చెప్పినట్లుగా అలా మైదానంలోకి వెళ్లడం, సెంచరీ బాది వచ్చేయడం అలవాటుగా మారిపోయింది. రోజుకో రికార్డు సవరించడాన్ని రొటీన్ వ్యవహారంగా మార్చుకున్న విరాట్ కోహ్లి మూడో వన్డేలోనూ మళ్లీ అదే చేసి చూపించాడు. 49 ఓవర్ల పాటు క్రీజ్‌లో నిలిచి మరో అరుదైన ఇన్నింగ్స్‌తో తన స్థాయిని ప్రదర్శించాడు. పరిస్థితులు ప్రతికూలంగా మారిపోయినా, అవతలి ఎండ్ నుంచి సహకారం లోపించినా ఎక్కడా వెనకడుగు వేయకుండా అతను దూసుకుపోయిన తీరు కోహ్లిని మరోసారి సూపర్ స్టార్‌గా నిలబెట్టింది. దూకుడుగా ఆడిన శిఖర్ ధావన్ అవుటయ్యాక జట్టు ఇన్నింగ్స్‌ను విరాట్ భుజాన వేసుకొని నడిపించిన వైనం అతడిని మరింత ఉన్నత స్థాయిలో నిలబెడుతుంది. శిఖర్ వెనుదిరిగాక భారత్ 163 పరుగులు చేస్తే... అందులో కోహ్లి ఒక్కడివే 101 పరుగులు ఉన్నాయి. తన వికెట్ విలువేమిటో కోహ్లికి తెలిసినంతగా మరెవరికీ తెలీదంటే అతిశయోక్తి కాదు. ఈ మ్యాచ్‌లో కూడా ప్రత్యర్థి బౌలర్లకు అతను ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ఏ దశలో కూడా అతను ఒక్క తప్పుడు షాట్ ఆడలేదు. ఎక్కడా బౌండరీల కోసం బలవంతపు దూకుడుకు ప్రయత్నించలేదు. ఫోర్లు, సిక్సర్లకంటే వికెట్ల మధ్య పరుగెత్తడాన్నే కోహ్లి ఎక్కువగా ప్రేమిస్తాడని అనిపిస్తుంది ఈ ఇన్నింగ్స్ చూస్తే. విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన చూపించకుండానే కేవలం సింగిల్స్ ద్వారా వంద పరుగులు చేయడం అనితర సాధ్యం. మధ్యలో ఒక దశలో 45 బంతుల పాటు కోహ్లి ఒక్క ఫోర్ కూడా కొట్టలేదు. ఏం పర్లేదు...క్రీజ్‌లో ఉంటే చాలు తర్వాత చూసుకోవచ్చులే అనే ధీమా అతనిది. సరిగ్గా అదే జరిగింది కూడా. తనదైన శైలిలో లెక్క సరి చేస్తూ ఇన్నింగ్స్ ముగిసేసరికి అతను 100కంటే ఎక్కువ స్ట్రయిక్‌రేట్‌తో ఇన్నింగ్స్ ముగించడం విశేషం. సెంచరీ పూర్తి చేసుకునే సమయానికి 7 ఫోర్లు మాత్రమే కొట్టిన కోహ్లి...ఆ తర్వాత మరో 5 ఫోర్లు కొట్టాడు. శతకం తర్వాత మాత్రమే రెండు సార్లు బంతి గాల్లోకి లేచింది. ముఖ్యంగా రబడ వేసిన చివరి ఓవర్లో శరీరం మొత్తాన్ని గుండ్రంగా తిప్పేస్తూ మిడ్ వికెట్ మీదుగా కొట్టిన భారీ సిక్సర్ గురించి ఎంత చెప్పినా తక్కువే. చివరి బంతికి మిడాఫ్ మీదుగా కొట్టిన బుల్లెట్‌లాంటి ఫోర్‌తో విరాట్ తన క్లాసిక్ ఇన్నింగ్స్‌కు ఇచ్చిన ముగింపును అంతా సులువుగా మరిచిపోలేం. ఇప్పటికే లెక్కలేనన్ని రికార్డులతో గణాంక నిపుణులను తనతో పాటు పరుగెత్తిస్తున్న కోహ్లి బుధవారం కూడా వారికి మరోసారి భారీ హోంవర్క్ ఇచ్చేశాడు. ఈ జోరు ఇలాగే సాగితే అసలు కోహ్లి పరుగుల వరద ఎక్కడ ఆగుతుందో ఊహకు కూడా అందడం లేదు!

100 సింగిల్స్ ద్వారానే వంద పరుగులు చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్ కోహ్లి. ఈ మ్యాచ్‌లో 75 సింగిల్స్ తీసిన అతను 11 సార్లు 2 పరుగులు, ఒకసారి 3 పరుగుల చొప్పున సాధించాడు.

1 కెరీర్‌లో 34వ సెంచరీ చేసిన క్రమంలో దక్షిణాఫ్రికాలో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా కోహ్లి రికార్డులకెక్కాడు. సచిన్ (152) స్కోరును అతను దాటేశాడు.

మహిళల జట్టూ మెరిసింది

- రెండో వన్డేలో దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం
- సిరీస్ 2–0తో కైవసం... స్మృతి అద్భుత శతకం
- 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా జులన్ రికార్డు



స్మృతి మంధాన



జులన్

కింబర్లీ: సఫారీ గడ్డపై భారత పురుషుల జట్టు స్పిన్నర్ల ప్రదర్శనతో స్ఫూర్తి పొందారో ఏమోగానీ... మహిళల జట్టు స్పిన్నర్లూ చెలరేగిపోయారు. దక్షిణాఫ్రికాను వరుసగా రెండో వన్డేలోనూ చిత్తుగా ఓడించిన మిథాలీ సేన మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో చేజిక్కించుకుంది. ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా బుధవారం ఇక్కడ జరిగిన రెండో వన్డేలో అన్ని రంగాల్లో ఆధిపత్యం చాటిన భారత్ 178 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. స్మృతి మంధాన (129 బంతుల్లో 135; 14 ఫోర్లు, 1 సిక్స్) దూకుడైన శతకానికి తోడు హర్మన్‌ప్రీత్ కౌర్ (69 బంతుల్లో 55; 2 ఫోర్లు, 1 సిక్స్), వేద కృష్ణమూర్తి (33 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకాలు చేయడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 302 పరుగులు చేసింది. కెప్టెన్ మిథాలీ రాజ్ (20), పూనమ్ రౌత్ (20) ఫర్వాలేదనిపించారు. లక్ష్య ఛేదనలో లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ (4/24), ఎడంచేతి వాటం స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ (2/14)లకు తోడు దీప్తి శర్మ (2/34) ఆఫ్ స్పిన్ ధాటికి దక్షిణాఫ్రికా జట్టు చేతులెత్తేసింది. 30.5 ఓవర్లలో 124 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ లిజెల్లీ లీ (75 బంతుల్లో 73; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కాప్ (17) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు.

ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఓపెనర్ లౌరా వోల్‌వార్త్‌ను అవుట్ చేయడం ద్వారా మహిళల వన్డే క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా జులన్ గోస్వామి రికార్డులకెక్కింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 35 ఏళ్ల జులన్ 2002లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసింది. 2007లో ఐసీసీ ఉమన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైంది. పురుషుల వన్డే క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్ దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్ కావడం విశేషం.

మ్యాక్స్‌వెల్ తడాఖా



హోబర్ట్: మ్యాక్స్‌వెల్ (58 బంతుల్లో 103 నాటౌట్; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో పాటు అద్భుత బౌలింగ్ (3/10) ప్రదర్శనతో ముక్కోణపు టి20 సిరీస్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 5 వికెట్లతో గెలిచింది. తొలుత ఇంగ్లండ్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేయగా... ఆసీస్ మరో 9 బంతులు మిగిలుండగానే 5 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి గెలుపొందింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో మలాన్ (36 బంతుల్లో 50; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. 10 ఓవర్లకు 94/2తో పటిష్టంగా కనిపించిన ఇంగ్లండ్ మ్యాక్స్‌వెల్, అగర్ (2/15)ల ధాటికి తక్కువ స్కోరుకే పరిమితమైంది. అనంతరం ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో మ్యాక్స్‌వెల్ ఆటే హైలైట్. సహచరులు పెవిలియన్ చేరుతున్నా తనదైన శైలిలో రెచ్చిపోయిన మ్యాక్స్‌వెల్ ఒంటి చేత్తో మ్యాచ్ గెలిపించాడు. 18.2 ఓవర్లలో ఇరు జట్ల స్కోర్లు సమమైన దశలో మ్యాక్స్‌వెల్ సిక్స్ కొట్టి సెంచరీ పూర్తి చేసుకోవడంతో పాటు ఆసీస్‌ను విజయ తీరాలకు చేర్చాడు. టి20ల్లో మ్యాక్స్‌వెల్‌కు ఇది రెండో సెంచరీ.

ఓటమితో మొదలు



అంకిత

న్యూఢిల్లీ: అంకిత రైనా సంచలన విజయం సాధించినప్పటికీ... ఫెడ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్–1లో భారత్‌కు శుభారంభం లభించలేదు. చైనాతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–2తో ఓడిపోయింది. తొలి సింగిల్స్‌లో కర్మన్‌కౌర్ థండి 2–6, 2–6తో ప్రపంచ 125వ ర్యాంకర్ యఫాన్ వాంగ్ చేతిలో ఓటమి పాలైంది. రెండో సింగిల్స్‌లో ప్రపంచ 253వ ర్యాంకర్ అంకిత రైనా 6–3, 6–2తో 120వ ర్యాంకర్ లిన్ జును బోల్తా కొట్టించడంతో స్కోరు 1–1తో సమమైంది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత రైనా–ప్రార్థన తొంబారే ద్వయం 2–6, 6–7 (1/7)తో వాంగ్–జావోజువాన్ యాంగ్ జంట చేతిలో పరాజయం పాలైంది. గురువారం జరిగే మ్యాచ్‌లో కజకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

అంధుల క్రికెట్‌కూ గుర్తింపు ఇవ్వండి

బీసీసీఐని కోరిన సచిన్



న్యూఢిల్లీ: 'అంధుల జట్టు ఎన్నో అవరోధాలు అధిగమించింది. వారి స్ఫూర్తిదాయక ప్రపంచ కప్ విజయం మానవ మేధస్సుకు పరిమితి లేదని గుర్తుచేస్తోంది. అందుకని భారత అంధుల క్రికెట్ సంఘం (సీఏబీఐ)కు గుర్తింపునిస్తూ ఆ క్రికెటర్లను బోర్డు పెన్షన్ పథకం పరిధిలోకి తీసుకోండి' అని బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బీసీసీఐని కోరాడు. ఈ మేరకు బోర్డు పరిపాలకుల కమిటీ అధ్యక్షుడు వినోద్‌రాయ్‌కు లేఖ రాశాడు. బీసీసీఐ గుర్తింపు దక్కడం వారి కృషికి మెచ్చుకోలుగా ఉంటుందని, ఆటగాళ్ల ఆర్థిక భద్రతకూ భరోసాగా నిలుస్తుందని పేర్కొన్నాడు. గత నెలలో అంధుల జట్టు ప్రపంచకప్ గెలిచిన సందర్భంగా బీసీసీఐ తరఫున రివార్డు అందిస్తామని రాయ్ ప్రకటించారు.

మరో క్లీన్‌స్వీప్‌తో క్వార్టర్స్‌లోకి

భారత పురుషుల జట్టు జోరు • ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



శ్రీకాంత్

అలోర్ సెటార్ (మలేసియా): బ్యాడ్మింటన్‌లో పసికూన జట్టు మాల్దీవులుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. వరుసగా రెండో విజయంతో గ్రూప్ 'డి' నుంచి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇదే గ్రూప్ నుంచి ఇండోనేసియా కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. గురువారం భారత్, ఇండోనేసియా జట్ల మధ్య మ్యాచ్ విజేత గ్రూప్ 'టాపర్'గా నిలుస్తుంది.

ఫిలిప్పీన్స్‌పై కూడా 5–0తో నెగ్గిన భారత్ అదే జోరును మాల్దీవులుపై కనబరిచింది. పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో 'బర్త్‌డే బాయ్' కిడాంబి శ్రీకాంత్ 21–5, 21–6తో జయన్ హుస్సేన్‌పై; సాయిప్రణీత్ 21–10, 21–4తో అహ్మద్ నిబాల్‌పై; సమీర్ వర్మ 21–5, 21–1తో అర్సలాన్ అలీపై గెలిచారు. డబుల్స్ మ్యాచ్‌ల్లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జంట 21–8, 21–8తో జయన్ హుస్సేన్–షహీమ్ జోడీపై... అర్జున్–శ్లోక్ రామచంద్రన్ ద్వయం 21–2, 21–5తో అర్సలాన్ అలీ–అహ్మద్ నిబాల్ జోడీపై గెలిచాయి.

చూసేద్దామా... ఐస్ క్రికెట్!

- నేడు, రేపు స్విట్జర్లాండ్‌లో టి20 మ్యాచ్‌లు
- బరిలో సెహ్వాగ్, ఆఫ్రిది, జహీర్, కైఫ్

మ.గం.3.30 నుంచి సోని ఈఎస్‌పీఎన్‌లో ప్రత్యక్ష ప్రసారం



సెయింట్ మోరిట్జ్ (స్విట్జర్లాండ్): నేలపై క్రికెట్ సాధారణం. బీచ్‌లో క్రికెట్ కొంచెం కష్టం. మరి హిమ తాపంలో ఐస్ క్రికెట్ సంక్లిష్టం. కానీ ఈ తరహా క్రికెట్‌కు ప్రపంచ దిగ్గజాలు సై అంటున్నారు. భారత్ నుంచి వీరేంద్ర సెహ్వాగ్, కైఫ్, జహీర్ ఖాన్, అగార్కర్, రమేశ్ పవార్ కొత్త థ్రిల్‌కు సిద్ధమయ్యారు. ఇతర దేశాల నుంచి కలిస్, గ్రేమ్ స్మిత్, వెటోరి, దిల్షాన్, మలింగ, అక్తర్, షాహిద్ ఆఫ్రిది తదితర పేరొందిన క్రికెటర్లు బరిలోకి దిగుతున్నారు. దీంతో స్విస్‌లో ఐస్ క్రికెట్ హంగామా దిగ్గజాలతో జరగనుంది. ఐస్‌పై ప్రత్యేకంగా రూపొందించిన కృత్రిమ కార్పెట్ పిచ్‌పై రెండు టి20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇక్కడ రాత్రి అయితే ఉష్ణోగ్రతలు–20 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోతాయి. రక్తం గడ్డకట్టే పరిస్థితిలో ఆడే ఆట ఇది. ప్రపంచ దిగ్గజాలను టీమ్ రాయల్స్, బద్రుట్ ప్యాలెస్ డైమండ్స్ జట్లకు ఎంపిక చేశారు నిర్వాహకులు. గురువారం, శుక్రవారం ఒక్కో మ్యాచ్ జరుగుతుంది.

ముంబై ఇండియన్స్ బౌలింగ్ మెంటార్‌గా మలింగ



ముంబై: రానున్న ఐపీఎల్ సీజన్‌కు శ్రీలంక వెటరన్ పేసర్ లసిత్ మలింగ ముంబై ఇండియన్స్ జట్టు బౌలింగ్ మెంటార్‌గా నియమితుడయ్యాడు. ప్రస్తుతం ముంబై ప్రధాన కోచ్‌గా జయవర్ధనే ఉండగా బౌలింగ్‌లో షేన్‌బాండ్, బ్యాటింగ్‌లో రాబిన్‌సింగ్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. జాంటీ రోడ్స్ వైదొలగడంతో ఫీల్డింగ్ కోచ్‌గా జేమ్స్ పెమెంట్‌ను తీసుకున్నారు. బాండ్, మలింగ ఆధ్వర్యంలో తమ జట్టు యువ ఆటగాళ్లు రాటుదేలుతారని ముంబై ఫ్రాంచైజీ యజమాని ఆకాశ్ అంబానీ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియాలో ఘనంగా వాక్ విత్ జగన్



సిడ్నీ పార్కులో ఎన్నారైలతో కలసి వాక్ విత్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప యాత్రకు మద్దతుగా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ప్రవాసాంధ్రులు బుధవారం ఆస్ట్రేలియాలో ఘనంగా వాక్ విత్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సిడ్నీ కార్యవర్గ కమిటీ సభ్యులు రంగారెడ్డి, గోవిందరెడ్డి, తిమ్మారెడ్డి, శ్రీకాంత్, ప్రకాష్, దామోదర్, భారతి, మనుతో పాటు సుమారు 100 మందికి పైగా ప్రవాసాంధ్రులతో కలసి సిడ్నీ పర్రమట్ట రివర్ పార్కులో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఏపీలో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. గత ఎనిమిదేళ్లుగా ప్రజలతో మమేకమవుతున్న వైఎస్ జగన్‌కు మద్దతు ప్రకటించాలని వారిని కోరారు.

స్వగ్రామం చేరిన 'గాలి' భౌతికకాయం

- సీఎం చంద్రబాబు, ఇతర నేతల నివాళులు
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు

సాక్షి, నెట్‌వర్క్: తీవ్ర జ్వరంతో హైదరాబాద్‌లో మంగళవారం అర్ధరాత్రి మరణించిన టీడీపీ ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడి భౌతికకాయాన్ని బుధవారం ప్రత్యేక విమానంలో ఆయన స్వగ్రామం చిత్తూరు జిల్లాలోని రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురం తరలించారు. మంత్రులతో కలిసి వెంకట్రామాపురం చేరుకున్న సీఎం చంద్రబాబు గాలికి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, సత్యప్రభ, నారాయణస్వామి, ఆదిత్య, ఎంపీ శివప్రసాద్, ఎమ్మెల్సీలు గౌనివారి శ్రీనివాసులు, దొరబాబు, కరణం బలరామ్, శాసనమండలి చైర్మన్ ఫరూక్, వైఎస్సార్‌సీపీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి, ఎంపీ కేవీపీ రామచంద్రరావు, సీపీఐ నేత నారాయణ తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు. నేడు గాలి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు.



గాలి ముద్దుకృష్ణమ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు. (ఇన్‌సెట్‌లో) ముద్దుకృష్ణమ మృతదేహం

ఆరు సార్లు ఎమ్మెల్యే

గాలి ముద్దుకృష్ణమ నాయుడు 1947 జూన్ 9న చిత్తూరు జిల్లా వెంకట్రామాపురంలో జన్మించారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసి గుంటూరు జిల్లా పెదనందిపాడు కాలేజీలో అధ్యాపకుడిగా పదేళ్లు పనిచేశారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు భానుప్రకాష్, జగదీశ్, కుమార్తె లావణ్య ఉన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ టీడీపీని ఏర్పాటు చేశాక 1983 ఎన్నికల్లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1989, 1994 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. 1999లో కాంగ్రెస్ పార్టీ తరపున ఓటమిపాలైనా 2004లో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత టీడీపీలో చేరి 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో సినీ నటి ఆర్కే రోజా చేతిలో ఓటమి పాలయ్యారు. 2015లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ సంతాపం

సీనియర్ రాజకీయ నాయకుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడి మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో నిరాడంబరుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి తన సానుభూతిని తెలుపుతున్నానని పేర్కొన్నారు.

భృంగి వాహనంపై శ్రీశైలేశుడు

శ్రీశైలం: శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణతో ప్రారంభం కాగా, బుధవారం రాత్రి రెండో రోజు భ్రామరీ సమేతుడైన మల్లికార్జునుడు భృంగీవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనాధీశులైన స్వామి, అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు విశేష వాహన పూజలను నిర్వహించారు. రథశాల నుంచి అంకాలమ్మ గుడి, నందిమండపం, వీరభద్రస్వామి మండపం వరకు వెళ్లి రాత్రి 9.30 గంటలకు ఆలయ ప్రాంగణానికి తిరిగి చేరుకుంది. భృంగి వాహనాధీశుడైన స్వామి అమ్మవార్లను వేలాది మంది భక్తులు దర్శించుకుని నారికేళాది ఫలాదులను సమర్పించారు.



భృంగి వాహనంపై పార్వతీసమేత శ్రీశైలేశుడు

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503.   Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.